ఈనాడు

విజయవాడ 27-8-2025 బుధవారం సిటీ సంపుటి 52 . సంచిక 18 | THE LARGEST CIRCULATED TELUGU DAILY | రూ. 6-50 పేజీలు 16 | www.eenadu.net

Vijayawada, Visakhapatnam, Hyderabad, Tirupati, Ananthapuramu, Karimnagar, Rajamahendravaram, Suryapet, Guntur, Nellore, Srikakulam, Kurnool, Tadepalligudem, Warangal, Kadapa, Nizamabad, Khammam, Ongole, Mahaboobnagar, Chennai, Bengaluru

ఛాంపియన్


కోయెల్ బార్

కోయెల్.. రెండు ప్రపంచ రికార్డులతో

కామన్వెల్త్ వెయిట్‌లిఫ్టింగ్‌లో పసిడి సొంతం

అహ్మదాబాద్: భారత యువ లిఫ్టర్ కోయెల్ బార్.. కామన్వెల్త్ వెయిట్‌లిఫ్టింగ్ ఛాంపియన్‌షిప్‌లో అదరగొట్టింది. ఆమె యూత్ విభాగంలో రెండు ప్రపంచ రికార్డులు నెలకొల్పుతూ ఛాంపియన్‌గా నిలిచింది. 53 కేజీల విభాగంలో కోయెల్ స్నాచ్‌లో 85 కేజీలు, క్లీన్ అండ్ జెర్క్‌లో 107 కేజీలు.. మొత్తంగా 192 కేజీలతో అగ్రస్థానంలో నిలిచింది. ఈ క్రమంలో యూత్ విభాగంలో స్నాచ్, ఓవరాల్ బరువుల్లో ప్రపంచ రికార్డులు బద్దలు కొట్టింది. జూనియర్, యూత్ విభాగాలు రెంటికీ ఈ ప్రదర్శనను పరిగణించడంతో ఆమెకు రెండు పసిడి పతకాలు దక్కాయి. సీనియర్ మహిళల 52 కేజీల విభాగంలో రజతం గెలిచిన స్నేహ సోరెన్ (81+104=185) కంటే.. 17 ఏళ్ల కోయెల్ మెరుగైన ప్రదర్శన చేయడం విశేషం. కోయెల్ తండ్రి పశ్చిమబెంగాల్‌లోని హౌరాలో చికెన్ దుకాణం నడుపుతున్నాడు. మరోవైపు 58 కేజీల విభాగంలో బింద్యారాణి రజతం సాధించింది. ఆమె 206 కేజీలతో (91+115) రెండో స్థానంలో నిలిచింది. పురుషుల 65 కేజీల విభాగంలో రాజా ముత్తుపాండి త్రుటిలో స్వర్ణం కోల్పోయాడు. అతను 296 కేజీలతో (128+168) రజతం సాధించాడు.


సిఫ్ట్ కౌర్

రెండు స్వర్ణాలు గెలిచిన షూటర్

మెరిసిన సిఫ్ట్ కౌర్

ఆసియా షూటింగ్ ఛాంపియన్‌షిప్స్

షిమ్‌కెంట్ (కజకిస్థాన్): ఆసియా షూటింగ్ ఛాంపియన్‌షిప్స్‌లో సిఫ్ట్ కౌర్ సమ్ర అదరగొట్టింది. మహిళల వ్యక్తిగత 50మీ రైఫిల్ 3 పొజిషన్స్‌లో స్వర్ణం గెలిచిన ఆమె.. భారత్ జట్టు స్వర్ణం గెలవడంలోనూ కీలక పాత్ర పోషించింది. 23 ఏళ్ల సిఫ్ట్ మంగళవారం వ్యక్తిగత ఫైనల్లో 459.2 పాయింట్లు స్కోర్ చేసి విజేతగా నిలిచింది. చైనాకు చెందిన యాంగ్ యుజీ (458.8) రజతం నెగ్గగా.. జపాన్ అమ్మాయి నోబతా మిసాకి (448.2) కాంస్యం చేజిక్కించుకుంది. ఆశి చౌస్కీ (402.8) ఏడో స్థానంతో సరిపెట్టుకుంది. ఇదే విభాగం టీమ్ ఈవెంట్లో సిఫ్ట్, అంజుమ్ మౌద్గిల్, ఆశి చౌస్కీలతో కూడిన జట్టు టైటిల్ గెలుచుకుంది. ఈ త్రయం 1753 పాయింట్లు స్కోర్ చేసింది. జపాన్ (1750) రజతం, దక్షిణ కొరియా (1745) కాంస్యం గెలిచాయి. భారత్ 9 స్వర్ణాలు సహా 20 పతకాలతో పట్టికలో రెండో స్థానంలో ఉంది. చైనా 24 పతకాలతో అగ్రస్థానంలో నిలిచింది. జూనియర్ విభాగం మహిళల వ్యక్తిగత 50మీ రైఫిల్ 3 పొజిషన్స్‌లో భారత షూటర్ అనుష్క పసిడి పతకం సాధించింది. ఫైనల్లో ఆమె 460.7 పాయింట్లు స్కోర్ చేసింది. టీమ్ విభాగంలో అనుష్క, సంధు, గైక్వాడ్‌ల బృందం 1758 పాయింట్లతో బంగారు పతకం సొంతం చేసుకుంది. జూనియర్ పురుషుల 25మీ ర్యాపిడ్ ఫైర్‌లో సమీర్ కాంస్యం గెలుచుకున్నాడు. జూనియర్ మహిళల ట్రాప్‌లో సబీరా స్వర్ణం, అద్య రజతం సాధించారు. సబీర, అద్య, భవ్యలతో కూడిన జట్టు ట్రాప్ టీమ్ స్వర్ణాన్ని చేజిక్కించుకుంది. ఆర్య, వంశ్ త్యాగి, అర్జున్‌లతో కూడిన జూనియర్ పురుషుల ట్రాప్ జట్టు కూడా పసిడి పతకం గెలుచుకుంది.

యుఎస్ ఓపెన్

కీస్ ఇంటికి

స్వైటెక్, అల్కరాస్ శుభారంభం


న్యూయార్క్

యుఎస్ ఓపెన్లో మరో సీడెడ్ ప్లేయర్ నిష్క్రమించింది. మహిళల సింగిల్స్‌లో అమెరికా స్టార్ మాడిసన్ కీస్ తొలి రౌండ్లోనే ఇంటిముఖం పట్టింది. ఆరో సీడ్ కీస్ 7-6 (12-10), 6-7 (3-7), 5-7తో రెనాటా జెరజువా (మెక్సికో) చేతిలో ఓడింది. ఈ మ్యాచ్‌లో ఆరంభం నుంచి కీస్‌కు రెనాటా గట్టిపోటీ ఇచ్చింది. తొలి సెట్లో 2-4తో వెనుకబడిన కీస్.. పుంజుకుని సెట్‌ను టైబ్రేకర్‌కు మళ్లించింది. టైబ్రేకర్‌లో ఒత్తిడిని అధిగమించి సెట్ గెలుచుకుంది. రెండో సెట్లో కీస్ 3-0తో ఆధిక్యంలోకి వెళ్లింది. ఈ దశ నుంచి విజృంభించిన రెనాటా.. స్కోరు సమం చేసింది. తర్వాత టైబ్రేకర్‌లో సెట్ గెలిచి మ్యాచ్‌లో నిలిచింది. నిర్ణయాత్మక మూడో సెట్లో రెనాటా దూకుడు ముందు కీస్ నిలవలేకపోయింది. 3-5తో వెనుకబడిన ఆమె.. ఆపై సెట్‌తో పాటు మ్యాచ్‌ను కోల్పోయింది. 89 అనవసర తప్పిదాలు, 14 డబుల్ ఫాల్ట్స్ చేసిన కీస్ ఓటమి కొనితెచ్చుకుంది. 12వ సీడ్ స్వితోలినా (ఉక్రెయిన్) కూడా ఓడిపోయింది. ఆమె 2-6, 4-6తో అనా బాండర్ (హంగేరి) చేతిలో కంగుతింది. టైటిల్ ఫేవరెట్ ఇగా స్వైటెక్ తొలి రౌండ్‌ను అధిగమించింది. ఈ పోలెండ్ స్టార్ 6-1, 6-2తో అరాంగో (కొలంబియా)ను ఓడించింది. ఈ మ్యాచ్‌లో నాలుగుసార్లు ప్రత్యర్థి సర్వీస్ బ్రేక్ చేసిన స్వైటెక్.. 26 విన్నర్లు కొట్టి తేలిగ్గా విజయాన్ని సొంతం చేసుకుంది. కొస్టుక్ (ఉక్రెయిన్) 6-4, 6-4తో బౌల్టర్ (బ్రిటన్)పై, జాయింట్ (ఆస్ట్రేలియా) 6-4, 7-6 (8-6) కొసెన్సెవా (అండోరా)ను ఓడించారు. అయిదో సీడ్ ఆండ్రీవా (రష్యా), తొమ్మిదో సీడ్ రిబకినా (కజకిస్థాన్), కసత్‌కినా (ఆస్ట్రేలియా), పవ్లిచెంకోవా (రష్యా) కూడా ముందంజ వేశారు. ఆండ్రీవా 6-1, 6-0తో పార్క్స్ (అమెరికా)ను చిత్తు చేయగా.. రిబకినా 6-3, 6-0తో పరెయా (అమెరికా)ను ఓడించింది. కసత్‌కినా 7-5, 6-1తో రూజ్ (రొమేనియా)పై, పవ్లిచెంకోవా 6-7 (5-7), 7-6 (7-5), 6-4తో యాస్ట్రెంకా (ఉక్రెయిన్)పై నెగ్గారు. సకారి (గ్రీస్) 6-3, 6-2తో మారియా (జర్మనీ)పై, మెర్టిన్స్ (బెల్జియం) 6-1, 6-0తో ఆన్ (అమెరికా) గెలిచారు.


రెనాటా

వీనస్ పోరాడి..: 45 ఏళ్ల వయసులో గ్రాండ్‌స్లామ్ సింగిల్స్ డ్రాలో నిలిచిన అమెరికా వెటరన్ స్టార్ వీనస్ విలియమ్స్ పోరాటం తొలి రౌండ్‌కే పరిమితమైంది. వైల్డ్‌కార్డు ఎంట్రీతో బరిలో దిగిన వీనస్ 3-6, 6-2, 1-6తో పదకొండో సీడ్ ముచోవా (చెక్) చేతిలో ఓడింది. తొలి సెట్లో ఓడినా.. రెండో సెట్లో వీనస్ సత్తా చాటింది. మొదటి గేమ్‌లోనే ముచోవా సర్వీస్ బ్రేక్ చేసిన ఆమె.. అదే జోరుతో సెట్ గెలిచింది. మూడో గేమ్‌లో వీనస్ తేలిపోయింది. కోర్టులో వేగంగా కదల్లేక ఇబ్బంది పడిన వీనస్.. అనవసర తప్పిదాలు చేసింది. దీంతో సెట్‌తో పాటు మ్యాచ్‌ను కోల్పోయింది. మిక్స్‌డ్ డబుల్స్ టోర్నీలో రిలీ ఒపెల్కాతో బరిలో దిగిన వీనస్.. ప్రిక్వార్టర్స్‌లో ఇంటిముఖం పట్టింది.

డ్రేపర్, రూన్ ముందుకు: అయిదో సీడ్ డ్రేపర్ (బ్రిటన్), తియాఫో (అమెరికా), రూన్ (డెన్మార్క్), కచానోవ్ (రష్యా) రెండో రౌండ్ చేరారు. డ్రేపర్ 6-4, 7-5, 6-7 (7-9), 6-2తో గోమెజ్ (అర్జెంటీనా)పై, రూన్ 6-3, 7-6 (7-4), 7-6 (7-2)తో జాండ్‌షెల్ప్ (నెదర్లాండ్స్)ను ఓడించాడు. తియాఫో 6-3, 7-6 (8-6), 6-3తో నిషికా (జపాన్)పై, తొమ్మిదోసీడ్ కచానోవ్ 6-7 (5-7), 6-3, 7-5, 6-1తో నిశేష్ బసవారెడ్డి (అమెరికా)పై గెలిచారు. 12వ సీడ్ రూడ్ (నార్వే) ముందంజ వేశాడు. అతడు 6-1, 6-2, 7-6 (7-5)తో ఆనర్ (ఆస్ట్రియా)ను ఓడించాడు. షపోవలోవ్ (కెనడా), రుబ్లెవ్ (రష్యా), స్ట్రాఫ్ (జర్మనీ), నోరి (బ్రిటన్), వాల్టన్ (ఆస్ట్రేలియా) తొలి రౌండ్‌ను అధిగమించారు.


అల్కరాస్

అల్కరాస్ కొత్త అవతారం

పురుషుల సింగిల్స్‌లో టైటిల్ ఫేవరెట్ కార్లోస్ అల్కరాస్ (స్పెయిన్) శుభారంభం చేశాడు. తొలి రౌండ్లో ఈ రెండో సీడ్ 6-4, 7-5, 6-4తో రిలీ ఒపెల్కా (అమెరికా)ను ఓడించాడు. మ్యాచ్‌లో నాలుగు ఏస్‌లు సంధించిన అల్కరాస్.. మూడుసార్లు ప్రత్యర్థి సర్వీస్ బ్రేక్ చేసి తేలిగ్గా విజయాన్ని అందుకున్నాడు. తొలి రౌండ్లో అల్కరాస్ ఆటను మించి అతడి కొత్త అవతారం అభిమానులను ఆకట్టుకుంది. మిక్స్‌డ్ డబుల్స్ టోర్నీలో పూర్తి జుట్టుతో ఉన్న అల్కరాస్.. సింగిల్స్ టోర్నీకి జుట్టు లేకుండా వచ్చాడు. దాదాపు గుండుతో బరిలో దిగిన అతడు కొత్తగా కనిపించాడు. "జుట్టు బాగా పెరిగిపోయింది. దీంతో సోదరుడే మిషన్ అందుకున్నాడు. ఈ క్రమంలో చాలా ఎక్కువగా కట్ చేశాడు. ఇక జుట్టును పూర్తిగా తీసేయక తప్పలేదు. కొత్త హెయిర్ కట్ ఎలా ఉంది. నచ్చిందా లేదా?" అని మ్యాచ్ అనంతరం అల్కరాస్.. అభిమానులను ప్రశ్నించాడు.

ప్రపంచ బ్యాడ్మింటన్

చెమటోడ్చిన సింధు

రెండో రౌండ్లో భారత స్టార్


సింధు

పారిస్: రెండు సార్లు ఒలింపిక్ పతక విజేత, భారత స్టార్ షట్లర్ పి.వి.సింధు ప్రపంచ బ్యాడ్మింటన్ ఛాంపియన్‌షిప్‌ను కాస్త కష్టంగానే మొదలుపెట్టింది. మంగళవారం మహిళల సింగిల్స్ తొలి రౌండ్లో 15వ ర్యాంకర్ సింధు 23-21, 21-6తో 69వ ర్యాంకర్ కలోయానా నల్బంతోవా (బల్గేరియా)ను ఓడించింది. తొలి గేమ్‌ను గెలిచేందుకు ఆమె తీవ్రంగా శ్రమించాల్సి వచ్చింది. అనవసర తప్పిదాలతో 0-4తో వెనుకబడిన సింధుపై ప్రత్యర్థి ఆధిపత్యం చలాయిస్తూ 11-7తో ముందంజ వేసింది. విరామానంతరం లయను దొరకబుచ్చుకున్న సింధు స్మాష్‌లు, క్రాస్‌కోర్ట్ షాట్‌లతో పాయింట్లు రాబట్టి 14-12తో ఆధిక్యంలోకి దూసుకెళ్లింది. అయితే నల్బంతోవా కూడా పోరాటంతో తొలి గేమ్ హోరాహోరీగా సాగింది. 20-19తో గేమ్ పాయింటుకు చేరువైన నల్బంతోవా షటిల్‌ను నెట్‌కు ఆడటంతో స్కోరు సమమైంది. 21-20తో మరోసారి గేమ్ పాయింట్ అవకాశం లభించినా నల్బంతోవా వృథా చేసుకుంది. ఈ సమయంలో తన అనుభవాన్నంతా ఉపయోగించిన సింధు వరుసగా మూడు పాయింట్లు సాధించి 23-21తో తొలి గేమ్‌కు తెరదించింది. రెండో గేమ్ పూర్తిగా ఏకపక్షంగా సాగింది. 6-5తో రెండో గేమ్‌ను మొదలుపెట్టిన సింధు వరుస పాయింట్లతో హోరెత్తించింది. అక్కడ్నుంచి మ్యాచ్ ముగిసే వరకు నల్బంతోవా కేవలం ఒకే ఒక్క పాయింటు గెలుచుకోగా.. మిగతావన్నీ సింధు ఖాతాలోకి వెళ్లాయి. ఫలితంగా 21-6తో రెండో గేమ్ సింధు సొంతమైంది. పురుషుల సింగిల్స్ తొలి రౌండ్లో హెచ్.ఎస్.ప్రణయ్ 21-18, 21-15తో ఓల్డార్ఫ్ (ఫిన్లాండ్)పై గెలిచి రెండో రౌండ్లో అడుగుపెట్టాడు.

గోవాలో చెస్ ప్రపంచకప్

ముంబయి: గోవా చెస్ ప్రపంచకప్‌నకు ఆతిథ్యమివ్వనుంది. ఈ టోర్నీ అక్టోబరు 30 నవంబరు 27 వరకు జరుగుతుంది. ప్రపంచ ఛాంపియన్ గుకేశ్, మాగ్నస్ కార్ల్‌సన్ (నార్వే), కరువానా (అమెరికా), ప్రజ్ఞానంద సహా 206 మంది క్రీడాకారులు చెస్ ప్రపంచకప్‌లో పోటీపడనున్నారు. ఈ టోర్నీ నుంచి ముగ్గురు క్యాండిడేట్స్ టోర్నమెంట్‌కు అర్హత సాధిస్తారు. అయితే ప్రపంచ ఛాంపియన్ అయిన గుకేశ్ క్వాలిఫికేషన్ రేసులో లేడు. భారత్ చివరిసారి 2002లో ప్రపంచకప్‌నకు ఆతిథ్యమిచ్చింది. అప్పుడు హైదరాబాద్‌లో రామోజీ ఫిల్మ్ సిటీలో జరిగిన టోర్నీలో విశ్వనాథన్ ఆనంద్ విజేతగా నిలిచాడు. రెండు గేమ్‌ల నాకౌట్ ఫార్మాట్లో ప్రపంచకప్ ఆడతారు. పోరు సమమైతే టైబ్రేక్స్ (ర్యాపిడ్, బ్లిట్జ్) ఆడాల్సివుంటుంది. టాప్-50 సీడ్లకు నేరుగా రెండో రౌండ్లో ప్రవేశం లభిస్తుంది. భారత్ నుంచి ప్రవేశ జాబితాలో ఉన్న 21 మందిలో అయిదుసార్లు ప్రపంచ ఛాంపియన్ విశ్వనాథన్ ఆనంద్ కూడా ఉన్నాడు. ఈ టోర్నీ మొత్తం నగదు బహుమతి రూ.17.40 కోట్లు.

ఆధిక్యంలో ప్రజ్ఞానంద

సెయింట్ లూయిస్: సింక్వెఫీల్డ్ కప్‌లో భారత గ్రాండ్‌మాస్టర్ ప్రజ్ఞానంద ఆధిక్యంలోకి దూసుకెళ్లాడు. ఏడో రౌండ్లో అతడు 27 ఎత్తుల్లో అలీరెజా ఫిరౌజా (ఫ్రాన్స్)పై విజయం సాధించాడు. ప్రజ్ఞానంద గత అయిదు గేమ్‌లను డ్రాగా ముగించిన సంగతి తెలిసిందే. ప్రస్తుతం అతడు 4.5 పాయింట్లతో ఫాబియానో కరువానా (అమెరికా)తో కలిసి అగ్రస్థానంలో ఉన్నాడు. ఆరోనియన్ (అమెరికా)తో గేమ్‌ను కరువానా డ్రాగా ముగించాడు. మరో గేమ్‌లో ప్రపంచ ఛాంపియన్ గుకేశ్.. వెస్లీ సో (అమెరికా) చేతిలో పరాజయంపాలయ్యాడు. ఆరోనియన్, వెస్లీ సో చెరో నాలుగు పాయింట్లతో సంయుక్తంగా మూడో స్థానంలో ఉన్నారు. లాగ్రేవ్ (ఫ్రాన్స్), దుడా (పోలెండ్), సేవియన్ (అమెరికా)లు తలో 3.5 పాయింట్లతో ఉమ్మడిగా అయిదో స్థానంలో నిలిచారు. గుకేశ్ (3), అలీరెజా (3)లది ఆ తర్వాతి స్థానం.

బాధ్యత ఉత్సాహాన్నిస్తుంది


సిరాజ్

దిల్లీ: ప్రధాన బౌలర్ బాధ్యతను ఆస్వాదిస్తున్నట్లు భారత పేసర్ మహ్మద్ సిరాజ్ అన్నాడు. గత కొన్నేళ్లుగా మూడు ఫార్మాట్లలో భారత పేస్ దాడికి జస్‌ప్రీత్ బుమ్రా నాయకత్వం వహిస్తున్నాడు. అయితే గాయం కారణంగా బుమ్రా అందుబాటులో లేనప్పుడు సిరాజ్ ఆ బాధ్యతల్ని సమర్థంగా నిర్వర్తిస్తున్నాడు. ఇంగ్లాండ్‌తో టెస్టు సిరీస్‌లో బుమ్రా గైర్హాజరీలో సిరాజ్ అద్భుత బౌలింగ్‌తో అదరగొట్టాడు. ఆ సిరీస్‌లో అత్యధిక వికెట్లు తీసిన బౌలర్‌గా ఘనత సాధించాడు. "నా భుజాలపై బాధ్యత ఉంచినప్పుడు మరింత బాగా రాణిస్తా. సాధారణ సిరీస్ తీసుకున్నా నా ప్రదర్శన మెరుగ్గా ఉంటుంది. బాధ్యత నాకు ఉత్సాహాన్నిస్తుంది. ఆత్మవిశ్వాసాన్ని పెంచుతుంది. వెన్ను నొప్పి కారణంగా బుమ్రా అందుబాటులో లేడు. అతని లోటు కనబడనీయకుండా బౌలింగ్ విభాగంలో సానుకూలతను కొనసాగించేందుకు ప్రయత్నించా. ఆకాశ్ దీప్‌తో సహా మిగతా బౌలర్లతో మాట్లాడిన ప్రతిసారి వాళ్లలో నమ్మకాన్ని నింపా. గత ప్రదర్శనను పునరావృతం చేయొచ్చని భరోసా ఇచ్చా" అని సిరాజ్ పేర్కొన్నాడు.

సాదియాకు కాంస్యం


సాదియా

మంగళగిరి, న్యూస్‌టుడే: ప్రపంచ జూనియర్ పవర్ లిఫ్టింగ్‌లో మంగళగిరి అమ్మాయి షేక్ సాదియా అల్మాస్ సత్తా చాటింది. 57 కేజీల విభాగంలో ఆమె కాంస్య పతకం సాధించింది. కోస్టారికా రాజధాని శాన్ జోస్‌లో పోటీలు జరిగాయి. సాదియాకు ఆంధ్రప్రదేశ్ మంత్రి నారా లోకేష్ అభినందనలు తెలిపారు. ఆమెకు లోకేష్ సొంత నిధులతో ఆర్థిక సాయం అందించినట్లు పవర్ లిఫ్టింగ్ సంఘం గుంటూరు జిల్లా అధ్యక్ష ప్రధాన కార్యదర్శులు విజయభాస్కర్‌రావు, షేక్ సందాని తెలిపారు.


విహారి

త్రిపురకు విహారి

దిల్లీ: భారత బ్యాటర్ హనుమ విహారి ఆంధ్ర జట్టును వీడాడు. 2025-26 దేశవాళీ సీజన్‌లో త్రిపుర తరఫున బరిలో దిగనున్నాడు. ఆంధ్ర క్రికెట్ సంఘం (ఏసీఏ) అతనికి నిరభ్యంతర పత్రం (ఎన్‌ఓసీ) మంజూరు చేసింది. ఇటీవలే ఆంధ్ర ప్రిమియర్ లీగ్‌లో ప్లేయర్ ఆఫ్ ద టోర్నీగా నిలిచిన విహారి.. మూడు ఫార్మాట్లలో ఆడాలన్న ఉద్దేశంతోనే త్రిపురకు తరలివెళ్లాడు. ఈ విషయంలో ఏసీఏ నుంచి ఎలాంటి హామీ లభించకపోవడంతో విహారి ప్రత్యామ్నాయం చూసుకున్నాడు. "మూడు ఫార్మాట్లలో ఆడగల సత్తా నాకుందని నమ్ముతున్నా. అందుకే ఇతర అవకాశాల పట్ల ఆసక్తి కనబరిచా. టీ20 ఫార్మాట్లో యువ ఆటగాళ్లపై దృష్టిసారిస్తున్నట్లు ఏసీఏ స్పష్టంచేసింది. ఈ నేపథ్యంలోనే 50 ఓవర్ల ఫార్మాట్లో ఆడటం కూడా సమంజసం కాదని నిర్ణయించుకున్నా. విజయ్ హజారే ట్రోఫీకి దూరంగా ఉన్నా. కొత్త వాతావరణంలో ఆడాలని భావిస్తున్నా" అని విహారి తెలిపాడు.

చెలరేగిన సంజు శాంసన్

తిరువనంతపురం: ఆసియా కప్ టీ20 టోర్నీ ముంగిట భారత వికెట్ కీపర్ బ్యాటర్ సంజు శాంసన్ చెలరేగిపోతున్నాడు. కేరళ క్రికెట్ లీగ్‌లో కొచి బ్లూ జట్టుకు ప్రాతినిధ్యం వహిస్తున్న సంజు.. త్రిశూర్ టైటాన్స్‌పై మెరుపు ఇన్నింగ్స్ (89; 46 బంతుల్లో 5×4, 9×6) ఆడాడు. ఈ ఇన్నింగ్స్‌లో అతను ఒక్క బంతికి 13 పరుగులు రాబట్టడం విశేషం. సిజోమన్ అనే బౌలర్ వేసిన ఇన్నింగ్స్ అయిదో ఓవర్లో ఓ బంతికి సంజు సిక్సర్ బాదాడు. అది నోబాల్ కావడంతో ఫ్రీహిట్ లభించింది. దాన్ని కూడా సంజు స్టాండ్స్‌లోకి పంపించాడు. నోబాల్ వల్ల వచ్చిన ఎక్స్‌ట్రాతో కలిపి ఒక బంతికి 13 పరుగులు వచ్చినట్లయింది. రెండు రోజుల ముందే సంజు మరో జట్టుపై 51 బంతుల్లోనే 121 పరుగులు చేయడం విశేషం.

సర్ఫరాజ్, రుతురాజ్ శతకాలు

చెన్నై: అఖిల భారత బుచ్చిబాబు క్రికెట్ టోర్నీలో సర్ఫరాజ్ ఖాన్ (111; 112 బంతుల్లో 9×4, 5×6), రుతురాజ్ గైక్వాడ్ (133; 144 బంతుల్లో 10×4, 4×6) అదరగొట్టారు. ముంబయి తరఫున సర్ఫరాజ్, మహారాష్ట్ర జట్టులో రుతురాజ్ సెంచరీలతో కదంతొక్కారు. మంగళవారం హరియాణాతో ప్రారంభమైన మూడో రౌండ్ మ్యాచ్‌లో తొలుత బ్యాటింగ్ చేసిన ముంబయి మొదటి ఇన్నింగ్స్‌లో 9 వికెట్లకు 346 పరుగులు సాధించింది. ఒక దశలో 84 పరుగులకే నాలుగు వికెట్లు కోల్పోయిన ముంబయిని సర్ఫరాజ్ ఆదుకున్నాడు. సెంచరీతో సత్తాచాటిన అతడు ముంబయికి గౌరవప్రదమైన స్కోరు అందించాడు. హిమాచల్‌ప్రదేశ్‌తో మ్యాచ్‌లో మహారాష్ట్ర తొలి ఇన్నింగ్స్‌లో 440 పరుగుల భారీస్కోరు సాధించింది. రుతురాజ్‌తో పాటు అర్షిన్ కులకర్ణి (146; 190 బంతుల్లో 16×4, 1×6) శతకంతో చెలరేగాడు. హిమాచల్ ఎడమచేతి వాటం స్పిన్నర్ ప్రిన్స్ ఠాకూర్ (7/144) ఏడు వికెట్లు తీశాడు. రోహిత్ రాయుడు (5/44) విజృంభించడంతో హైదరాబాద్‌తో జరుగుతున్న మ్యాచ్‌లో మధ్యప్రదేశ్ తొలి ఇన్నింగ్స్‌లో 56.5 ఓవర్లలో 181 పరుగులకే కుప్పకూలింది. మొదటి రోజు ఆట ముగిసే సమయానికి హైదరాబాద్ తొలి ఇన్నింగ్స్‌లో 33 ఓవర్లలో ఒక వికెట్‌కు 155 పరుగులు సాధించింది. తన్మయ్ అగర్వాల్ (85 బ్యాటింగ్; 121 బంతుల్లో 12×4, 1×6), నితీశ్‌రెడ్డి (41; 48 బంతుల్లో 6×4) రాణించారు.


రుతురాజ్

అంపైర్ కాల్ నిబంధన తీసేయాలి


సచిన్

ముంబయి: అంపైర్ నిర్ణయ సమీక్ష పద్ధతిలో వివాదాస్పదంగా మారిన 'అంపైర్ కాల్' నిబంధనను తీసేయాలన్న డిమాండ్‌కు దిగ్గజ బ్యాటర్ సచిన్ తెందుల్కర్ మద్దతు పలికాడు. "డీఆర్ఎస్‌లో అంపైర్ కాల్ నిబంధనను మార్చాలన్నది నా కోరిక. ఫీల్డ్ అంపైర్ నిర్ణయంపై అసంతృప్తితోనే ఆటగాళ్లు సమీక్షకు వెళ్తారు. అలాంటపుడు మళ్లీ తిరిగి అంపైర్ కాల్‌కు ఎందుకు వెళ్లాలి? ఆటగాళ్లకు కలిసి రానట్లే.. కొన్నిసార్లు అంపైర్లకూ ఇబ్బందులుంటాయి. సాంకేతికతలో కచ్చితత్వం లేదంటే ఆ సమస్య ఎప్పుడూ ఉంటుంది" అని సచిన్ అన్నాడు. సమీక్షలో ఎల్బీడబ్ల్యూ నిర్ణయాలకు సంబంధించి బంతి యాభై శాతం కంటే ఎక్కువగా స్టంప్‌నకు తాకనప్పుడు.. సాంకేతికతను పరిగణనలోకి తీసుకోరు. అంపైర్ ఔట్ అంటే ఔట్, నాటౌట్ అంటే నాటౌట్ ఇస్తున్నారు. దీని పట్ల ఎప్పట్నుంచో వ్యతిరేకత ఉంది. సామాజిక మాధ్యమంలో అభిమానుల ప్రశ్నలకు బదులిస్తూ అంపైర్ కాల్ నిబంధనపై సచిన్ అసంతృప్తి వ్యక్తం చేశాడు. ఈ సందర్భంగా తనయుడు అర్జున్ తెందుల్కర్‌కు నిశ్చితార్థం అయిందని ధ్రువీకరించాడు.

అత్యుత్తమ సూర్యను చూస్తారు


సూర్యకుమార్

దిల్లీ: రాబోయే రోజుల్లో తనలోని అత్యుత్తమ ఆటగాడిని చూస్తారని టీమ్ ఇండియా టీ20 కెప్టెన్ సూర్యకుమార్ యాదవ్ చెప్పాడు. ఐపీఎల్ అనంతరం హెర్నియా చికిత్స చేయించుకుని కొన్నాళ్లు విశ్రాంతి తీసుకున్న సూర్య.. తర్వాత బెంగళూరులోని బీసీసీఐ సెంటర్ ఆఫ్ ఎక్స్‌లెన్స్ (సీఓఈ)కి చేరుకుని ఆరు వారాలు అక్కడే గడిపాడు. మ్యాచ్ ఫిట్‌నెస్ సాధించాక ఆసియా కప్ జట్టు సెలక్షన్‌కు అందుబాటులోకి వచ్చాడు. తన సారథ్యంలోనే జట్టును ఎంపిక చేశారు. ఈ నేపథ్యంలో సూర్య మాట్లాడుతూ.. "ఐపీఎల్ చివరి దశలో నా సమస్యను గుర్తించా. ఇంతకుముందు కూడా ఇదే రకమైన ఇబ్బందిని ఎదుర్కొన్నా. శస్త్రచికిత్స తర్వాత, ఇప్పుడు నేను మెరుగైన స్థితిలో ఉన్నాను. కోలుకునే ప్రక్రియ అయిదారు వారాల పాటు సాగింది. ఇందులో ముఖ్యమైన విషయం ఏంటంటే.. చుట్టూ సరైన వ్యక్తులు ఉండి మనల్ని ఉత్తమమైన మార్గంలో నడిపించడమే. నాలోని ఉత్తమ ఆటగాడిని బయటికి తీసుకురావడానికి ఇది నాకు దక్కిన అవకాశంగా భావిస్తున్నా" అని సూర్య అన్నాడు.

ఈనాడు

విజయవాడ 27-8-2025 బుధవారం సిటీ సంపుటి 52 . సంచిక 18

THE LARGEST CIRCULATED TELUGU DAILY

రూ. 6-50 పేజీలు 16 www.eenadu.net

Vijayawada, Visakhapatnam, Hyderabad, Tirupati, Ananthapuramu, Karimnagar, Rajamahendravaram, Suryapet, Guntur, Nellore, Srikakulam, Kurnool, Tadepalligudem, Warangal, Kadapa, Nizamabad, Khammam, Ongole, Mahaboobnagar, Chennai, Bengaluru



పాఠకులకు, ప్రకటనకర్తలకు, ఏజెంట్లకు, శ్రేయోభిలాషులకు ఈనాడు వినాయక చవితి శుభాకాంక్షలు

సెలవు

వినాయక చవితి సందర్భంగా బుధవారం 'ఈనాడు' కార్యాలయానికి సెలవు. గురువారం సంచిక వెలువడదు. పునర్దర్శనం శుక్రవారం.

\- చైర్మన్ & మేనేజింగ్ డైరెక్టర్

తాజా వార్తల కోసం ఈటీవీ భారత్, ఈటీవీ ఆంధ్రప్రదేశ్, ఈనాడు.నెట్ లను చూడొచ్చు.

లొంగిపోయిన సంజయ్

ఏసీబీ కోర్టులో న్యాయాధికారి ముందు సీఐడీ మాజీ చీఫ్ హాజరు • సెప్టెంబరు 9 వరకు రిమాండ్

బెయిలు పిటిషన్ వేసిన సంజయ్ • పోలీసు కస్టడీ కోరుతూ ఏసీబీ పిటిషన్

కౌంటర్లు వేయాలని ఇరుపక్షాలకూ కోర్టు ఆదేశం • విచారణ ఈ నెల 29కి వాయిదా

ఈనాడు - అమరావతి

వైకాపా ప్రభుత్వ హయాంలో ఎస్సీ, ఎస్టీలకు అవగాహన సదస్సుల పేరిట సొమ్ము దోపిడీ, అగ్ని-ఎన్వోసీ వెబ్‌సైట్, యాప్ అభివృద్ధి నిర్వహణ పేరుతో నిధుల దుర్వినియోగానికి పాల్పడిన కేసులో ఐపీఎస్ అధికారి, నాటి సీఐడీ, అగ్నిమాపక శాఖల డీజీ నిడగట్టు సంజయ్ (ఏ1) మంగళవారం విజయవాడ ఏసీబీ కోర్టులో లొంగిపోయారు. సంజయ్ దాఖలు చేసిన లొంగుబాటు పిటిషన్‌ను పరిగణనలోకి తీసుకున్న న్యాయాధికారి పి.భాస్కరరావు.. సెప్టెంబరు 9 వరకు జ్యుడీషియల్ రిమాండ్ విధించారు. విజయవాడ జిల్లా జైలుకు తరలించాలని ఏసీబీ పోలీసులను ఆదేశించారు. దీంతో సంజయ్‌ను విజయవాడ జిల్లా జైలుకు తరలించారు.

బెయిలు కోరుతూ సంజయ్, ఆయన్ను ఏడు రోజులు పోలీసు కస్టడీకి అప్పగించాలంటూ ఏసీబీ అధికారులు ఏసీబీ కోర్టులో పిటిషన్లు వేశారు. సంజయ్ తరఫు న్యాయవాది మన్మథరావు వాదనలు వినిపిస్తూ.. జ్యుడీషియల్



విజయవాడలోని జిల్లా జైలులోకి వెళ్తున్న సంజయ్

రిమాండ్‌లో ఉంచాల్సిన అవసరం లేదన్నారు. సంజయ్‌కు గుండె శస్త్రచికిత్స జరిగిందని, జైల్లోకి ఔషధాలు పంపించే వెసులుబాటు కల్పించాలని కోరారు. జైలు మాన్యువల్ నిబంధనలకు అనుగుణంగా ఐపీఎస్ అధికారికి కల్పించాల్సిన సౌకర్యాలను పిటిషనర్‌కు ఇచ్చేలా జైలు అధికారులను ఆదేశించాలని అభ్యర్థించారు.

ఏసీబీ తరఫున ప్రత్యేక పీపీలు వాదనలు వినిపిస్తూ.. సంజయ్‌ను ప్రశ్నించి పలు విషయాలను రాబట్టాల్సి ఉందన్నారు. కస్టడీలోకి తీసుకొని ఇంటరాగేషన్ చేయాలని భావిస్తే ఇదే కోర్టులో పిటిషన్ వేసేందుకు సుప్రీంకోర్టు.. ఏసీబీకి స్వేచ్ఛనిచ్చిందని గుర్తుచేశారు. ఈ నేపథ్యంలో సంజయ్‌ను ఏడు రోజుల పోలీసు కస్టడీకి అప్పగించాలని పిటిషన్ వేశామన్నారు. ప్రాథమిక వాదనలు విన్న న్యాయాధికారి.. పిటిషన్లపై కౌంటర్లు వేయాలని ఇరువైపు న్యాయవాదులను ఆదేశించారు. విచారణను ఈ నెల 29కి వాయిదా వేశారు.

రూ.1.75 కోట్ల ప్రజాధనాన్ని దోచిపెట్టారని..

అగ్ని-ఎన్వోసీ వెబ్‌సైట్, మొబైల్ యాప్ అభివృద్ధి నిర్వహణ, 150 ట్యాబ్‌ల సరఫరా ఒప్పందం పేరుతో సౌత్రికా టెక్నాలజీస్ అండ్ ఇన్‌ఫ్రా సంస్థకు, సీఐడీ తరఫున (మిగతా 2లో)

వైకాపా హయాంలో అవినీతి.. ఐపీఎస్ సంజయ్‌కు జైలే గతి 2లో



ఈటీవీ 30 వసంతాల వేడుకలో కేక్ కోస్తున్న అగ్ర కథానాయకుడు చిరంజీవి. చిత్రంలో నిర్మాతలు ఎస్.గోపాలరెడ్డి, కేఎల్ నారాయణ, శ్యామ్‌ప్రసాదరెడ్డి, రామోజీ గ్రూపు సంస్థల సీఎండీ కిరణ్, దర్శకుడు రాఘవేంద్రరావు, జెమినీ కిరణ్, మురళీమోహన్

తెలుగువారి మనోల్లాస వేదిక..
ఈటీవీ 30 ఏళ్ల వేడుక



తెలుగు ప్రజల మనసు గెలిచిన ఈటీవీ.. 30 ఏళ్లు పూర్తిచేసుకుంది. 1995 ఆగస్టు 27న ప్రయాణం ప్రారంభించి ప్రేక్షకులకు నచ్చే, మెచ్చే కార్యక్రమాలతో ఆదరాభిమానాలు చూరగొంది. ప్రజల అభిరుచులను గుర్తిస్తూ, గౌరవిస్తూ జనరంజకంగా సాగిపోతోంది. సుదీర్ఘ ప్రస్థానంలో ఎన్నో మైలురాళ్లను అధిగమించిన మనందరి టీవీ మూడు దశాబ్దాల పండుగను ఘనంగా నిర్వహించుకుంది. ఈ వేడుకలు రామోజీ ఫిల్మ్ సిటీలో అత్యంత వైభవంగా జరిగాయి. మొదటి నుంచీ ఈటీవీతో అనుబంధం ఉన్న మెగాస్టార్ చిరంజీవి ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా విచ్చేసి 'ఈటీవీ @ 30' కేక్‌ను కట్ చేశారు. ఈ సందర్భంగా దర్శకేంద్రుడు కె.రాఘవేంద్రరావు, ప్రముఖ నటులు మురళీమోహన్, అలీ, నిర్మాత శ్యామ్‌ప్రసాదరెడ్డి తదితరులు రామోజీ గ్రూపు సంస్థల సీఎండీ కిరణ్‌కు శుభాకాంక్షలు తెలియజేశారు. మార్గదర్శి ఎండీ శైలజా కిరణ్, రామోజీ ఫిల్మ్ సిటీ ఎండీ విజయేశ్వరి, ఈటీవీ నెట్‌వర్క్ సీఈఓ బాపినీడు, సుజయ్, దివిజ ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు. ఈ వేడుకల్లో పాల్గొన్న నటీనటులు, దర్శకనిర్మాతలు, సాంకేతిక నిపుణులు, ఉన్నతోద్యోగులు తాము ఈటీవీ 30 ఏళ్ల ప్రయాణంలో భాగస్వాములు కావడంపై హర్షం వ్యక్తం చేశారు. ఛానల్ భవిష్యత్తు మరింత బ్రహ్మాండంగా ఉండాలని, అత్యున్నతంగా ఎదగాలని ఆకాంక్షించారు.

మరపురాని వినోదాల ప్రయాణం... ఈటీవీ 30 ఏళ్ల ప్రస్థానం సినిమా లో

అవినీతి అనకొండ.. ఆ అధికారిణి

ఐఏఎస్ అధికారి శ్రీలక్ష్మిపై పరోక్షంగా విరుచుకుపడ్డ భూమన కరుణాకరరెడ్డి 14లో

కశ్మీర్‌లో ఆకస్మిక వరదలు

వైష్ణోదేవి ఆలయ మార్గంలో కొండచరియలు విరిగిపడి తొమ్మిది మంది దుర్మరణం

నేటి నుంచి 50% సుంకాల భారం

రష్యా నుంచి చమురు కొంటున్న భారత్‌పై అమెరికా అక్కసు

48 బిలియన్ డాలర్ల వాణిజ్యంపై ప్రభావం




రొయ్యలు, దుస్తులు, పాదరక్షలకు దెబ్బ

ఔషధాలకు మినహాయింపు

వాషింగ్టన్, దిల్లీ: రష్యా నుంచి ముడి చమురు కొంటున్న భారత్‌పై ఒత్తిడి తెచ్చేందుకు అమెరికా విధించిన అదనపు సుంకాలు ఆ దేశ కాలమానం ప్రకారం.. మంగళవారం అర్ధరాత్రి దాటాక బుధవారం తెల్లవారుజామున 12.01 (భారత కాలమానం ప్రకారం బుధవారం ఉదయం 9.30 గంటలు) నుంచి అమల్లోకి రానున్నాయి. గతంలో విధించిన 25శాతానికి అదనంగా మరో 25శాతం కలిపి భారత్ ఎగుమతులపై 50శాతం భారం పడనుంది. మన దేశం (మిగతా 12లో)

వచ్చే మహిళా దినోత్సవం నాటికి..
లక్ష మంది మహిళా పారిశ్రామికవేత్తలు

- బ్యాంకర్లు పెద్దఎత్తున రుణాలిచ్చి ప్రోత్సహించాలి
- అమరావతిలో ఫైనాన్షియల్ డిస్ట్రిక్ట్, ఐకానిక్ భవనాలు
- రాజధాని రైతుల రిటర్నబుల్ ప్లాట్లకు రుణాలివ్వండి
- ఎస్ఎల్‌బీసీ సమావేశంలో బ్యాంకర్లతో సీఎం చంద్రబాబు



రాష్ట్రంలోని 175 నియోజకవర్గాల్లో ఏర్పాటుచేసే ఎంఎస్ఎంఈ పార్కుల్లో మహిళలకే అవకాశం కల్పిస్తాం. ఇప్పటి వరకు డ్వాక్రా మహిళల ఆర్థిక స్వావలంబనకు ఎలా సహకరించారో, వారిని పారిశ్రామికవేత్తలుగా తయారు చేసేందుకూ బ్యాంకర్లు అంతే తోడ్పాటు అందించాలి.

\- సీఎం చంద్రబాబు

వివరాలు 12లో

ఒప్పంద అధ్యాపకులను క్రమబద్ధీకరించాలని, ఎమ్మెల్సీ కమిటీ సిఫార్సుల మేరకు 12 నెలలు జీతాలు చెల్లించాలని పీడీఎఫ్‌ ఎమ్మెల్సీ గోపిమూర్తి కోరారు. తాడేపల్లిలో మంగళవారం ఇంటర్మీడియట్‌ విద్య డైరెక్టర్‌ కృతికా శుక్లాను కలిసి వినతిపత్రం సమర్పించారు.

సిబ్బంది మధ్య.. ఈటీవీ 30 ఏళ్ల సంబరాలు

కేక్‌ కట్‌ చేసిన సుజయ్‌, దివిజ

ఈటీవీ మూడు దశాబ్దాల వేడుకలు రామోజీ ఫిల్మ్‌సిటీలోని కార్పొరేట్‌ కార్యాలయంలో ఘనంగా జరిగాయి. రామోజీ గ్రూపు సంస్థల సీఎండీ సి.హెచ్‌. కిరణ్‌ సారథ్యంలో దివంగత రామోజీరావు మనవడు సుజయ్‌, మనవరాలు దివిజ కేక్‌ కట్‌ చేశారు. ఈటీవీని ఆదరిస్తున్న తెలుగు ప్రజలకు మరింత వినోదాన్ని అందిస్తామని సుజయ్‌ హామీ ఇచ్చారు. 'మా నాన్న సుమన్‌ ఈటీవీని ఎప్పుడూ పెద్ద కూతురులా భావించేవారు. అలాంటి ఈటీవీ 30 ఏళ్లు పూర్తి చేసుకున్నవేళ నాకు ఆనందంతో పాటుగా నోటమాట రావట్లేదు. నాన్న లేకున్నా ఉన్నట్టే అనిపిస్తోంది. నాన్న పనిని ఎంత ఇష్టపడ్డారో ఉద్యోగులు కూడా అంతే ఇష్టంతో ఈటీవీని ముందుకు తీసుకెళ్లారు. నాన్న కోరుకున్న స్థాయి కంటే పైస్థాయిలోనే ఈటీవీని ఉంచిన ఉద్యోగులకు శిరసు వంచి నమస్కరిస్తున్నా. ఈటీవీ ప్రస్థానాన్ని కొనసాగించేందుకు నేర్చుకోవాల్సింది నేర్చుకుంటూ చానల్‌ అభివృద్ధికి నా వంతు కృషి చేస్తాను' అని మాట ఇచ్చారు.

విభాగాధిపతులకు జ్ఞాపికలు ప్రదానం

ఈటీవీ 30 ఏళ్ల ప్రయాణంలో ఆది నుంచి అత్యుత్తమ సేవలందించిన వారికి రామోజీ గ్రూపు సీఎండీ కిరణ్‌ జ్ఞాపికలు అందజేశారు. ఈ కార్యక్రమంలో రామోజీ ఫిల్మ్‌సిటీ మేనేజింగ్‌ డైరెక్టర్‌ విజయేశ్వరి, ఈటీవీ సీఈవో బాపినీడు, మానవవనరుల విభాగం అధిపతి గోపాలరావు, ఈనాడు ఆంధ్రప్రదేశ్‌ ఎడిటర్‌ ఎం.నాగేశ్వరరావు, తెలంగాణ ఎడిటర్‌ డీఎన్‌ ప్రసాద్‌, ఈటీవీ భారత్‌ సీఈవో జొన్నలగడ్డ శ్రీనివాస్‌, రామోజీ గ్రూపు విభాగాధిపతులు శివరామకృష్ణ, ఏవీరావు, ఐ. వెంకట్‌, అజయ్‌శాంతి, శైలజ, రావి చంద్రశేఖర్‌, వివిధ విభాగాల సీనియర్‌ ఉద్యోగులు, సిబ్బంది పాల్గొన్నారు.



30 వసంతాల సంబరాల్లో కేక్‌ కోస్తున్న సుజయ్‌, దివిజ. చిత్రంలో ఈటీవీ సీఈవో బాపినీడు, రామోజీ గ్రూపు సంస్థల సీఎండీ కిరణ్‌, ఫిల్మ్‌సిటీ ఎండీ విజయేశ్వరి, ఉషోదయా పబ్లికేషన్స్‌ డైరెక్టర్‌ ఐ.వెంకట్‌

- ఈనాడు, హైదరాబాద్‌

వైకాపా హయాంలో అవినీతి.. ఐపీఎస్‌ సంజయ్‌కు జైలే గతి

దళిత, గిరిజనులకు అవగాహన సదస్సుల పేరిట దోపిడీ

- అగ్నిమాపక శాఖలో సాంకేతికత పేరిట నిధుల దుర్వినియోగం
- విజిలెన్స్‌ విచారణలో వెల్లడవడంతో ఏసీబీ కేసు
- సుప్రీంకోర్టు ఆదేశాలతో విధి లేక లొంగుబాటు

ఈనాడు, అమరావతి: వైకాపా హయాంలో నాటి ప్రభుత్వ పెద్దల అండతో చెలరేగిపోయిన ఐపీఎస్‌ అధికారి ఎన్‌.సంజయ్‌ ఎస్సీ, ఎస్టీ ఎట్రాసిటీ నిరోధక చట్టంపై దళితులు, గిరిజనులకు అవగాహన సదస్సుల పేరిట నిధులు దుర్వినియోగానికి పాల్పడ్డారు. అగ్ని-ఎన్‌ఓసీ వెబ్‌సైట్‌, యాప్‌ అభివృద్ధి, నిర్వహణలోనూ అవినీతికి తెరలేపారు. ఆయన అగ్నిమాపక శాఖ డైరెక్టర్‌ జనరల్‌, సీఐడీ విభాగాధిపతిగా పనిచేసిన సమయంలో.. ఈ హోదాలను అడ్డం పెట్టుకుని రూ.1.75 కోట్ల మేర దోచుకున్నట్లు విజిలెన్స్‌ అండ్‌ ఎన్‌ఫోర్స్‌మెంట్‌ విచారణలో తేలింది. దీని కోసం డొల్ల కంపెనీలను అడ్డం పెట్టుకున్నట్లు వెల్లడైంది. విజిలెన్స్‌ నివేదిక ఆధారంగా.. గతేడాది డిసెంబరులో సంజయ్‌పై ఏసీబీ కేసు నమోదు చేసింది. అవినీతి నిరోధక చట్టంలోని వివిధ సెక్షన్ల కింద అభియోగాలు మోపింది. సంజయ్‌ను (ఏ1)గా, సౌత్రికా టెక్నాలజీస్‌ అండ్‌ ఇన్‌ఫ్రా ప్రైవేట్‌ లిమిటెడ్‌ను (ఏ2)గా, క్రిత్వ్యాప్‌ టెక్నాలజీస్‌ ప్రైవేట్‌ లిమిటెడ్‌ను (ఏ3)గా చేర్చింది. ఈ కేసులో ఏపీ హైకోర్టు జనవరిలో సంజయ్‌కు ముందస్తు బెయిల్‌ ఇవ్వగా ఆ ఉత్తర్వులను సుప్రీంకోర్టు జులై 31న కొట్టేసింది. ఈ కేసు వివరాలు వెలికితీస్తే తమకు అనేక అంశాలు తెలుస్తాయని సుప్రీంకోర్టు న్యాయమూర్తులు... నాలుగు వారాల్లో లొంగిపోవాలని సంజయ్‌ను ఆదేశించారు. దీంతో వేరే దారిలేక సంజయ్‌ మంగళవారం న్యాయాధికారి ఎదుట లొంగిపోయారు.

కాంట్రాక్టు నుంచి బిల్లుల చెల్లింపు వరకు మోసమే..

■ ఎస్సీ, ఎస్టీ ఎట్రాసిటీ నిరోధక చట్టంపై దళితులు, గిరిజనులకు అవగాహన సదస్సుల పేరిట సంజయ్‌ రూ.1.19 కోట్ల మేర దోపిడీకి పాల్పడ్డారు. క్రిత్వ్యాప్‌ టెక్నాలజీస్‌తో కుమ్మక్కై ఆ సంస్థకు సదస్సుల నిర్వహణ కాంట్రాక్టు కట్టబెట్టారు. ఒప్పందం కుదుర్చుకున్న వారం రోజుల్లోనే ఎస్సీలకు సదస్సుల నిర్వహణ కోసం రూ.59.52 లక్షలు, ఎస్టీల కోసం సదస్సుల నిర్వహణకు రూ.59.51 లక్షలు చొప్పున మొత్తం రూ.1.19 కోట్ల బిల్లు మోసపూరితంగా చెల్లించేశారు.

■ ఈ సదస్సులన్నీ సీఐడీ ప్రాంతీయ కార్యాలయాల్లో పూర్తిగా సీఐడీ సిబ్బంది ఆధ్వర్యంలోనే జరిగాయి. కానీ రికార్డుల్లో మాత్రం క్రిత్వ్యాప్‌ సంస్థే సదస్సులు నిర్వహించినట్లు చూపించి, నిధులు దోచిపెట్టారు.

■ ఎస్సీ, ఎస్టీల కోసం నిర్వహించిన ప్రతి అవగాహన సదస్సులోనూ 350 మంది పాల్గొన్నట్లు రికార్డుల్లో చూపించారు. 'ప్రతి కార్యక్రమంలో ఒకే సంఖ్యలో ప్రజలు పాల్గొంటారా? అసలు హెచ్చుతగ్గులే ఉండవా?' అంటూ విచారణలో సుప్రీంకోర్టు న్యాయమూర్తులు విస్మయం వ్యక్తం చేశారు. ఎస్సీ, ఎస్టీల అవగాహన కార్యక్రమాలకు ఒకేలా బిల్లులు చెల్లించటంలో ఆంతర్యమేంటని ప్రశ్నించారు.

■ ఫ్లాట్‌ నంబర్‌ 601, లలితాంజలి అపార్ట్‌మెంట్‌, ద్వారకాపురి కాలనీ, హైదరాబాద్‌లోని చిరునామాలో క్రిత్వ్యాప్‌ టెక్నాలజీస్‌ ఉన్నట్లు రికార్డుల్లో చూపారు. ఆ చిరునామాలో అసలు ఆ కంపెనీయే లేదని, అది డొల్ల కంపెనీ అని విజిలెన్స్‌ విచారణలో తేలింది.

పనులు జరగకుండానే బిల్లులు చెల్లించేశారు

■ అగ్ని-ఎన్వోసీ వెబ్‌సైట్‌, మొబైల్‌ యాప్‌ అభివృద్ధి, నిర్వహణ, 150 ట్యాబ్‌ల సరఫరా కాంట్రాక్టును నిబంధనలకు విరుద్ధంగా సౌత్రికా టెక్నాలజీస్‌ అనే సంస్థకు సంజయ్‌ కట్టబెట్టారు. ఒప్పందం కుదిరిన వారం రోజుల్లోనే ఎలాంటి పనులు జరగకపోయినా ఆ సంస్థకు రూ.59.53 లక్షలు బిల్లు చెల్లించేశారు.

■ టెండరు నిబంధనల ప్రకారం.. వెబ్‌సైట్‌, యాప్‌ కార్యకలాపాలు ప్రారంభించి, ట్యాబ్‌లన్నీ సరఫరా చేస్తే 50%, శాఖాపరమైన అంతర్గత సమీక్ష కమిటీ నివేదిక అందిస్తే 25%, సెక్యూరిటీ ఆడిట్‌ పూర్తిచేశాక 20% బిల్లులు చెల్లించాలి. మిగతా 5 శాతాన్ని ఏడాదికోసారి చొప్పున ఐదేళ్లలో చెల్లించాలి. సంజయ్‌ ఈ నిబంధనలన్నీ ఉల్లంఘించి ఆఘమేఘాలపై సౌత్రికా టెక్నాలజీస్‌కు నిధులు చెల్లించేశారు. 50% పనులు పూర్తిచేసినట్లు సంస్థ తప్పుడు నివేదికలు సమర్పిస్తే.. ఎంత పని జరిగిందో పరిశీలించకుండానే బిల్లులు ఇచ్చేశారు. ఈ బిల్లులు చెల్లించాలంటూ సంజయ్‌ సంబంధిత అధికారులపై తీవ్ర ఒత్తిడి తీసుకొచ్చారు. ఆ సంస్థతో కుమ్మక్కయ్యారు.

■ ఒక్కో ల్యాప్‌టాప్‌, ఐపాడ్‌కు రూ.1.78 లక్షలు వెచ్చించి 10 పరికరాలను మార్కెట్‌ కంటే అధిక ధరలు వెచ్చించి సౌత్రికా టెక్నాలజీస్‌ నుంచి సంజయ్‌ కొన్నారు. దీని కోసం రూ.17.89 లక్షలు చెల్లించారు. టెండర్లు, కాంపిటీటివ్‌ బిడ్లు లేకుండానే సరఫరా ఆర్డర్లు ఇచ్చేశారు. బిల్లులూ సమర్పించలేదు.

లొంగిపోయిన సంజయ్‌

(మొదటి పేజీ తరువాయి)

ఎస్సీ, ఎస్టీ ఎట్రాసిటీ నిరోధక చట్టంపై దళితులు, గిరిజనులకు అవగాహన సదస్సుల నిర్వహణ ఒప్పందం పేరుతో క్రిత్వ్యాప్‌ టెక్నాలజీస్‌ ప్రైవేట్‌ లిమిటెడ్‌ సంస్థకు రూ.1.75 కోట్ల ప్రజాధనాన్ని సంజయ్‌ దోచిపెట్టారనే ఆరోపణలతో ఏసీబీ కేసు నమోదు చేసింది. ఈ కేసులో ముందస్తు బెయిలు కోసం ఆయన హైకోర్టును ఆశ్రయించారు. విచారణ జరిపిన హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్‌ కె.శ్రీనివాసరెడ్డి.. సంజయ్‌కు షరతులతో ముందస్తు బెయిలిస్తూ ఈ ఏడాది జనవరి 30న తీర్పు ఇచ్చారు. దీన్ని రాష్ట్రప్రభుత్వం సుప్రీంకోర్టులో సవాల్‌ చేసింది. జులై 31న విచారణ జరిపిన సర్వోన్నత న్యాయస్థానం.. హైకోర్టు ఇచ్చిన ముందస్తు బెయిలును రద్దు చేసింది. నాలుగు వారాల్లో ఏసీబీ కోర్టులో లొంగిపోవాలని సంజయ్‌కు తేల్చిచెప్పింది. ఈ నేపథ్యంలో సంజయ్‌ మంగళవారం విజయవాడ ఏసీబీ కోర్టులో లొంగిపోయారు. ఏసీబీ కోర్టు న్యాయాధికారి పి.భాస్కరరావు.. ఆయనతో మాట్లాడి వ్యక్తిగత వివరాలు, ఈ కేసుతో మీకు సంబంధం ఉందా తదితర వివరాలను అడిగి తెలుసుకున్నారు. ఆ వివరాలు చెప్పిన సంజయ్‌ తనకు గుండె సంబంధిత శస్త్రచికిత్స జరిగిందని తెలిపారు.

ఖైదీ నంబర్‌ 7971: సంజయ్‌ నేరుగా లొంగిపోవడం, ఏసీబీ కోర్టు జ్యుడీషియల్‌ రిమాండ్‌ విధించడంతో ఏసీబీ అధికారులు విజయవాడ జిల్లా జైలుకు తరలించారు. ఆరోగ్యంగానే ఉన్నారని నిరూపించే వైద్య ధ్రువపత్రం లేదంటూ సంజయ్‌ను కారాగారంలోకి తీసుకునేందుకు జైలు అధికారులు నిరాకరించారు. దీంతో సంజయ్‌ను ఏసీబీ అధికారులు మళ్లీ కోర్టుకు తీసుకొచ్చారు. న్యాయాధికారి ఆదేశాల మేరకు విజయవాడ ప్రభుత్వ వైద్యశాలలో వైద్య పరీక్షలు చేయించారు. ఆయన ఆరోగ్యంగా ఉన్నారని వైద్యులు ఇచ్చిన నివేదికతో విజయవాడ జిల్లా జైలుకు తరలించారు. జైలులో ఆయనకు రిమాండ్‌ ఖైదీ నంబరు 7971 కేటాయించారు.



వైద్య పరీక్షల కోసం విజయవాడ ప్రభుత్వ ఆసుపత్రికి వచ్చిన సంజయ్‌

ఆర్టీసీ ఉద్యోగుల పదోన్నతులకు పచ్చజెండా

- దస్త్రానికి సీఎం చంద్రబాబు ఆమోదం

ఈనాడు, అమరావతి: ఆర్టీసీ ఉద్యోగుల పదోన్నతుల దస్త్రానికి ముఖ్యమంత్రి చంద్రబాబు ఆమోదం తెలిపారు. చాలాకాలంగా పదోన్నతుల కోసం ఎదురుచూస్తున్న 2 వేల మంది సిబ్బందికి మేలు కలగనుంది. పదోన్నతుల ప్రక్రియ వివిధ కారణాలతో జాప్యమవుతూ వచ్చింది. తాజాగా గత నెలలో ఈ ఫైల్‌ ప్రభుత్వం వద్దకు వెళ్లింది. రవాణాశాఖ ముఖ్య కార్యదర్శి, ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి, రవాణా శాఖ మంత్రి మండిపల్లి రాంప్రసాద్‌రెడ్డి నుంచి సీఎం వద్దకు ఈ నెల 23న వెళ్లింది. దీనికి సీఎం చంద్రబాబు మంగళవారం ఆమోదం తెలిపారు. ఒకట్రెండు రోజుల్లో పదోన్నతులపై ఉత్తర్వు వెలువడనుంది. 2024-25 ప్యానల్‌ ఇయర్‌ ఈ నెలాఖరుతో ముగుస్తుంది. ఈలోపు పదోన్నతులు పూర్తి చేయాల్సి ఉంది.

■ డ్రైవర్లు, కండక్టర్లకు.. వరుసగా కంట్రోలర్‌/ అసిస్టెంట్‌ డిపో క్లర్క్‌, ట్రాఫిక్‌ ఇన్‌స్పెక్టర్‌ గ్రేడ్‌-3/ డిపో క్లర్క్‌/టీటీఐ, డిప్యూటీ సూపరింటెండెంట్‌ ట్రాఫిక్‌, సూపరింటెండెంట్‌ ట్రాఫిక్‌, అసిస్టెంట్‌ మేనేజర్‌ (ట్రాఫిక్‌) వరకు పదోన్నతి లభిస్తుంది.

■ గ్యారేజ్‌ ఉద్యోగుల్లో.. డిప్యూటీ మెకానిక్స్‌ నుంచి వరుసగా మెకానిక్స్‌, లీడింగ్‌ హ్యాండ్స్‌, డిప్యూటీ సూపరింటెండెంట్‌ మెకానికల్‌, సూపరింటెండెంట్‌ మెకానిక్‌, అసిస్టెంట్‌ ఇంజినీర్‌ (మెకానికల్‌ ఫోర్‌మెన్‌) వరకు పదోన్నతులు వస్తాయి.

■ పర్సనల్‌, ఫైనాన్స్‌, స్టోర్స్‌ విభాగాల్లో జూనియర్‌ అసిస్టెంట్‌ నుంచి సీనియర్‌ అసిస్టెంట్‌, డిప్యూటీ సూపరింటెండెంట్‌, సూపరింటెండెంట్‌, అసిస్టెంట్‌ మేనేజర్‌ వరకు పదోన్నతులు దక్కుతాయి.

■ పదోన్నతుల ఫైలుకు సీఎం ఆమోదం తెలపడంపై ఎన్‌ఎంయూఏ, ఎంప్లాయీస్‌ యూనియన్లు హర్షం ప్రకటించాయి.

డీఎంల పదోన్నతులకు కేసులు అడ్డంకి: డిపో మేనేజర్ల (డీఎంల) పదోన్నతులకు కోర్టు కేసులు అడ్డంకిగా మారాయి. సంస్థలో ఆపరేషన్స్‌, మెకానికల్‌ ఇంజినీర్స్‌, పర్సనల్‌, ఎకౌంట్స్‌, స్టోర్స్‌, సివిల్‌ ఇంజినీరింగ్‌ వంటి ఆరు విభాగాల వారికి రోస్టర్‌ పాయింట్ల ఆధారంగా డిపో మేనేజర్లుగా పదోన్నతులు ఇస్తారు. మెకానిక్‌ ఇంజినీర్ల విభాగం నుంచి 41 మంది డీఎంలుగా ఉండాలి. కానీ, గతంలో నిబంధనలకు విరుద్ధంగా ఎక్కువ మందికి పదోన్నతులు ఇవ్వడంతో ఇప్పుడు ఆ విభాగానికి చెందినవారు 57 మంది ఉన్నారు. ఇతర విభాగాల వారు తక్కువగా ఉన్నారు. ప్రస్తుతం 46 డీఎం కేడర్‌ (జూనియర్‌ స్కేల్‌ ఆఫీసర్‌) పోస్టులు ఖాళీగా ఉండగా, వీటికి పదోన్నతులు కల్పించే సమయంలో మెకానికల్‌ ఇంజినీరింగ్‌ విభాగాల వారిని తగ్గించేలా అధికారులు సిద్ధమయ్యారు. దీంతో వారు న్యాయస్థానాన్ని ఆశ్రయించారు. మరోవైపు ఆపరేషన్స్‌ విభాగం నుంచి కూడా కొందరు కోర్టును ఆశ్రయించి, న్యాయం చేయాలని కోరారు. దీనిపై కోర్టు స్టేటస్‌కో ఇచ్చింది. గతంలో ఆర్టీసీ ప్రధాన కార్యాలయంలో పనిచేసిన అధికారుల తప్పిదాలే ఈ పేచీకి కారణమని ఉద్యోగులు పేర్కొంటున్నారు.

పేర్ని నానిపై ఏలూరులో కేసు

ఏలూరు నేరవార్తలు, న్యూస్‌టుడే: శాంతిభద్రతలకు విఘాతం, వర్గాల మధ్య విద్వేషాలు కలిగించేలా, పోలీసులను అవమానపరిచేలా మాజీ మంత్రి పేర్ని నాని ఇటీవల చేసిన వ్యాఖ్యలపై ఏలూరు త్రీటౌన్‌ పోలీస్‌స్టేషన్‌లో కేసు నమోదైంది. మాజీ ఎమ్మెల్యే అబ్బయ్యచౌదరిని లీజు బకాయిలు గురించి ప్రశ్నించేందుకు పలువురు కొల్లేరువాసులు 21న ఏలూరు జిల్లా పెదవేగి మండలం కొండలరావుపాలెం వెళ్లగా.. అక్కడ ఉద్రిక్తత తలెత్తింది. దీనిపై 22న వైకాపా నాయకులు ఏలూరు ఎస్పీ కార్యాలయానికి వచ్చి వినతిపత్రం అందజేశారు. అనంతరం కార్యాలయ ప్రాంగణంలో పేర్ని నాని విలేకర్లతో మాట్లాడారు. 'చేతగాకపోతే తప్పుకోవాలి. జరిగేది జరుగుతుంది. మేం మిగులుతామో వాళ్లు మిగులుతారో తెలిసిపోతుంది. మాజీ ఎమ్మెల్యే అబ్బయ్య చౌదరిని చంపుతారా! చంపితే నియోజకవర్గంలో 1000 మంది అబ్బయ్య చౌదరులు పుడతారు' అంటూ స్థానికంగా రెండు వర్గాల మధ్య విద్వేషాలు పెంచేలా వ్యాఖ్యలు చేశారు.

వాతావరణం

ప్రాంతం	గరిష్ఠ	కనిష్ఠ
నెల్లూరు	36.9	28.6
తిరుపతి	36.5	26.0
అనంతపురం	33.5	22.3
ఒంగోలు	33.0	28.2
కడప	33.0	25.0
కర్నూలు	32.4	24.2
గుంటూరు	32.0	28.0
ఖమ్మం	31.0	26.0
ఆదిలాబాద్‌	30.8	23.7
విజయవాడ	30.0	28.0
రాజమహేంద్రవరం	29.0	25.5
తాడేపల్లిగూడెం	28.9	27.2
శ్రీకాకుళం	28.0	25.0
నరసాపురం	27.5	25.8
విశాఖపట్నం	26.4	23.4
విజయనగరం	24.0	22.0

తెలుగు ప్రజలకు గర్వకారణం ఈటీవీ: అయ్యన్నపాత్రుడు

ఈనాడు, అమరావతి: ఈటీవీ తెలుగు ప్రజలకు గర్వకారణమని శాసనసభాపతి చింతకాయల అయ్యన్నపాత్రుడు అభిప్రాయపడ్డారు. ఈ మేరకు మంగళవారం ఫేస్‌బుక్‌లో ఆయన ఒక పోస్టు పెట్టారు. 'మూడు దశాబ్దాలుగా తెలుగు సంస్కృతి, సంప్రదాయాలు, పండగలు, కళలు, సాహిత్యం అన్నింటినీ మన ఇళ్లలోకి తీసుకువస్తూ, ప్రతి తెలుగు హృదయాన్నీ అలరించిన అద్భుతమైన ఛానల్‌ ఈటీవీ. 24 గంటల న్యూస్‌ ఛానల్‌ నుంచి వినోదం, విజ్ఞానం, విలువలు అందిస్తూ తెలుగు మీడియా రంగానికి కొత్త దిశను చూపించింది. ఈ 30 ఏళ్ల విజయయాత్రలో శ్రమజీవుల కృషి, నిబద్ధతతో నిలబడ్డ ఈటీవీకి నా హృదయపూర్వక అభినందనలు' అని పేర్కొన్నారు.

30 ఏళ్లుగా సత్యనిష్ఠతో వార్తలను అందిస్తున్న 'ఈటీవీ'

మంత్రి అచ్చెన్నాయుడు

ఈనాడు, అమరావతి: మూడు దశాబ్దాలుగా సమాజానికి మార్గదర్శకత్వం వహిస్తూ.. ప్రజల ఆశలు, ఆకాంక్షలకు అద్దం పట్టేలా సత్యనిష్ఠతో కూడిన వార్తలను అందిస్తూ.. మీడియా రంగంలో 'ఈటీవీ' తనదైన గుర్తింపు సాధించిందని మంత్రి అచ్చెన్నాయుడు పేర్కొన్నారు. 30 ఏళ్లు పూర్తి చేసుకున్న సందర్భంగా ఆయన శుభాకాంక్షలు తెలిపారు. 'వార్తా ప్రసారాలకు మాత్రమే పరిమితం కాకుండా విద్య, ఆరోగ్యం, ప్రజల హక్కులు, ఆర్థికాభివృద్ధి, కళాసాంస్కృతిక కార్యక్రమాలకు 'ఈటీవీ'లో ప్రాధాన్యం ఇస్తున్నారు. 30 ఏళ్ల నిరంతర ప్రయాణంలో నిజాయతీతో కూడిన జర్నలిజం, వినూత్న కార్యక్రమాలు, ప్రజా సమస్యలపై చర్చలే ఈటీవీని ప్రత్యేకంగా నిలిపాయి' అని ప్రశంసించారు.

ఇదీ సంగతి!



క్రికెట్‌ బ్యాట్లలో గంజాయి

అక్రమంగా తరలిస్తున్న నిందితుల అరెస్టు

విశాఖపట్నం (రైల్వేస్టేషన్‌), న్యూస్‌టుడే: పిల్లలు ఆడుకునే ప్లాస్టిక్‌ క్రికెట్‌ బ్యాట్లలో గంజాయి నింపి, అక్రమంగా రవాణా చేస్తున్న నిందితుల్ని విశాఖలో రైల్వే పోలీసులు అరెస్టు చేసినట్లు జీఆర్పీ సీఐ ధనుంజయనాయుడు మంగళవారం తెలిపారు. ఆ వివరాలు... బెంగాల్‌, ఒడిశాలకు చెందిన ఇద్దరు మహిళలు ప్లాస్టిక్‌ బ్యాట్‌లను హ్యాండిల్‌ వద్ద కట్‌ చేసి, వాటిని గంజాయితో నింపేశారు. వాటిపై యథావిధిగా గ్రిప్‌లను అమర్చి, బ్యాట్‌లను సిద్ధం చేశారు. ఆ గంజాయిని కేరళకు తరలించేందుకు విశాఖ రైల్వేస్టేషన్‌కు చేరుకున్నారు. గస్తీలో ఉన్న ఆర్పీఎఫ్‌, జీఆర్పీ సిబ్బంది తనిఖీలు చేశారు. నిందితులను అదుపులోకి తీసుకుని, వారివద్ద 18 కిలోల గంజాయిని స్వాధీనం చేసుకున్నారు.



రైల్వే పోలీసుల అదుపులో నిందితులు, గంజాయితో ఉన్న క్రికెట్‌ బ్యాట్లు

గ్రహం అనుగ్రహం 27-8-2025 బుధవారం

శ్రీ విశ్వావసు నామ సంవత్సరం; దక్షిణాయనం;
వర్ష రుతువు, భాద్రపద మాసం, శుక్లపక్షం
చవితి: మ. 2-00 తదుపరి పంచమి; చిత్త: పూర్తి;
వర్జ్యం: మ. 2-31 నుంచి 4-16 వరకు; అమృత ఘడియలు: రా. 1-01 నుంచి 2-46 వరకు; దుర్ముహూర్తం: ఉ. 11-37 నుంచి 12-27 వరకు
రాహుకాలం: మ. 12-00 నుంచి 1-30 వరకు
సూర్యోదయం: ఉ.5.48; సూర్యాస్తమయం: సా.6.17; వినాయక చవితి

గ్రహం అనుగ్రహం 28-8-2025 గురువారం

శ్రీ విశ్వావసు నామ సంవత్సరం; దక్షిణాయనం;
వర్ష రుతువు, భాద్రపద మాసం, శుక్లపక్షం
పంచమి: మ. 3-44 తదుపరి షష్ఠి; చిత్త: ఉ. 8-01 తదుపరి స్వాతి
వర్జ్యం: మ. 2-12 నుంచి 3-58 వరకు; అమృత ఘడియలు: రా. 12-48 నుంచి 2-34 వరకు; దుర్ముహూర్తం: ఉ. 9-57 నుంచి 10-47 వరకు తిరిగి మ. 2-56 నుంచి 3-46 వరకు; రాహుకాలం: మ. 1-30 నుంచి 3-00 వరకు
సూర్యోదయం: ఉ.5.48; సూర్యాస్తమయం: సా.6.16; రుషి పంచమి



కోర్టులో పద్ధతిగా ఉండాలి కదా!

- వైకాపా నేత చెవిరెడ్డికి ఏసీబీ కోర్టు న్యాయాధికారి మందలింపు
- మద్యం నిందితులకు రిమాండ్ పొడిగింపు


కోర్టు వద్ద నిందితులు చెవిరెడ్డి భాస్కరరెడ్డి, ధనుంజయ్‌రెడ్డి, కృష్ణమోహన్‌రెడ్డి, వెంకటేష్‌నాయుడు, సజ్జల శ్రీధర్‌రెడ్డి, రాజ్ కెసిరెడ్డి, మిథున్‌రెడ్డి, బాలాజీ గోవిందప్ప

ఈనాడు, అమరావతి: ఏసీబీ కోర్టుకు తీసుకువస్తున్న ప్రతిసారి అరుస్తూ.. న్యాయస్థానం ప్రాంగణంలో హల్‌చల్ చేస్తున్న వైకాపా నేత చెవిరెడ్డి తీరును న్యాయాధికారి ఆక్షేపించారు. 'కోర్టుకు వచ్చినప్పుడు పద్ధతిగా ఉండాలి కదా.. మిగిలిన నిందితులు ఎలా ఉంటున్నారు? మీరెలా ప్రవర్తిస్తున్నారో చూసుకోండి' అంటూ మందలించారు. రిమాండ్ పొడిగింపుపై వాదనల సందర్భంగా న్యాయాధికారి ఇలా వ్యాఖ్యానించారు. పోలీసులే ఇలా దుష్ప్రచారం చేస్తున్నారనీ, బెయిల్‌ను అడ్డుకునేందుకు ఇలా చేస్తున్నారనీ వైకాపా నేత వివరణ ఇచ్చారు. మంగళవారంతో నిందితులకు రిమాండ్ ముగుస్తున్నందున వారిని విజయవాడలోని ఏసీబీ కోర్టులో హాజరుపరిచారు. వచ్చే నెల 9 వరకు రిమాండ్ పొడిగిస్తూ న్యాయస్థానం ఆదేశాలు ఇచ్చింది.

నొప్పితో బాధపడుతున్నా.. చెవిరెడ్డి

'నేను వెన్నునొప్పితో బాధపడుతున్నా. తిరుపతిలోని స్విమ్స్‌లో ఫిజియో థెరపీ చేయించుకునేవాడిని. 70 రోజుల నుంచి జైలులో ఉన్నా.. ఇప్పటి వరకు 120 మాత్రలు వేసుకున్నా. నొప్పిని నిర్లక్ష్యం చేస్తే శస్త్రచికిత్స వరకు వెళ్తుంది. నేను విజయవాడ ప్రభుత్వాసుపత్రిలో ఫిజియో థెరపీని తిరస్కరించానని చెప్పడం సరికాదు. సమస్యను దృష్టిలో పెట్టుకుని చికిత్సకు అనుమతించండి' అని వివరించారు. వెన్నునొప్పికి ఉండవల్లిలో ప్రకృతి చికిత్స తీసుకునేందుకు మధ్యంతర బెయిల్ ఇవ్వాలన్న చెవిరెడ్డి పిటిషన్‌పై మంగళవారం కోర్టులో వాదనలు జరిగాయి. వెన్నునొప్పి చికిత్స కోసం ప్రభుత్వాసుపత్రికి తరలించగా అక్కడ ఫిజియో థెరపీ తీసుకునేందుకు తిరస్కరించారని ప్రాసిక్యూషన్స్ జేడీ రాజేంద్రప్రసాద్ వాదించారు. నిందితుడి సమస్యపై వైద్య నిపుణులు పరీక్షించి నివేదిక ఇచ్చాకే నిర్ణయం తీసుకోవాలన్నారు. చెవిరెడ్డి తరఫున న్యాయవాది వాణి తన వాదనలు వినిపిస్తూ.. వెన్ను నొప్పి సమస్య ఆయనను తీవ్రంగా ఇబ్బంది పెడుతోందనీ, చికిత్స తీసుకునేందుకు మధ్యంతర బెయిల్ ఇవ్వాలని కోరారు. ఈ పిటిషన్‌పై ఈనెల 30న తీర్పు వెలువడనుంది. ★ విజయవాడ నుంచి రాజమహేంద్రవరం కేంద్ర కారాగారానికి వెళ్లే సమయంలో ఎస్కార్ట్ సిబ్బంది ఫోన్ నుంచి.. మిథున్‌రెడ్డి తన కుటుంబ సభ్యులతో మాట్లాడుకునేందుకు అనుమతించాలని ఆయన తరఫు న్యాయవాది కోరారు. దీనికి న్యాయాధికారి తిరస్కరించారు. ★ మద్యం కేసు నిందితులు గోవిందప్ప బాలాజీ, వెంకటేశ్‌నాయుడు, కృష్ణమోహన్‌నాయుడు మంగళవారం మరోసారి బెయిల్ పిటిషన్లు దాఖలు చేశారు.

నాపై ఇదే తొలి కేసు: కోర్టులో రాజ్ కెసిరెడ్డి

'నాపై గతంలో ఒక్క కేసు కూడా లేదు. సిట్ అధికారులు నన్ను అక్రమంగా ఇరికించారు. హైదరాబాద్‌లోని ఫామ్‌హౌస్‌లో రూ.11 కోట్ల నగదు స్వాధీనం అంతా నాటకం. ఆ నోట్ల నంబర్లు రికార్డు చేసి ఉంటే పోలీసుల బండారం బయటపడి ఉండేది. నాకు విషయం తెలిసి పిటిషన్ వేసే సరికే సిట్ అధికారులు సీజ్ చేసిన నగదును కరెన్సీ చెస్ట్‌కు తరలించారు' అని ఏ1 రాజ్ కెసిరెడ్డి కోర్టులో తన వాదన వినిపించారు.

★ ఈ కేసు విచారణ సందర్భంగా రాజమహేంద్రవరం జైలు నుంచి ఎంపీ మిథున్‌రెడ్డిని, విజయవాడ జైలు నుంచి రాజ్ కెసిరెడ్డి, బూనేటి చాణక్య, సజ్జల శ్రీధర్‌రెడ్డి, పైలా దిలీప్, గోవిందప్ప బాలాజీ, ధనుంజయరెడ్డి, కృష్ణమోహన్‌రెడ్డి, వెంకటేష్ నాయుడు, చెవిరెడ్డి భాస్కరరెడ్డిలను, గుంటూరు జిల్లా కారాగారం నుంచి బాలాజీ కుమార్ యాదవ్, నవీన్ కృష్ణలను తీసుకొచ్చారు. రాజ్ కెసిరెడ్డి తరఫున న్యాయవాది పొన్నవోలు సుధాకర్‌రెడ్డి వాదించారు. న్యాయాధికారి భాస్కరరావు.. నిందితుల రిమాండ్‌ను పొడిగించడంతో వారందరినీ తిరిగి వారివారి కారాగారాలకు తరలించారు.

తోపుదుర్తి సోదరులు చంపాలని చూస్తున్నారు

- వైకాపా బహిష్కృత నేత మహానందరెడ్డి


మాట్లాడుతున్న మహానందరెడ్డి. చిత్రంలో ఆయన అనుచరులు, కుటుంబసభ్యులు

అనంతపురం (కమలానగర్), న్యూస్‌టుడే: రాప్తాడు మాజీ ఎమ్మెల్యే ప్రకాశ్‌రెడ్డి, ఆయన సోదరులు తనను చంపేందుకు కుట్ర చేస్తున్నారని వైకాపా బహిష్కృత నేత మహానందరెడ్డి ఆరోపించారు. మంగళవారం అనంతపురంలో ఆయన మీడియాతో మాట్లాడారు. వైకాపా ప్రభుత్వంలోనే తనను హత్య చేసేందుకు ప్రకాశ్‌రెడ్డి కుట్ర చేశారన్నారు. అమెరికాలో ఉన్న తన అన్న కుమారుడికి ఫోన్ చేసి మీ చిన్నాన్నను చంపుతామని బెదిరించారని చెప్పారు. ఇప్పుడు కూడా అధికారంలో ఉన్నవారితో లోపాయికారీ ఒప్పందాలు కుదుర్చుకుని తనను అంతమొందించేందుకు ప్రయత్నిస్తున్నారని ఆరోపించారు. ప్రస్తుత అనంతపురం అర్బన్ ఎమ్మెల్యే దగ్గుపాటి వెంకటేశ్వరప్రసాద్ సైతం పోలీసులతో అక్రమ అరెస్టు చేయించి తన హత్యకు కుట్ర చేస్తున్నారని ఆరోపించారు. ఇప్పటికే రాజకీయాల్లో తన కుటుంబంలోని ఇద్దరిని కోల్పోయామని చెప్పారు. తన అన్న ప్రసాద్‌రెడ్డి హత్య కేసులో ఉన్న నిందితులను ప్రకాశ్‌రెడ్డి తన వెనక తిప్పుకుంటున్నారని తెలిపారు. పంచాయతీ ఎన్నికల్లో తన భార్యను అరెస్టు చేయించారని.. 33 ఓట్లతో ఆమె గెలిచినా తెదేపా అభ్యర్థికి విజేతగా డిక్లరేషన్ ఇప్పించారని ఆరోపించారు. తోపుదుర్తి ప్రకాశ్‌రెడ్డి ఉప్పరపల్లిలో వంక పోరంబోకు భూముల్ని, బెంగళూరు రోడ్డులో మాజీ సైనికోద్యోగి పేరుతో సృష్టించిన భూములను కాజేశారని.. ఆ వివరాలన్నీ త్వరలోనే బయట పెడతామన్నారు.


విద్యుత్తు దీపాలంకరణలో కాణిపాకం వినాయకుడి ఆలయం

వరసిద్ధుడి బ్రహ్మోత్సవాలకు సర్వం సిద్ధం

కాణిపాకం, న్యూస్‌టుడే: చిత్తూరు జిల్లాలోని కాణిపాకం శ్రీవరసిద్ధి వినాయక స్వామి వార్షిక బ్రహ్మోత్సవాలకు సర్వం సిద్ధం చేశారు. వినాయక చవితి సందర్భంగా స్వామివారి దర్శనార్థం తరలివచ్చే భక్తులకు ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా అదనపు క్యూలైన్లు ఏర్పాటు చేశారు. ఉత్సవ శోభ కనిపించేలా ప్రధాన, అనుబంధ ఆలయాలను విద్యుత్తు దీపాలతో అలంకరించారు.

సెప్టెంబరు 7న శ్రీవారి ఆర్జిత సేవల రద్దు

చంద్రగ్రహణం కారణంగా ఆలయం మూసివేత

తిరుమల, న్యూస్‌టుడే: చంద్ర గ్రహణం కారణంగా సెప్టెంబరు 7వ తేదీన ఊంజల్‌సేవ, ఆర్జిత బ్రహ్మోత్సవం, సహస్రదీపాలంకార సేవలను తితిదే రద్దు చేసింది. ఆ రోజు సాయంత్రం 3.30 గంటల నుంచి మరుసటి రోజు (సెప్టెంబరు 8) తెల్లవారుజామున మూడు గంటల వరకు స్వామివారి ఆలయాన్ని మూసివేయనున్నారు. గ్రహణ సమయానికి ఆరు గంటల ముందుగా ఆలయం తలుపులు మూసివేయడం ఆనవాయితీ. మరుసటి రోజు తెల్లవారుజామున మూడు గంటలకు సుప్రభాతంతో ఆలయ తలుపులు తెరిచి శుద్ధి, పుణ్యాహవాచనం నిర్వహించనున్నారు. తోమాలసేవ, కొలువు, పంచాగ శ్రవణం, అర్చన ఏకాంతంగా నిర్వహించాక ఉదయం ఆరు గంటలకు శ్రీవారి దర్శనం పునఃప్రారంభమవుతుంది.

తిరుమల ఘాట్‌రోడ్డులో తప్పిన పెనుప్రమాదం

కొండ దిగుతుండగా ఊడిపోయిన ఆర్టీసీ బస్సు టైరు



ఘాట్‌రోడ్డులో టైరు ఊడిపోయి ఆగిపోయిన ఆర్టీసీ బస్సు

తిరుమల, న్యూస్‌టుడే: ఘాట్‌రోడ్డులో వెళుతున్న ఆర్టీసీ బస్సు టైరు అకస్మాత్తుగా ఊడిపోగా డ్రైవర్ చాకచక్యంగా బస్సును నిలిపివేయడంతో భక్తులు పెనుప్రమాదం నుంచి త్రుటిలో తప్పించుకున్నారు. ఆర్టీసీకి చెందిన సప్తగిరి ఎక్స్‌ప్రెస్ మంగళవారం సాయంత్రం తిరుమల నుంచి తిరుపతికి ప్రయాణికులతో వస్తుండగా 57వ మలుపు వద్ద ఈ ఘటన జరిగింది. ముందు టైరు ఊడిపోవడంతో బస్సు ఒక్కసారిగా పక్కకు ఒరిగింది. వేగం తక్కువగా ఉండడంతో డ్రైవర్ బస్సును నిలిపివేయగలిగారు. అనంతరం ప్రయాణికులను మరో బస్సులో తిరుపతికి తీసుకెళ్లారు.

చట్టాలపై మహిళలకు అవగాహన సదస్సులు


రాయపాటి శైలజ

ఈనాడు, అమరావతి: మహిళల రక్షణ, హక్కులు, చట్టాలపై అవగాహన కల్పించేందుకు ఈ నెల 28 నుంచి మూడు రోజులపాటు అవగాహన సదస్సులు నిర్వహించనున్నట్లు రాష్ట్ర మహిళా కమిషన్ ఛైర్‌పర్సన్ రాయపాటి శైలజ తెలిపారు. 28న భీమవరం, 29న కాకినాడ, 30న రాజమహేంద్రవరంలలో ఈ కార్యక్రమాలను నిర్వహిస్తామని మంగళవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. వివిధ రంగాల్లో ప్రతిభ కనబరిచిన మహిళలు ఇందులో పాల్గొంటారన్నారు.


రక్షణ శాఖమంత్రి రాజ్‌నాథ్‌సింగ్‌కు నమూనా నౌకను బహూకరిస్తున్న నేవీ అడ్మిరల్ దినేష్ కుమార్ త్రిపాఠి ★ జాతికి అంకితం చేసిన నౌక ఐఎన్ఎస్ ఉదయగిరి ★ ఐఎన్ఎస్ హిమగిరి

వసుధైక కుటుంబమే భారత్ సిద్ధాంతం

- రక్షణ మంత్రి రాజ్‌నాథ్‌సింగ్
- ఉదయగిరి, హిమగిరి నౌకలు జాతికి అంకితం

విశాఖపట్నం (సింధియా), న్యూస్‌టుడే: వసుధైక కుటుంబమే భారత్ సిద్ధాంతమని ఎన్ని ఒడుదొడుకులొచ్చినా రక్షణ చర్యల్లో ఎప్పటికీ రాజీ పడబోమని రక్షణశాఖ మంత్రి రాజ్‌నాథ్ సింగ్ పేర్కొన్నారు. మంగళవారం తూర్పు నౌకాదళ ముఖ్య కేంద్రం విశాఖపట్నం నేవల్ డాక్‌యార్డులో జరిగిన 'ఐఎన్ఎస్ ఉదయగిరి, ఐఎన్ఎస్ హిమగిరి' నౌకలను జాతికి అంకితం చేసే కార్యక్రమంలో ఆయన ముఖ్యఅతిథిగా పాల్గొని ప్రసంగించారు. ఏకకాలంలో రెండు భారీ యుద్ధనౌకలను నేవీ సేవలకు అందించడం సంతోషకరమన్నారు. స్వీయరక్షణ పరిజ్ఞానాన్ని ఒడిసిపట్టుకుంటూ రానున్న రోజుల్లో భారత్ నౌకాదళం సముద్ర శక్తిగా మారబోతోందన్నారు. సూర్యోదయ, హిమ శిఖరాల పేర్లమీద ఈ రెండు నౌకలకు ఉదయగిరి, హిమగిరిగా నామకరణం జరిగిందన్నారు. ఇండో-పసిఫిక్, హిందు మహాసముద్ర ప్రాంత రక్షణ బలోపేత చర్యల్లో భాగంగా దేశీయ, అంతర్జాతీయ జలాల్లో ఈ నౌకలు కూడా బహుముఖ పాత్రను పోషిస్తాయన్నారు. దేశీయ పరిజ్ఞానంతో నిర్మించిన ఈ రెండు నౌకల అనుభవంతో 2050 నాటికి భారత్ 200 యుద్ధనౌకల నిర్మాణ స్థాయికి చేరనుందన్నారు. తొలుత నావికుల గౌరవ వందనాన్ని రక్షణ మంత్రి స్వీకరించారు. కార్యక్రమంలో భారత నేవీ అడ్మిరల్ దినేష్ కె.త్రిపాఠి, అనకాపల్లి ఎంపీ సీఎం రమేష్, ఈస్టర్న్ నేవల్ కమాండ్ చీఫ్ వైస్ అడ్మిరల్ రాజేష్‌పెంధార్కర్, హిమగిరి కమాండింగ్ అధికారి రాబిన్ చక్రవర్తి ఇతర కమాండ్ అధికారులు, పూర్వ నేవీ అధికారులు, నౌకాదళ ఉద్యోగుల కుటుంబీకులు పాల్గొన్నారు.

దేశానికి గర్వకారణం: సీఎం చంద్రబాబు

ఈనాడు, అమరావతి: విశాఖలో అత్యాధునిక యుద్ధనౌకలు ఐఎన్ఎస్ ఉదయగిరి, ఐఎన్ఎస్ హిమగిరి రక్షణ మంత్రి రాజ్‌నాథ్‌సింగ్ సమక్షంలో జలప్రవేశం చేయడం దేశానికి గర్వకారణమని ముఖ్యమంత్రి చంద్రబాబు 'ఎక్స్'లో పేర్కొన్నారు.

బంగాళాఖాతంలో అల్పపీడనం

- ఉత్తరాంధ్రలో భారీ వర్షాలు


విశాఖపట్నంలోని ఎంవీపీ కాలనీ సెక్టార్-5 ప్రధాన మార్గంలో కూలిన భారీ వృక్షం

ఈనాడు, విశాఖపట్నం: వాయవ్య బంగాళాఖాతంలో ఒడిశా-పశ్చిమ బెంగాల్ తీరాల్లో సోమవారం అర్ధరాత్రి దాటాక అల్పపీడనం ఏర్పడింది. దీనికి అనుబంధంగా ఉపరితల ఆవర్తనం కొనసాగుతోంది. అల్పపీడనం పశ్చిమ-వాయవ్య దిశగా కదులుతూ వచ్చే రెండు రోజుల్లో మరింత బలపడుతుందని భారత వాతావరణ విభాగం (ఐఎండీ) అంచనా వేస్తోంది. ఇది బుధవారం నాటికి వాయుగుండంగా బలపడే అవకాశముందని కొన్ని వాతావరణ మోడళ్లు అంచనా వేస్తున్నాయి. బుధ, గురువారాల్లో అల్లూరి సీతారామరాజు, ఏలూరు జిల్లాల్లో కొన్ని ప్రాంతాల్లో భారీ వర్షాలు, మిగిలిన ప్రాంతాల్లో తేలికపాటి నుంచి ఓ మోస్తరు వర్షాలు కురిసే అవకాశముందని అమరావతి వాతావరణ కేంద్రం తెలిపింది. శనివారం వరకు మత్స్యకారులు వేటకు వెళ్లరాదని విశాఖలోని తుపాను హెచ్చరికల కేంద్రం అధికారులు సూచించారు.

పోలాకిలో 11 సెం.మీ. వర్షం

అల్పపీడన ప్రభావంతో ఉత్తరాంధ్ర జిల్లాల్లో ఎడతెరిపి లేకుండా వర్షాలు కురుస్తున్నాయి. సోమవారం ఉదయం నుంచి మంగళవారం ఉదయం వరకు శ్రీకాకుళం, విజయనగరం జిల్లాల్లో భారీ వర్షాలు కురిశాయి. అత్యధికంగా శ్రీకాకుళం జిల్లాలోని పోలాకిలో 11 సెంటీమీటర్లు, నరసన్నపేటలో 10, శ్రీకాకుళంలో 9, ఆమదాలవలసలో 8, విజయనగరం జిల్లా పూసపాటిరేగలో 7 సెం.మీ. వర్షపాతం నమోదైంది. మంగళవారం అనకాపల్లి, శ్రీకాకుళం, విశాఖపట్నం, విజయనగరం జిల్లాల్లో వర్షాలు కురిశాయి. సాయంత్రం 5 గంటల వరకు అత్యధికంగా అనకాపల్లి జిల్లా పరవాడలో 6, శ్రీకాకుళంలో 5.8, అనకాపల్లి జిల్లా చోడవరంలో 5.5, విశాఖ జిల్లా గాజువాకలో 5.5 సెం.మీ. వర్షం కురిసింది.

హోంమంత్రి సమీక్ష..

ఉత్తరాంధ్రలో వర్షాలు కురుస్తుండటంతో మంగళవారం హోంమంత్రి అనిత పరిస్థితిని సమీక్షించారు. అన్ని జిల్లాల్లో కంట్రోల్ రూమ్స్ ఏర్పాటు చేయాలని అధికారులను ఆదేశించారు. క్షేత్రస్థాయిలో ఉంటూ.. లోతట్టు ప్రాంతాల ప్రజలను అప్రమత్తం చేయాలన్నారు. సహాయక చర్యలకు ఎన్డీఆర్ఎఫ్, ఎస్డీఆర్ఎఫ్ దళాలు సిద్ధంగా ఉండాలన్నారు.

పెద్దిరెడ్డి బినామీ మాధవరెడ్డిపై కొరడా

- భూముల అక్రమ రిజిస్ట్రేషన్ల రద్దు
- స్వాధీనానికి జిల్లా కలెక్టర్ ఉత్తర్వులు


ఈనాడు, కడప: మాజీ మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి బినామీ, మదనపల్లె సబ్ కలెక్టర్ కార్యాలయ దస్త్రాల దహనం కేసులో నిందితుడైన మాధవరెడ్డిపై అన్నమయ్య జిల్లా కలెక్టర్ శ్రీధర్ కొరడా ఝళిపించారు. మదనపల్లె మండలం వలసపల్లెలో ఎసైన్డ్ భూములను ఆక్రమించడం, నిషేధిత జాబితాలోని వాటిని అక్రమంగా రిజిస్ట్రేషన్ చేసుకోవడాన్ని గుర్తించిన కలెక్టర్ జూన్ 25న విచారణకు ఆదేశించారు. వలసపల్లె రెవెన్యూ గ్రామంలో 546/1లో 3.34 ఎకరాలను మాధవరెడ్డి కుమారుడు వంకిరెడ్డి మోనిష్‌కుమార్‌రెడ్డి పేరిట అక్రమంగా రిజిస్ట్రేషన్ చేసినట్లు ఈ విచారణలో గుర్తించారు. 546/2లో 5.38 ఎకరాలను మాధవరెడ్డి పేరిట రిజిస్ట్రేషన్ చేసుకుని కల్యాణ మండపం, హోటల్ నిర్మాణ పనులు చేపట్టినట్లు నిర్ధారించుకున్నారు. ఈ భూములను వైకాపా ప్రభుత్వ హయాంలో నాటి కలెక్టర్ అనుమతి లేకుండానే ఫ్రీహోల్డ్ చేసుకున్నారని, డీకేటీ పట్టా షరతులను ఉల్లంఘించారని విచారణలో తేలింది. ఈ భూములకు రిజిస్ట్రేషన్లను రద్దు చేయడంతోపాటు ఇకపై ఎలాంటి లావాదేవీలకు తావులేకుండా చర్యలు తీసుకోవాలని ఈ మేరకు తనకు నివేదిక సమర్పించాలని మంగళవారం జిల్లా రిజిస్ట్రార్‌ను కలెక్టర్ కోరారు. రద్దు చేసిన రిజిస్ట్రేషన్ భూముల వివరాలను నిషేధిత ఆదేశాల పుస్తకంలో నమోదు చేయాలని మదనపల్లె మండల తహసీల్దార్‌ను కలెక్టర్ ఆదేశించారు. వెబ్‌ల్యాండ్‌లో సవరణలు చేపట్టి ఈ భూముల్ని ప్రభుత్వ/ఎసైన్డ్ భూములుగా గుర్తించినట్లు నమోదు చేయాలని కోరారు. మాధవరెడ్డితో పాటు కుటుంబసభ్యుల పేరిట, బినామీల పేరిట ఉన్న భూముల్ని గుర్తించే ప్రక్రియ కూడా ముమ్మరంగా సాగుతోంది.

ఈనాడు తొలివేలుపు

'ఇరవై ఏళ్ల వయసులో గుడికి పోకుంటే దోషం... అరవై దాటాకా ఆలయానికి పోవాలంటే ఆయాసం' అన్నారు వివేకానంద స్వామి. గుడిలో ఏముందో తెలుసుకోవాలన్న కుతూహలం యువతరానికి అవసరం. ఆ గుడిలోనివాడే తన గుండెలోనూ ఉన్నాడని గ్రహించడం పెద్దరికానికి చిహ్నం. మంత్రాలంటే అక్షరాలు కావని, గురువంటే వ్యక్తి కాడని, దైవమంటే విగ్రహం కాదని గ్రహించడమే- వృద్ధాప్యానికి ధన్యత. గణపతి విషయంలోనూ అంతే. కళ్లతో పరికించేది- ప్రతిమను, బుద్ధితో గ్రహించాల్సింది తత్త్వాన్ని! 'తొండమునేక దంతమును తోరపు బొజ్జయు వామ హస్తమున్'- గణపతి రూపం. ముత్తుస్వామి దీక్షితర్ కృతిలోని 'మూలాధార క్షేత్రస్థిత, ప్రణవ చైతన్యం' గణపతి నిజస్వరూపం. మంత్రశాస్త్రం 32 గణపతుల గురించి చెప్పింది. చవితిపూట మనం ఆరాధించేది వరసిద్ధి వినాయకుణ్ని. ఆయన పురాణగణపతి. గజముఖుడు. 'దోష భేదికి ప్రపన్న వినోదికి విఘ్నవల్లికాచ్ఛేదికి మంజువాదికి మోదక ఖాదికిన్' అంటూ పోతన చెప్పిన విశేషణాలను విశ్లేషిస్తే- పురాణగణపతి స్వరూపం బాగా తెలుస్తుంది. 92 అధ్యాయాల ఉపాసన ఖండం, 155 అధ్యాయాల క్రీడాఖండాల్లో గణేశపురాణం ఆ స్వరూపాన్ని సవివరంగా చెప్పింది.

యువతరానికి నేడు అవసరమైనవాడు పురాణగణపతి. కవులెందరో అద్భుతంగా వర్ణించిన కావ్యగణపతే పురాణగణపతి. అమ్మానాన్నలతో ఆట- ఆయనకు పరమప్రీతి. 'గ్రక్కున నేత్రయుగ్మము కరద్వితయంబున మూసి పట్టి' తల్లిదండ్రులతో దాగుడుమూతలాడిన గణపతిని దశకుమార చరిత్రలో కేతన వర్ణించాడు. అమ్మ ఒడిలో చేరి చనుబాలు తాగుతూ రెండోవైపు 'కుచంబు కానక అహి వల్లభహారము(పాము)'ను తాకి భ్రాంతికి లోనైన గణపతిని ప్రార్థిస్తున్న నెపంతో అటు అర్ధనారీశ్వర భావనను, ఇటు మనుచరిత్ర కథాంశాన్ని స్ఫురింపజేసిన గడుసుదనం అల్లసాని పెద్దనది. ప్రబంధకవులే కాదు ఆధునిక పద్యకవులెందరో వినాయకుణ్ని కొలుస్తూనే వచ్చారు. 'ఎలుక గుర్రము మీద నీరేడు భువనాల పరువెత్తి వచ్చిన పందెకాడు' అంటూ ఒక్క పంక్తిలో- గణాధిపత్య సాధన వృత్తాంతమంతా గుదిగుచ్చిన భావకవి కరుణశ్రీ. 'పెద్దది పొట్ట- విద్దెయల పెట్టెయనంగ' అంటూ విద్యాగణపతికి విధేయుడైన అవధానకవి కడిమిళ్ల వరకూ యువతరానికి గణపతి పట్ల వారు ఆసక్తిని రేకెత్తిస్తూనే వచ్చారు. కవిత్వంలో ఆధ్యాత్మిక చైతన్యాన్ని రంగరిస్తూనే వచ్చారు.

జనచైతన్యాన్ని సమీకరించడానికి ఆధ్యాత్మికతను మించిన అస్త్రం లేదని గ్రహించిన నాయకుడు బాలగంగాధర తిలక్. ఇలవేలుపుగానూ గుడివేలుపుగానూ ఉంటూ వచ్చిన తొలివేలుపును స్వరాజ్య ఉద్యమంలో భాగంగా వీధి మొగసాలలో నిలిపినవారాయన. అది క్రమంగా విరాడ్రూపం ధరించింది. ఊరూవాడా ఉత్సవాల సందడి పెరిగింది. మట్టి గణపతిని మాత్రమే అర్చించమని చెప్పిన ముద్గలపురాణం మాట ఇప్పుడిప్పుడే ఆచరణలోకి వస్తోంది. మట్టి విలువ మనిషికి తెలిసొస్తోంది. ఇకపై రూపం కాకుండా చైతన్యం గురించి ఆలోచించాలి. తత్త్వాన్వేషణ సాగించాలి. 'శివశివ మూరితివి గణనాథ'లోని వేదగణపతి భావనను- 'శివుడి కుమారుడవు గణనాథ'లోని పురాణగణపతి భావనతో అనుసంధానించాలి. అధర్వవేదంలోని ప్రామాణికమైన 'గణపతి అధర్వశీర్షం' చెప్పిన గణనాథుడు- వేదగణపతి. ఆయనకు ఏనుగు ముఖం లేదు. కాబట్టి రూపం కాదు- తత్త్వం ప్రధానం. దేవగణాలనే కాదు- మనిషి గుణాలను సైతం దారిలో పెట్టేది- గణపతి తత్త్వం! దాన్ని ఆరాధిద్దాం! 'తత్త్వమెరుగువాడు దైవంబు నెరుగును' అన్నాడు వేమన. దాన్ని అనుసరిద్దాం!



ప్రతి వ్యక్తీ తన పరిధిలో నిజాయతీగా ఎంతో కొంత సమాజం కోసం పనిచేయాలి. అప్పుడే మన తరవాత ఈ భూమి మీదకు వచ్చే తరం ఆరోగ్యంగా, ఆనందంగా మాత్రమే కాదు, సుసంపన్నంగానూ ఉంటుంది.

– దొరాబ్జీ టాటా

ప్రణవ స్వరూపుడు

మన సంప్రదాయంలో గణపతి ఆరాధన అత్యంత ప్రధానమైనది. వేదాలు, మంత్రశాస్త్రాలు, పురాణాలు, గణేశతాపినీ ఉపనిషత్తు వంటి ఉపాసనోపనిషత్తులు స్వామి ప్రత్యేకతను చాటాయి. గణపతిని పరమాత్మగా ఉపాసించే సత్సంప్రదాయం గాణపత్యంలో ఉంది. గణేశపురాణం, ముద్గలపురాణం, మహాగణపతి దర్శనం వంటి గ్రంథాలు చాలా ఉన్నాయి. స్కాంద, బ్రహ్మవైవర్తాది పురాణాలలో గణపతిగాథలు, విశేషాలు ఎన్నో!

సృష్టి ఆరంభంలో వచ్చిన విఘ్నాల నుంచి బయటపడేందుకు బ్రహ్మ ప్రణవా(ఓంకారా)న్ని జపిస్తూ ధ్యానిస్తుండగా... ఆ ప్రణవమే గజానన రూపాన్ని ధరించి సాక్షాత్కరించిందని పురాణగాథ. 'ప్రణవ స్వరూప వక్రతుండం...' అని ముత్తుస్వామి దీక్షితులు కీర్తించారు. సృష్టి ఆదిలో బ్రహ్మకు గోచరించిన ప్రణవస్వరూపుడే ఉమామహేశ్వర తనయుడిగా ఉదయించాడు. విశ్వగణపతి అయిన స్వామియే ప్రమథ గణపతిగా అభిషిక్తుడయ్యాడు.



వేదాల్లో మంత్రగణపతి అయిన 'ఓంకార' స్వరూపుడిగా, యోగశాస్త్రంలో యోగగణపతి మూలాధారచక్ర సంస్థితుడిగా, అక్షరగణపతి అయిన విద్యాస్వరూపుడిగా అభివర్ణించారు. బుద్ధిని తీర్చిదిద్ది నడిపించే స్వామి కనుక 'వినాయకుడు' అయ్యాడు. శివుడి సన్నిధిలో ఉన్నవాడు కాబట్టి 'హేరంబు'డని, వక్రబుద్ధులను తొలగించి బుద్ధిని సవరించేవాడు కనుక 'వక్రతుండు'డని అనేక నామాలతో గణనాథుణ్ని పిలుస్తారు. మంచి పనులకు విఘ్నాలు తొలగించి, చెడు పనులకు విఘ్నాలు కలిగించి జగతి గతిని నిర్విఘ్నంగా నడిపే స్వామి 'విఘ్నేశ్వరుడ'ని ప్రసిద్ధి. అభీష్టసిద్ధులను ప్రసాదించే 'వరద గణపతే'- కష్టాలను నివారించే 'సంకష్టహర గణపతి' కూడా!

అంతర్యామి

దేవతలు, రుషులు, ఉపాసకులు, పండితులు, పామరులు ప్రీతిగా ఆరాధించే దైవం ఏకదంతుడు. అర్చించిన వెంటనే అనుగ్రహించే దయాళువు ఈ 'క్షిప్రగణపతి'. కోరికలను తీర్చడమే కాక, చిత్తానికి చైతన్యాన్ని ప్రసాదించే పరతత్త్వం ఈయనే కాబట్టి 'చింతామణి గణపతి' అంటారని ముద్గలమహర్షి వంటి ద్రష్టలు నిర్వచించారు. 'ఓం'కారం 'అ'కార, 'ఉ'కార, 'మ'కార, 'తురీయా'లనే నాలుగు భాగాలతో ఉంటుందని ఉపనిషత్ వాక్యం. 'తురీయం' శుద్ధమైన పరబ్రహ్మతత్త్వం. అ, ఉ, మ- సృష్టి, స్థితి, లయలను కలిగించేది ఈశ్వర స్వరూపం. ప్రపంచ కార్యాలలో మూడక్షరాల, మూడుగుణాల తత్త్వం (అ, ఉ, మ) వ్యక్తమవుతుంటుంది. ప్రపంచానికి అతీతమైనది 'తురీయం'. ఈ నాలుగు తానైన ఈశ్వరుడే గుణ'గణా'లకు, ప్రకృతి 'గణా'లకు పతి. పంటల దేవుడిగా, పృథ్వీతత్త్వ నియామకుడిగా గణపతిని పూజించడం కూడా సంప్రదాయమే.

వేర్వేరు యుగాలలో అనేకమార్లు అవతరించిన గణేశ లీలలను పురాణాలు వివరించాయి. ఎంతో లోతైన దివ్యతత్త్వాల రూపంగా గణేశవైభవం శాస్త్రాల్లో కనిపిస్తుంది. భక్తులందరూ ఇష్టంగా పూజించుకునే వరసిద్ధి వినాయకుడు, జన'గణ' మనసులకు అధినాయకుడిగా విశ్వక్షేమాన్ని కలిగించాలని ఈ పుణ్యపర్వాన భక్తిగా ప్రార్థించుకుందాం.

– సామవేదం షణ్ముఖశర్మ

ట్రంప్ గొంతెమ్మ కోరికలు...
భారత రైతులకు సవాళ్లు!

టారిఫ్‌లంటూ ఉరుముతున్న అమెరికా వాటిపై ఇండియాకు నోటీస్ కూడా ఇచ్చేసింది. భారత ఎగుమతులపై అగ్రరాజ్యం 50శాతం సుంకాలు విధించడం వల్ల మన పరిశ్రమలు, ఎగుమతిదారులకు నష్టం తప్పదు. రైతులకూ అవి శరాఘాతాలు కాగలవు. మరోవైపు తమ వ్యవసాయ ఉత్పత్తులతో భారతీయ విపణిని ముంచెత్తాలనుకుంటున్న అమెరికా ఆలోచన మరీ ప్రమాదకరమైనది!

భారతదేశం తమ దగ్గర నుంచి చమురు, ఆయుధాలు కొనాలంటూ అమెరికా ఒత్తిడి చేయడం అందరికీ తెలిసిందే. కానీ, తమ వ్యవసాయ ఉత్పత్తులకు భారత్ తలుపులు బార్లా తెరవాలని ట్రంప్ పట్టుబట్టడం పెద్దగా వెలుగులోకి రావడం లేదు. అమెరికా గ్రామీణ ఓటర్ల మెప్పు పొందడం కోసం ట్రంప్ మన రైతులను బలిపెట్టడానికి సిద్ధమవుతున్నారు. అగ్రరాజ్య ఒత్తిడి కారణంగా భారత ప్రభుత్వం పత్తిపై కొంత సడలింపు వైఖరి చేపట్టింది. కొత్త పత్తి సీజను ముందు విదేశీ పత్తి దిగుమతులపై 11శాతం సుంకాన్ని 40 రోజులపాటు తొలగిస్తున్నట్లు



ప్రకటించింది. ఇక్కడ విదేశీ పత్తి అంటే అమెరికన్ పత్తి దిగుమతులే. ట్రంప్ తెస్తున్న ఒత్తిడే ఈ నిర్ణయానికి పురిగొల్పిందనడంలో సందేహం లేదు. ప్రస్తుతం ఇండియాకు దిగుమతి అవుతున్న విదేశీ పత్తి ధర ఒక క్యాండీకి (355.6 కిలోలకు) రూ.50వేల నుంచి రూ.51 వేలుగా ఉంది. భారత పత్తి సంస్థ (సీసీఐ) ఒక క్యాండీ పత్తిని రూ. 56వేల నుంచి రూ.57వేల ధరకు విక్రయిస్తోంది. పత్తికి కొత్త కనీస మద్దతు ధరను రూ.61వేలుగా నిర్ణయించవచ్చు. ఈ పరిస్థితిలో తక్కువ ధరకు విదేశీ పత్తిని మన మార్కెట్‌లోకి అనుమతిస్తే మన రైతాంగం తీవ్రంగా నష్టపోతుంది. పత్తిని ఎక్కువగా పండించే రాష్ట్రాల ఆదాయానికి గండి పడుతుంది.


ఇతర దేశాల నెత్తిన చేయి...

విదేశీ పత్తి చవకగా లభ్యమవడం వల్ల కాస్తోకూస్తో లాభపడేది వస్త్ర తయారీ పరిశ్రమ మాత్రమే. ఈ పరిణామం ఉత్పత్తి ఖర్చులు తగ్గిస్తాయి. అసలు అమెరికన్ పత్తి చవకగా లభిస్తుండటానికి కారణం- ఆ దేశ ప్రభుత్వం తమ రైతులకు భారీ సబ్సిడీలు ఇవ్వడమే. అమెరికా సర్కారు పత్తితోపాటు మరెన్నో వ్యవసాయోత్పత్తులకు సబ్సిడీలిస్తోంది. అలాంటి ఉత్పత్తులైన పాలు, బీఫ్, చక్కెర, సోయాబీన్, మొక్కజొన్న, బియ్యం, కనోలా పంటలను, ఇథనాలులను కూడా భారత్‌పై రుద్దాలని ట్రంప్ చూస్తున్నారు. భారతదేశం ప్రపంచ వాణిజ్య సంస్థ(డబ్ల్యూటీవో) నిబంధనల ప్రకారమే తన పాడి పరిశ్రమనూ, మొక్కజొన్న తదితర వ్యవసాయోత్పత్తులను కాపాడుకుంటోంది. కానీ, అనేక అంతర్జాతీయ ఒప్పందాలనూ సంస్థలనూ పక్కకు నెట్టేస్తున్న ట్రంప్ సర్కారు డబ్ల్యూటీవోను కూడా స్వేచ్ఛా వాణిజ్యానికీ, మార్కెట్ అందుబాటుకూ అడ్డంకిగా పరిగణిస్తోంది. ఇతర దేశాలకు తన వ్యవసాయ సరకులను స్వేచ్ఛగా ఎగుమతి చేయాలనుకొంటున్న ట్రంప్- అమెరికాకు పొగాకు ఎగుమతులపై మాత్రం 350శాతం సుంకాలు విధిస్తున్నారు. విదేశీ దిగుమతులను ఖరీదైనవిగా మార్చడానికి సుంకాలను పెంచుతున్నారు. తమ వ్యవసాయదారులకు భారీగా సబ్సిడీలు ఇవ్వడం, ప్రత్యేక పథకాలను అమలు చేయడం ద్వారా విదేశాలకు అమెరికన్ వ్యవసాయ ఎగుమతులను చవకగా మారుస్తున్నారు. తమ వ్యవసాయ మిగులును విదేశాలకు అమ్ముకుంటున్నారు.

షరతులు పెట్టాల్సిందే...

ట్రంప్ సుంకాల బాదుడును తప్పించుకోవడం కొంచెం కష్టమైన పనే. అలాగని అమెరికా వ్యవసాయ సరకులను ఇక్కడ చవకగా గుమ్మరించడం వల్ల మన రైతులకు తీవ్ర నష్టం కలుగుతుంది. అయితే కొంచెం తెలివిగా వ్యవహరిస్తే మార్గం దొరుకుతుంది. అమెరికా నుంచి వ్యవసాయ సరకులను దిగుమతి చేసుకోవడం తప్పనిసరయితే సేంద్రియ పంటలను, జీవావరణానికి హాని చేయని, సుస్థిర వ్యవసాయ పద్ధతుల్లో సాధించిన పంట ఉత్పత్తులను మాత్రమే దిగుమతి చేసుకుంటామనే షరతు విధించాలి. మొదట అమెరికా నుంచి జన్యుమార్పిడి పంటల దిగుమతిని నిషేధించాలి. సేంద్రియ పద్ధతిలో పెంచిన పత్తిని మాత్రమే అనుమతించాలి. ఇతర పంటలకూ ఇదే నియమాన్ని వర్తింపజేయాలి. మన దగ్గర మొక్కజొన్న రైతులు ఏటా నష్టాల బారిన పడుతున్నారు. ఇలాంటప్పుడు అమెరికన్ జన్యుమార్పిడి(జీఎంవో) మొక్కజొన్న భారీగా భారతీయ మార్కెట్‌ను ముంచెత్తితే మన రైతుల రాబడి తగ్గిపోతుంది. దీన్ని నివారించేందుకు అమెరికా నుంచి సేంద్రియ మొక్కజొన్న దిగుమతులను మాత్రమే అనుమతిస్తామని స్పష్టం చేయాలి. జీఎంవో మొక్కజొన్నతోపాటు జీఎంవో చక్కెరకూ తలుపులు మూసెయ్యాలి. అమెరికా వ్యవసాయ సరకులను బడా కార్పొరేషన్ల నుంచి కాకుండా సాధారణ రైతుల నుంచి, చిన్న రైతుల సహకార సంస్థల నుంచి కొనుగోలు చేయడం ద్వారా అగ్రరాజ్య రైతాంగం మద్దతు చూరగొనవచ్చు. విషతుల్య క్రిమినాశనులను వాడిన పంటల దిగుమతిని అనుమతించకూడదు. బాదంపప్పు, యాపిల్స్ తదితర పంటల్లోనూ విష రసాయనాల అవశేషాలను తనిఖీ చేయాలి. భారత్ ప్రస్తుతం వంట నూనెల కొరతను ఎదుర్కొంటోంది. అమెరికా దగ్గర భారీగా కనోలా, సోయా నూనె నిల్వలు ఉన్నాయి. అయితే జన్యుమార్పిడి చేయని వంట నూనెలను మాత్రమే దిగుమతి చేసుకోవాలి. సోయా పశుదాణాను కూడా తనిఖీ చేయాలి.

స్వదేశీ వ్యవసాయ కార్పొరేట్ సంస్థల ప్రోద్బలంతో ట్రంప్ తమ పాలను, పాల పొడిని కొనాలంటూ మన దేశంపై ఒత్తిడి పెంచుతున్నారు. అయితే అమెరికాలో పశువులకు జీఎంవో మొక్కజొన్న, సోయాలతోపాటు మాంసం ఉపఉత్పత్తులనూ దాణాగా వేస్తుంటారు. అలాంటి పాలను భారతీయులు స్వీకరించలేరు. పైగా అమెరికా కార్పొరేట్ పాల దిగుమతులు అమూల్ సంస్థనే కాదు, చిన్న చిన్న పాడి సహకార సంఘాలనూ దెబ్బతీస్తాయి. దీన్ని నివారించడానికి, కేవలం సేంద్రియ పాలను మాత్రమే దిగుమతి చేసుకుంటామనే షరతు పెట్టాలి. ఏదేమైనా, సహజ పద్ధతుల్లో పండించిన పంటలు, ఉత్పత్తి చేసిన పాలను మాత్రమే కొనుగోలు చేస్తామని నిష్కర్షగా చెప్పడం ద్వారా అమెరికాకు కొంతమేరయినా అడ్డుకట్ట వేయవచ్చు. మన రైతులను, దేశ ప్రజల ఆరోగ్యాన్నీ సంరక్షించుకోవచ్చు.



ఇంద్రశేఖర్ సింగ్
వ్యవసాయ విధానాల విశ్లేషకులు, నేషనల్ సీడ్ అసోసియేషన్ ఆఫ్ ఇండియా మాజీ డైరెక్టర్



సమష్టి చైతన్యస్ఫూర్తి!

గణేశుడు కర్తవ్య నిర్వహణాదక్షుడు. అమ్మకిచ్చిన మాట కోసం ఆదిదేవుణ్ని సైతం ఎదిరించి కర్తవ్యపాలనకు కట్టుబడ్డాడు. సానుకూల ధోరణులకు, సమన్వయ దృక్పథానికి, సునిశితమైన పరిశీలన దృష్టికి లంబోదరుడు సంకేతం. తాను గణాలకు అధిపతి అయినా అందరికీ అందుబాటులో ఉంటూ, సమన్వయంతో వ్యవహరిస్తూ, కలిసికట్టుగా విజయాన్ని సాధిద్దామని ప్రమథ గణాలతో గణపతి పేర్కొన్నాడు.

అమ్మ చేతి పసుపు బొమ్మగా రూపు దాల్చి, తండ్రి చేతిలోనే శిరస్సును కోల్పోయి, గజముఖాన్ని ధరించాడు గణపతి. గణాధిపత్యం కోసం సోదరుల మధ్య జరిగిన పోటీలో ఆత్మబలంతో గెలిచాడు. ఇలా ఎన్నో సంక్షోభ పరిస్థితులను ఎదుర్కొని, చివరికి విజయ గణపతిగా భాసిల్లాడు. చిత్తశుద్ధి, లక్ష్యసిద్ధితో సాధించలేనిది ఏమీ లేదని నిరూపించాడు. తన మరుగుజ్జు రూపాన్ని చూసి అవహేళన చేసినా పట్టించుకోకుండా తనదైన కార్యాచరణ ప్రణాళికతో ముందడుగు వేశాడు. ప్రథమ పూజ్యుడిగా ప్రణతులను అందుకుంటున్నాడు.

గణపతి నవరాత్రులు అంటే కాలక్షేపానికి నిర్వహించే ఉత్సవాలు కాదు. మనదైన ఘన వారసత్వాన్ని కొనసాగించడానికి ఉపకరించే సామూహిక సాధనా మార్గాలు. కొన్నేళ్ల కిందటి వరకు ఈ పండుగకు సంబంధించి మనోజ్ఞమైన కార్యకలాపాలు ఉండేవి. స్నేహితులతో కలిసి గణపతి పూజ కోసం చెట్ల నుంచి పత్రిని సేకరించడం, చెరువులోని బంక మట్టితో ప్రతిమ తయారు చేయడం, నీటి కుంటల్లో తామరాకులు, పువ్వులు సేకరించడం, వెదురు బద్దలతో పాలవెల్లి తయారు చేయడం, దానికి ధాన్యపు కంకులు, పండ్లు అలంకరించడం, మండపాలను రంగు కాగితాలతో తీర్చిదిద్దటం.. అవన్నీ గుర్తొస్తే మనసు ఉత్సాహంతో నిండిపోతుంది.

విద్య, ఉద్యోగ, వ్యాపారపరంగా రకరకాల ఒత్తిళ్లతో సతమతమయ్యేవారికి గణపతి నవరాత్రులు సరికొత్త ఉత్సాహాన్ని అందిస్తాయి. ఆరాధన, ప్రార్థన, ఏకాగ్రత, ధ్యానం అనేవి సుప్త చేతనావస్థను పరిశుద్ధం చేస్తాయి. మనసులో స్వచ్ఛతను, ధైర్యాన్ని, శక్తిని పెంచి వ్యక్తుల స్వభావాన్ని తీర్చిదిద్దుతాయి. మనిషి ఎప్పుడూ ఒంటరి కాదు, సామాజిక చైతన్యంతో ముందడుగు వేస్తేనే ప్రగతి సాధ్యమని మన పండుగలు నిరూపిస్తాయి. ఏదైనా కార్యక్రమం నిర్వహించాలంటే సమూహ స్ఫూర్తి(టీం స్పిరిట్) కావాలి. గణేశ మండపం ఏర్పాటు నుంచి నిమజ్జనం వరకు ప్రతి వేడుకా సామూహిక చైతన్యంతో కొనసాగుతుంది. విభిన్న రకాల మనస్తత్వాలు ఉన్న వ్యక్తులు ఒకచోట చేరి, బాధ్యతలను పంచుకుని, సమన్వయంతో సంకల్పశక్తి ద్వారా విజయం సాధించవచ్చు... అనే ప్రధానమైన గెలుపు సూత్రానికి ప్రతీక- వినాయక నవరాత్రుల వేడుక.

వ్యక్తి కన్నా వ్యవస్థ గొప్పది. నేను, నాది అనే సంకుచిత భావజాలాన్ని విడనాడి; మనం, మనది, మనకు అనే విశాల దృక్పథాన్ని అలవర్చుకోవాలి. ఈ సందేశ స్ఫూర్తినే వినాయక ఉత్సవాల కార్యాచరణ ఆవిష్కరిస్తుంది.

– విద్వత్ శ్రీనిధి

నాలుగైదు దేశాలే...

కంప్యూటర్లు, ఇతర ఎలక్ట్రానిక్ ఉపకరణాలు పనిచేయాలంటే 'లాజిక్ చిప్స్'గా పిలిచే సీపీయూలు, జీపీయూలు, ఎన్‌పీయూలు తప్పనిసరి. అంతటి కీలకమైన సున్నితమైన ఆ 'లాజిక్ చిప్స్' డిజైన్, తయారీల్లో కొన్ని దేశాలదే ఆధిపత్యం. 2021 లెక్కల ప్రకారం ఆయా విభాగాల్లో ఆ దేశాల వాటా ఎంతంటే... (శాతాల్లో)

డిజైనింగ్		ఫ్యాబ్రికేషన్	
అమెరికా	61	తైవాన్	47
తైవాన్	9	అమెరికా	27
చైనా	9	చైనా	12
దక్షిణ కొరియా	6	దక్షిణ కొరియా	11
జపాన్	6	ఇటలీ	2
ఇతరులు	9	జపాన్	1

అసెంబ్లింగ్, టెస్టింగ్, ప్యాకేజింగ్

తైవాన్	29
అమెరికా	28
చైనా	14
దక్షిణ కొరియా	13
జపాన్	7
సింగపూర్	2
మలేసియా	2
ఇతరులు	5



(ఆధారం - సెంటర్ ఫర్ సెక్యూరిటీ అండ్ ఎమర్జింగ్ టెక్నాలజీ నివేదిక)

అన్నింటికీ ఆన్‌లైన్... అయిపోతాం ఆఫ్‌లైన్!

'ఒరేయ్ బావా... గెడ్డం గీసుకోవడానికి బ్లేడు లేదు. వీధి చివర షాప్‌కెళ్తున్నా, నీకు కూడా ఏమైనా కావాలా?'

'దానికోసం షాప్‌కి ఎందుకురా.. ఎంచక్కా ఆన్‌లైన్‌లో ఆర్డర్ పెట్టేయొచ్చుగా'

'అరేయ్, నిన్ను అందరూ ఆన్‌లైన్ అరబుర్ర అనడంలో తప్పేలేదు. మరీ బ్లేడుకు కూడా ఆర్డర్ ఏంట్రా బొప్పాయిలో గింజలు తిని పండు పారేసే బ్లడీ ఫూల్'

'చాల్లే, అందుకే నిన్ను వెనక బెంచ్ వెంకట్ అనేది. అన్నింటిలోనూ వెనకబడిపోయావ్ అనుకో. బ్లేడ్ ఏంటి... కూరలో కరివేపాకు కూడా ఆన్‌లైన్ ఆర్డరే ఇప్పుడు. మొన్నటికి మొన్న.. ఎగ్జామ్ రాస్తుంటే పెన్నులో ఇంకైపోయింది. ఆర్డర్ పెట్టగానే అరనిమిషంలో తెచ్చాడు తెలుసా బుక్‌ఇట్ అన్న'

'అరనిమిషంలోనా? హాల్ బయటే ఉన్నాడేంట్రా..? అయినా పరీక్ష రాస్తూ ఆర్డర్ పెట్టడం ఏంటి.. ఇన్విజిలేటర్ ఏం చేస్తున్నట్టు?'

'ఆన్‌లైన్‌లోనే ఏదో గేమ్ ఆడుకుంటున్నాడులే, అది వేరే విషయంగానీ... మొన్న సూదిలో దారం ఎక్కించడం ఎలాగో తెలియక తెగ ఇబ్బంది పడిపోయా తెలుసా! మైట్యూబ్‌లో చూస్తే దారం ఎక్కించడం ఎలాగో ఎక్స్‌ప్లెయిన్ చేస్తూ ఏడువేలా ఆరువందల యాభై మూడు వీడియోలు కనిపించాయి. వాటిలో బెస్ట్ ఎంచుకుని చూసి వెంటనే ఎక్కించేశా తెలుసా?'

'ఇంకా నయం, అన్నీ చూస్తూ కూర్చున్నావ్ కాదు. దానికంటే... నువ్వు ట్రై చేయడమే ఫాస్ట్‌గా అయిపోతుంది కదా!'

'ఏం కాదు... ఆన్‌లైన్‌లో చూస్తేనేగా వచ్చేది'

'ఏడిశావ్, నీలాంటోడే పిడుక్కీ పెళ్లికీ ఒకటే మంత్రం అన్నాడట. ఏదైనా కష్టపడి నేర్చుకోవాల్సిన విషయాలకు వాడాలి కానీ.. మరీ ఇలాంటి వాటికి ఏంట్రా?'

'నువ్విలా అంటున్నావా... మొన్న మన మూడో బెంచ్ అబిగాణ్ని ట్రాఫిక్ పోలీసులు ఆపారట. కంగారులో ఇప్పుడు ఏం చేయాలని 'విరి'ని అడిగితే సైలెంటుగా పారిపొమ్మని చెప్పిందట. వాడా గొప్ప సలహాతో ఎంత బాగా తప్పించుకున్నాడో తెలుసా!'

'గాడిద గుడ్డేం కాదు! అలా తప్పించుకునే ప్రయత్నంలో పక్క స్టాప్‌లో పోలీసులకు దొరికిపోయాడు. చలాన్‌తో పోయే దానికి బండి సీజ్ చేశారు. తర్వాత ఏమిటిది 'విరి'... అని అడిగితే, సింపుల్‌గా 'వెరీ సారీ' అని నవ్వేసిందట!'

'అవునా...'

'మరి!'

'నువ్వు ఎన్నయినా చెప్పరా వెంకట్... ఆన్‌లైన్‌లో బతకడమంత ఈజీ ఇంకోటి లేదు. ఎవరైనా పోయినా సింపుల్‌గా ఆర్ఐపీ అని పెడితే చాలు. పరామర్శించే పనే లేదు!'

'అయితే నీ బర్త్‌డేకి కూడా హెచ్‌బీడీ అని పెట్టేసి ఊరుకుంటా. గిఫ్ట్ గిట్రా అడక్కు'

'అలాంటి పనులు చేయకురా బాబు... అయినా నీకో విషయం తెలుసా? మన పక్క రూమ్ ప్రశాంత్‌గాడు 'పట్టుకో చూద్దాం' అనే ఆన్‌లైన్ డేటింగ్ యాప్ వాడుతున్నాడు. అందులో మధుమిత అనే ముద్దుగుమ్మ పరిచయమైంది వాడికి. ఇక పగలూరాత్రీ లవ్వే లవ్వు. అలాంటి ఆఫర్లు కూడా ఉంటాయమ్మా..'

'ఆహా.. అలాగా! మన ఎదురు రూమ్‌లో ఉండే వాడి పేరేంట్రా?'

'మధుసూదన్'

'వాడే ఈ మధుమిత. మూడొందలు తీసుకుని తిరిగివ్వని పాపానికి ఫేక్ అకౌంట్ పెట్టి ఆ ప్రశాంత్‌గాడి పాకెట్ ఖాళీ చేసేస్తున్నాడు. ఈ విషయం తెలియక ఆ వెర్రోడు వేలకు వేలు వదిలించుకుంటున్నాడు'

'అయ్యబాబోయ్... నిజమా!?'

'మరి... ఆన్‌లైన్‌లో ఇలాంటి మోసాలు బోలెడు ఉంటాయమ్మా...'

'నువ్వలాగే అంటావ్ కానీ, ఎప్పుడూ ఆన్‌లైన్‌లో ఉంటుంటే వచ్చే కిక్కే వేరప్పా! చదువులు, ఆఫీసు పనులు, షాపింగులు, మీటింగులూ, డేటింగులు... అన్నీ ఈజీగా అయిపోతున్నాయ్ కదా!'

'అందుకే డిప్రెషన్‌లూ, సప్రెషన్లూ, ఎమోషనల్ బ్రేక్‌డౌన్లు కూడా అయిపోతున్నాయ్'

'అంతేనంటావా...'

'మరి! నీలాంటి అపర మేతావులే వీడియోకాల్స్‌లో చూసి ప్రసవాలు, సెర్చ్ ఇంజిన్స్‌లో వెతికి దొంగతనాలు, బ్లాగుల్లో చదివి హత్యలు చేస్తున్నారు. ఆ శవాలను మాయం చేయడానికి కొత్త కొత్త టెక్నిక్‌లు కూడా మళ్లీ ఆన్‌లైన్‌లోనే! అవసరానికి వాడాలి కానీ ఇలా అక్కర్లేని పనులను ఆన్‌లైన్‌లో చేయకూడదురా అరబుర్ర. అతి చేస్తే గతి చెడుతుంది. అన్నింటికీ ఆన్‌లైన్ మీద ఆధారపడితే చివరికి లైఫే ఆఫ్‌లైన్ అయిపోతుంది. అప్పుడిక నీ అడ్రస్ ప్రొఫైల్స్‌లోనూ, రీల్స్‌లోనూ తప్ప రియల్ లైఫ్‌లో ఉండదు'

'తిడితే తిట్టావ్‌గానీ మంచి విషయమే చెప్పావ్‌రా. సర్లే పద, నేను కూడా నీతోపాటు షాప్‌కి వస్తా'

'అలాగే, రా'

'ఇంతకీ ఈ రీల్ చూశావా నువ్వు..'

'నిన్నూ...'



– చంద్రమౌళిక సాపిరెడ్డి

బొజ్జ గణపయ్య బుజ్జి పాఠాలు..!



వేద.. 'ప్లాస్టర్ ఆఫ్ పారిస్‌తో చేసిన వినాయకులను పెట్టొద్దని, మట్టితో తయారుచేసిన విగ్రహాలనే పూజించాలని స్కూల్లో టీచర్ చెప్పారు కదా!' అంది కీర్తి. 'అవును.. మనం రేపు ఉదయాన్నే లేచి మట్టితో వినాయకుడిని తయారుచేద్దామా' అంది వేద. 'సరే చేద్దాం. మరి పొద్దున్నే వచ్చేయి' బదులిచ్చింది కీర్తి. ఉదయాన్నే ఇద్దరూ కలిసి మట్టి తీసుకొచ్చి గణపతిని చేయడం మొదలుపెట్టారు. 'నాకో సందేహం వచ్చింది కీర్తి.. మనం ప్రతి ఒక్కరి నుంచి ఏదో ఒకటి నేర్చుకోవచ్చని పెద్దవాళ్లు చెబుతుంటారు కదా! మరి గణపతి నుంచి ఏం నేర్చుకోవచ్చో నీకేమైనా తెలుసా?' అంది వేద. 'నాకు పెద్దగా ఏం తెలియదు కానీ వినాయకుడికి అమ్మానాన్నలంటే చాలా ఇష్టమట. తన తమ్ముడికీ, తనకూ పోటీ పెట్టి ప్రపంచాన్ని చుట్టి రమ్మంటే అమ్మానాన్నల చుట్టూరా తిరిగి మీరే నా ప్రపంచం అని చెప్పాడట. వ్యాసుడు చెబుతుంటే వినాయకుడే మహాభారతం రాశాడని పురాణాల్లో చెప్పారు కదా! తను ఆపకుండా మొత్తం పూర్తయ్యేవరకు ఎన్ని ఆటంకాలు వచ్చినా రాస్తూనే ఉన్నాడట' అని చెప్పింది కీర్తి. 'అవునా..! ఇంట్లో అమ్మవాళ్లు చెబుతుంటే నేనూ ఒకసారి విన్నాను. గణపతి వాళ్లమ్మ పార్వతీదేవి స్నానానికి వెళ్తూ.. బయట తనను కూర్చోమని చెప్పిందట. కాపలా కూర్చున్నప్పుడు అక్కడికి శివుడు వచ్చాడట. దాంతో ఆయన్ని లోపలికి వెళ్లనివ్వకుండా గొడవ పెట్టుకున్నాడట' అని చెప్పింది వేద. మొదటి నుంచీ వీళ్ల మాటలన్నీ వింటున్న తేజ.. 'అయితే ఈ మూడు సందర్భాల్లో వినాయకుడి నుంచి మనమేం నేర్చుకోవచ్చు' అని అడిగింది. 'మొదటి సందర్భం నుంచి.. అమ్మానాన్నలను పెద్దవాళ్లను ఎలా గౌరవించాలనే విషయం నేర్చుకోవచ్చు. ఇక రెండో సందర్భం నుంచి.. మొదలుపెట్టిన పనిని మధ్యలో వదిలేయకుండా లక్ష్యాన్ని చేరుకునే దిశగా ఎలా వెళ్లాలో తెలుసుకోవచ్చు. చివరి దాని నుంచి.. ఇచ్చిన మాట కోసం ఎంత పట్టుదలగా ఉన్నా ఎవరితో మాట్లాడుతున్నాం, ఎంతవరకు మాట్లాడాలి అనే విషయాలను అంచనా వేసుకోవాలని నేర్చుకోవచ్చు' అని చెప్పింది వేద. 'భలేగా చెప్పావు!' అంది తేజ. ఇక గణపతిని తయారుచేయడం పూర్తవ్వగానే ముగ్గురూ కలిసి.. ఎంచక్కా విగ్రహాన్ని మండపానికి తీసుకెళ్లారు.

హాయ్! బుజ్జీ!!

– అవధూత హరిప్రియ

రాష్ట్ర ఉత్తమ ఉపాధ్యాయుల ఎంపికకు కమిటీ

ఈనాడు, అమరావతి: రాష్ట్ర స్థాయి ఉత్తమ ఉపాధ్యాయుల అవార్డుల ఎంపిక కోసం కమిటీని ఏర్పాటు చేస్తూ పాఠశాల విద్యాశాఖ ఉత్తర్వులు జారీ చేసింది. కమిటీలో విద్యాశాఖ మంత్రి నారా లోకేశ్‌ చైర్మన్‌గా, కార్యదర్శి కోన శశిధర్‌ వైస్‌ చైర్మన్‌గా, డైరెక్టర్‌ విజయరామరాజు కన్వీనర్‌గా, ఎస్సీఈఆర్టీ డైరెక్టర్‌ వెంకట కృష్ణారెడ్డి, ఆదికవి నన్నయ వర్సిటీ ప్రొఫెసర్‌ మల్లి గాంధీ సభ్యులుగా ఉంటారు. జిల్లా విద్యాధికారులు సమర్పించిన జాబితా నుంచి కేటగిరీల వారీగా ఉపాధ్యాయులను ఈ కమిటీ ఎంపిక చేస్తుందని పేర్కొంది.

సిగ్నల్‌ ట్యాంపరింగ్‌ చేసి నర్సాపూర్‌ ఎక్స్‌ప్రెస్‌లో దోపిడీ

దాచేపల్లి, న్యూస్‌టుడే: సిగ్నల్‌ ట్యాంపరింగ్‌ చేసి ఎక్స్‌ప్రెస్‌ రైల్లోకి చొరబడిన దొంగల ముఠా ముగ్గురు మహిళల మెడలోని బంగారు ఆభరణాలను చోరీ చేసి పరారైన ఘటన పల్నాడు జిల్లా దాచేపల్లి మండలం నడికుడి రైల్వే స్టేషన్‌ సమీపంలోని 146/06 మైలురాయి వద్ద చోటుచేసుకుంది. నాగర్‌సోల్‌ నుంచి నరసాపురం వెళుతున్న నర్సాపూర్‌ ఎక్స్‌ప్రెస్‌ రైలు మంగళవారం తెల్లవారుజామున 2.47 గంటలకు నడికుడి రైల్వేస్టేషన్‌ సమీపానికి చేరుకుంది. ఆ సమయంలో మార్గంలో పైవే అండర్‌ బ్రిడ్జి సమీపంలో దుండగులు పట్టాల పక్కన హోమ్‌ సిగ్నల్‌ను ట్యాంపర్‌ చేశారు. రెడ్‌ సిగ్నల్‌ పడటంతో లోకో పైలట్‌ రైలును ఆపేశారు. వెంటనే దొంగల ముఠా సభ్యులు రైల్లోకి చొరబడి ఎస్‌-1, ఎస్‌-2, ఎస్‌-3 బోగీల్లోని ఇద్దరు మహిళల మెడలో 68 గ్రాముల బంగారు గొలుసులు, ఓ మహిళ మెడలోని రోల్డ్‌ గోల్డ్‌ గొలుసు దోచుకున్నారు. ఎస్‌-5 బోగీలోనూ చోరీకి యత్నించగా ప్రయాణికులు కేకలు వేయడంతో పరారయ్యారు. ఆ సమయంలో రైలు 35 నిమిషాలపాటు నిలిచిపోయింది. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు రైల్వే ఎస్సై రమేష్‌ తెలిపారు. కాగా, నర్సాపూర్‌ ఎక్స్‌ప్రెస్‌ రైలుకు భద్రతా సిబ్బంది లేకపోవడం గమనార్హం.



మీకు మీరే అభినందించుకోండి

మీరు సాధించిన తొలి విజయానికి ఇతరుల ప్రశంసలు ఆశిస్తూ కూర్చోకండి. మిమ్మల్ని మెచ్చుకునేందుకు ఒక్కోసారి ఎవరూ ముందుకు రాకపోవచ్చు. కాబట్టి మీకు మీరు అభినందించడం అలవాటు చేసుకోండి. ఒక్క విజయంతో ఆగిపోకుండా.. సాహసోపేత నిర్ణయాలతో భవిష్యత్‌ విజయాలకు బాటలు పరుచుకుంటూ వెళ్లండి.

– ఫోలా ఎయినా, లీడర్‌షిప్‌ మెంటార్‌

జాతీయ ఉత్తమ ఉపాధ్యాయుడిగా దేవానంద్‌

మైలవరం, న్యూస్‌టుడే: జాతీయ ఉత్తమ ఉపాధ్యాయ అవార్డుకు ఎన్టీఆర్‌ జిల్లా మైలవరంలోని లకిరెడ్డి హనిమిరెడ్డి ప్రభుత్వ డిగ్రీ కళాశాల తెలుగు విభాగాధిపతి డాక్టర్‌ మెండ దేవానంద్‌కుమార్‌ ఎంపికయ్యారు. కేంద్రం నుంచి సోమవారం రాత్రి ఆయనకు సమాచారం అందింది. గురుపూజోత్సవాన్ని పురస్కరించుకుని సెప్టెంబరు 5న దిల్లీలో నిర్వహించే కార్యక్రమంలో రాష్ట్రపతి చేతులమీదుగా ఆయన అవార్డు అందుకోనున్నారు. 2021 నుంచి మైలవరం కళాశాలలో పని చేస్తున్న ఆయన వినూత్న కార్యక్రమాలకు పేరొందారు. విద్యార్థులతో తాళపత్ర గ్రంథాలను తయారు చేయించడం ద్వారా జాతీయస్థాయికి చేరారు. అందులోనే విద్యార్థులకు సర్టిఫికేషన్‌ కోర్సు, జర్నలిజం, జీవన నైపుణ్యాలు, అనువాదం వంటి 12 కోర్సులను కళాశాలలో ఆయన ఆధ్వర్యంలో నిర్వహించారు. 2011 నుంచి అధ్యాపకునిగా పనిచేస్తూ 38 పరిశోధనా పత్రాలు ప్రచురించడంతో పాటు, పలు జాతీయ సదస్సుల నిర్వహణలోనూ కీలక భూమిక పోషించారు. 2024లో రాష్ట్ర ఉత్తమ ఉపాధ్యాయుడిగానూ అవార్డు అందుకున్నారు.



మెండ దేవానంద్‌కుమార్‌



అయ్యర్‌ విజయలక్ష్మీ కాశీనాథ్‌

ఆర్కిటెక్చర్‌ రంగంలో విజయవాడ ప్రొఫెసర్‌కు జాతీయస్థాయి అవార్డు

కానూరు, న్యూస్‌టుడే: విజయవాడకు చెందిన స్కూల్‌ ఆఫ్‌ ప్లానింగ్‌ అండ్‌ ఆర్కిటెక్చర్‌ కళాశాలకు చెందిన ప్రొఫెసర్‌ అయ్యర్‌ విజయలక్ష్మీ కాశీనాథ్‌.. జాతీయస్థాయిలో నేషనల్‌ అవార్డ్‌ ఫర్‌ టీచర్స్‌-2025కు ఎంపికయ్యారు. ఉన్నతవిద్య విభాగంలో ఆమెను అవార్డుకు ఎంపిక చేశారు. చెన్నైకు చెందిన అయ్యర్‌ విజయలక్ష్మీ కాశీనాథ్‌.. అన్నా యూనివర్సిటీలో బీఆర్క్‌, ఎంఆర్క్‌, పీహెచ్‌డీ చేశారు. 28 ఏళ్లుగా ఆర్కిటెక్చర్‌ రంగంలో బోధన చేస్తున్నారు. ఆమె పరిశోధన పత్రాలు 150 వరకు వివిధ జర్నల్స్‌లో ప్రచురితమయ్యాయి. ఐదు పుస్తకాలు రచించారు. ఎన్‌పీటీఈఎల్‌ స్వయం కోర్సుల్లో నాలుగు సబ్జెక్టులను ఆమె బోధిస్తారు. 2022లో సోలార్‌ డెకథ్లాన్‌ అవార్డు వరించింది. ప్రస్తుతం జాతీయస్థాయిలో రెండో అవార్డు అందుకోనున్నారు.

జాతీయ ఉత్తమ ఉపాధ్యాయురాలికి మంత్రి అభినందనలు

ఈనాడు, అమరావతి: జాతీయ ఉత్తమ ఉపాధ్యాయ అవార్డుకు ఎంపికైన మాదాబత్తుల తిరుమల శ్రీదేవికి విద్యాశాఖ మంత్రి నారా లోకేశ్‌ అభినందనలు తెలిపారు. "జాతీయ అవార్డుకు ఎంపికకావడం మన రాష్ట్రానికే గర్వకారణం. 'నేర్చుకోవడానికి రండి.. దేశసేవ చేయడానికి వెళ్లండి' నినాదంతో వినూత్న బోధనా పద్ధతిలో విద్యార్థులను తీర్చిదిద్దుతున్న తీరు ఉపాధ్యాయ లోకానికి స్ఫూర్తిగా నిలుస్తుంది" అని పేర్కొన్నారు.

సృష్టి వ్యవహారంలో మీ పనితీరు బాగోలేదు..

- తనిఖీలు చేసి నివేదిక ఇవ్వడంలో జాప్యం ఎందుకు?
- అధికారులపై వైద్యారోగ్య శాఖ మంత్రి సత్యకుమార్‌ ఆగ్రహం

ఈనాడు, అమరావతి: సృష్టి ఫెర్టిలిటీ సెంటర్‌ వ్యవహారంలో జిల్లాల్లో అధికారులు స్పందించిన తీరుపై వైద్యారోగ్య శాఖ మంత్రి సత్యకుమార్‌ యాదవ్‌ అసంతృప్తి వ్యక్తంచేశారు. వివాదాస్పద అంశంపై రాష్ట్రవ్యాప్తంగా తనిఖీలు నిర్వహించి తీసుకున్న చర్యలపై నివేదిక ఇవ్వమంటే ఎందుకంత తాత్సారం? ఎన్టీఆర్‌ జిల్లాలో మినహా మరెక్కడా అధికారులు పట్టించుకోకపోవడం సరికాదు అంటూ ఆగ్రహం వ్యక్తంచేశారు. రాష్ట్ర సచివాలయంలో వైద్యారోగ్యశాఖ ఉన్నతాధికారులతో మంగళవారం సత్యకుమార్‌ యాదవ్‌ సమీక్షా సమావేశం నిర్వహించారు. ''ప్రజాప్రతినిధులు, ప్రజలు పలు సమస్యలు నా దృష్టికి తెస్తున్నప్పుడు వాటిని సంబంధిత అధికారులు పరిశీలించి సమాచారం ఇవ్వాలి. ఈ విషయంలోనూ జాప్యం జరుగుతోంది. ప్రజా సమస్యలు పట్టించుకోకపోతే అది ప్రజాస్వామ్య ఉల్లంఘన కిందకు వస్తుంది. వైద్యులు, అధికారులు అప్రమత్తంగా ఉండాలి" అని హితవు పలికారు. ప్రభుత్వ ఆసుపత్రుల్లో వాట్సప్‌ గవర్నెన్స్‌ ప్రవేశపెడితే రిపోర్టులు వెంటనే రోగులకు పంపే వీలుంటుందన్నారు. ఆయుష్‌, ఔషధ నియంత్రణ, ఫుడ్‌ సేఫ్టీ విభాగాల్లో ఖాళీల భర్తీకి చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. సాధారణ బదిలీల్లో నిర్ణీత గడువులో 99 శాతం మంది విధుల్లో చేరడంపై సంతృప్తి వ్యక్తంచేస్తూ వివాదరహితంగా బదిలీలు నిర్వహించిన ఉన్నతాధికారులను అభినందించారు. సమావేశంలో వైద్యారోగ్యశాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి ఎం.టి.కృష్ణబాబు, కమిషనర్‌ వీరపాండియన్‌, సెకండరీ హెల్త్‌ సంచాలకులు సిరి, డీఎంఈ నరసింహం, వివిధ శాఖల విభాగాధిపతులు పాల్గొన్నారు.

డీఎంఈకి అభినందనలు..: ఈ నెలాఖరులో పదవీ విరమణ చేయనున్న వైద్య విద్య సంచాలకులు (డీఎంఈ) డీవీఎల్‌ నరసింహాన్ని వైద్యారోగ్య శాఖ మంత్రి సత్యకుమార్‌ యాదవ్‌ అభినందించారు. క్లిష్టమైన కీలక పదవిని వివాద రహితంగా నిర్వహించారని ప్రశంసించారు.

ధర్మాన సోదరులే నన్ను పార్టీ నుంచి సస్పెండ్‌ చేయించారు

ఎమ్మెల్సీ దువ్వాడ శ్రీనివాస్‌

శ్రీకాకుళం అర్బన్‌, న్యూస్‌టుడే: మాజీ మంత్రులు ధర్మాన సోదరులు ఉద్దేశపూర్వకంగా తనపై కక్షగట్టి వైకాపా నుంచి సస్పెండ్‌ చేయించారంటూ ఎమ్మెల్సీ దువ్వాడ శ్రీనివాస్‌ ఆరోపించారు. శ్రీకాకుళంలో మంగళవారం ఆయన విలేకరులతో మాట్లాడారు. 'నాపై పార్టీ సస్పెన్షన్‌ తాత్కాలికమే. దానికీ, జగన్‌మోహన్‌రెడ్డికీ ఎలాంటి సంబంధం లేదు. నేను ఎప్పటికీ జగన్‌ విధేయుడిగానే ఉంటాను. నా సస్పెన్షన్‌ వెనక వైకాపా జిల్లా అధ్యక్షుడు ధర్మాన కృష్ణదాస్‌, ఆయన సోదరుడు, మాజీ మంత్రి ధర్మాన ప్రసాదరావు ఉన్నారు. నా ధాటిని తట్టుకోలేక జిల్లాలో కింజరాపు కుటుంబంతో వారికున్న లోపాయికారి ఒప్పందాలతో కుట్ర పూరితంగా సస్పెండ్‌ చేయించారు. మిస్టర్‌ ధర్మాన కృష్ణదాస్‌, ప్రసాదరావ్‌.. దమ్ముంటే సస్పెన్షన్‌ కాదు, నన్ను పార్టీ నుంచి బహిష్కరించండి' అని సవాలు విసిరారు. కేంద్ర మంత్రి రామ్మోహన్‌నాయుడు విశాఖ ఉక్కు పరిశ్రమ ప్రైవేటీకరణకు అనుకూలంగా ఉన్నారే తప్ప, క్యాప్టివ్‌ మైనింగ్‌పై ఎందుకు మాట్లాడట్లేదు అని దువ్వాడ ప్రశ్నించారు.

నెల రోజుల్లో అంగన్‌వాడీ కార్యకర్తలకు కొత్త సెల్‌ఫోన్లు

ఈనాడు, అమరావతి: నెల రోజుల్లో అంగన్‌వాడీ కార్యకర్తలకు కొత్త సెల్‌ఫోన్లు అందించనున్నట్లు రాష్ట్ర మహిళా శిశు సంక్షేమ శాఖ డైరెక్టర్‌ వేణుగోపాల్‌రెడ్డి తెలిపారు. ఇండక్షన్‌ స్టవ్‌ వినియోగానికి వీలుగా నెలకు రూ.500 చొప్పున విద్యుత్తు ఛార్జీల కింద ప్రభుత్వమే చెల్లిస్తుందన్నారు. సామాజిక భద్రత పింఛన్ల పంపిణీకి అంగన్‌వాడీలను వినియోగించరాదని ఇప్పటికే జిల్లా కలెక్టర్లకు ఆదేశాలు జారీ చేసినట్లు వివరించారు. గుంటూరులోని మహిళా శిశు సంక్షేమ శాఖ కార్యాలయంలో సీఐటీయూ, ఏఐటీయూసీ, ఐఎఫ్‌టీయూ అనుబంధ అంగన్‌వాడీ సంఘాల ప్రతినిధులతో డైరెక్టర్‌ వేణుగోపాల్‌రెడ్డి మంగళవారం సమావేశమై పలు అంశాలపై చర్చించారు. ఈ సందర్భంగా సంక్షేమ పథకాల్ని అర్హత కలిగిన వారందరికీ అందిస్తామని డైరెక్టర్‌ హామీ ఇచ్చినట్లు ఆయా సంఘాల ప్రతినిధులు సుబ్బరావమ్మ, లలితమ్మ, జ్యోతి తెలిపారు. పోషణ ట్రాకర్‌లో నమోదు చేసిన వివరాలను తిరిగి సంజీవని యాప్‌లో నమోదు చేయాల్సిన అవసరం లేదని సూచించారన్నారు. కృష్ణా, అనంతపురం, తూర్పు, పశ్చిమగోదావరి జిల్లాల్లో అంగన్‌వాడీలకు బీఎల్వో విధుల నుంచి మినహాయింపు ఇస్తామని హామీ ఇచ్చినట్లు వెల్లడించారు.

సీమ ప్రాజెక్టులపై రూ.15 వేల కోట్లు ఖర్చుచేస్తే 10 లక్షల ఎకరాలు సాగులోకి

మాజీ ఐపీఎస్‌ అధికారి ఏబీ వెంకటేశ్వరరావు



సమావేశంలో మాట్లాడుతున్న మాజీ ఐపీఎస్‌ అధికారి ఏబీ వెంకటేశ్వరరావు పక్కన లక్ష్మీనారాయణ, భవానీప్రసాద్‌, రామారావు

విజయవాడ (గాంధీనగర్‌), న్యూస్‌టుడే: 'రాయలసీమ ప్రాంతంలోని ప్రాజెక్టులకు పది, పదిహేను వేల కోట్ల రూపాయలు ఖర్చు చేస్తే పది లక్షల ఎకరాలు సాగులోకి వస్తాయని, పది లక్షలమందికి స్థిరమైన ఉపాధి లభిస్తుందని, రూ. వేల కోట్ల సంపద ఉత్పత్తి అవుతుందని.. ప్రభుత్వం వాటి నిర్మాణాన్ని పూర్తి చేయాలని' మాజీ ఐపీఎస్‌ అధికారి ఏబీ వెంకటేశ్వరరావు తెలిపారు. శ్రీశైలం జలాశయం నుంచి కృష్ణా నది జలాలపై ఆధారపడి చేపట్టిన ప్రాజెక్టుల స్థితిగతులపై ముఖ్యమంత్రి చంద్రబాబుకు రాసిన లేఖను మంగళవారం విజయవాడ ప్రెస్‌ క్లబ్‌లో ఆయన మీడియాకు విడుదల చేశారు. ఆలోచనాపరుల వేదిక ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ సమావేశంలో మాట్లాడుతూ 'ప్రభుత్వాలు కేవలం రిజర్వాయర్లలో నీటిని నింపడం కాదు చివరి ఎకరాకు నీరిస్తేనే ప్రయోజనం అని తెలిపారు. గత ప్రభుత్వం రుషికొండ ప్యాలెస్‌కు రూ.500 కోట్లు, రాయలసీమ ఎత్తిపోతలకు రూ.750 కోట్ల ప్రజాధనాన్ని వృథా చేసిందన్నారు. రుషికొండ భవనాలను మెంటల్‌ ఆస్పత్రికి లేదా ఐటీ కంపెనీలకు వినియోగించాలని సూచించారు. రాజకీయ విశ్లేషకుడు టి.లక్ష్మీనారాయణ మాట్లాడుతూ గోదావరి, కావేరి నదుల అనుసంధానాన్ని ఇచ్చంపల్లి నుంచి చేపట్టాలన్న జాతీయ నదుల అనుసంధాన టాస్క్‌ఫోర్స్‌ కమిటీ ప్రతిపాదనను ఏపీ ప్రభుత్వం తిరస్కరించడం సరైనదేనని పేర్కొన్నారు. రైతు సంఘం నాయకుడు అక్కినేని భవానీ ప్రసాద్‌ మాట్లాడుతూ వైకుంఠపురం రిజర్వాయర్‌ను 20 టీఎంసీల సామర్థ్యంతో నిర్మిస్తే ఉపయోగమన్నారు. ఈ సమావేశంలో వేదిక నాయకులు జొన్నలగడ్డ రామారావు పాల్గొన్నారు.

మెగా డీఎస్సీ ఆపడానికి జగన్‌ 24 కేసులు వేయించారు

ఏపీఎస్‌ఆర్టీసీ ఛైర్మన్‌ కొనకళ్ల నారాయణ

ఈనాడు, అమరావతి: మెగా డీఎస్సీ ఆపడానికి వైకాపా అధ్యక్షుడు జగన్‌మోహన్‌రెడ్డి 24 కేసులు వేయించినా.. యువతకు ఇచ్చిన మాట ప్రకారం 16,347 ఉపాధ్యాయ పోస్టులతో కూటమి ప్రభుత్వం పారదర్శకంగా మెగా డీఎస్సీ నిర్వహించిందని ఏపీఎస్‌ఆర్టీసీ ఛైర్మన్‌ కొనకళ్ల నారాయణ తెలిపారు. తెదేపా కేంద్ర కార్యాలయంలో మంగళవారం ఆయన మాట్లాడారు. ''ఏటా మెగా డీఎస్సీ నిర్వహించి యువ ఉపాధ్యాయులతో రాష్ట్ర విద్యారంగాన్ని దేశంలో అగ్రస్థానంలో నిలపడం ప్రభుత్వ లక్ష్యం. చంద్రబాబు తన 14 ఏళ్ల పాలనలో 13 డీఎస్సీలతో 1,96,619 ఉపాధ్యాయ పోస్టులు భర్తీ చేసి, చరిత్ర సృష్టించారు. జగన్‌ ప్రభుత్వం మాత్రం మెగా డీఎస్సీ హామీ ఇచ్చి, ఒక్క పోస్టూ భర్తీ చేయకుండా విద్యారంగాన్ని నాశనం చేసింది'' అని ధ్వజమెత్తారు.

సీఎం చంద్రబాబు విశాఖ పర్యటన ఖరారు

విశాఖపట్నం (వన్‌టౌన్‌), న్యూస్‌టుడే: ముఖ్యమంత్రి చంద్రబాబు విశాఖ పర్యటన ఖరారైంది. ఈ నెల 29న ఉదయం 11.15 గంటలకు విజయవాడ నుంచి విశాఖ చేరుకుని, అధికారిక కార్యక్రమాల్లో పాల్గొంటారు. సాయంత్రం 4.10 గంటలకు విశాఖలో బయలుదేరి బెంగళూరు వెళ్తారు.

ఐపీఎస్‌ అధికారి సునీల్‌కుమార్‌ సస్పెన్షన్‌ పొడిగింపు

- వచ్చే ఏడాది ఫిబ్రవరి 24 వరకూ అమల్లో
- ప్రభుత్వ ఉత్తర్వులు జారీ

ఈనాడు, అమరావతి: "సీనియర్‌ ఐపీఎస్‌ అధికారి పీవీ సునీల్‌ కుమార్‌పై విధించిన సస్పెన్షన్‌ను ఎత్తేస్తే.. ఆయన నిందితుడిగా ఉన్న కేసుల దర్యాప్తు, విచారణను ప్రభావితం చేసే అవకాశముంది. వాటి ఆధారాలు, సాక్ష్యాలు తారుమారు చేసే ప్రమాదముంది. అందుకే మరో 6 నెలలపాటు ఆయన సస్పెన్షన్‌ను పొడిగిస్తున్నాం. 2026 ఫిబ్రవరి 24 వరకు ఈ సస్పెన్షన్‌ అమల్లో ఉంటుంది" అని రాష్ట్ర ప్రభుత్వం పేర్కొంది. "వైకాపా హయాంలో సీఐడీ విభాగాధిపతిగా పనిచేసిన పీవీ సునీల్‌కుమార్‌.. అగ్రిగోల్డ్‌ బాధితులకు పరిహారం చెల్లింపుల కోసం రాష్ట్ర ప్రభుత్వం కేటాయించిన నిధులు దుర్వినియోగం చేశారనే అభియోగాలపై ఏసీబీ విచారణ జరుపుతోంది. ఈ కేసులో సాక్షుల విచారణ, వివిధ శాఖల నుంచి డాక్యుమెంట్ల సేకరణ ఇంకా పూర్తికాలేదు. శాసనసభ ఉపసభాపతి కె.రఘురామకృష్ణరాజు నరసాపురం ఎంపీగా ఉన్న సమయంలో ఆయన్ను కస్టడీకి తీసుకుని చిత్రహింసలకు గురిచేశారంటూ గుంటూరు నగరంపాలెం పోలీస్‌స్టేషన్‌లో సునీల్‌కుమార్‌పై నమోదైన కేసులో దర్యాప్తు కొనసాగుతోంది. ఈ చిత్రహింసల వెనక ఉన్న విస్తృత కుట్రను వెలికితీయడం, రఘురామకృష్ణరాజును కొట్టడానికి వినియోగించిన ఆయుధాలను గుర్తించడం వంటివి ఇంకా పెండింగ్‌లో ఉన్నాయి. ఈ దశలో సస్పెన్షన్‌ను ఎత్తేస్తే సునీల్‌కుమార్‌ తన పలుకుబడి, పరపతితో కేసుల దర్యాప్తు, విచారణను ప్రభావితం చేసే, ఆధారాలు, సాక్ష్యాలను తారుమారు చేసే అవకాశముంది" అని నిర్ణయానికొచ్చిన రివ్యూ కమిటీ ఆయన సస్పెన్షన్‌ను పొడిగించాలని తీర్మానించింది. ఈ మేరకు ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి కె.విజయానంద్‌ మంగళవారం ఉత్తర్వులు జారీ చేశారు.

అనుమతి లేకుండా విదేశీ పర్యటనలు చేశారంటూ తొలుత సస్పెన్షన్‌

వైకాపా హయాంలో సీఐడీ విభాగాధిపతిగా, అగ్నిమాపక శాఖ డైరెక్టర్‌ జనరల్‌గా పనిచేసిన పీవీ సునీల్‌కుమార్‌.. రాష్ట్ర ప్రభుత్వం అనుమతి తీసుకోకుండా తరచూ విదేశీ పర్యటనలకు వెళ్లారని, కొన్ని సందర్భాల్లో ఒక దేశానికి వెళ్లేందుకు అనుమతి పొంది మరో దేశంలో పర్యటించారంటూ తొలుత మార్చి 2న ప్రభుత్వం ఆయన్ను సస్పెండ్‌ చేసింది. అనంతరం ఆగస్టు 28 వరకూ దాన్ని పొడిగించింది. ఆ గడువు ముగుస్తున్న నేపథ్యంలో రివ్యూ కమిటీ తాజాగా సమావేశమైంది. ◆ అఖిల భారత సర్వీసు నియమావళి, నిబంధనలను సునీల్‌కుమార్‌ ఉద్దేశపూర్వకంగా ఉల్లంఘించారని, తీవ్ర క్రమశిక్షణ రాహిత్యానికి, దుష్ప్రవర్తనకు పాల్పడ్డారని ప్రభుత్వం పేర్కొంది. జార్జియా వెళ్లేందుకు అనుమతి తీసుకుని దుబాయ్‌లో (యూఏఈ), అమెరికా వెళ్లేందుకు అనుమతి పొంది లండన్‌లో (యూకే) పలుమార్లు పర్యటించారని, అసలు ఏ అనుమతీ లేకుండా పలుమార్లు అమెరికాకు, దుబాయ్‌కు వెళ్లారంటూ ఆయనపై 6 అభియోగాలు గతంలోనే ప్రభుత్వం నమోదు చేసింది.



గార మండలంలోని కొత్తూరు-సైరిగాం ప్రాంతంలో పంట పొలాల్లో నిలిచిన నీరు

శ్రీకాకుళం జిల్లాలో భారీ వర్షం

శ్రీకాకుళం, న్యూస్‌టుడే: శ్రీకాకుళం జిల్లావ్యాప్తంగా మంగళవారం భారీ వర్షం కురిసింది. లోతట్టు ప్రాంతాలన్నీ జలమయమయ్యాయి. పలు మండలాల్లో పంట పొలాలు నీట మునిగాయి. శ్రీకాకుళం నగరంలో సోమవారం రాత్రి నుంచి మంగళవారం మధ్యాహ్నం వరకు ఎడతెరిపి లేకుండా వర్షం కురిసింది. జిల్లా కేంద్రంలో 52.4 మి.మీ. వర్షపాతం నమోదైంది. నగర సమీపంలోని పెద్దపాడు సమీపంలో జాతీయ రహదారిపై వర్షపు నీరు నాలుగు అడుగుల లోతుతో సుమారు కిలోమీటరు పొడవునా నిలిచిపోయింది. సర్వీసు రోడ్డులో వాహనాలు తిరగలేకపోయాయి. కాలువల్లో పూడికతీత పనులు చేపట్టకపోవడంతో వర్షం పడిన ప్రతిసారీ ఇదే పరిస్థితి తలెత్తుతోంది.



శ్రీకాకుళం జిల్లా కేంద్రంలోని పెద్దపాడు సమీపంలో జాతీయ రహదారిపై నిలిచిన నీరు

పాఠశాల విద్యపై ఏపీలో సగటు ఖర్చు రూ.18వేలు

- జాతీయ సగటు కంటే అధికంగా వ్యయం
- దక్షిణాదిలో నాలుగో స్థానంలో ఏపీ
- కేంద్రం విడుదల చేసిన 'సమగ్ర మాడ్యులర్‌ సర్వే విద్య-2025'లో వెల్లడి

ఈనాడు, అమరావతి: పిల్లల చదువుల కోసం జాతీయ సగటు కంటే ఏపీలో తల్లిదండ్రులు అత్యధికంగా ఖర్చుచేస్తున్నారు. దక్షిణాదిలో తమిళనాడు, తెలంగాణ, కర్ణాటక తర్వాత ఏపీలో పాఠశాల విద్యకు సగటున చేస్తున్న వ్యయం అధికంగా ఉంది. పూర్వ ప్రాథమిక విద్య(ఎల్‌కేజీ) నుంచి ఇంటర్మీడియట్‌ వరకు అన్ని స్థాయిల్లో కలిపి ఒక్కో విద్యార్థిపై రాష్ట్రంలో ఏటా రూ.18,479 ఖర్చు చేస్తుండగా.. ఇది జాతీయ స్థాయిలో రూ.12,616గా ఉంది. ఇదే వ్యయం తమిళనాడులో రూ.21,526, తెలంగాణలో రూ.20,590, కర్ణాటకలో రూ.18,756 చొప్పున ఉంది. కేంద్రం 'సమగ్ర మాడ్యులర్‌ సర్వే విద్య-2025' పేరుతో మంగళవారం సర్వే నివేదిక విడుదల చేసింది. కేంద్ర గణాంకాలు, కార్యక్రమాల అమలు మంత్రిత్వశాఖ ఈ ఏడాది ఏప్రిల్‌ నుంచి జూన్‌ వరకు ఈ సర్వేను దేశవ్యాప్తంగా నిర్వహించింది. ఏపీలో గ్రామాలు, పట్టణాల్లో కలిపి 1,828 కుటుంబాలు, 6,516 మందిని సర్వే చేసి వివరాలు సేకరించింది.

గ్రామీణంలోనూ అధికమే..

◆ గ్రామీణ ప్రాంతాల్లో పాఠశాల విద్యకు రాష్ట్రంలో సగటున ఒక్కొక్కరిపై రూ.14,116 వ్యయం చేస్తుండగా, జాతీయ సగటు రూ.8,382గా ఉంది. పట్టణాలకు వచ్చేసరికి రాష్ట్ర సగటు రూ.26,078 కాగా, జాతీయ సగటు 23,470గా ఉంది.

◆ రాష్ట్రంలో అన్ని రకాల ప్రభుత్వేతర విద్యాసంస్థల్లో చదివేవారిలో ఒక్కొక్కరు సరాసరిన రూ.32,683 చొప్పున వ్యయం చేస్తుండగా.. ఇది జాతీయస్థాయిలో రూ.25,002గా ఉంది.

◆ రాష్ట్రంలో కోర్సు ఫీజు, రవాణా, ఏకరూప దుస్తులు, పుస్తకాలు, స్టేషనరీ, ఇతర వాటికి కలిపి ఒక్కో విద్యార్థి సరాసరిన రూ.18,479 వ్యయం చేస్తుండగా.. జాతీయస్థాయిలో రూ.12,616 ఖర్చు చేస్తున్నారు.

◆ పూర్వ ప్రాథమిక విద్యలో చదువు కోసం ఒక్కో విద్యార్థి గ్రామీణ ప్రాంతంలో రూ.9,478 ఖర్చు చేస్తుండగా.. పట్టణాల్లో రూ.17,814 వ్యయం చేస్తున్నారు. గ్రామాలు, పట్టణాలు కలిపి చూస్తే సరాసరిన రూ.12,086 భరిస్తున్నారు.

◆ పూర్వ ప్రాథమిక విద్యలోనూ 3.6%, ప్రాథమిక స్థాయిలో 9.8%, సెకండరీలో 13.5% మంది ప్రైవేటు కోచింగ్‌లకు వెళ్తున్నారు. ఇంటర్‌లో ఇది 6.2%గా ఉంది. అన్ని స్థాయిల్లో కలిపి సరాసరిన కోచింగ్‌లకు ఏపీలో రూ.6,435 వ్యయం చేస్తున్నారు.

◆ విద్య కోసం ఒకే ఆదాయవనరు నుంచి ఖర్చు చేస్తున్నవారు రాష్ట్రంలో 94% ఉండగా.. వీరిలో కుటుంబసభ్యుల ద్వారా నిధులు పొందేవారు 96.1% ఉన్నారు. ప్రభుత్వ ఉపకార వేతనాలతో చదువుకునేవారు 1.1% ఉన్నారు. ఇతరుల సహాయంతో చదువుకునేవారు 2.8%గా ఉన్నారు.

తెలుగు భాషా పురస్కారాల ఎంపికకు కమిటీ

ఈనాడు, అమరావతి: గిడుగు రామ్మూర్తి పంతులు జయంతి సందర్భంగా ఈ నెల 29న నిర్వహించే తెలుగు భాషా దినోత్సవంలో ప్రతిభావంతులైన సాహితీ ప్రముఖులకు అందించే తెలుగు భాషా పురస్కారాల ఎంపిక కోసం ప్రత్యేక కమిటీని ఏర్పాటు చేస్తూ ప్రభుత్వం మంగళవారం ఉత్తర్వులు జారీ చేసింది. అవనిగడ్డ ఎమ్మెల్యే మండలి బుద్ధ ప్రసాద్‌, రాష్ట్ర సృజనాత్మకత, సాంస్కృతిక కమిషన్‌ ఛైర్‌పర్సన్‌ పి.తేజస్వి సభ్యులుగా, కమిషన్‌ ముఖ్య కార్యనిర్వాహక అధికారి ఆర్‌.మల్లికార్జునరావు కన్వీనర్‌గా ప్రభుత్వం కమిటీని ఏర్పాటు చేసింది. ఎంపికైన వారికి పురస్కారం కింద రూ.25 వేల నగదు బహుమతి, జ్ఞాపిక అందజేయనున్నారు.

నూరు నామాలతో పిలిచినా.. వెయ్యి రూపాలతో కొలిచినా.. ఏకదంతాయ నమః



ఆపరేషన్ సిందూర్..వింగ్ కమాండర్ వినాయక్

హైదరాబాద్ ఉప్పుగూడ ప్రాంతంలో 'ఆపరేషన్ సిందూర్' కాన్సెప్ట్‌తో వినాయక మండపాన్ని ఏర్పాటు చేశారు. వినాయకుడు వింగ్ కమాండర్‌గా, మూషికాలను సైనికులుగా తీర్చిదిద్దారు. ఆపరేషన్ సిందూర్‌పై అర గంట వీడియో ప్రదర్శనకు.. మినీ థియేటర్‌నూ ఏర్పాటుచేశారు. – న్యూస్‌టుడే, చార్మినార్

మైక్రోస్కోప్‌లోనే దర్శనం..



వరంగల్‌కు చెందిన అంతర్జాతీయ సూక్ష్మ శిల్పకారుడు మట్టెవాడ అజయ్‌కుమార్ వినాయక చవితి సందర్భంగా.. కనురెప్ప చివరన నాట్యం చేస్తున్న వినాయకుడి సూక్ష్మ శిల్పం చెక్కారు. ఈ సూక్ష్మ శిల్పం 0.37 ఎంఎం (370 మైక్రాన్స్) ఎత్తు ఉంది. దీనిని మైక్రోస్కోప్ ద్వారా మాత్రమే వీక్షించవచ్చు.
- న్యూస్‌టుడే, శివనగర్(వరంగల్)



శిలా నాయకుడు

కొండంత గణపతి నాగర్‌కర్నూల్ జిల్లా తిమ్మాజిపేట మండలం ఆవంచలో కొలువుదీరాడు. 23 అడుగుల ఎత్తు, 15 అడుగుల వెడల్పైన (ఒకే రాతిపై చెక్కిన) ఈ గణపతికి వినాయక చవితి రోజు భక్తులు విశేష పూజలు చేస్తారు. – న్యూస్‌టుడే, తిమ్మాజీపేట

ఖైరతాబాద్ మహా గణపతి



ఖైరతాబాద్ శ్రీ విశ్వశాంతి మహా గణపతి చుట్టూ.. నిర్మాణ సమయంలో కట్టిన కర్రలను మంగళవారం రాత్రి తొలగించారు. దీంతో 69 అడుగుల ఎత్తు, 28 అడుగుల వెడల్పు బడా గణేశుడు సంపూర్ణంగా దర్శనమిస్తున్నాడు. బుధవారం నుంచి పూజలందుకోవడానికి సిద్ధమయ్యాడు.
- ఈనాడు, హైదరాబాద్

కదళీ పూర్ణ ఫల మహా గణపతి!



నంద్యాల పట్టణంలోని శ్రీభగత్ సేవాసమాజ్ ఆధ్వర్యంలో 16 అడుగుల ఎత్తుతో రూపుదిద్దుకున్న ఈ వినాయకుడికి ఓ ప్రత్యేకత ఉంది. 12,108 అరటి కాయలతో ఇలా కదళీ పూర్ణ ఫల మహా గణపతిని తీర్చిదిద్దారు.
- న్యూస్‌టుడే, నంద్యాల బొమ్మలసత్రం

మధుర నాయకా



కాకినాడ నగరంలోని భానుగుడి కూడలి పురుషోత్తమ కాంప్లెక్స్ సమీపంలో శ్రీబాలగణపతి భక్తబృందం సభ్యులు బెల్లంతో 13 అడుగుల పార్వతీ తనయుడి విగ్రహాన్ని తయారు చేశారు. ఇందుకు వెయ్యి కిలోల బెల్లం ఉపయోగించారు. పర్యావరణ హితమే లక్ష్యంగా రూ.లక్ష వరకు వెచ్చించి ఇలా తయారు చేశామని నిర్వాహకులు చింతపల్లి గణేష్, గుబ్బల సూర్యప్రకాష్, ఉంగరాల దుర్గారావు, బంటి సురేష్ తెలిపారు. పూజల అనంతరం ఇదే బెల్లాన్ని భక్తులకు ప్రసాదంగా అందజేస్తామన్నారు.
- ఈనాడు, కాకినాడ

వక్రతుండ 'వజ్ర'కాయ! సూర్యకోటి సమప్రభ!



సుమారు 50 లక్షల అమెరికన్ డైమండ్స్‌తో అలంకరించిన 11 అడుగుల వినాయక విగ్రహం పల్నాడు జిల్లా చిలకలూరిపేట షరాఫ్ బజారులో ఆధ్యాత్మిక వెలుగులు విరజిమ్ముతోంది. గోల్డెన్ యూత్ ఉత్సవ కమిటీ తన 30వ వార్షిక వేడుకల నేపథ్యంలో ఈ ప్రత్యేక ఏర్పాట్లు చేసింది. హైదరాబాద్, కోల్‌కతాకు చెందిన 9 మంది శిల్పులు 15 రోజులు శ్రమించి విగ్రహాన్ని తయారుచేశారు. ఇందుకు రూ.10 లక్షలు వెచ్చించినట్లు కమిటీ కన్వీనర్ పొట్టి వెంకట శివరత్నబాబు తెలిపారు.
- న్యూస్‌టుడే, చిలకలూరిపేట పట్టణం

వయసు పెరుగుతోంది... మనసు ఎదుగుతోందా?

పిల్లలు తింటున్నారా...అనే కాదు... ఎలా ఉంటున్నారో పరిశీలించండి!
స్కూల్‌కు వెళుతున్నారా... అనేకాదు... వారేం నేర్చుకుంటున్నారో ఆరా తీయండి!
మార్కులు బాగా వస్తున్నాయా.. అనే కాదు...
ఏ ఆలోచనలు వారిని చుట్టుముడు తున్నాయో అర్థం చేసుకోండి...
పుట్టినప్పటి నుంచి టీనేజీ వరకు వారిది ఎదిగే వయసే కాదు...
మనసు కూడా... అది ఏ దశలోనైనా గాడి తప్పొచ్చు...



బయటికి వెళ్లి ఇంటికి తిరిగి రాగానే బుడిబుడి అడుగులతో బుజ్జాయి పరిగెత్తుకుంటూ వచ్చి హత్తుకోవడం ప్రతి తండ్రికీ మధురానుభూతే. ఇది రెండేళ్ల వయసున్న పిల్లల్లో ఉండే సాధారణ లక్షణం. అలా కాకుండా దీనికి భిన్నంగా ఆ వయసు చిన్నారులు ప్రవర్తిస్తుంటే... అనుమానించాల్సిందే. అమ్మ, నాన్న ఇంటి నుంచి బయటికి వెలుతున్నా పట్టించుకోకుండా ఉండటం... తిరిగి ఇంటికి వచ్చినా సంతోష పడకపోవడం... అనేది ఆ పిల్లల్లో మానసికంగా ఏదో తేడా జరుగుతోందనే దానికి సంకేతాలు!

అదే పెద్దయ్యాక... పాఠశాలలో పిల్లలందరూ ఆడుకుంటున్నా వారితో కలవకుండా ఒంటరిగా ఉండటం...చదువులో ఉన్నట్టుండి వెనుకబడటం. ఒకసారి ఎక్కువగా తినడం...కొన్ని రోజులు సరిగా తినకపోవడం. ఇతరులను పోల్చుకుంటూ కుంగిపోవడం. ఇవి కూడా మానసిక సమస్యలేనని నిపుణులంటున్నారు.

2 నుంచి 18 ఏళ్ల వరకూ వివిధ దశల్లో కనిపించే మానసిక ప్రవృత్తులను సకాలంలో గుర్తించి అడ్డుకట్ట వేయకపోతే దీర్ఘకాలంలో ఇవి వారిపై తీవ్ర ప్రభావాన్ని చూపిస్తాయి.

- ప్రపంచ ఆరోగ్య సంస్థ అంచనాల ప్రకారం 10-19 ఏళ్ల పిల్లలు ప్రతి ఏడుగురిలో ఒకరికి మానసిక రుగ్మతలున్నాయి. ఒత్తిడి, ఆందోళన, ప్రవర్తనా పరమైన సమస్యలు దీనికి ప్రధాన కారణాలు.

లక్షణాలు ఏంటంటే...

0-3 ఏళ్లు...

6	నెలల వయసొచ్చినా నవ్వలేకపోతే
12	నెలలకు అమ్మ, అత్తలాంటి పదాలు పలకలేకపోతే
18	నెలలకు పూర్తి పదాలు పలకడం రాకపోతే
2	ఏళ్లకు మాటలు రాకపోవడం, కళ్లల్లో కళ్లు పెట్టి చూడలేకపోవడం, ఆడుకునేందుకు అనాసక్తి, కోపం, గుక్కపట్టి ఏడ్వడం, తల్లిదండ్రులతో అనుబంధాన్ని చూపించకపోవడం, వచ్చిన మాటలు, నడక వెనక్కి పోవడం

3-5 ఏళ్లు...

- భాష సక్రమంగా మాట్లాడలేకపోవడం
- కాసేపైనా ఒకే చోట కుదురుగా కూర్చోలేకపోవడం (హైపర్ యాక్టివిటీ)
- పాఠశాలలో పక్కన ఉండే పిల్లల్ని డిస్టర్బ్ చేస్తూ ఉండటం
- ఇతర పిల్లల్ని కొట్టడం... వారితో కలిసి ఆడుకోకుండా ఒంటరిగా ఉండటం
- ఉపాధ్యాయులు చెప్పిన ఆసక్తికర అంశాలను ఇంటి దగ్గర ప్రస్తావించకపోవడం.
- బడికిగానీ, ట్యూషన్‌కుగానీ పంపించేటప్పుడు అమ్మను పట్టుకుని ఏడవడమనేది ఈ వయసులో తగ్గిపోవాలి. కానీ ఇంకా ఎక్కువవుతూ ఉంటే మాత్రం అనుమానించాల్సిందే.

6-12 ఏళ్లు...

ఈ వయసు పిల్లలు బాధను కోపంగా వ్యక్తపరుస్తారు. వారిలో కోపం ఎక్కువగా ఉంటే అది ఒత్తిడికి ప్రతిరూపమని గుర్తించాలి.
- అప్పటి వరకు తరగతి గదిలో మంచి మార్కులు సాధిస్తున్న పిల్లవాడు...ఉన్నట్టుండి వెనకబడటం. స్నేహితులకు దూరం. ● తలనొప్పి, కడుపునొప్పి కాళ్లనొప్పి, తదితర కారణాలు చూపిస్తూ పాఠశాలకు వెళ్లకపోవడం. ● చేతిలో ఏముంటే దాన్ని విసిరికొట్టడం ● రాత్రిళ్లు మేలుకోవడం, పగలు నిద్రపోవడం ● ఒకసారి ఎక్కువగా తినడం, కొన్ని రోజులు సరిగా తినకుండా ఉండటం

13-18 ఏళ్లు...

ఈ వయసు పిల్లలు బాధ, కోపం, సంతోషం, అసహ్యం ఇలా అన్ని రకాల ఎమోషన్స్‌ను ప్రదర్శించగలరు. మానసికంగా అస్థిరత్వం ఉన్న పిల్లలు తమ బాధను తోటి వారి దగ్గర వ్యక్తపరుస్తూ ఉంటారు. తనని తాను బాధించుకోవడం(సెల్ఫ్ హార్మ్) అనేది ఈ వయసులో కనిపిస్తుంది.
- ఒత్తిడికి ఎక్కువగా గురవుతుంటారు
- పాఠశాల హాజరు తక్కువగా ఉంటుంది.
- బాగా మార్కులు వచ్చే పిల్లలకు ఉన్నట్టుండి తక్కువ రావడం
- సమస్య లేకపోయినా ఎక్కువ ఉన్నట్లు ఆందోళనకు గురికావడం
- లావుగా ఉన్నా.. సన్నగా ఉన్నా అనే భావనతో కుంగిపోవడం

తొలి దశలో గుర్తించడమే కీలకం...:
- తల్లిదండ్రులు వారి సమస్యలను పిల్లల ముందు ప్రస్తావించకూడదు.
- పాఠశాల హాజరు తగ్గుతోందంటే అది తీవ్రమైన అంశంగా గుర్తించాలి.
- చిన్న వయసులో ఎక్కువ సమయం పాఠశాలలోనే గడుపుతారు కాబట్టి విద్యార్థుల తీరుపై ఉపాధ్యాయులూ నిఘా పెట్టాలి.
- సమస్యను తొలిదశలో గుర్తిస్తే వెంటనే మానసిక వైద్య నిపుణుడిని లేదా కౌన్సిలర్‌ను కలవాలి.

- విజయ చంద్రారెడ్డి, మానసిక వైద్య నిపుణులు, ఎయిమ్స్

- ఈనాడు, అమరావతి

ఏకదంతుడికి సంజ్ఞలతో పూజలు




విగ్రహానికి తుది మెరుగులు దిద్దుతున్న బధిర సంఘం సభ్యులు

వినాయక ఉత్సవాలు అంటే.. ఊరు ఊరంతా డీజే మోతలు మోగుతాయి. మండపం వద్దకు వెళ్లకుండా మైక్‌లోనే మంత్రాలు వినిపిస్తాయి. ప్రతి ఊరిలో జరిగే తంతే ఇది. ఒడిశాలోని కటక్‌లో మాత్రం ఇందుకు భిన్నంగా వేడుకలు చేస్తారు. స్థానిక తులసీనగర్‌కు చెందిన బధిర సంఘం భక్తులు సంజ్ఞలతో గణనాథున్ని పూజిస్తారు. ఉత్సవాలు జరిగినన్ని రోజులు 350 మందికిపైగా బధిరులు, పెద్దఎత్తున స్థానికులు ఈ పూజల్లో పాల్గొంటారు. మహానది తీరం నుంచి బంకమట్టిని తెచ్చి పర్యావరణహిత విగ్రహాన్ని స్వయంగా తయారు చేసుకుంటారు. అలంకరణ, ప్రసాదాల తయారీ తదితర పనులన్నీ సంఘం సభ్యులే చేసుకుంటారు. ఇలా 15 ఏళ్లుగా క్రమం తప్పకుండా వేడుకలు నిష్ఠగా నిర్వహిస్తున్నారు. ఉత్సవాల్లో స్థానికులు భాగస్వాములై, ఆర్థికంగా చేయూత ఇస్తారు. రోజువారీ పూజల షెడ్యూల్, కార్యక్రమాల వివరాలనూ మైక్‌లో చెప్పరు.. మండపం వద్ద ఏర్పాటు చేసే బోర్డుపై రాస్తారు.

– న్యూస్‌టుడే, భువనేశ్వర్

జైసల్మేర్‌లో జురాసిక్ పార్కు!



బయల్పడిన ఫైటోసార్ శిలాజం

ప్రాచీన కాలంలో మన దేశంలో డైనోసార్లు, వాటిని పోలిన జంతువులు విరివిగా సంచరించాయని చెప్పేందుకు మరికొన్ని బలమైన ఆనవాళ్లు లభించాయి. రాజస్థాన్‌లోని జైసల్మేర్ సమీప మెఘా గ్రామంలో 20 కోట్ల సంవత్సరాల క్రితం నాటి ఫైటోసార్ శిలాజాన్ని భూగర్భజలశాస్త్రవేత్త డాక్టర్ నారాయణ్‌దాస్ ఇంఖియా నేతృత్వంలోని బృందం తాజాగా గుర్తించింది. 1.5 నుంచి 2 మీటర్ల పొడవున్న ఈ శిలాజం.. మొసలి ఆకృతిని పోలి ఉంది. జురాసిక్ యుగంలో ఇక్కడ డైనోసార్లతో పాటు సరీసృపాలు సంచరించాయని, ఫైటోసార్ జీవులు పరిణామ క్రమంలో ఇప్పుడు మనం చూస్తున్న మొసళ్లుగా రూపాంతరం చెంది ఉంటాయని శాస్త్రవేత్తలు అభిప్రాయపడుతున్నారు. నీటిలోనూ నేలపైన జీవించే ఉభయచర జీవి ఈ ఫైటోసార్. కోట్ల ఏళ్ల క్రితం ఇక్కడ ప్రవహించిన నదిలో లభించే చేపలను ఆహారంగా తీసుకుంటూ జీవించి ఉంటుందని అంచనా వేస్తున్నారు. 2023లోనూ డైనోసార్‌కు చెందిన శిలాజ అండాన్ని జైసల్మేర్ ప్రాంతంలో నారాయణ్‌దాస్ గుర్తించారు. 2018లో జియోలాజికల్ సర్వే ఆఫ్ ఇండియా శాస్త్రవేత్తలు ప్రపంచంలోనే అత్యంత ప్రాచీనమైన డైనోసార్ శిలాజాన్ని గుర్తించారు.

–ఈనాడు ప్రత్యేక విభాగం

భార్య ఉంగరాల కోసం.. 18 టన్నుల చెత్త వెదికాడు



కెనడాలోని బ్రిటిష్ కొలంబియాలో ఓ వ్యక్తి తన భార్య పోగొట్టుకున్న పెళ్లి ఉంగరాల కోసం దాదాపు 18 టన్నుల చెత్తను జల్లెడ పట్టాడు. స్టీవ్‌వాన్ ఎసెల్‌డిక్, జీన్నీన్ దంపతులు ఓరోజు తమ తోటలో ఉన్నపుడు కిందపడిన పాప్‌కార్న్‌ను సేకరించి చెత్తలో వేసే సమయంలో ఆమె చేతి ఉంగరాలు పడిపోయాయి. పారిశుధ్య కార్మికులు చెత్త బ్యాగును తీసుకెళ్లిపోయాక ఈ విషయాన్ని గుర్తించారు. ఆ చెత్త అప్పటికే డంపింగ్‌యార్డుకు చేరింది. మరుసటిరోజు అక్కడకు వెళ్లిన స్టీవ్‌వాన్.. కాంట్రాక్టరు అనుమతితో గ్లౌజులు ధరించి, పార చేతబట్టి ఉంగరాల కోసం వేట మొదలుపెట్టాడు. ఈ ప్రయత్నం ఫలించకపోవచ్చని అక్కడున్నవారు సందేహం వ్యక్తం చేసినా ఆయన వెనక్కి తగ్గలేదు. చివరకు స్టీవ్‌వాన్ ఉంగరాలను గుర్తించడంతో భర్త ప్రేమకు జీన్నీన్ పొంగిపోయింది.

– ఇంటర్నెట్ డెస్క్

ఇంటికో గ్రంథాలయం.. అగ్గిరాములే ఆదర్శం



ఆయన చదువుకుంది ఆరో తరగతే. సేకరించిన పుస్తకాలు రెండు వేలకు పైగానే. పాత ఇల్లయినా. ఇంట్లో తన కోసం గ్రంథాలయమే ఏర్పాటు చేసుకున్నారు. ఇంతగా పుస్తక పఠనం, సేకరణను అలవాటుగా చేసుకున్న ఆయన పేరు చెరుకు అగ్గిరాములు. యాదాద్రి భువనగిరి జిల్లా మోత్కూరు పురపాలిక పరిధిలోని కొండగడప గ్రామం. మోత్కూరులో ఆరో తరగతి వరకు చదువుకున్న ఆయన 1973లో చెన్నై వెళ్లారు. అప్పట్లో రామస్వామి పెరియార్, అన్నాదొరై, ఎంజీఆర్‌ల సభలకు వెళ్లి వారి ప్రసంగాల ద్వారా ప్రభావితమయ్యారు. కమ్యూనిస్టు నాయకులు రాసిన అనేక పుస్తకాలు, వారి జీవిత చరిత్రలు సేకరించి, చదివారు. వాటిని ఇంట్లో బీరువా నిండా, ట్రంకు పెట్టెల్లో దాచిపెట్టారు. ఆసక్తి ఉన్న గ్రామస్థులకు అగ్గిరాములు పుస్తకాలను ఇస్తుంటారు. దేశం విజ్ఞానదాయకంగా మారాలంటే.. ప్రతి ఇంట్లో ఒక గ్రంథాలయం ఉండాలని మేధావులు చెబుతుంటారు. అగ్గిరాములే ఇందుకు ఆదర్శం అంటే అతిశయోక్తి కాదు.

– న్యూస్‌టుడే, మోత్కూరు

మృత కణాలకు పునరుజ్జీవించే సామర్థ్యాలు

జీవులలోని మృత కణాలు తిరిగి జీవించే అంతర్నిర్మిత సహజ సామర్థ్యాన్ని కలిగి ఉన్నాయని హైదరాబాద్‌లోని సెంటర్ ఫర్ సెల్యూలార్ అండ్ మాలిక్యులర్ బయాలజీ(సీసీఎంబీ) శాస్త్రవేత్తలు గుర్తించారు. స్వీయ పునరుజ్జీవం, కణజాల మరమ్మతు, పునరుత్పత్తి ప్రక్రియను ఎలా వేగవంతం చేస్తాయో వారు ఆవిష్కరించారు. 'ప్రోగ్రామ్డ్ సెల్ రివైవల్' అని పిలిచే ఈ విధానం దెబ్బతిన్న కణాలు.. కణజాలాన్ని తిరిగి పొందేందుకు, పునరుత్పత్తి చేసేందుకు వీలు కల్పిస్తుందని తెలియజేశారు. డాక్టర్ సంతోష్ చౌహాన్ నేతృతంలోని శాస్త్రవేత్తల బృందం వివిధ జీవులపై పరీక్షలు జరిపింది. ఎలుకల్లో చర్మ గాయాలు వేగంగా తగ్గడం, రసాయన, వేడి, అతినీలలోహిత కాంతి వంటి తీవ్ర కంటి గాయాలు నయమవడాన్ని గుర్తించారు. కప్పల తోక పునరుత్పత్తి ప్రేరేపితమైందని, పురుగులలో నరాల మరమ్మతు, ఈగల్లో రక్త మూల కణాల ఉత్పత్తి మెరుగుపడిందని నిరూపించారు. ఈ అధ్యయనం తాజాగా యూరోపియన్ జర్నల్ ఈఎంబీవోలో ప్రచురితమైంది. అయితే, ఈ పునరుజ్జీవ ప్రక్రియ క్యాన్సర్ విషయంలో ప్రమాదకరంగా ఉండవచ్చని శాస్త్రవేత్తలు హెచ్చరించారు. 'చాలా క్యాన్సర్ కణాలు మూలకణ లక్షణాలతో తిరిగి బతికి కణితులను మరింత దూకుడుగా మార్చే అవకాశముంది' అని చౌహాన్ వివరించారు.

– ఈనాడు, హైదరాబాద్

విఘ్ననాయక.. విజయదాయక!

ప్రగతి పరిఢవిల్లేలా.. దీవించు దేవా



వినాయక చవితి.. విఘ్నాలు తొలగించే వేడుక.. ప్రగతి కాంతులు దరి చేర్చే వేదిక.. కూటమి ప్రభుత్వం అధికారం చేపట్టాక... నిరుడు వినాయక చవితి స్ఫూర్తితో ప్రగతి పనులు మొదలెట్టారు. అవి సాగుతున్నా మరింత ఊపందుకోవాల్సి ఉంది. నేటి గణేశ్ చతుర్థి వేళ.. గణనాథుడి దీవెనలతో ప్రగతి వెల్లివిరిసేలా ప్రజాప్రతినిధులు, అధికారులు కృషి చేయాలి.

❖ **ఆశలకు "రెక్కలు":** గన్నవరం విమానాశ్రయంలో నూతన టెర్మినల్ భవన నిర్మాణం 2022కే పూర్తి చేయాల్సి ఉంది. కానీ గత వైకాపా ప్రభుత్వ నిర్లక్ష్యంతో పనులు నిలిచిపోయాయి. అంతర్జాతీయ సర్వీసులకు అనుమతులున్నా అవకాశం లేదు. రూ. 450 కోట్లతో చేపట్టిన నిర్మాణ పనులు మరింత వేగవంతం కావాలి.

❖ **ముంపు ముప్పు వీడేలా:** విజయవాడ నగరం చిన్న వర్షానికే మునుగుతోంది. ప్రజలు అవస్థలు పడుతున్నారు. రూ.450 కోట్లతో చేపట్టిన వాన నీటి కాలువల నిర్మాణం ఇప్పటికి 50 శాతం పూర్తి చేశారు. దృష్టి పెట్టి వేగంగా పూర్తి చేయాలి.

❖ **ఆక్రమణలు వీడితేనే అభయం:** కూటమి చొరవతో బుడమేరు వరద నుంచి విజయవాడ వేగంగా బయటికి వచ్చింది. మళ్లీ పునరావృతం కాకుండా.. గండి పడిన ప్రాంతంలో 500 మీటర్ల మేర రక్షణ గోడ నిర్మించారు. గట్లు బలోపేతం చేశారు. పూడికలు తొలగించి ప్రవాహం సాఫీగా సాగేలా చేశారు. గట్టు పొడవునా ఆక్రమణలు తొలగిస్తే పూర్తి స్థాయి రక్షణ దొరుకుతుంది.

కలల రాజధాని.. అమరావతి


వైకాపా మూడు రాజధానులని ఐదేళ్లు కాలయాపన చేసింది. కూటమి సర్కారు అధికారం చేపట్టాక పనులు ఊపందుకున్నాయి. ప్రస్తుతం రూ. 50 వేల కోట్లతో రాజధాని నిర్మాణ పనులు చేపడుతున్నారు. ఈ పనులు సైతం మరింత వేగవంతం చేయాలి.

ఉపాధికి "మల్లవల్లి"తో ఊతం

కూటమి సర్కారు మల్లవల్లిలో 370 పరిశ్రమలకు స్థలాలు కేటాయించింది. రెండేళ్లలో పరిశ్రమల్లో ఉత్పత్తి మొదలు పెట్టాలనేది లక్ష్యం. సకాలంలో పూర్తి చేస్తే 10 వేల మందికి ఉపాధి దొరుకుతుంది. జగ్గయ్యపేట, నందిగామ, తిరువూరు పరిధిలో రక్షణ రంగ విడి పరికరాలు పరిశ్రమలకు స్థలం సేకరిస్తున్నారు. పూర్తి చేస్తే వేల మందికి ఉద్యోగాలు రానున్నాయి.

సాఫీగా సాగిపోదాం...

పశ్చిమ బైపాస్ పనులు వేగంగా సాగుతున్నాయి. ఎన్‌హెచ్-65ను పున్నమి ఘాట్ వరకు విస్తరించేలా పచ్చజెండా ఊపారు. దీని డీపీఆర్ పనుల్లో అధికారులు నిమగ్నం అయ్యారు. ఓఆర్ఆర్ పనులు భూముల సర్వే దశ దాటాయి. ఎన్‌హెచ్-216 డీపీఆర్ దిశగా సాగుతోంది. గ్రీన్‌ఫీల్డ్ హైవే పనులకు అడుగులు పడుతున్నాయి. వివిధ దశల్లో ఉన్న జాతీయ రహదారులన్నీ వేగంగా అందుబాటులోకి తీసుకురావాలి. – ఈనాడు, అమరావతి



దుర్గాఘాట్‌లో మౌలిక వసతులపై దృష్టి

ఇంద్రకీలాద్రి, న్యూస్‌టుడే : దుర్గాఘాట్‌లో మౌలిక వసతులపై అధికారులు దృష్టి పెట్టాలని ఈవో శీనానాయక్ అన్నారు. దసరా ఉత్సవాలు సమీపిస్తున్న వేళ అభివృద్ధి పనులను ఈవో మంగళవారం పరిశీలించారు. దుర్గాఘాట్‌లో పారిశుద్ధ్యం, మరుగుదొడ్లు, సబ్ వేలో భక్తులకు సమస్యలు తలెత్తకుండా చూడాలని చెప్పారు. ఘాట్‌రోడ్డులో పగుళ్లకు మరమ్మతులు చేయాలని సూచించారు. అన్నప్రసాదం స్వీకరించే భక్తులు బయోమెట్రిక్ ద్వారా వేలిముద్రలు నమోదు చేస్తున్నారా అన్న విషయాన్ని పరిశీలించారు. కనకదుర్గానగర్ మార్గంలో బీటీరోడ్డు పనులు చేస్తున్నందున ఘాట్‌రోడ్డులో మాత్రమే భక్తులు తమ వాహనాలను నిలిపి.. అమ్మవారిని దర్శించుకోవాలని సూచించారు. ఏసీ రంగారావు, ఈఈ రాంబాబు, డీఈలు అశోక్ రవీంద్ర పాల్గొన్నారు.

ఈనాడు
అమరావతి
ఎన్టీఆర్

పశ్చిమ బైపాస్‌పై.. సౌరభం

★ కృష్ణా బ్రిడ్జి మధ్యలో సౌరపలకల ఏర్పాటు
★ రోజుకు 3 మెగావాట్ల విద్యుత్తు ఉత్పత్తి...

ఈనాడు, అమరావతి

"పశ్చిమ బైపాస్.. సౌర కాంతులు వెదజల్లనుంది. ఎన్‌హెచ్ఏఐకి విద్యుత్తు భారం తగ్గిస్తూనే... ఇతర ఎన్‌హెచ్ ప్రాజెక్టులకు వినియోగించుకునేలా సౌర విద్యుత్తు ప్రాజెక్టును పట్టాలెక్కించనున్నారు. ప్యాకేజీ-4లో భాగంగా నిర్మించిన కృష్ణా బ్రిడ్జి మధ్యలో సౌర పలకలు ఏర్పాటు చేయనున్నారు."



కొండవీటివాగు సమీపంలో బైపాస్‌పై..



విద్యుత్తు నిల్వకు ఉంచిన పరికరాలు

దేశంలోనే మొదటి ప్రాజెక్టుగా..

ప్యాకేజీ-4లో గొల్లపూడి నుంచి కాజ వరకు 17 కి.మీ. మేర వెస్ట్ బైపాస్ నిర్మిస్తున్నారు. ఇందులో పాలవాగు, కొండవీటి వాగు, కృష్ణా నది మీద 3.35 కి.మీ. మేర వంతెనలు నిర్మించారు. వీటిపైన సౌర విద్యుత్తు సౌకర్యం కల్పించేందుకు అధికారులు రూ.15 కోట్లతో సౌర విద్యుత్తు ప్రాజెక్టును పట్టాలెక్కిస్తున్నారు. గొల్లపూడి దాటాక కృష్ణా నదిపై నిర్మించిన కృష్ణా బ్రిడ్జిపై రహదారి మధ్యలో నాలుగు మీటర్ల వెడల్పు స్థలంలో వరుసగా సౌర పలకలు, విద్యుత్తు నిల్వ చేసే పరికరాలు అమర్చనున్నారు. ఈ ప్రాజెక్టు పూర్తి చేస్తే దేశంలో ఓ నదిపై నిర్మించిన వంతెన మధ్యలో సౌర పలకల ఏర్పాటు, విద్యుత్తు సరఫరా చేసే మొదటి ప్రాజెక్టుగా రికార్డులకెక్కుతుంది. ఈ ఆలోచనతో స్థలం కూడా వృథా కాదు.

★ రహదారిపై మొత్తం 5 పైవంతెనలు, రెండు అండర్ పాస్‌లు ఉన్నాయి. వీటికి కూడా సౌర విద్యుత్తు సరఫరా చేయడానికి ఇప్పటికే వీటిపై రహదారి మధ్యలో సౌర పలకలు, విద్యుత్తు నిల్వ పరికరాలు ఏర్పాటు చేశారు. త్వరలో విద్యుత్తు సదుపాయం కల్పించేందుకు సన్నాహాలు చేస్తున్నారు.

ఇటు ఆదా.. అటు ఆదాయం.. గ్రిడ్ ద్వారా నెలకు రూ.10 లక్షల బిల్లు వస్తుంది. పలకల ద్వారా రోజుకు 3 మెగావాట్ల విద్యుత్తు ఉత్పత్తి అవుతుంది. అక్కడి విద్యుత్తు అవసరాలకు ఒక మెగావాట్ సరిపోతోంది. మిగిలిన రెండు మెగావాట్లను గ్రిడ్‌కు విక్రయిస్తే నెలకు రూ.20 లక్షల ఆదాయం వస్తుంది. లేదా ఇదే స్థాయిలో రెండు ప్రాజెక్టుల అవసరాలకు వాడుకోవచ్చు. ఇక్కడి విద్యుత్తు భారం, ఆదాయం కలిపి మొత్తమ్మీద ఎన్‌హెచ్‌కు రూ.30 లక్షల లబ్ధి చేకూరనుంది.

పార్వతి పుత్ర...



వినాయక చవితిని పురస్కరించుకుని విజయవాడ కెనాల్‌రోడ్డులోని గణపతి ఆలయం మంగళవారం రాత్రి విద్యుద్దీపకాంతులతో మెరిసిపోతోంది. – ఈనాడు అమరావతి



జగ్గయ్యపేట విజ్ఞాన్ పాఠశాలలో విద్యార్థులు వినాయకుడి ఆకారంలో కూర్చొని అలరించారు. ఉపాధ్యాయులు అందరు కలిసి వేడుకలు నిర్వహించారు. -జగ్గయ్యపేట గ్రామీణం, న్యూస్‌టుడే

ప్రకృతి మిత్ర...



పర్యావరణ పరిరక్షణకు మట్టి గణపతులను పూజించేందుకు ఎక్కువ మంది ఆసక్తి చూపిస్తున్నారు. నిమజ్జనం చేసిన తర్వాత కూడా ప్రకృతికి మేలు చేసేలా విత్తనాలను మట్టిలో కలిపి విగ్రహాలను చేస్తున్నారు. ఇందిరాగాంధీ మున్సిపల్ స్టేడియంలో విద్యార్థులు రూపొందించిన మట్టి ప్రతిమలే ఇవి. - ఈనాడు అమరావతి

హైవే అండర్‌పాస్ వంతెనపై రోడ్డు నిర్మాణం



నందిగామ వద్ద కొనసాగుతున్న పనులు

ఈనాడు కథనాలకు స్పందన

నందిగామ, న్యూస్‌టుడే : నందిగామ వద్ద జాతీయ రహదారిపై కొన్ని నెలలుగా నిలిచిన వంతెనపై అప్రోచ్ రోడ్డు నిర్మాణ పనులు ప్రారంభించారు. ఉప గుత్తేదారుకి బిల్లులు ఇవ్వక పోవడంతో పనులు నిలిపివేసారు. దీనిపై 'ఈనాడు'లో వరుసగా కథనాలు ప్రచురితం కావడంతో జాతీయ రహదారి అథారిటీ అధికారులు స్పందించి గుత్తేదారుతో పనులు పునః ప్రారంభించారు. వంతెనకు అనుసంధానంగా అప్రోచ్ రోడ్లు నిర్మించక వాహనదారులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. ఈ ప్రాంతంలో విజయవాడ- హైదరాబాద్ జాతీయ రహదారిపై కిలోమీటరు పొడవున రోడ్డు నిర్మించాల్సి ఉంది. ఈ పరిస్థితుల్లో సర్వీసు రోడ్డుపై వాహనాల రాకపోకలకు ఇబ్బందిగా మారింది. 'ఈనాడు'లో కథనాలు రావటంతో ఎట్టకేలకు అధికారులు యుద్ధప్రాతిపదికన పనులు చేయిస్తున్నారు. అప్రోచ్ రోడ్లు నిర్మిస్తే నేరుగా వంతెనపై నుంచి జాతీయ రహదారిపై వాహనాలు దూసుకెళ్లనున్నాయి.

గుత్తగా ఇచ్చుకో.. గుట్టుగా దోచుకో!

సీఆర్డీఏ రహదారుల టెండర్లలో ప్రతిష్టంభన ★ గడువు పొడిగింపుతో కాలయాపన

ఈనాడు, అమరావతి



"విజయవాడ, గుంటూరు నగరాల్లో ట్రాఫిక్ సమస్య తగ్గించేందుకు.. శివారు ప్రాంతాల్లో రహదారుల అభివృద్ధికి పిలిచిన టెండర్లలో సీఆర్డీఏ వైఖరితో ప్రతిష్టంభన నెలకొంది. నిధులున్నా.. సద్వినియోగం చేసుకోవడంలో తప్పటడుగులు వేస్తోంది. టెండర్ల గడువు ముగిసినా మీనమేషాలు లెక్కిస్తున్నారు. టెండర్లు పిలిచే ముందు ఒక వైఖరి.. ఆ తర్వాత మరో వైఖరితో అభాసుపాలవుతోంది. పెద్ద గుత్తేదారుల మేలుకే తాత్సారం చేస్తున్నారనే విమర్శలు వస్తున్నాయి."

రూ.109.91 కోట్లతో... విజయవాడ నగరంపై ట్రాఫిక్ ఒత్తిడి తగ్గించేలా సీఆర్డీఏ అధికారులు శివారు ప్రాంతాల్లో రహదారుల విస్తరణ చేపట్టారు. ప్రధాన మార్గాలకు మూడు ప్రత్యామ్నాయ రోడ్ల అభివృద్ధికి ఇటీవల టెండర్లు పిలిచారు. ★ రూ.26.51 కోట్లతో బల్లెంవారివీధి నుంచి నిడమానూరు మెయిన్‌రోడ్డు కూడలి వరకు రహదారి విస్తరణ ★ రూ.25.52 కోట్లతో మహానాడు రోడ్డును బల్లెంవారివీధి నుంచి పోరంకి-నిడమానూరు మెయిన్ రోడ్డు వరకు ★ రూ.22.96 కోట్లతో బందరు రోడ్డు నుంచి హైటెన్షన్ లైన్ రోడ్డు కూడలి వరకు విస్తరణకు టెండర్లు పిలిచారు. వీటికి ఈనెల 11 గడువుగా నిర్దేశించారు. అదే రోజు సాయంత్రం సాంకేతిక బిడ్లను తెరవాలి. కానీ.. తెరవకుండానే గడువును 19 వరకు.. మళ్లీ 29 వరకు పొడిగించారు.

★ గుంటూరులోనూ ట్రాఫిక్ ఒత్తిడి తగ్గించేలా ఇన్నర్ రింగ్ రోడ్డు పొడిగిస్తున్నారు. జేకేసీ కాలేజీ నుంచి పెదపలకలూరు రోడ్డు వరకు మూడో దశ విస్తరణకు రూ.34.87 కోట్లతో సీఆర్డీఏ టెండర్లు పిలిచింది. టెండర్ల దాఖలుకు ఈనెల 7 తుది గడువుగా నిర్దేశించారు. అదేరోజు సాయంత్రం సాంకేతిక బిడ్లను తెరిచారు. ఆరు సంస్థలు బిడ్లు వేశాయి. వీటిని మదింపు చేసి అర్హత సంస్థవి.. ఫైనాన్షియల్ బిడ్లు తెరవాలి. అందులో ఎల్1గా నిలిచిన సంస్థకు పనులు అప్పగిస్తే.. ఇప్పటికే మొదలయ్యేవి. కానీ ఈ ప్రక్రియ నిలిచింది.

పనుల విలీనానికే జాప్యం... ఈ నాలుగు పనులను విలీనం చేసి ఒకటే పని కింద పెద్ద గుత్తేదారుకు కట్టబెట్టేందుకే రంగం సిద్ధమవుతున్నట్లు తెలిసింది. ఇందులో భాగంగానే ఉద్దేశపూర్వకంగా పనులు ఆపినట్లు సమాచారం. ఇది గుత్తాధిపత్యానికి దారి తీస్తుందని చిన్న గుత్తేదారులు ఆగ్రహిస్తున్నారు. ముందు వేర్వేరుగా టెండర్లు పిలిచి.. ఆ తర్వాత విలీనానికి యత్నించడం ఎంత వరకు సబబని ప్రశ్నిస్తున్నారు. తమకు కూడా అమరావతి పనులు చేసేందుకు అవకాశం కల్పించాలని కోరుతున్నారు.

కొనసాగుతున్న వరద

ఎన్టీఆర్ కలెక్టరేట్, న్యూస్‌టుడే : కృష్ణా నది దిగువున వరద ప్రవాహం మంగళవారం స్వల్ప హెచ్చు, తగ్గుల మధ్య కొనసాగింది. ఉదయం 6 గంటలకు ఎగువ నుంచి 1,75,578 క్యూసెక్కులు రాగా, సముద్రంలోకి 1,67,175 క్యూసెక్కులు విడుదల చేశారు. సాయంత్రం 5 గంటలకు 1,61,578 క్యూసెక్కులు రాగా.. సముద్రంలోకి 1,43,175 క్యూసెక్కులు వదిలారు. రాత్రి 8 గంటలకు ఎగువ నుంచి 1,70,075 క్యూసెక్కులు రాగా, 15 గేట్లను నాలుగు అడుగులు, 54 గేట్లను మూడు అడుగులు మేర ఎత్తారు. (ఒక గేటు మూసి ఉంది). సముద్రంలోకి 1,52,175 క్యూసెక్కులు విడుదల చేశారు. పంట కాల్వలకు 17,900 క్యూసెక్కులు ఇస్తున్నారు. కృష్ణా తూర్పు ప్రధాన కాలువకు 10,187, పశ్చిమకు 7,713 క్యూసెక్కులు, కృష్ణా తూర్పు ప్రధాన కాలువ నుంచి రైవస్ 5,017, బందరు 1,911, కేఈబీ 1,802, ఏలూరు కాలువలకు 1,457 క్యూసెక్కులు ఇచ్చారు.

వాట్సాప్‌లో చలానా పంపి..

రూ.1.78 లక్షలు కొట్టేశారు..

విజయవాడ నేరవార్తలు : వాట్సాప్‌లో వాహన చలానా రాగా.. చూద్దామని క్లిక్ చేశారు. అంతే క్రెడిట్ కార్డుల నుంచి మూడు విడతల్లో రూ.1.78 లక్షలు మాయమయ్యాయి. అజిత్‌సింగ్‌నగర్ పీఎస్ పరిధిలోని నందమూరినగర్‌కు చెందిన యువకుడు (35) వ్యాపారం చేస్తుంటారు. ఆయనకు ఈ నెల 22న వాట్సాప్‌లో ఇ-చలానా అని వచ్చింది. దాన్ని క్లిక్ చేశారు. తర్వాత రోజు అతని రెండు క్రెడిట్ కార్డుల నుంచి రూ. 47,097లు, రూ. 65,777, రూ. 65,777లు చొప్పున డబ్బులు పోయాయి. వెంటనే కార్డులను బ్లాక్ చేయించారు.

ఏపీకే ఫైల్ వల్లే ఇలా... సైబర్ నేరగాళ్లు చలానా పేరుతో వైరస్‌తో కూడిన ఏపీకే ఫైల్ సృష్టించి ఆయనకు పంపించారు. దాన్ని క్లిక్ చేయగానే అతని చరవాణి.. సైబర్ నేరగాళ్ల ఆధీనంలోకి వెళ్లిపోయింది. దానిలో నిక్షిప్తమైన సమాచారం మేరకు క్రెడిట్ కార్డులతో లావాదేవీలు చేశారు. ఇది గుర్తించకపోయి ఉంటే.. మరిన్ని లావాదేవీలు చేసేవారని పోలీసులు వెల్లడించారు. వాహన చలానా పేరుతో వాట్సాప్‌కు సమాచారం వస్తే జాగ్రత్తగా ఉండాలని వారు హెచ్చరిస్తున్నారు.

తిరుపతమ్మ హుండీల ఆదాయం రూ.94.58 లక్షలు

పెనుగంచిప్రోలు, న్యూస్‌టుడే: పెనుగంచిప్రోలు తిరుపతమ్మ అమ్మవారి ఆలయంలోని హుండీల ఆదాయాన్ని మంగళవారం లెక్కించినట్లు ఈవో కిశోర్‌కుమార్ తెలిపారు. 79 రోజుల వ్యవధికి గాను రూ. 94,58,457 నగదు, 158 గ్రాముల బంగారం, 1.180 కిలోల వెండి, వివిధ దేశాలకు చెందిన 930 విదేశీ కరెన్సీ నోట్లు వచ్చినట్లు ఆయన పేర్కొన్నారు. జిల్లా దేవాదాయశాఖ ఉప కమిషనర్ ఎన్. షణ్ముకం పర్యవేక్షణలో హుండీల ఆదాయాన్ని లెక్కించారు. ఆలయ ఛైర్మన్ జంగాల శ్రీనివాసరావు, పాలకవర్గ సభ్యులు బెజవాడ శ్రీనివాసరావు, వెంకటరమణ, ఏఈవో జంగం శ్రీనివాసరావు, సిబ్బంది పాల్గొన్నారు.

పర్యావరణ గణపయ్యకు జేజేలు

విజయవాడ క్రీడలు, న్యూస్‌టుడే: పర్యావరణ పరిరక్షణ అందరి బాధ్యత అని ఈ విషయంపై విద్యార్థులు చిన్నప్పటి నుంచే అవగాహన కల్పించాల్సిన అవసరం ఉందని జిల్లా ఇన్‌ఛార్జి మంత్రి సత్యకుమార్ యాదవ్ పేర్కొన్నారు. మంగళవారం విజయవాడ ఐజీఎంసీ స్టేడియంలో జిల్లా అధికార యంత్రాంగం, వీఎంసీ, రాష్ట్ర కాలుష్య నియంత్రణ మండలి సంయుక్త ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన పర్యావరణహిత మట్టి గణపతి ప్రతిమల తయారీ కార్యక్రమంలో ఆయన పాల్గొన్నారు. మంత్రి మాట్లాడుతూ మండపాల ఏర్పాటుకు ఉచితంగా అనుమతులతో పాటు ఉచిత విద్యుత్తును రాష్ట్ర ప్రభుత్వం అందజేస్తుందన్నారు. ఉత్సవ కమిటీలు, మండపాల నిర్వాహకులు పండగ పవిత్ర కాపాడుకుంటూ కార్యక్రమాలు నిర్వహించాలన్నారు. మట్టి గణపతి ప్రతిమల తయారీలో వరల్డ్ బుక్ ఆఫ్ రికార్డ్స్(డబ్ల్యూబీఆర్-లండన్)లో నమోదైన జిల్లా అధికార యంత్రాగానికి అభినందనలు తెలిపారు. ★ ఎంపీ కేశినేని శివనాథ్ మాట్లాడుతూ.. విజయవాడ అంటేనే వైబ్రెంట్ నగరమని.. చెత్త రహిత నగరం కేటగిరీల్లో నగరానికి సెవెన్ స్టార్ రేటింగ్ లభించిందని, ప్రజా చైతన్యం, సమష్టి కృషివల్లే ఇది సాధ్యమైందన్నారు. ★ ఎమ్మెల్యే బొండా ఉమామహేశ్వరరావు మాట్లాడుతూ ప్రతిమల తయారీలో ప్లాస్టర్ ఆఫ్ పారిస్, కృత్రిమ రంగులు వంటి వాటి వినియోగం బాగా తగ్గిందని.. దీనిని జీరో చేయాల్సిన అవసరముందన్నారు. ★ కాలుష్య నియంత్రణ మండలి ఛైర్మన్ పి. కృష్ణయ్య మాట్లాడుతూ విశాఖ, విజయవాడలో వాయు కాలుష్యాన్ని తగ్గించేందుకు కృషి చేస్తున్నామన్నారు. ★ కలెక్టర్ జి. లక్ష్మీశ మాట్లాడుతూ చవితి ఉత్సవాల్లో మట్టి ప్రతిమలను పూజించి ప్రకృతి శోభతో ఆధ్యాత్మిక వాతావరణంలో పండగ జరుపుకొనేలా ప్రోత్సహించేందుకు ఈ కార్యక్రమాన్ని నిర్వహించామన్నారు. ★ నగర పోలీస్ కమిషనర్ ఎస్.వి. రాజశేఖరబాబు మాట్లాడుతూ మండపాల ఏర్పాటుకు ఎలాంటి రుసుము లేకుండా అనుమతులు మంజూరు చేస్తున్నామని, ఇందుకు ప్రత్యేక యాప్ అందుబాటులో ఉందన్నారు.

★ సంయుక్త కలెక్టర్ ఎస్.ఇలక్కియ, వీఎంసీ కమిషనర్ ధ్యానచంద్ర, ఆర్డీవో కావూరి చైతన్య, వీసీబీ ఈఈ ఇ.శ్రీనివాసరావు, వీఎంసీ అదనపు కమిషనర్ డి.చంద్రశేఖర్, స్థానిక నేతలు, విద్యార్థులు, పలు శాఖల అధికారులు తదితరులు పాల్గొన్నారు.



విద్యార్థులతో కలిసి మట్టి గణపతి ప్రతిమలు చూపుతున్న కలెక్టర్ లక్ష్మీశ



కొబ్బరి ఆకులతో గణపతి

పోలీసుల అదుపులో హవేలీ గ్యాంగ్

కృష్ణలంక, న్యూస్‌టుడే: పలు నేరాలతో సంబంధం ఉన్న మధ్యప్రదేశ్‌కు చెందిన హవేలీ గ్యాంగ్‌ను పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. పోలీసుల సమాచారం మేరకు మంగళవారం బాగా పొద్దుపోయిన తరువాత సుమారు 10 మందికి పైగా ఉన్న గ్యాంగ్ సభ్యులు పీఎన్‌బీఎస్‌లో సంచరిస్తున్నారన్న సమాచారంతో కృష్ణలంక పోలీసులు అప్రమత్తమై వారిని గుర్తించారు. ఏలూరు జిల్లా ముసునూరు పోలీసులకు వారిని అప్పగించినట్లు సమాచారం.

అటు వెళ్లొద్దు.. ఇటు మళ్లొచ్చు..!

సూర్యారావుపేట, న్యూస్‌టుడే

ఎఫ్ఎం రేడియో ద్వారా ట్రాఫిక్ సమాచారం

'హలో.. హలో... శ్రోతలారా... బెంజిసర్కిల్ వద్ద భారీగా ట్రాఫిక్ నిలిచిపోయింది. అటు వైపు వెళ్లే వారు ప్రత్యామ్నాయ రహదారులను చూసుకోవడం మంచిది. పటమట వైపు వెళ్లే వారు... కృష్ణలంక జాతీయ రహదారి మీదుగా రామలింగేశ్వర్ నగర్ నుంచి మళ్లితే సులువుగా గమ్యం చేరవచ్చు..' అంటూ ఎఫ్ఎం రేడియోలో తాజా ట్రాఫిక్ సమాచారం ప్రజలకు అందించేలా విజయవాడ పోలీసులు చర్యలు తీసుకుంటున్నారు. హైదరాబాద్, బెంగళూరు, చెన్నై, దిల్లీ... వంటి మెట్రోపాలిటన్ నగరాల్లోనే ఇలాంటి సౌకర్యం ఉండగా.. ఇక నగర వాసులకు అందనుంది.

ప్రయోగాత్మకంగా.. ట్రా'ఫికర్'ను అంటే టక్కున గుర్తుకు వచ్చేది మన బెజవాడే. రెండు జాతీయ రహదారులు నగరం నడిబొడ్డు గుండా వెళుతుండడం, కీలకమైన వ్యాపార కేంద్రం.. దశాబ్దాల నాటి రహదారులు వెరసి.. నగర వాసులకు నిత్యం ట్రాఫిక్ చిక్కులే. ఈ చిక్కుముడులను విప్పేందుకు ట్రాఫిక్ పోలీసులు ఇప్పటికే అనేక వినూత్న కార్యక్రమాలు చేపట్టారు. అస్త్రం యాప్, ట్రాఫిక్ అంబాసిడర్లు, డ్రోన్ల ద్వారా ట్రాఫిక్ జామ్‌లను గమనించి దిద్దుబాటు చర్యలు తీసుకుంటున్నారు. తాజాగా మరో సరికొత్త ప్రయోగానికి శ్రీకారం చుట్టారు. 'ఎఫ్ఎం' రేడియో ద్వారా ట్రాఫిక్ సమాచారం ఇచ్చేందుకు ప్రయోగాత్మకంగా చర్యలు చేపట్టారు. ఈ సేవలు అందించేందుకు 'రెడ్ ఎఫ్ఎం' ముందుకు వచ్చింది.

కీలక సమయాల్లో రెండు స్లాట్లు: విజయవాడ నగరంలో ఉదయం, సాయంత్రం వేళల్లో విపరీతమైన ట్రాఫిక్ రద్దీ ఏర్పడుతుంది. ఆ సమయాల్లో ప్రజలకు ట్రాఫిక్ సమాచారం తెలియజేసేందుకు రెండు స్లాట్లను ట్రాఫిక్ పోలీసులకు కేటాయించారు. రద్దీ వేళల్లో ఎఫ్ఎం రేడియో ద్వారా జాకీలు ట్రాఫిక్ వివరాలు అందించేలా ప్రణాళికలు సిద్ధం చేశారు. అస్త్రం యాప్‌లో వచ్చే సమాచారం ఎఫ్ఎం రేడియో వారికి అందిస్తారు. రేడియో జాకీలు లేదా ఎఫ్ఎం ప్రతినిధులు.. బెజవాడ ట్రాఫిక్‌ను గమనిస్తూ అప్పటికప్పుడు ప్రజలకు సమాచారం చేరవేస్తారు. ట్రా'ఫికర్' బారిన పడకుండా జాగ్రత్తలు చెబుతుంటారు.

బుజ్జి బుజ్జి గణపయ్య



ఈనాడు-ఈటీవీ ఆధ్వర్యంలో మొగల్రాజపురం సిద్ధార్థ నగర్ లోని లిటిల్ బ్రెయిన్స్ పాఠశాలలో మట్టి ప్రతిమలు తయారు చేస్తున్న విద్యార్థులు. - న్యూస్‌టుడే, విజయవాడ సిటీ



పర్యావరణహితం కాంక్షిస్తూ ఈనాడు-ఈటీవీ ఆధ్వర్యంలో విస్సన్నపేట మండలంలోని నరసాపురం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో చిన్నారులతో మట్టి గణపతుల తయారీ కార్యక్రమం నిర్వహించారు. దీనికి విద్యార్థులు అధిక సంఖ్యలో హాజరై ప్రతిమలు తయారు చేశారు. పలువురు ఉపాధ్యాయులు పాల్గొన్నారు. - న్యూస్‌టుడే, విస్సన్నపేట

మహా గణపతి సిద్ధం



విద్యాధరపురం, న్యూస్‌టుడే : గట్టువెనక ప్రాంతంలోని లేబరుకాలనీ మైదానంలో దూండీ గణేష్ సేవాసమితి ఆధ్వర్యంలో నవ రాత్రి ఉత్సవాలు నిర్వహించేందుకు పర్యావరణ సహిత కార్యసిద్ధి మహాశక్తి గణపతిని మంగళ వారం సిద్ధం చేశారు. రెండు నెలల పాటు 72 అడుగుల ఎత్తున్న మహాశక్తి గణపతిని సమితి సభ్యుల పర్యవేక్షణలో 250 మంది ఇతర రాష్ట్రాల కార్మికులు కష్టపడి సిద్ధం చేశారు. భారీ వర్షానికి తట్టుకునేలా నిర్మాణం చేశారు. మట్టితో గణేశుడితో పాటు వాసవీ కన్యకా పరమేశ్వరి, నగరేశ్వర స్వామి విగ్రహాలు ఏర్పాటు చేశారు. ఉత్సవాల సందర్భంగా భక్తుల సందర్శనకు ఏర్పాట్లు చేశామని ఆర్య వైశ్య కార్పొరేషన్ ఛైర్మన్ దూండీ రాకేష్ తెలిపారు.

31న ఉమ్మడి కృష్ణా జిల్లా యోగాసన పోటీలు

విజయవాడ క్రీడలు, న్యూస్‌టుడే: స్థానిక ఐజీఎంసీ స్టేడియంలోని డీఎస్ఏ హాలులో ఈ నెల 31వ తేదీన ఉమ్మడి కృష్ణా జిల్లా యోగాసన పోటీలు నిర్వహిస్తామని జిల్లా యోగాసన స్పోర్ట్స్ సంఘం కార్యదర్శి ఎల్. మురళీకృష్ణ తెలిపారు. సబ్ జూనియర్, జూనియర్ బాలబాలికలతో పాటు సీనియర్స్ స్త్రీ, పురుషుల విభాగాల్లో పోటీలు జరుగుతాయని పేర్కొన్నారు. పాల్గొనే ఆసక్తిగల వారు ఈ నెల 30వ తేదీ ఉదయం 11 గంటల్లోపు తమ పేర్లు నమోదు చేసుకోవాలన్నారు. ఆధార్‌కార్డు, వయసు ధ్రువీకరణ పత్రం, రెండు పాస్ పోర్టు సైజు ఫొటోలతో హాజరవ్వాలన్నారు. మరిన్ని వివరాలకు ఫోన్ 94411 19909, 94402 76648 నంబర్లపై సంప్రదించాలన్నారు.

తాటాకులు కావు.. తాళపత్ర గ్రంథాలు

అంతరించిన కళకు ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో పునర్వైభవం

మైలవరం, న్యూస్‌టుడే

తాళపత్ర గ్రంథాలు..సుమారు నాలుగున్నర శతాబ్దాల కిందట వరకు సమాచార నిక్షిప్తానికి ఇవే సాధనాలు.. జాన్‌గూటెన్ బర్గ్ ముద్రణా యంత్రాన్ని కనుగొనే వరకు రాజ్యమేలిన ఆయుధం. శ్రీ వేంకటేశ్వర స్వామిపై అన్నమయ్య రాసిన వేలాది కీర్తనలను నిక్షిప్తం చేసుకున్న సాధనం. ఈ కళను యువతరానికి పరిచయం చేయాలన్న ఆశయం జిల్లా పరిధి మైలవరంలోని లకిరెడ్డి హనిమిరెడ్డి ప్రభుత్వ డిగ్రీ కళాశాల అధ్యాపకులకు తట్టింది. తెలుగు విభాగం ఆధ్వర్యంలో ఏకంగా 2 నెలల శిక్షణ తరగతులకు పురికొల్పింది. తాళపత్రాలపై రాయించడమే కాదు, వాటిని వారితోనే స్వయంగా తయారు చేయించే ఆలోచనకు శ్రీకారం చుట్టారు. ఫలితంగా 50 మంది విద్యార్థులతో 50 సంక్షిప్త గ్రంథాలను రూపొందించేలా చేశారు. కళాశాల దాత జీవిత చరిత్ర నుంచి సమకాలీన సామాజిక అంశాల గురించి రాయించి ధ్రువపత్రాలు కూడా అందించారు.




పత్రాలపై రాసిన అక్షరాలు

'ఎప్పుడూ ఒకేలా బోధిస్తే విద్యార్థుల్లో ఆసక్తి ఏం ఉంటుంది. టీఎల్ఎం(టీచింగ్ లెర్నింగ్ మెటీరియల్)తో నూతన ఆలోచనలు చేస్తే, ఎలక్ట్రానిక్ పరికరాల వాడకంతో పాటు నేటితరం ఆలోచన ధోరణి మారుతుందన్న సంకల్పంతో ప్రయోగాత్మకంగా ఏడాదిన్నర కిందటే ప్రారంభించాం. విద్యార్థులకు తాళపత్ర గ్రంథాలపై అవగాహన కల్పించాలని ప్రిన్సిపల్ ఇళ్లా రవి సహకారంతో ముందడుగు వేశాను. తెలుగు విభాగం ఆధ్వర్యంలో విద్యార్థులతోనే తాటాకులు తెప్పించి, వాటిపై రాయడానికి కావాల్సిన విధంగా రసాయనాలు పూసి..ఎండబెట్టి రాసేందుకు సిద్ధం చేశాం. ఒక్కొక్కరు పలు అంశాలపై, వేర్వేరు భాషల్లో ఘంటం(ఇనుప సూది)తో సుమారు 30 పేజీల వరకు రాయించి వాటిని ఒక్కో గ్రంథంగా తయారు చేశాం. ఇందులో పాల్గొన్న 50 మందికి ధ్రువపత్రం, బంగారు పతకం అందించాం. త్వరలోనే రెండో విడత మొదలు పెట్టడానికి ప్రయత్నాలు చేస్తున్నాం' అని కళాశాల తెలుగు విభాగాధిపతి మెండా దేవానంద కుమార్ వివరించారు.

సూపర్ సిక్స్.. గణేశ్..!

వినాయక చవితి సందర్భంగా విజయవాడ, అజిత్‌సింగ్‌నగర్‌కు చెందిన శంకర్ అనే చిరుద్యోగి.. కూటమి ప్రభుత్వ సూపర్-6 పథకాలతో కూడిన వినాయకుడి చిత్రపటాన్ని అందంగా గీశారు. లంబోదరుడి తలపై మహాశక్తి పథకం. చెవుల భాగంలో అన్నదాత, యువగళం.. తొండంలో బీసీలకు రక్షణ చట్టం.. కాళ్ల భాగంలో ఇంటింటికీ నీరు, పూర్ టు రిచ్ పథకాలతో గణేశ్ చిత్రాన్ని తీర్చిదిద్దిన తీరు స్థానికులను ఆకట్టుకుంది.

- న్యూస్‌టుడే, అజిత్‌సింగ్‌నగర్



నేడు విద్యుత్తు బిల్లులు చెల్లించొచ్చు

సూర్యారావుపేట, న్యూస్‌టుడే : వినాయక చవితి సందర్భంగా బుధవారం సెలవు దినమైనప్పటికీ జిల్లాలోని అన్ని విద్యుత్తు బిల్లుల వసూలు కేంద్రాలు తెరిచి ఉంటాయని విద్యుత్తు సంస్థ ఎస్ఈ టి.శ్రీనివాసరావు తెలిపారు. వినియోగదారులు సద్వినియోగం చేసుకోవాలని కోరారు. అలాగే ఏపీ సీపీడీసీఎల్ కన్జ్యూమర్ యాప్, గూగుల్ పే, ఫోన్ పే, అమెజాన్ పే, బిల్ డెస్క్ యాప్‌ల ద్వారా బిల్లులు చెల్లించవచ్చని ఆయన పేర్కొన్నారు.

ధర వరలు



వంకాయలు-24, టమాటా-40, బెండ-28, పచ్చిమిర్చి-34, కాకర-24, బీర-32/38, క్యాబేజీ-22, క్యారెట్-36/46, దొండ-26, బంగాళదుంప-28, ఉల్లిపాయలు-25, గోరు చిక్కుడు-28, దోస-18, సొర-18/16, పొట్ల-20, అరటికాయ-8/7, చామదుంప-26, ఆల్లం-50/90, మునగ-5/6, ఆకు కూరలు (కట్ట)-3/8, కంద-38, బీట్‌రూట్-28, కీరదోస-36, బీన్స్-80, క్యాప్సికం-68, నిమ్మ (డజను)-30/24, కొత్తిమీర-12/24, పుదీనా-5/15, ముల్లంగి-10, పచ్చిమామిడి-13/15 (నిన్నటిధర). నగరంలోని రైతు బజార్లలో ఈ ధరలు (రూ.,కిలో) వర్తిస్తాయి.

- ఎన్టీఆర్ కలెక్టరేట్, విజయవాడ

కరుణ చూపిన దాతలు

చిన్నారి వైద్య చికిత్సకు ఔదార్యం

గవర్నర్‌పేట, న్యూస్‌టుడే : నెలలు నిండకుండానే జన్మించి.. అనారోగ్య సమస్యలతో ఇబ్బందులు పడుతున్న చిన్నారిని ఆదుకునేందుకు దాతలు ముందుకు వచ్చారు. తెనాలికి చెందిన మర్రిపూడి శివసాయి రమణ, గొండి లక్ష్మీ ప్రియాంక దంపతులకు స్పెయిన్ 5 సంవత్సరాలకు మగ బిడ్డ జన్మించాడు. 7వ నెలలోనే పుట్టడంతో తీవ్ర అనారోగ్యానికి గురయ్యాడు. హైదరాబాద్‌లోని ఫెర్నాండెజ్ ఆసుపత్రిలో చేర్పించగా చికిత్స అందిస్తున్నారు. రోజుకు రూ.75వేలు అవసరం. చిరుద్యోగం చేసే శివసాయి రమణ.. తమ కుమారుడి వైద్యానికి ఆర్థిక ఇబ్బందులు పడుతుండటంతో.. సాయం చేయాలని దాతలను కోరారు. దీనిపై మంగళవారం 'కరుణ కురవాలి.. కనుపాప మెరవాలి' శీర్షికతో 'ఈనాడు'లో కథనం ప్రచురితమైంది. అనేక మంది దాతలు స్పందించి.. సాయం చేసేందుకు ముందుకు వచ్చారు. చిన్నారి తండ్రి బ్యాంకు ఖాతా, గూగుల్‌పే/ ఫోన్‌పే నంబరుకు రూ.2.09 లక్షలు పంపారు.

స్పందనకు వందనం

దాతలు సంప్రదించాల్సిన నంబర్లు

తండ్రి : మర్రిపూడి శివసాయి రమణ
బ్యాంకు పేరు : హెచ్‌డీఎఫ్‌సీ బ్యాంకు
శాఖ : గురునానక్ కాలనీ, విజయవాడ
ఖాతా నంబరు : 50100314409367
ఐఎఫ్ఎస్ కోడ్ : HDFC0009062
ఫోన్ పే/ గూగుల్‌పే: 77992 25111
తల్లి : గొండి లక్ష్మీ ప్రియాంక
గూగుల్‌పే/ ఫోన్‌పే : 72870 30078

రాష్ట్ర స్థాయి గట్కా పోటీలకు జిల్లా బృందం

విజయవాడ క్రీడలు, న్యూస్‌టుడే: స్థానిక ఆంధ్రా లయోలా కళాశాలలో వచ్చే నెల 13, 14వ తేదీల్లో జరిగే రాష్ట్ర స్థాయి గట్కా పోటీలకు ఉమ్మడి కృష్ణా జిల్లా తరఫున 80 మంది బాలబాలికలు, స్త్రీ, పురుషులు అర్హత సాధించారని జిల్లా కార్యదర్శి కె.శ్రీనివాస్ తెలిపారు. ఈ నెల 24వ తేదీన గాంధీనగర్‌లోని చిట్టూరి పబ్లిక్ స్కూల్లో నిర్వహించిన జిల్లా జట్టు ఎంపిక పోటీల నుంచి ప్రతిభ కనబరిచిన క్రీడాకారులను ఎంపిక చేశామన్నారు. అండర్-8, 12, 14, 17, 19 బాలబాలికలు, అండర్-22, 25 వయసు విభాగాల్లో స్త్రీ, పురుషుల రాష్ట్ర స్థాయి పోటీల్లో జిల్లా జట్టుకు ప్రాతినిధ్యం వహిస్తారని ఆయన పేర్కొన్నారు.



ఎంపికైన క్రీడాకారులతో జిల్లా సంఘం ప్రతినిధులు

సీతమ్మ పాదాల వద్ద నిమజ్జనానికి ఏర్పాట్లు

విజయవాడ నగరపాలక సంస్థ, న్యూస్‌టుడే: వినాయక విగ్రహాల నిమజ్జనానికి కృష్ణా నది వెంట సీతమ్మపాదాల వద్ద ప్రత్యేకంగా ఏర్పాట్లు చేస్తున్నట్లు నగరపాలక సంస్థ కమిషనర్ ధ్యానచంద్ర తెలిపారు. మంగళవారం ఆయన బందరు రోడ్డు, ఇందిరాగాంధీ మున్సిపల్ క్రీడా ప్రాంగణం, సీతమ్మవారి పాదాలు, ప్రకాశం బ్యారేజ్ ప్రాంతాల్లో పర్యటించారు. కమిషనర్ మాట్లాడుతూ పెద్ద విగ్రహాలను మాత్రమే ఆ ప్రాంతంలో నిమజ్జనం చేయాలని తెలిపారు. అందుకు ప్రత్యేకంగా క్రేన్లు ఇతర పరికరాలు, సిబ్బందిని అందుబాటులో ఉంచుతున్నట్లు వెల్లడించారు. చిన్నపాటి ప్రతిమలను మాత్రం ప్రజలు సొంతప్రాంతంలోనే వరకు తమ ఇళ్ల వద్దనే డ్రమ్ముల్లో నీరు నింపుకొని నిమజ్జనం చేసుకోవాలని తెలిపారు. నగరంలోని కాలువల్లో చిన్న విగ్రహాలను నిమజ్జనం చేసేవారు కేవలం గణేశ్ ప్రతిమలను మాత్రమే తీసుకు రావాలని తెలిపారు. ఆకులు, పూలు, పండ్లు, పూజా సామగ్రిని కృష్ణా నది, కాలువల్లో వేయవద్దని సూచించారు. వాటి కోసం ప్రత్యేకంగా బిన్నులు ఏర్పాటు చేస్తున్నామన్నారు. నిర్దేశిత ప్రాంతంలో మినహా మరెక్కడా పెద్ద విగ్రహాలను నిమజ్జనం చేయవద్దని, ఈ విషయంలో ప్రజలు తమకు సహకరించాలని కమిషనర్ కోరారు. ఆయన వెంట అధికారులు అర్జునరావు, శ్రీనివాసరెడ్డి, జి.శ్రీనివాస్, అన్నపూర్ణ, బాబూ శ్రీనివాస్, కె. ప్రభాకర్ పాల్గొన్నారు.



కృష్ణా నది ప్రాంతాన్ని పరిశీలిస్తున్న కమిషనర్ ధ్యానచంద్ర, అధికారులు

మట్టి ప్రతిమలపై విస్తృత ప్రచారం

ఆకట్టుకుంటున్న ఫ్లాష్‌మాబ్‌లు

విజయవాడసిటీ, న్యూస్‌టుడే: 'మట్టి గణపతిని పూజిద్దాం.. పర్యావరణాన్ని కాపాడదాం.' అంటూ విజయవాడ నగరంలోని పలు విద్యా సంస్థలకు చెందిన విద్యార్థులు విస్తృతంగా ప్రచారం చేస్తున్నారు. ప్రధాన కూడళ్లు, వాణిజ్య సముదాయాలు, కాలనీల్లో వెళ్లి ప్రజల్లో చైతన్యం తెచ్చేందుకు ప్రయత్నం చేస్తున్నారు. యువతీ యువకులు కలిసి ఫ్లాష్‌మాబ్‌లు, నృత్యాలు, నాటికలు ప్రదర్శిస్తూ.. ప్రజల అభ్యున్నతి పర్యావరణ పరిరక్షణ గురించి తెలియజేస్తున్నారు.

☛ బీవీ సిద్ధార్థ కళాశాల విద్యార్థులు పలు కూళ్లు మట్టి గణపతి ప్రతిమలను తయారు చేస్తున్నారు. ఏటా వెయ్యి నుంచి పది వేలకు పైగా ప్రతిమలను తయారు చేసి వినాయక చవితి రోజు కళాశాల గేటు వద్ద పెద్ద ప్రజలకు ఉచితంగా అందిస్తున్నారు. మట్టిలో వివిధ రకాల వృక్షాల విత్తనాలు కలుపుతున్నారు. నిమజ్జనం అనంతరం మొక్కలు మొలిచేలా ప్రజలకు సూచిస్తున్నారు. పర్యావరణ పరిరక్షణతో పాటు మొక్కలు పెంపకంపై అవగాహన కల్పిస్తున్నారు. కొద్ది రోజుల నుంచి బెంజిసర్కిల్, మాచవరం, స్క్రూబ్రిడ్జ్, పైపుల రోడ్డు, సిద్ధార్థ సర్కిల్‌లో ప్రజలను కలిసి మట్టి ప్రతిమల ప్రాముఖ్యత వివరిస్తున్నారు.



నలంద విద్యార్థుల చైతన్య ప్రదర్శన

☛ నలంద డిగ్రీ కళాశాల విద్యార్థులు ఇటీవల పీవీపీ మాల్‌లో ఫ్లాష్‌మాబ్‌ నిర్వహించారు. మట్టి ప్రతిమను వినియోగించడం వల్ల కలిగే ప్రయోజనాలను ప్రజలకు వివరిస్తూ చైతన్యం తీసుకొచ్చారు.

'కృష్ణా జిల్లాకు వంగవీటి పేరు పెట్టాలి'

గాంధీనగర్, న్యూస్‌టుడే : కృష్ణా జిల్లాకు దివంగత మాజీ ఎమ్మెల్యే వంగవీటి మోహన రంగా పేరు పెట్టాలని రాష్ట్ర కాపు బలిజ సంఘం అధ్యక్షుడు జనార్ధన్ ప్రభుత్వాన్ని విజ్ఞప్తి చేశారు. మంగళవారం ఆయన ప్రెస్ క్లబ్‌లో విలేకరులతో మాట్లాడారు. ఉప ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్ పిలుపుతో రాష్ట్ర వ్యాప్తంగా కాపు కులస్థులు గత ఎన్నికల్లో కూటమి ప్రభుత్వానికి ఓటు వేసి గెలిపించారని చెప్పారు. ఒక్క రంగా మంది రంగా అభిమానులు మనోభావాలను గౌరవించి కృష్ణా జిల్లాకు ఆయన పేరు పెట్టాలని కోరారు. రంగాపై అభిమానంతో ప్రతి గ్రామం, పట్టణాల్లో విగ్రహాలు ఏర్పాటు చేశారని... ఆ విషయాన్ని ప్రభుత్వం దృష్టిలో పెట్టుకోవాలన్నారు. సమావేశంలో తెదేపా కార్పొరేషన్ ఫ్లోర్ లీడర్ నెల్లిబండ్ల బాలాస్వామి, రాధా, రంగా మిత్రమండలి నాయకులు ఆకుల శ్రీనివాస్, చెన్నుపాటి శ్రీను, మాజీ ఉడిపి రామయ్య, రామానాయుడు, సాంబయ్య, ఎస్.ఎస్. రాజా, నెరుసు కృష్ణంజనేయులు, పి.ఈశ్వర్, తదితరులు పాల్గొన్నారు.

కుంగ్-ఫూ, కరాటేలో ప్రతిభ

విజయవాడ క్రీడలు, న్యూస్‌టుడే: హైదరాబాద్‌లోని కేబీఆర్ ఇండోర్ స్టేడియంలో ఈ నెల 24వ తేదీన జరిగిన అంతర్జాతీయ స్థాయి ఓపెన్ కుంగ్-ఫూ, కరాటే పోటీల్లో నగరానికి చెందిన పలువురు క్రీడాకారులు ప్రతిభ చూపి పతకాలు కైవసం చేసుకున్నారని అంతర్జాతీయ వాంకిన్ కరాటే డు శిక్షకుడు ఎస్.కె. రాష్ట్ర ప్రధాన కార్యదర్శి షరీఫ్ తెలిపారు. ఈ టోర్నీలో భారత్‌తో పాటు పలు దేశాలకు చెందిన రెండు వేల మంది క్రీడాకారులు పోటీపడ్డారని పేర్కొన్నారు. ఎస్. అనన్య పెద్ద విభాగాల్లో కటా, వెపన్ కటాల్లో పసిడి, వెపన్ కుమితేలో రజతం, బి.నిహా కటా, కుమితేలో పసిడి, ఎస్.కె. వెపన్ కటాలో కాంస్యం, డి.చరణి కటాలో పసిడి, డి.లక్ష్య ఎనిమిదేళ్ల విభాగంలో కటాలో పసిడి, వెపన్ కటాలో రజతం, ఎ.శ్రీహర్ష 12 ఏళ్ల విభాగంలో కటాలో పసిడి, ఎ.వెంకట సురేష్ 14 ఏళ్ల విభాగంలో కటాలో పసిడి పతకాలు సొంతం చేసుకున్నారు. క్రీడాకారులను పలువురు అభినందించారు.



పతకాలు సాధించిన క్రీడాకారులతో దురాజ్యం

బ్రాయిలర్ ధరలు (కిలో రూ.లలో)

బ్రాయిలర్ బ్రాయిలర్ పారం లివ్ రేట్ -112 లైవ్ 104 లైవ్ స్కిన్ -194, స్కిన్ లెస్ -221. ఆమాసి పౌల్ట్రీ ఫార్మ్స్ & బ్రీడర్స్ అసోసియేషన్ బ్రాయిలర్ పారం లైవ్ 115, 124, 105 లైవ్ స్కిన్ 200, స్కిన్ లెస్ 230.

నెక్ సూచించిన కోడిగుడ్డు ధర

కోడిగుడ్ల నెక్ సూచించిన ధర ... 100 గుడ్ల ధర రూ.500 (రిటైల్) ...

కార్యక్రమము	ప్రసార వేళలు
ఉదయం	ఉ. 5 - ఉ. 7
ఈ-మార్నింగ్	ఉ. 7 - ఉ. 11
సుస్వరం	ఉ. 11 - మ. 2
సత్యభామ	మ. 2 - సా. 5
డ్రైవ్ టైమ్	సా. 5 - రా. 9
సరదాగా కాసేపు	రా. 9 - రా. 12
బ్యాక్ టు బ్యాక్ సాంగ్స్	రా. 12 - ఉ. 5

గమనిక

క్లాసిఫైడ్ ప్రకటనలకు ప్రతిస్పందించే ముందు తగిన రీతిలో క్షుణ్ణంగా విచారించుకోవలసిందిగా పాఠకులకు సూచించడమైనది. ప్రకటనదారు చెబుతున్న లేదా చేసుకుంటున్న క్లెయిములతో ఈ వార్తాపత్రికకు ఏవిధమైన సంబంధం లేదు. ప్రకటనదారులు సరుకుల అమ్మకం లేదా అందించిన సేవల విషయంలో తప్ప, ప్రకటనల ద్వారా ప్రజల నుండి ఎట్టి డబ్బును వసూలు చేయరాదు. డబ్బును వసూలుచేసే ప్రకటనకర్తను బ్లాక్- లిస్టులో ఉంచే మరియు/ లేదా అతనిపై చట్టపరమైన చర్య తీసుకునే హక్కు యాజమాన్యానికి కలదు.

ఈవీఎం గోదాముకు పటిష్ఠ భద్రత



రికార్డులు పరిశీలిస్తున్న కలెక్టర్ లక్ష్మీశ, పక్కన అధికారులు

గొల్లపూడి, న్యూస్‌టుడే : ఈవీఎం, వీవీప్యాట్‌ల గోదాముకు పటిష్ఠమైన భద్రత కల్పిస్తున్నట్లు కలెక్టర్ జి.లక్ష్మీశ తెలిపారు. గొల్లపూడిలోని వ్యవసాయ మార్కెట్ యార్డు గోదాములో భద్రపరిచిన ఈవీఎం, వీవీప్యాట్‌లను ఆయన మంగళవారం పరిశీలించారు. గోదాము వద్ద భద్రతగా ఉన్న పోలీసు సిబ్బంది నిరంతరం అప్రమత్తంగా ఉండాలని సూచించారు. అనంతరం పలు రికార్డులు తనిఖీ చేశారు. డీఆర్‌వో ఎం.లక్ష్మీనరసింహం, నాయకులు వై.రామయ్య, వై.ఆంజనేయరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ఎట్టకేలకు స్పందించారు

ఈనాడు కథనానికి స్పందన

రెడ్డిగూడెం, న్యూస్‌టుడే : రాఘవాపురం గ్రామంలోని పాలకేంద్రం- 2 భవనం ఎదురుగా తారురోడ్డుపై రక్షిత తాగునీటి పైపులైన్ పగిలి నీరు వృథాగా పోతుందని 'ఈనాడు'లో సోమవారం 'తాగునీటి వృథా కనపడదా..'అనే శీర్షికతో వార్త ప్రచురితమైంది. దీనిపై స్పందించిన పంచాయతీ కార్యదర్శి ఎస్.రామారావు సిబ్బందిని పంపి మంగళవారం రక్షితనీటి పైపులైన్‌కు మరమ్మతులు చేయించారు.



తాగునీటి పైపులైన్‌కు మరమ్మతు చేస్తున్న సిబ్బంది

మేమున్నాం.. మీకు తోడుగా.. 10 AM to 1 PM

తిరువూరు: 98853 28820 మైలవరం: 80085 74705

స్పందనకు వందనం



తిరువూరు పట్టణం 7వ వార్డులోని డ్రెయిన్లలో పూడిక పేరుకుని, మురుగు పారుదలకు ఆటంకంగా ఉందని స్థానికుడు కిరణ్ కుమార్ 'ఈనాడు' మేమున్నాం.. మీకు తోడుగా ద్వారా సమస్యను అధికారుల దృష్టికి తీసుకెళ్లారు. దీనిపై స్పందించిన మున్సిపల్ అధికారి పారిశుద్ధ్య కార్మికులను పంపించి కాలువలను శుభ్రం చేయించారు. - న్యూస్‌టుడే, తిరువూరు టౌన్



? మునగపాడు రైస్‌మిల్ వెనుక బజార్‌లో పారిశుద్ధ్యం అస్తవ్యస్తంగా తయారై దోమలతో వ్యాధుల బారిన పడుతున్నాం. తక్షణమే పారిశుద్ధ్య చర్యలు చేపట్టాలి. - వెంకటేశ్వరరావు, గ్రామస్థుడు. ✔ సమస్య మా దృష్టికి వచ్చింది. సిబ్బందితో పారిశుద్ధ్య చర్యలు చేపట్టి దోమలు నివారించేందుకు చర్యలు చేపడతాం. - శ్రీనివాసరావు, పంచాయతీ కార్యదర్శి - న్యూస్‌టుడే, జి.కొండూరు

ఆక్రమణలకు అడ్డు

కొండపల్లి: కొండపల్లి పురపాలిక వ్యాప్తంగా కొన్ని రోజులుగా వెలుగులోకి వస్తున్న ప్రభుత్వ స్థలాల ఆక్రమణలపై పురపాలిక అధికారులు స్పందిస్తున్నారు. ఆయా స్థలాల్లో హెచ్చరిక బోర్డులను మంగళవారం ఏర్పాటు చేశారు. కొండపల్లి ఖిల్లా రోడ్డు, ఇబ్రహీంపట్నం, శాంతినగర్ ప్రాంతాల్లో ఈ ఆక్రమణలు చోటు చేసుకున్నాయి. దీనిపై తెదేపా, జనసేన నాయకులు స్పందించి వాటిని సందర్శించి అధికారులకు సమాచారం ఇచ్చారు. ఇందులో భాగంగా కమిషనర్ రమ్యకీర్తన, ఏఈ మొస్మీ ఆయా స్థలాలను సందర్శించారు.

వృత్తివిద్యా కోర్సులతో ఉపాధి అవకాశాలు

మైలవరం, న్యూస్‌టుడే : విద్యార్థి దశలో వృత్తివిద్యా కోర్సులతో ఉపాధి అవకాశాలు మెరుగవుతాయని స్థానిక బాలికోన్నత పాఠశాల ప్లస్ ప్రధానోపాధ్యాయుడు వై.రాజశేఖర్ అన్నారు. పీఎం శ్రీ కార్యక్రమంలో భాగంగా పాఠశాలలో బ్యూటీ, వెల్‌నెస్ అంశాలపై వృత్తివిద్యా కోర్సును ఆయన ప్రారంభించారు. కోర్సుపై అవగాహనలో భాగంగా మంగళవారం క్షేత్ర సందర్శన చేశారు. ఈ సందర్భంగా లక్ష్మి ప్రసన్న బ్యూటీ సెలూన్‌లో పలు అంశాలను విద్యార్థులకు తెలిపారు.

ఓ బొజ్జ గణపయ్య.. నీ బంటుమేమయ్య

'ఈనాడు-ఈటీవీ' ఆధ్వర్యంలో విద్యార్థులతో మట్టి బొమ్మల తయారీ

విస్సన్నపేట, న్యూస్‌టుడే

తొలి పండగ వినాయక చవితి వచ్చేసింది. ఓ బొజ్జ గణపయ్య.. నీ బంటు మేమయ్య.. అంటూ చిన్నారులు పూజించేందుకు సిద్ధమయ్యారు. 'ఈనాడు-ఈటీవీ' ఆధ్వర్యంలో మంగళవారం విస్సన్నపేట మండలం నరసాపురం జడ్పీ ఉన్నత పాఠశాలలోని విద్యార్థులతో పర్యావరణహితం కాంక్షిస్తూ మట్టి గణపతుల తయారీ కార్యక్రమం నిర్వహించారు. దీనికి ప్రధానోపాధ్యాయురాలు ఎస్.శోభాలత, పీఈటీ రమేష్ సహకారం అందించారు. పలువురు విద్యార్థులు ఉత్సాహంగా పాల్గొని చిట్టి చేతులతో బంకమట్టిని తీసుకొచ్చి వివిధ రూపాల్లో ప్రతిమలను తీర్చిదిద్దారు. పర్యావరణ హితమే తమ అభిమతమని, మట్టి వినాయకుడినే పూజిస్తామని, అందరికీ ఇదే చెబుతామంటూ ప్రతిజ్ఞ చేశారు. ఈ సందర్భంగా జరిగిన సభలో హెచ్‌ఎం మాట్లాడుతూ.. పర్యావరణ హితం కోసం మట్టి వినాయక విగ్రహాలనే పూజిద్దామని పిల్లలతో పాటు సమాజాన్ని జాగృత పరచేలా 'ఈనాడు- ఈటీవీ' చేపట్టిన అవగాహన కార్యక్రమం స్వాగతించతగిందని చెప్పారు.

ప్రోత్సహిస్తాం



'ఈనాడు-ఈటీవీ' ఆధ్వర్యంలో పర్యావరణ హితం కోసం మట్టి గణపయ్యలనే పూజించాలని అవగాహన కల్పించారు. మేమే స్వయంగా బంక మట్టిని సేకరించి విగ్రహాలను తయారు చేశాం. పండగ రోజున వీటినే పూజిస్తాం. మేము తయారు చేసిన వాటిని మరికొందరికి పంచి పూజ చేయమని ప్రోత్సహిస్తాం. - బాలికల బృందం

చాలా సంతోషించాం



పాఠశాలలో మట్టి ప్రతిమలు తయారు చేయడం చాలా సంతోషంగా భావించాం. రసాయనాలతో చేసిన బొమ్మలు హానికరం అని తెలుసుకున్నాం. కాలుష్య భూతాన్ని అంతం చేసేందుకు పర్యావరణ హితం కోసం మట్టి ప్రతిమలు ముద్దు అని గ్రామంలో ప్రచారం చేస్తాం. ప్రజలకు అవగాహన కలిగిస్తాం. - బాలుర బృందం

కఱ్ఱ ఆటలో ప్రతిభ



విద్యార్థులతో హెచ్‌ఎం సంతోష్ కుమార్

ఇబ్రహీంపట్నం, న్యూస్‌టుడే : జిల్లా స్థాయి గట్కా(కఱ్ఱ ఆట) పోటీల్లో పశ్చిమ ఇబ్రహీంపట్నం జడ్పీ ఉన్నత పాఠశాల విద్యార్థులు ప్రతిభ చాటారు. ఈ నెల 24న విజయవాడ చిట్టూరి హైస్కూల్‌లో జరిగిన పోటీల్లో పాఠశాలకు చెందిన ఎస్.కె.కరిష్మా (బంగారు), పి.క్రాంతి (వెండి), ఎంగణేష్(కాంస్య), ఎ.అరవింద్ (కాంస్య) పతకాలు సాధించారు. జిల్లా విజేతలైన వీరు రాష్ట్ర స్థాయి పోటీలకు ఎంపికయ్యారు. ఈ నేపథ్యంలో హెచ్‌ఎం ఎం.సంతోష్ కుమార్, పీఈటీ రామశేఖర్ వీరందరిని మంగళవారం అభినందించారు.

చట్టాలపై అవగాహన తప్పనిసరి

కంభంపాడు(ఎ.కొండూరు), న్యూస్‌టుడే : విద్యార్థులు చదువుతో పాటు చట్టాలపై కూడా అవగాహనతో ఉండాలని తిరువూరు న్యాయస్థానం ఇన్‌ఛార్జి న్యాయమూర్తి అనూష సూచించారు. మండలంలోని కంభంపాడు ప్రభుత్వ జూనియర్ కళాశాలలో మంగళవారం నిర్వహించిన న్యాయ విజ్ఞాన సదస్సులో ఆమె మాట్లాడారు. పోక్సో చట్టంపై అవగాహన కల్పించారు. బాలికలపై అనుచిత లైంగిక దాడి సంఘటనలకు పాల్పడితే చట్టం ద్వారా నిందితులకు కఠిన శిక్ష విధిస్తారని స్పష్టం చేశారు. బార్ అసోసియేషన్ అధ్యక్షుడు సీహెచ్.వెంకటరెడ్డి, న్యాయవాదులు ఎస్.జనార్దనరావు, ఎ.నాగేంద్రప్రసాద్, వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.



ప్రసంగిస్తున్న జడ్జి అనూష, వేదికపై న్యాయవాదులు

డీఎస్సీతో కలలు సాకారం



మాట్లాడుతున్న తిరువూరు శాసనసభ్యుడు శ్రీనివాసరావు

తిరువూరు, న్యూస్‌టుడే : కూటమి ప్రభుత్వం విడుదల చేసిన డీఎస్సీ పరీక్ష ఫలితాల్లో ర్యాంకులు సాధించిన అభ్యర్థులకు తిరువూరు శాసనసభ్యుడు కె.శ్రీనివాసరావు శుభాకాంక్షలు తెలిపారు. మంగళవారం స్థానిక తెదేపా కార్యాలయం వద్ద నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. గత వైకాపా ప్రభుత్వంలో డీఎస్సీతో నష్టపోయిన అభ్యర్థులు ప్రస్తుతం తమ కలలను సాకారం చేసుకున్నారన్నారు. తన సొంత నిధులతో పేద విద్యార్థుల కోసం ఏర్పాటు చేసిన అంబేడ్కర్ స్టడీ సర్కిల్ నుంచి కూడా పలువురు ప్రతిభ చాటారని పేర్కొన్నారు. ఈ సందర్భంగా సీఎం చంద్రబాబు, మంత్రి నారా లోకేశ్‌కు కృతజ్ఞతలు తెలిపారు. స్థానిక నాయకులు పాల్గొన్నారు.

పోటీలతో విజ్ఞానం.. వినోదం

మైలవరం, న్యూస్‌టుడే : పోటీ పరీక్షల్లో పాల్గొనడం ద్వారా విద్యార్థుల్లో విజ్ఞానం పెరుగుతుందని స్థానిక ఎంబీఎం జడ్పీ బాలికోన్నత పాఠశాల ప్లస్ హెచ్‌ఎం వై.రాజశేఖర్ పేర్కొన్నారు. 'ఈనాడు- ఈటీవీ' ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న ప్రతిభా పాటవ పోటీల్లో భాగంగా మంగళవారం ఆ పాఠశాలలో జరిగిన వ్యాసరచన పోటీలో 34 మంది విద్యార్థినులు పాల్గొన్నారు. వీరిలో 10వ తరగతి విద్యార్థిని ఎస్కే.గుల్నార్, 9వ తరగతి విద్యార్థినులు ఎస్.సాత్విక, పి.వర్షిణి వరుసగా మొదటి మూడు స్థానాలు సాధించి, బహుమతులు అందుకున్నారు. హెచ్‌ఎం, ఉపాధ్యాయులు మాధవి, పి.బాలసరోజిని, ఎం.తులసి, ఎస్.ఎస్.ఆనంద్ పాల్గొని వారిని అభినందించారు.

విస్సన్నపేట : స్థానిక శ్రీచైతన్య టెక్నో స్కూల్లో మంగళవారం 'ఈనాడు' ఆధ్వర్యంలో 'చంద్రయాన్ నుంచి ఏఐ వరకు శాస్త్ర సాంకేతిక రంగాల్లో భారతదేశ ప్రయాణం' అనే అంశంపై వ్యాసరచన పోటీలు నిర్వహించారు. ఇందులో బి.పండు(9వ తరగతి), జె.సంజన(9వ తరగతి), ఉద్దిగ రెడ్డి(8వ తరగతి) ప్రథమ, ద్వితీయ, తృతీయ స్థానాల్లో నిలిచారు. వీరికి పాఠశాల ప్రిన్సిపల్ నాగ వెంకట పవన్ బహుమతులు అందజేశారు. ఉపాధ్యాయులు మల్లికార్జునరావు, లావణ్య, తిరుపతిరావు, సాయి సురేష్ పాల్గొన్నారు.



విస్సన్నపేట : గెలుపొందిన వారితో ప్రిన్సిపల్ నాగ వెంకట పవన్ తదితరులు



మైలవరం : బహుమతులు సాధించిన వారితో హెచ్‌ఎం రాజశేఖర్, ఉపాధ్యాయులు

సచివాలయ ఉద్యోగులకు సన్మానం



సిబ్బందిని సత్కరిస్తున్న వెంకటేశ్వరరావు, సుధాకర్‌రెడ్డి తదితరులు

జి.కొండూరు, న్యూస్‌టుడే : మునగపాడు సచివాలయంలో విధులు నిర్వహించి బదిలీ అయిన సిబ్బందిని కూటమి నాయకులు, అధికారులు మంగళవారం సన్మానించారు. అదే విధంగా నూతనంగా వచ్చిన వారికి ఘనంగా స్వాగతం పలికారు. సర్పంచులు పగడాల వెంకటేశ్వరరావు, దేశం సుధాకర్‌రెడ్డి, బి.సరస్వతి, విష్ణు, కార్యదర్శి శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.

యూరియా తరలించకుండా చెక్‌పోస్టులు

తిరువూరు, గంపలగూడెం, న్యూస్‌టుడే : తిరువూరు నియోజకవర్గం నుంచి తెలంగాణకు యూరియా అక్రమంగా తరలించకుండా సరిహద్దు గ్రామాల్లో చెక్‌పోస్టులు ఏర్పాటు చేసినట్లు సీఐ కె.గిరిబాబు మంగళవారం తెలిపారు. పోలీస్ సిబ్బందితో నిఘా ఏర్పాటు చేశామన్నారు. యూరియా ఇతర రాష్ట్రాలకు తరలిస్తే బాధ్యులపై చర్యలు ఉంటాయని హెచ్చరించారు.

సీఎం సహాయ నిధి చెక్కులు అందజేత

తిరువూరు టౌన్, న్యూస్‌టుడే : వివిధ అనారోగ్య సమస్యలతో బాధపడుతూ ఆసుపత్రుల్లో చికిత్స పొందిన వారికి తిరువూరు శాసన సభ్యుడు కొలికపూడి.శ్రీనివాసరావు మంగళవారం తన కార్యాలయంలో సీఎం సహాయ నిధి నుంచి మంజూరైన చెక్కులను పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో దుబ్బాకు.వెంకటేశ్వరరావు, గద్దె.వెంకన్న, తాళ్లూరి.రామారావు, వెంకట రెడ్డి, బొమ్మసాని మహేష్ తదితరులు పాల్గొన్నారు.

ఎరువులు అధిక ధరలకు అమ్మితే చర్యలు



తనిఖీ చేస్తున్న తహసీల్దార్ సుశీలాదేవి

రెడ్డిగూడెం : ఎరువులను అధిక ధరలకు అమ్మితే డీలర్లపై కఠిన చర్యలు తీసుకుంటామని తహసీల్దార్ జె.సుశీలాదేవి, ఏవో బి.శ్రీనివాసరావు తెలిపారు. మంగళవారం కూనపరాజువర్రు, రెడ్డిగూడెం గ్రామాల్లోని ఎరువుల దుకాణాలను వారు తనిఖీ చేశారు. దుకాణాల్లో ఉన్న ఎరువులు, రికార్డులు పరిశీలించారు. ఆర్‌ఐ జె.పుల్లయ్య, వ్యవసాయ శాఖ సిబ్బంది పాల్గొన్నారు.

మట్టి గణపతులతో పర్యావరణ పరిరక్షణ

మైలవరం, న్యూస్‌టుడే : మట్టితో తయారు చేసిన గణపతి విగ్రహాలు, ప్రతిమలకు పూజలు చేయడం ద్వారా పర్యావరణ పరిరక్షణ సాధ్యమని ఎమ్మెల్యే వసంత కృష్ణప్రసాద్ అన్నారు. స్థానిక మదర్ థెరిస్సా ఛారిటబుల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో తయారు చేయించిన ప్రతిమలను పంచాయతీ కార్యాలయ కూడలిలో ఆయన అందజేశారు. ట్రస్ట్ అధ్యక్షురాలు కోయ సుధా శ్రీనివాసరావు, తెదేపా నాయకులు పాల్గొన్నారు. లయన్స్ క్లబ్ ఆఫ్ మైలవరం ఆధ్వర్యంలో మైలవరంతో పాటు మండలంలోని వెల్వడం, పొందుగలలో ప్రతిమలు పంపిణీ చేశారు.



మైలవరంలో చిన్నారికి ప్రతిమ, మొక్క అందజేస్తున్న ఎమ్మెల్యే కృష్ణప్రసాద్

కొండపల్లి, న్యూస్‌టుడే : స్థానిక క్రాంతి పాఠశాల విద్యార్థులు తయారు చేసిన ప్రతిమలను గ్రామస్థులు, తల్లిదండ్రులకు ఉచితంగా అందజేశారు. పలువురు ఉపాధ్యాయులు పాల్గొన్నారు.



కొండపల్లిలో పంపిణీ చేస్తున్న విద్యార్థులు

మైలవరం, న్యూస్‌టుడే : స్థానిక లకిరెడ్డి బాలిరెడ్డి ఇంజినీరింగ్ కళాశాలలో ఎన్ఎస్ఎస్, ప్రకృతి క్లబ్ ఆధ్వర్యంలో మట్టి ప్రతిమలు అందజేశారు. లీలావతి పాఠశాలలో మట్టి వినాయకుడికి విద్యార్థులతో పూజలు చేయించారు.

గంపలగూడెం, తిరువూరు, న్యూస్‌టుడే : తిరువూరులో లయన్స్ క్లబ్ ప్రతినిధులు సీహెచ్.శంకరరావు, డాక్టర్ టి.రామారావు, ఎన్.రాఘవరావు, కె.రాజేశ్‌ఖన్నా తదితరుల ఆధ్వర్యంలో 500 మట్టి బొమ్మలు పంపిణీ చేశారు. తోటమూలలో లయన్స్ క్లబ్, ఆర్యవైశ్య సంఘం ఆధ్వర్యంలో బొమ్మలు అందజేశారు.

తిరువూరు, న్యూస్‌టుడే : మునుకుళ్ల జడ్పీ ఉన్నత పాఠశాల విద్యార్థులు హెచ్‌ఎం జె.మురళీకృష్ణ, ఉపాధ్యాయుల పర్యవేక్షణలో మట్టి గణపతి ప్రతిమలను తయారు చేశారు.

ప్రజలకు నిరంతరం సేవలందించాలి

విస్సన్నపేట, న్యూస్‌టుడే : స్థానిక పుట్రేల రోడ్డు రాజా కాటా వద్ద నూతనంగా నిర్మిస్తున్న తెదేపా మండల కార్యాలయాన్ని ఎమ్మెల్యే వసంత కృష్ణప్రసాద్, ఆ పార్టీ నాయకుడు రాయల సుబ్బారావుతో కలిసి మంగళవారం పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కార్యాలయ కేంద్రంగా పార్టీ కార్యక్రమాలతో పాటు ప్రజలకు నిరంతరం సేవలందించాలని సూచించారు. కూటమి శ్రేణులు పాల్గొన్నారు.

అసత్య ప్రచారాలపై ఫిర్యాదు

జి.కొండూరు, న్యూస్‌టుడే : చెవుటూరు సొసైటీలోని ఎరువులను రైతులకు అందకుండా దాచేసి నల్లబజార్‌లో అదనపు ధరలకు విక్రయిస్తున్నారని అసత్య ఆరోపణలను సోషల్ మీడియాలో ప్రచారం చేస్తున్న వైకాపా మూకలపై చర్యలు తీసుకోవాలంటూ జి.కొండూరు పోలీస్ స్టేషన్‌లో మంగళవారం రైతులతో కలిసి సొసైటీ ఛైర్మన్ ఈమని మురళీకృష్ణ ఫిర్యాదు చేశారు. బాధ్యులపై చర్యలు తీసుకోవాలని కోరారు.

విశ్వమాత సేవలు చిరస్మరణీయం



పెనుగొలనులో మదర్ థెరిస్సా చిత్రపటానికి నివాళులర్పిస్తున్న గ్రామస్థులు

గంపలగూడెం, న్యూస్‌టుడే : మండలంలోని పెనుగొలనులో మంగళవారం విశ్వమాత మదర్ థెరిస్సా జయంతి నిర్వహించారు. ఆమె చిత్రపటానికి చిన్నారులు, గ్రామస్థులు, శిర్డీ సాయిబాబా సేవా కమిటీ సభ్యులు నివాళులర్పించారు.

తిరువూరు: పట్టణంలోని ఐడియాస్ సేవా సంస్థలో నిర్వహించిన కార్యక్రమంలో పలువురు మదర్ థెరిస్సా చిత్రపటానికి నివాళులర్పించారు. సంస్థ డైరెక్టర్ ఎ.శౌరి, నిర్వాహకులు రవిబాబు, రాజేశ్వరి, సుజాత, కిరణ్ పాల్గొన్నారు.



తిరువూరు ఐడియాస్ సేవా సంస్థలో..

హామీ అమలు చేయాలి

మైలవరం : ఎన్నికల సమయంలో కూటమి ఆశా కార్యకర్తలకు ఇచ్చిన హామీని అమలు చేయాలని ఆశా కార్యకర్తల సంఘం(సీఐటీయూ) రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఎ.ధనలక్ష్మి పేర్కొన్నారు. స్థానిక మారుతీ కల్యాణ మండపంలో మంగళవారం సంఘం 6వ జిల్లా మహాసభలను నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చి నెలలు గడుస్తున్నా హామీని అమలు చేయకపోవడం దుర్మార్గమన్నారు. అనంతరం జిల్లా కమిటీని ఎన్నుకున్నారు.

ఇంటింటా స్మార్ట్ కార్డుల పంపిణీ

కొండపల్లి, న్యూస్‌టుడే : కూటమి ప్రభుత్వం నూతనంగా ప్రవేశ పెట్టిన స్మార్ట్ రేషన్ కార్డులను ప్రజాప్రతినిధులు వృద్ధులు, దివ్యాంగులకు మంగళవారం పంపిణీ చేశారు. కొండపల్లి పురపాలికలోని కౌన్సిలర్లు, తెదేపా నాయకులు, రెవెన్యూ సిబ్బంది ఆయా ప్రాంతాల్లో వీటిని లబ్ధిదారులకు అందజేశారు. సెప్టెంబర్ 1 నుంచి రెవెన్యూ అధికారుల ఆధ్వర్యంలో ఇంటింటికి వెళ్లి వీటిని పంపిణీ చేస్తామని తహసీల్దార్ వెంకటేశ్వర్లు తెలిపారు. కార్డు రాలేదని ఎవరూ ఆందోళన చెందవద్దన్నారు.

నెమలి(గంపలగూడెం): మండలంలోని నెమలిలో తెదేపా నాయకులు బెల్లం మధుసూదనరావు, వి.రాజశేఖర్, పి.కొండలరావు, వి.చిన అనంతరామయ్య, పి.రాంబాబు, కె.ఏసోబు లబ్ధిదారులకు కార్డులు పంపిణీ చేశారు.

రెడ్డిగూడెం, న్యూస్‌టుడే : శ్రీరాంపురంలో ఎమ్మెల్యే వసంత కృష్ణప్రసాద్ స్మార్ట్ రేషన్ కార్డులు పంపిణీ చేశారు. గ్రామ సర్పంచి ఎ.శ్రీనివాసరావు, కూటమి నాయకులు పాల్గొన్నారు.

రాష్ట్రంలో విచ్చలవిడిగా అమ్మకాలు



సభలో ప్రసంగిస్తున్న శ్రీదేవి

విస్సన్నపేట, న్యూస్‌టుడే : రాష్ట్రంలో గంజాయి, మద్యం విచ్చలవిడిగా అమ్మకాలు జరుగుతున్నాయని మహిళా సంఘం ఐద్వా జిల్లా కార్యదర్శి శ్రీదేవి ఆరోపించారు. స్థానిక సుందరయ్య భవనంలో ఐద్వా ఆధ్వర్యంలో జరిగిన విస్తృత స్థాయి సమావేశంలో ఆమె పాల్గొని ప్రసంగించారు. అనంతరం పట్టణ కమిటీ ఎన్నిక ఏకగ్రీవంగా జరిగింది. ఐద్వా మండల కార్యదర్శి కరెడ్ల ధనలక్ష్మి, భవానీ, కల్యాణి జ్యోతి, శుభకరిణి తదితరులు పాల్గొన్నారు.

ఆటో కార్మికులను ఆదుకోండి

తిరువూరు, న్యూస్‌టుడే : ప్రభుత్వం అమలు చేసిన స్త్రీశక్తి పథకం ద్వారా ఆర్థికంగా నష్టపోయిన ఆటో డ్రైవర్లను ఆదుకోవాలని కోరుతూ సీఐటీయూ నాయకుల ఆధ్వర్యంలో మంగళవారం పట్టణంలో ప్రదర్శన నిర్వహించారు. స్థానిక రెవెన్యూ కార్యాలయం వద్ద ధర్నా చేసి తమ డిమాండ్ల వినతిపత్రాన్ని ఉప తహసీల్దారు నాగమణికి అందజేశారు. పలువురు నాయకులు పాల్గొన్నారు.

నిబంధనలు తప్పనిసరి

ఇబ్రహీంపట్నం, న్యూస్‌టుడే : వినాయక ఉత్సవ కమిటీలు నిబంధనలను తప్పనిసరిగా పాటించాలని సీఐ చంద్రశేఖర్ తెలిపారు. స్థానిక పోలీస్ స్టేషన్ ఆవరణలో మంగళవారం నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. కార్యక్రమంలో ఎస్సైలు, సిబ్బంది పాల్గొన్నారు.

తిరువూరు, గంపలగూడెం: తిరువూరులో ఉత్సవ కమిటీలకు నిర్వహించిన అవగాహన సదస్సులో సీఐ కె.గిరిబాబు, ఎస్సై కె.సత్యనారాయణ మాట్లాడారు. మండపాల వద్ద ఎటువంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా సీసీ కెమెరాలు ఏర్పాటు చేయాలని సూచించారు.



తిరువూరులో సూచనలిస్తున్న సీఐ గిరిబాబు



ఇబ్రహీంపట్నంలో సీఐ చంద్రశేఖర్

గణపతి నవరాత్రోత్సవాలకు చురుగ్గా ఏర్పాట్లు

గంపలగూడెం, ఎ.కొండూరు, తిరువూరు: గణపతి నవరాత్రోత్సవాలకు గంపలగూడెం, ఎ.కొండూరు, తిరువూరు మండలాల్లోని భక్తులు ఏర్పాట్లు చురుగ్గా చేస్తున్నారు.

ఇబ్రహీంపట్నం గ్రామీణం: చవితి నేపథ్యంలో ఇబ్రహీంపట్నం రింగు సెంటర్ విగ్రహాలు, పూజా సామగ్రి, పత్రి అమ్మకం, కొనుగోలుదారులతో సందడిగా మారింది. కొండపల్లికి చెందిన శాలివాహనులు మట్టి బొమ్మలతో పాటు వివిధ రంగులతో దిద్దిన ప్రతిమలను విక్రయాలకు సిద్ధం చేశారు.

గొల్లపూడి: గొల్లపూడి వన్‌సెంటర్ వద్ద పత్రి విక్రయాలను భారీ ఎత్తున చేపట్టారు. వాహనాల్లో విగ్రహాలను భక్తులు తరలించారు.

బావిలోకి దూకి మహిళ ఆత్మహత్య


మైలవరం, న్యూస్‌టుడే : అనారోగ్యంతో తట్టుకోలేక ఒక మహిళ బావిలోకి దూకి ఆత్మహత్యకు పాల్పడినట్లు ఎస్సై కె.సుధాకర్ తెలిపారు. మండలంలోని వెల్వడంలో వాటర్ ట్యాంకు సమీపంలో నివసించే పత్తిపాటి రమణ(55) మంగళవారం సాయంత్రం ఇంటికి పక్కనున్న బావిలోకి దూకింది. అది చూసిన ఒక బాలుడు ఇంట్లోని వారికి తెలియజేయగా, బావిలో వెతకగా, అప్పటికే ఆమె నీట మునిగి మరణించింది. ఇటీవల అనారోగ్యంగా ఇబ్బంది పడుతూ ఆత్మహత్యకు పాల్పడి ఉంటుందని ఆమె భర్త స్వామి ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్సై పేర్కొన్నారు.

చికిత్స పొందుతూ వృద్ధురాలి మృతి

గంపలగూడెం : వినగడపకు చెందిన ఎస్కే.మస్తాన్‌బీ(65) అనారోగ్య సమస్యతో గడ్డి మందు తాగి ఆత్మహత్యకు పాల్పడింది. ఎస్సై శ్రీను వివరాల మేరకు.. కొన్నేళ్లుగా అనారోగ్యంతో బాధపడుతున్న ఆమె ఈ నెల 24న ఇంట్లో ఉన్న గడ్డి మందు తాగింది. గమనించిన కుటుంబ సభ్యులు ఆమెను తొలుత తిరువూరు ప్రభుత్వ ఆసుపత్రికి, తర్వాత విజయవాడకు తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ మంగళవారం ఆమె తుదిశ్వాస విడిచింది. మృతురాలి కుమారుడు మస్తాన్‌వలీ ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేశారు.

ఈనాడు
its@eenadu.in

టెక్ వినాయకా నమోస్తుతే!



వినాయక చవితి అనగానే పల్లె, పట్నం తేడా లేకుండా ఉత్సాహం ఉరకలేస్తుంది. వీధి వీధినా గణపతి మండపాలు విద్యుత్ కాంతులతో విరాజిల్లుతుంటాయి. భక్తి ప్రపత్తులతో గణపతిని వేడుకొని, విజయం చేకూర్చాలని మొక్కుకుంటాం. ఈ పర్వదినం ఆధ్యాత్మికమైనదే అయినా ఇప్పుడు సాంకేతిక పరిజ్ఞాన శోభనూ సంతరించుకుంటోంది. మన పండుగల్లో టెక్నాలజీ విడదీయలేని భాగంగా మారుతున్న క్రమంలో గణపతి నవరాత్రులను మరింత ఆనందంగా నిర్వహించుకోవటానికి ఇది తోడ్పడుతోంది.

లాల్‌బాగ్‌చా రాజా దర్శనం

గణపతి వేడుకలకు మహారాష్ట్ర పెట్టింది పేరు. పుణె, ముంబయి నగరాల్లో చాలా అట్టహాసంగా నిర్వహిస్తుంటారు. ముంబయిలోని లాల్‌బాగ్‌చా రాజాను చూడటానికి ప్రజలు తండోపతండాలుగా విరగబడుతుంటారు. మరి అక్కడికి వెళ్లలేనివారు, ఇష్టమైన గణపతి దర్శనం చేసుకోలేకపోతున్నామని విచారించాల్సిన పనిలేదు. ఇప్పుడే వర్చువల్ 360 డిగ్రీ లైవ్ స్ట్రీమింగ్ పరిజ్ఞానాలు మండపాలను ఇంట్లోకే తీసుకొస్తున్నాయి. లాల్‌బాగ్‌చా రాజా సార్వజనిక్ గణేశోత్సవ్ మండల్ అధికారిక వెబ్‌సైట్ ద్వారా ప్రత్యక్ష ప్రసారం చేస్తుంది. యూట్యూబ్ చానల్‌లోనూ (https://www.youtube.com/@LalbaugRaja/streams) స్పష్టంగా తిలకించొచ్చు. ఈ చానెల్‌ను సబ్‌స్క్రైబ్ చేసుకుంటే నోటిఫికేషన్లూ అందుతాయి. రోజూ హారతి వేళలను కూడా పోస్ట్ చేస్తారు. ఫేస్‌బుక్, ఇన్‌స్టాగ్రామ్, ఎక్స్ వంటి సామాజిక మాధ్యమాల్లోనూ ఎంతోమంది లాల్‌బాగ్‌చా రాజా మాత్రమే కాదు.. ఇలాంటి ఇతర మండపాల దర్శనాలను ప్రత్యక్ష ప్రసారం చేస్తుంటారు కూడా.



మన ఖైరతాబాద్ గణపతి

మనదగ్గర ఖైరతాబాద్ గణపతి ప్రత్యేకతే వేరు. ఎత్తయిన విగ్రహం భక్తులను ఎంతో ఆకట్టుకుంటుంది. ఖైరతాబాద్ గణేశ్ ఉత్సవ్ కమిటీ అధికార వెబ్‌సైట్‌లోకి (https://www.ganapathideva.org/index.html) వెళ్తే లైవ్ వీడియో ఆప్షన్ కనిపిస్తుంది. దీన్ని క్లిక్ చేస్తే యూట్యూబ్ ఛానెల్ ఓపెన్ అవుతుంది. ఇన్‌స్టాగ్రామ్‌లో ఖైరతాబాద్ గణేశ్ (khairatabad ganesh_official) ద్వారా అప్‌డేట్స్ తెలుసుకోవచ్చు.

● ప్రాచీన కాణిపాకం దేవస్థానం అధికారిక వెబ్‌సైట్‌లో (https://srikanipakadev-asthanam.org/en-in/home) టీవీ సదుపాయం ఉంది. దీని మీద క్లిక్ చేస్తే అధికారిక యూట్యూబ్ చానెల్ ఓపెన్ అవుతుంది. ఇందులో లైవ్ విభాగం ద్వారా ప్రత్యక్ష ప్రసారం తిలకించొచ్చు.

వీ మూవీస్ అండ్ టీవీ యాప్

వొడాఫోన్ ఐడియా తమ స్ట్రీమింగ్ యాప్ 'వీ మూవీస్ అండ్ టీవీ' ద్వారా నిరంతరాయంగా లాల్‌బగాచా రాజా ప్రత్యక్ష దర్శనానికి అవకాశం కల్పిస్తోంది. నేటి నుంచి నవరాత్రులు ముగిసేంత వరకూ ముఖ దర్శన్, హారతి వేళలు, పండుగ విశేషాలను కళ్లకు కడుతుంది. వీ యూజర్లకు ఇది ఉచితం. కాకపోతే బేసిక్ సబ్‌స్క్రిప్షన్ తీసుకోవాల్సి ఉంటుంది. యాప్‌లో లాల్‌బగాచా అని సెర్చ్ చేసి డివోషనల్ లేదా లైవ్ ఈవెంట్స్ విభాగంలో ఈ సదుపాయాన్ని గుర్తించొచ్చు. హెచ్‌డీ నాణ్యతతో ప్రసారాలు సాగుతాయి. వీ మూవీస్ అండ్ టీవీ వంటి యాప్స్‌లో వీఆర్-ఎనేబుల్డ్ ఆప్షన్ ఉపయోగించుకున్నట్టయితే మనం అక్కడే ఉండి తిలకిస్తున్న అనుభూతినీ పొందొచ్చు.



లైవ్ దేవ్ దర్శన్ (Live Dev Darshan)



ఇది ప్రత్యక్ష దైవ దర్శనాలకు ప్రత్యేకించిన ఆండ్రాయిడ్ యాప్. సిద్ధివినాయక్, దగ్దుశేత్ వంటి గణేశ మండపాల మీద విశేష దృష్టి సారించినప్పటికీ మనదేశంలోని చాలా దేవాలయాల ప్రత్యక్ష ప్రసారాలకు వీలు కల్పిస్తుంది. పూర్తిగా ఉచితం. హారతి, దర్శన వేళలు, వేడుకల నోటిఫికేషన్లకు పరిమితి అంటూ ఏదీ లేదు. ఈ సంవత్సరం గణపతి వేడుకల కోసం ప్రత్యేక విభాగమూ ఉంది.

● యాప్‌ను ఓపెన్ చేసి, ఇష్టమైన మండపాలను పేర్లతో శోధించాలి. వాటి లైవ్ స్ట్రీమ్స్ మీద తాకితే దైవ దర్శనం అవుతుంది. ఆయా పూజల వేళలూ కనిపిస్తాయి. కాకపోతే ఇందులో చాలా ప్రకటనలు ఉంటాయని మరవరాదు.

సిద్ధివినాయక్ దేవాలయ వెబ్‌సైట్, యాప్



ముంబయిలోని శ్రీ సిద్ధివినాయక్ గణపతి మందిర్ ట్రస్ట్ రోజంతా ప్రత్యక్ష దర్శనానికి వీలు కల్పిస్తుంది. ఈ సదుపాయం సంవత్సరమంతా ఉంటుంది గానీ నవరాత్రుల సందర్భంగా ప్రత్యేక హారతులతో మరింత కనువిందు కలిగిస్తుంది. https://www.siddhivinayak.org/live-darshan/ వెబ్‌సైట్‌లోకి వెళ్లి దర్శనం చేసుకోవచ్చు. లాగిన్ కావాల్సిన అవసరమేమీ లేదు. గణపతి విగ్రహాన్ని, పూజలను హైడెఫినిషన్ నాణ్యతతో చూడొచ్చు. శ్రీ సిద్ధివినాయక్ టెంపుల్ యాప్ సైతం అందుబాటులో ఉంది.

టెక్నో నాజూకు ఫోన్



టెక్నో మనదేశంలో స్పార్క్ గో 5జీ ఫోన్‌ను పరిచయం చేసింది. ఆండ్రాయిడ్ 15 ఆధారిత హైఓఎస్ 15, మీడియాటెక్ డైమెన్సిటీ 6400 చిప్‌సెట్‌తో పనిచేసే దీని ఫీచర్లు ఇవీ.

● 120హెచ్‌జడ్ రిఫ్రెష్ వేగం, 670 నిట్స్ గరిష్ఠ ప్రకాశం, 1600×720 పిక్సెల్స్ రెజల్యూషన్‌తో కూడిన 6.76 అంగుళాల హెచ్‌డీ+ ఎల్‌సీడీ డిస్‌ప్లే.
● మందం 7.99 ఎం.ఎం., బరువు 194 గ్రాములు.
● వెనకాల ఫ్లాష్‌తో కూడిన 50ఎంపీ ప్రైమరీ సెన్సర్, ముందు సెల్ఫీల కోసం 5ఎంపీ కెమెరా.
● 16జీబీ ర్యామ్, 256జీబీ స్టోరేజీ. ర్యామ్‌ను 8జీబీ వరకూ పెంచుకునే సదుపాయం.
● 6000ఎంఏహెచ్ భారీ బ్యాటరీ.
● డ్యుయల్ సిమ్, నీటిని తట్టుకునే ఐపీ64 రేటింగ్.
● స్కైబ్లూ, ఇంక్ బ్లాక్, టర్కోయిస్ గ్రీన్ రంగుల్లో అందుబాటులో ఉండే దీని ధర రూ.9,999.

వాట్సప్‌లో కొత్త వాయిస్ మెయిల్

వాట్సప్‌లో కాల్ చేస్తాం. కానీ అవతలివారు మాట్లాడలేరు. అత్యవసరంగా ఏదైనా చెప్పాల్సి వస్తే ఇది ఇబ్బందికరమైన విషయమే. ఇలాంటి పరిస్థితిని తప్పించటానికే వాట్సప్ కొత్త ఫీచర్‌ను పరీక్షిస్తోంది. అవతలివారు కాల్‌ను స్వీకరించకపోతే వాయిస్ మెసేజ్‌ను పంపించటం దీని ప్రత్యేకత. యూజర్లు వాయిస్ మెసేజ్‌ను రికార్డు చేయటమో లేదా వాట్సప్‌లో తిరిగి కాల్ చేయటానికి ప్రయత్నించటమో ఏదో ఒకటి ఎంచుకోవచ్చు. ఈ సదుపాయం చాట్‌లో మిస్డ్ కాల్ షార్ట్‌కట్‌గా కనిపిస్తుంది. ఫాలో అప్ వాయిస్ మెసేజ్ పంపించేట్టు దాంతో చూడొచ్చు. అవతలివారు దాన్ని వీలున్నప్పుడు వినొచ్చు.

మణికట్టుతోనే మాయాజాలం

మెటా సంస్థ త్వరలో హైపర్‌నోవా అనే స్మార్ట్ కళ్లద్దాలను తీసుకొస్తోంది. లెన్స్‌లో చిన్న స్క్రీన్ ఉండటం దీని ప్రత్యేకత. టెక్స్ట్, మ్యాప్స్, ఫొటోల వంటివన్నీ ఇందులో చూసుకోవచ్చు. ఫోన్ చేతిలో ఉండాల్సిన పనిలేదు. దీన్ని రిస్ట్‌బ్యాండ్‌తోనే నియంత్రించే వీలుండటం విశేషం. చేతి కదలికల తీరునే కంట్రోళ్లుగా తీసుకుంటుంది. కోరుకున్న పనులు చేసి పెడుతుంది. నిజంగా ఇంద్రజాలంలాగే ఉంది కదా.

వరుణుడికి మరో చందమామ



యురేనస్ చుట్టూ మరో చంద్రుడు భ్రమిస్తున్నట్టు నాసాకు చెందిన జేమ్స్ వెబ్ స్పేస్ టెలిస్కోప్ (జేడబ్ల్యూఎస్‌టీ) గుర్తించింది. దీంతో వరుణ గ్రహం చంద్రుళ్ల సంఖ్య 29కి చేరింది. సౌత్‌వెస్ట్ రిసెర్చ్ ఇన్‌స్టిట్యూట్ అంతరిక్షాన్ని పరిశీలిస్తున్నప్పుడు ఫిబ్రవరి 2న ఇది బయటపడింది. కేవలం 9.6 కిలోమీటర్ల విస్తీర్ణం గల దీన్ని ప్రస్తుతానికి ఎస్/2025 యూ1 అని పిలుచుకుంటున్నారు. త్వరలో ఇంటర్నేషనల్ ఆస్ట్రోనామికల్ యూనియన్ (ఐఏయూ) అధికారికంగా నామకరణం చేయనుంది. యురేనస్ కేంద్రం నుంచి 56,327 కి.మీ. దూరంలో ఉన్న ఇది దాదాపు వృత్తాకార మార్గంలో భ్రమిస్తోంది. మిరండ, ఏరియల్, అంబ్రియెల్, ఓబెరాన్, టైటానియా వంటి పెద్ద చంద్రుళ్ల కక్ష్యల్లో ఉండే ఇతర చిన్న చంద్రుళ్లతో పాటే ఇదీ సాగుతోంది. ఎస్/2025 యూ1 ఆవిష్కరణ జేడబ్ల్యూఎస్‌టీ అధునాతన సామర్థ్యాలను మరోసారి నిరూపించింది. దీనిలోని నియర్-ఇన్‌ఫ్రారెడ్ కెమెరా (నిర్‌క్యామ్) సాయంతోనే ఈ అతి చిన్న చంద్రుడిని గుర్తించటం సాధ్యమైంది. పెద్ద చంద్రుళ్ల మధ్యలో తిరిగే చిన్న చంద్రుళ్ల సంక్లిష్ట వ్యవస్థకిది మరో నిదర్శనం. యురేనస్‌కు ఉన్నన్ని అంతర్ చంద్రుళ్లు మరే గ్రహానికి లేవు మరి. ఇలాంటివి మరెన్నో ఉండొచ్చనీ అనుకుంటున్నారు. గతలో బయటపడ్డ చిన్న చంద్రుడి కన్నా ఇది మరింత చిన్నగా, తక్కువగా ప్రకాశిస్తుండటం గమనార్హం.

హెచ్‌పీ ఓమెన్ గేమింగ్ ల్యాప్‌టాప్



హెచ్‌పీ మనదేశంలో కొత్తగా ఓమెన్ 16 గేమింగ్ ల్యాప్‌టాప్‌ను ఆవిష్కరించింది. ఇంటెల్ లేదా ఏఎండీ ప్రాసెసర్లతో కూడిన ఇది ఓమెన్ ఏఐతో పనిచేస్తుంది. ఎన్‌విడియా జీఈఫోర్స్ 12 జీబీ ఆర్‌టీఎక్స్5070 టీఐ జీపీయూ వరకూ అందిస్తుంది. 170డబ్ల్యూ టోటల్ ప్రాసెసర్ పవర్, 115డబ్ల్యూ జీపీయూ సపోర్టు గల ఇందులో మరింత ఎక్కువసేపు ఆడుకోవటానికి కొత్త ఫ్యాన్ క్లీనింగ్ పరిజ్ఞానంతో కూడిన కూలింగ్ వ్యవస్థ కూడా ఉంటుంది. ఇది ఫ్యాన్‌ను వెనక్కు తిప్పటం ద్వారా దుమ్మును బయటకు పోయేలా చేస్తుంది. హెచ్‌పీకి చెందిన ఓమెన్ గేమింగ్ హబ్‌లో గేమర్స్ కోసం ఫైన్ ట్యూన్ సిస్టమ్ సెటింగ్స్, పవర్ మోడ్స్, కూలింగ్ ప్రిఫరెన్సెస్ ఆప్షన్లు కూడా ఉంటాయి. వీటిని ఇష్టమైనట్టుగా మార్చుకొని, వాడుకోవచ్చు. 16 అంగుళాల క్యూహెచ్‌డీ ప్యానెల్, 240హెచ్‌జడ్ రిఫ్రెష్ వేగంతో కూడిన 2560×1600 రెజల్యూషన్, 500 నిట్స్ గరిష్ఠ ప్రకాశంతో అలరిస్తోంది. దీని ప్రారంభ ధర రూ.129,999.

పీడీఎఫ్ ఫైలేనా?

ఆన్‌లైన్‌లో జోలికెళ్లి పీడీఎఫ్ ఫైళ్లను డౌన్‌లోడ్ చేస్తుంటాం కదా. అయితే డౌన్‌లోడ్ చేసే ముందు ఫైలు పేరు చివర .pdf ఉందేమో తప్పకుండా చూడండి. ఒకవేళ .exe అని ఉన్నట్టయితే వాటి జోలికి వెళ్లకండి. డౌన్‌లోడ్ చేస్తే వెంటనే డిలీట్ చేయండి. ఇది ఎగ్జిక్యూటేబుల్ ప్రోగ్రామ్ కావొచ్చు. మారువేషంలో ఉన్న మాల్వేర్ కావొచ్చు. కాబట్టి జాగ్రత్త అవసరం.

డబ్బులిస్తే క్రీడా కోటాలో డీఎస్సీ ఉద్యోగాలు!

సామాజిక మాధ్యమాల్లో వీడియో హల్‌చల్

విజయవాడ నేరవార్తలు, న్యూస్‌టుడే : 'డీఎస్సీ 2025'లో క్రీడా కోటా కింద 3 శాతం ఉద్యోగాలున్నాయి. డబ్బు ఖర్చు పెడితే దొడ్డిదోవన ఉద్యోగాలు ఇప్పిస్తా. స్పోర్ట్స్ అథారిటీ ఆఫ్ ఏపీ (శాప్) అధికారుల పూర్తి సహాయ సహకారాలు మాకున్నాయంటూ...' ఓ వ్యక్తి వీడియో సామాజిక మాధ్యమాల్లో హల్‌చల్ చేసింది. అదే వ్యక్తి.. తాను ప్రభుత్వ ఉన్నతాధికారినంటూ డీఎస్సీ అభ్యర్థులను ప్రలోభాలకు గురి చేస్తుండడం విజయవాడ నగరంలో కలకలం సృష్టించింది. డీఎస్సీ క్రీడా కోటా ఎంపికలపై ఈ రెండు వీడియోలు దుష్ప్రభావం చూపుతున్నాయంటూ శాప్ అధికారులు పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఇప్పటికే క్రీడాకారుల డ్రగ్స్ వినియోగంపై రచ్చరచ్చ జరుగుతుండగా.. తాజాగా డబ్బులిస్తే క్రీడా కోటాలో ఉద్యోగాలని సామాజిక మాధ్యమాల్లో వీడియో వైరల్ అవడం చర్చనీయాంశమైంది.

ఇలా వెలుగుచూసింది...: విజయవాడ శాప్ కార్యాలయంలో పి.వెంకట రమణానాయక్ ఏవోగా పని చేస్తున్నారు. ఆయన సోమవారం ఉదయం వాట్సాప్‌లో డీఎస్సీ 2025పై ఇద్దరు వ్యక్తులు మాట్లాడుకుంటున్న వీడియో గమనించారు. ముడుపులు చెల్లిస్తే క్రీడా కోటా కింద వచ్చే 3 శాతం ఉద్యోగాలు ఇప్పిస్తానంటూ ఒక వ్యక్తి మరొకరితో మాట్లాడారు. అదే వ్యక్తి తాను ప్రభుత్వంలో ఉన్నతాధికారినంటూ ప్రచారం చేసుకున్నారు. ఈ రెండు వీడియోలు ప్రజల్లో శాప్‌పై తప్పుడు అభిప్రాయం కలిగించేలా ఉన్నాయని శాప్ ఏఓ వెంకట రమణానాయక్ పేర్కొన్నారు. ఈ వీడియోలో మాట్లాడిన వారిపై తగిన చర్యలు తీసుకోవాలని కోరుతూ సైబర్ క్రైం పోలీసులకు ఫిర్యాదు చేయగా.. వారు సోమవారం రాత్రి కేసు నమోదు చేశారు.

ప్రేమ పేరుతో విద్యార్థినికి వేధింపులు

అసభ్యకర ఫొటోలు పోస్టుచేస్తానని బెదిరింపులు

మధురానగర్, న్యూస్‌టుడే : ప్రేమించానని వెంటపడ్డాడు. ఆమె నిరాకరించడంతో.. అసభ్యకర ఫొటోలు సామాజిక మాధ్యమాల్లో పెడతానని బెదిరించి డబ్బులు, నగలు గుంజేశాడు. అజిత్‌సింగ్‌నగర్ పోలీస్ స్టేషన్ పరిధిలో నివసించే ఓ యువతి డిగ్రీ మూడో సంవత్సరం చదువుతున్నారు. అదే కళాశాలలో సీనియర్ విద్యార్థి అయిన పి.రవితేజ.. ప్రేమించానని చెప్పడంతో ఆమె నిరాకరించారు. అతడు తన చరవాణితో ఆమె ఫొటోలు తీశాడు. వాటిని మార్ఫింగ్ చేసి.. అసభ్యకరంగా సృష్టించి సామాజిక మాధ్యమాల్లో పెడతానని బెదిరించాడు. రూ.5 లక్షలు ఇవ్వాలనడంతో ఆమె ఏం చేయలేక యువకుడి తల్లి కస్తూరికి రూ.50వేలు పంపించారు. ఇంకా డబ్బులు కావాలని వేధిస్తుండడంతో.. రూ.1.07 లక్షల వరకు ఇచ్చారు. ఇక డబ్బులు లేవనడంతో.. ఆమె వద్ద ఉన్న 28 గ్రాముల బంగారు గాజులు లాక్కున్నాడు. ఇంకా వేధిస్తుండడంతో.. యువతి తన తల్లికి విషయం చెప్పారు. దీంతో ఆమె.. రవితేజను ప్రశ్నించారు. డబ్బులు, బంగారం ఇవ్వాలని నిలదీయగా.. వాటిని ఇచ్చేందుకు నిరాకరించాడు. మరో రూ.5 లక్షలు చెల్లిస్తేనే రాజీకి వస్తాననడంతో బాధితులు పోలీసులకు ఫిర్యాదు చేశారు. రవితేజ, అతడి తల్లి కస్తూరిపై అజిత్‌సింగ్‌నగర్ పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.


మ్యాజిక్ డ్రెయిన్ల పరిశీలన



వివరాలు అడిగి తెలుసుకుంటున్న పలు జిల్లాల క్వాలిటీ కంట్రోల్ అధికారులు

నందిగామ గ్రామీణం, న్యూస్‌టుడే : జిల్లాలోని సోమవరంలో పైలెట్ ప్రాజెక్టుగా నిర్మించిన మ్యాజిక్ డ్రెయిన్లను మంగళవారం రాష్ట్రంలోని 26 జిల్లాల జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం జూనియర్, సీనియర్ క్వాలిటీ కంట్రోల్ అధికారులు పరిశీలించారు. ఎస్సీకాలనీలో ఇప్పటికే నాలుగు సిమెంటు రహదారుల వెంట వీటిని నిర్మించగా అయిదోది నిర్మాణంలో ఉంది. ఇటీవల జోరున కురిసిన వర్షాలకు డ్రెయిన్లలో నీరు నిలువకుండా భూగర్భంలోకి ఇంకాయి. ఈ డ్రెయిన్ల వల్ల పరిసరాలు పరిశుభ్రంగా ఉండటం, నిర్మాణ వ్యయం తక్కువగా ఉండటంతో మిగిలిన అన్ని జిల్లాల్లో ప్రయోగాత్మకంగా ఈ తరహాలో నిర్మించడానికి చర్యలు చేపట్టారు. మ్యాజిక్ డ్రెయిన్ల చిత్రాలను పరిశీలించారు. ఎన్టీఆర్ జిల్లా ఉపాధి హామీ పథకం సీనియర్ క్వాలిటీ కంట్రోలర్ సురేష్‌కుమార్, జూనియర్ క్వాలిటీ కంట్రోలర్ నాగిరెడ్డి ఈ డ్రెయిన్ల నిర్మాణంలో సాంకేతిక వివరాలను వారికి తెలిపారు. కార్యక్రమంలో ఎన్ఆర్ఈజీఎస్ నందిగామ ఏపీడీ ఎన్.శ్రీనివాసరావు, ఏపీవో శరత్‌బాబు, యోగానందం, స్థానిక ఉపాధి హామీ సిబ్బంది పాల్గొన్నారు.

విజయ పాలక మండలి సభ్యుల ఎన్నిక ఏకగ్రీవం



ధ్రువపత్రాలతో ఎన్నికైన పాలకమండలి సభ్యులు, పక్కన ఛైర్మన్ ఆంజనేయులు, ఎండీ ఈశ్వరబాబు, ఎన్నికల అధికారి గురునాథం తదితరులు

చిట్టినగర్, న్యూస్‌టుడే : కృష్ణా జిల్లా పాల సమితి (విజయ డెయిరీ) పాలకమండలి సభ్యులుగా ముగ్గురిని ఏకగ్రీవంగా ఎన్నుకున్నట్లు ఎన్నికల అధికారి ఎల్.గురునాథం మంగళవారం ప్రకటించారు. ఏటా ముగ్గురు సభ్యుల పదవీకాలం ముగుస్తుండటంతో ఎన్నికలు నిర్వహించారు. సోమవారం నామినేషన్ల ప్రక్రియ పూర్తి కాగా అదే రోజున పరిశీలన చేశారు. జనరల్ కేటగిరిలో ముగ్గురు, మహిళా కేటగిరిలో ఇద్దరు నామినేషన్లు దాఖలు చేశారు. వారిలో చిట్యాల గ్రామ పాల సొసైటీ అధ్యక్షురాలు బోయపాటి సుశీల నామినేషన్ తిరస్కరించడంతో నెక్కళపు వాణిశ్రీ ఏకగ్రీవంగా గెలిచినట్లు ప్రకటించారు. సాధారణ కేటగిరిలో ముగ్గురు నామినేషన్లు దాఖలు చేయగా వారిలో తిరువూరు మండలం, ముష్టికుంట్ల గ్రామ పాల సొసైటీ అధ్యక్షుడు గద్దె రంగారావు తన నామినేషన్‌ను మంగళవారం ఉప సంహరించుకున్నారు. ఈ నేపథ్యంలో పెడన మండలం, పెనుమల్లి గ్రామ పాల సొసైటీ అధ్యక్షుడు అర్జా వెంకట నగేష్, జగ్గయ్యపేట మండలం, భీమవరం గ్రామ పాల సొసైటీ అధ్యక్షుడు యింజం రామారావుల ఎన్నిక ఏకగ్రీవమైంది. ముగ్గురికి ధ్రువపత్రాలను ఎన్నికల అధికారి గురునాథం అందించారు. నూతన సభ్యులను ఛైర్మన్ చలసాని ఆంజనేయులు, మేనేజింగ్ డైరక్టర్ కొల్లి ఈశ్వరబాబు అభినందించారు.

'బేడ జంగం కులాన్ని ఎస్సీలో కొనసాగించాలి'

గాంధీనగర్, న్యూస్‌టుడే : రాష్ట్రంలో వెనుకబడి ఉన్న బేడ(బుడగ) జంగం కులాన్ని ఎస్సీ జాబితాలో కొనసాగించాలని ఏపీ ఎమ్మార్పీఎస్ రాష్ట్ర అధ్యక్షుడు పేరుపోగు వెంకటేశ్వరరావు మాదిగ డిమాండ్ చేశారు. మంగళవారం ఆయన విజయవాడ ప్రెస్ క్లబ్‌లో విలేకరులతో మాట్లాడారు. వీరికి కుల ధ్రువీకరణాలు లేకపోవడంతో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అమలు చేస్తున్న సంక్షేమ పథకాలు అందడం లేదని ఆవేదన వ్యక్తం చేశారు. ఆన్‌లైన్ ద్వారా పత్రాలు అందించాలని కోరారు. సంఘం రాష్ట్ర అధ్యక్షుడు వనం నాగేశ్వరరావు మాట్లాడుతూ.. 2023లో వైకాపా ప్రభుత్వం నిలిపివేసిన కుల ధ్రువీకరణ పత్రాలను తిరిగి అందజేస్తామని ఇచ్చిన హామీని కూటమి ప్రభుత్వం నిలబెట్టుకోవాలని కోరారు.

మత్స్యకారుల సంక్షేమానికి చర్యలు



బాధ్యతలు స్వీకరిస్తున్న వెంకటలక్ష్మి

గొల్లపూడి, న్యూస్‌టుడే : మత్స్యకారుల సంక్షేమానికి అవసరమైన చర్యలు చేపడతానని ఏపీ వడ్డీలు సంక్షేమ, అభివృద్ధి కార్పొరేషన్ ఛైర్‌పర్సన్ ఘంటసాల వెంకటలక్ష్మి పేర్కొన్నారు. ఏలూరు జిల్లా దెందులూరు నియోజకవర్గం జనసేన బాధ్యురాలిగా ఉన్న ఆమెను ఏపీ వడ్డీలు సంక్షేమ, అభివృద్ధి కార్పొరేషన్ ఛైర్‌పర్సన్‌గా ఇటీవల ప్రభుత్వం నియమించింది. ఈ మేరకు మంగళవారం విజయవాడ గొల్లపూడిలోని బీసీ భవన్‌లో ఆమె బాధ్యతలు స్వీకరించి మాట్లాడారు. వడ్డీ కులస్థులు ఎక్కువగా చేపల వేట సాగిస్తూ జీవనం సాగిస్తారని, వారి సమస్యలను ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్తానని చెప్పారు. సీఎం చంద్రబాబు, ఉప ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్‌లకు కృతజ్ఞతలు తెలిపారు. వెంకటలక్ష్మితో బీసీ కార్పొరేషన్ జేఎండీ జి.ఉమాదేవి ప్రమాణ స్వీకారం చేయించగా నాయకులు ఎం.తిమోతీ, ఎం.కొండలరావు, జె.రంగబాబు, రామకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

శతాధిక వృద్ధుల సత్కారానికి దరఖాస్తుల ఆహ్వానం



కరపత్రాలు ఆవిష్కరిస్తున్న హరికుమార్, అర్జునరావు, ఉమామహేశ్వరరావు తదితరులు

సత్యనారాయణపురం (గాంధీనగర్), న్యూస్‌టుడే : ప్రపంచ వృద్ధుల దినోత్సవం పురస్కరించుకుని వయోవృద్ధుల ఛారిటబుల్ ట్రస్టు ఆధ్వర్యంలో శతాధిక వృద్ధులను సత్కరిస్తున్నట్లు ఛైర్మన్, డాక్టర్ చల్లా హరికుమార్ తెలిపారు. మంగళవారం స్థానిక దుర్గాపురంలోని విజయ నర్సింగ్ కళాశాలలో కార్యక్రమ కరపత్రాలు ఆవిష్కరించారు. ఆయన మాట్లాడుతూ.. ఉమ్మడి కృష్ణా జిల్లాతో పాటు ఉమ్మడి గుంటూరు, పశ్చిమ గోదావరి జిల్లాల్లో వందేళ్లు పూర్తి చేసుకున్న వృద్ధులను ఒకే వేదికపై సత్కరిస్తామని వెల్లడించారు. ఇలాంటి వారి వివరాలను తమ దృష్టికి తీసుకురావాలని కోరారు. తామే వారి ఇంటికి వెళ్లి కార్యక్రమానికి తీసుకొచ్చి, అక్టోబరు 1వ తేదీన సత్కరిస్తామని.. నగదు బహుమతి ఇస్తామని పేర్కొన్నారు. సెప్టెంబరు 10వ తేదీలోపు ఫోన్ నంబరు 98481 11138లో సంప్రదించాలని ఆయన కోరారు. ట్రస్టు సభ్యులు తట్టి అర్జునరావు, ఉమామహేశ్వరరావు, మధుసూదనరావు, గోదావరి వెంకటేష్, పి.లక్ష్మీనరసింహారావు తదితరులు పాల్గొన్నారు.

నేటి నుంచి బీఎస్సీ నర్సింగ్ ఆన్‌లైన్ దరఖాస్తులు

ఎన్టీఆర్ ఆరోగ్య విశ్వవిద్యాలయం: 2025-26 విద్యా సంవత్సరానికి రాష్ట్రంలోని నర్సింగ్ వైద్య కళాశాలల్లో అందుబాటులో ఉన్న బీఎస్సీ నర్సింగ్(నాలుగేళ్ల) కోర్సు కన్వీనర్ కోటా సీట్ల ప్రవేశానికి ఆన్‌లైన్ దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు విజయవాడ డాక్టర్ ఎన్టీఆర్ ఆరోగ్య విశ్వవిద్యాలయం నోటిఫికేషన్ మంగళవారం విడుదల చేసింది. ఇప్పటికే విశ్వవిద్యాలయం నిర్వహించిన ప్రవేశ పరీక్షలో అర్హత సాధించిన అభ్యర్థులు ఈ నెల 27వ తేదీ మధ్యాహ్నం 3 గంటల నుంచి సెప్టెంబరు 4వ తేదీ రాత్రి 7 గంటల్లోగా సంబంధిత ధ్రువీకరణ పత్రాలతో ఆన్‌లైన్ ద్వారా దరఖాస్తు చేసుకోవాలి.

ట్యాక్సీ యజమానుల సమస్యలు పరిష్కరించాలి



నూతన కమిటీ ప్రమాణ స్వీకారంలో పాల్గొన్న ఆర్టీవో ప్రవీణ్, ట్రాఫిక్ ఏసీపీ రామచంద్ర తదితరులు

కానూరు, న్యూస్‌టుడే: ట్యాక్సీ యజమానుల సమస్యలను ప్రభుత్వం పరిష్కరించాలని ది విజయవాడ ట్యాక్సీ యజమానుల సంఘం అధ్యక్షుడు సాయిప్రసాద్ అన్నారు. మంగళవారం కానూరులోని ఓ కల్యాణ మండపంలో నిర్వహించిన సర్వసభ్య సమావేశంలో ఆయన పాల్గొని మాట్లాడారు. నగరంలో ట్రాఫిక్ సమస్యతో తీవ్ర ఇబ్బందులు పడుతున్నామన్నారు. ట్యాక్సీ బోర్డు గ్రీన్ ట్యాక్స్ తగ్గించాలని కోరారు. తెలంగాణ రాష్ట్ర బోర్డర్ ట్యాక్స్ కూడా చాలా ఎక్కువగా ఉందన్నారు. అసోసియేషన్ రాష్ట్ర కార్యాలయానికి ప్రభుత్వం స్థలం కేటాయించాలని విజ్ఞప్తి చేశారు. అనంతరం ఆర్టీవో ప్రవీణ్, ట్రాఫిక్ ఏసీపీ రామచంద్రలు మాట్లాడుతూ ఆయా సమస్యలను ప్రభుత్వం దృష్టికి తీసుకెళతామని చెప్పారు. రోటరీ క్లబ్ ఆధ్వర్యంలో ఉచిత కంటి వైద్య శిబిరం నిర్వహించి, మందులు, కళ్లజోళ్లు అందజేశారు. అనంతరం నూతన కమిటీ సభ్యులు ప్రమాణ స్వీకారం చేశారు. కార్యక్రమంలో అసోసియేషన్ ఉపాధ్యక్షుడు బాబూరావు, చంద్రశేఖర్, నాగేంద్రకిశోర్, రాంబాబు, శ్రీనివాస్, డ్రైవర్లు పాల్గొన్నారు.



సంఘీభావం తెలుపుతున్న నాయకులు

పెన్షన్ వ్యాలిడేషన్ చట్టం రద్దుకు డిమాండ్


మొగల్రాజపురం(విజయవాడ సిటీ), న్యూస్‌టుడే: పెన్షనర్లకు తీవ్ర నష్టాన్ని కలిగించే పెన్షన్ వ్యాలిడేషన్ చట్టం-2025ను కేంద్ర ప్రభుత్వం రద్దు చేయాలని ఫోరం ఆఫ్ సివిల్ పెన్షనర్స్ అసోసియేషన్ అధ్యక్షుడు వి.వరప్రసాద్, కన్వీనర్ ఎన్.రామారావులు డిమాడ్ చేశారు. ఈ చట్టానికి వ్యతిరేకంగా సంఘం ఆధ్వర్యంలో మంగళవారం నగరంలోని సిద్ధార్థ ఆడిటోరియంలో రాష్ట్ర స్థాయి ఐక్య సమావేశం నిర్వహించారు. వారు మాట్లాడుతూ రెగ్యులర్ ఉద్యోగులతో సమానంగా పెన్షన్ రివిజన్ గతంలో జరిగేదని, ఈ చట్టం వల్ల జరగదని, ఉద్యోగ విరమణ అయిన తర్వాత ఎంత అయితే పెన్షన్ వస్తుందో జీవితకాలం అంతే వస్తుందని, దీనిపై పెన్షనర్లు తీవ్ర ఆందోళనలో ఉన్నారని తెలిపారు. ఇది రాజ్యాంగంలోని ఆర్టికల్ 14ను ఉల్లంఘించినట్లేనని, సుప్రీంకోర్టు గతంలో ఇచ్చిన తీర్పునకు భిన్నంగా ఉందన్నారు. 40 ఏళ్లు ప్రజలకు సేవలందించిన కేంద్ర ప్రభుత్వ ఉద్యోగులను తీవ్ర ఇబ్బందులకు గురిచేస్తున్నారని మండిపడ్డారు. కో- కన్వీనర్లు ఎన్.నాగేశ్వరరావు, ఎ.చంద్రశేఖర్ మాట్లాడుతూ 8వ వేతన సంఘాన్ని ఏర్పాటు చేయాలని ప్రభుత్వాన్ని కోరారు. అసోసియేషన్ ఉపాధ్యక్షుడు పి.అశోక్‌బాబు, ఎ.కోటేశ్వరరావు, పీఎస్‌వీ ప్రసాద్, ఎన్.నాగేశ్వరరావు, చంద్రశేఖరరావు సీఐటీయూ రాష్ట్ర అధ్యక్షుడు ఏవీ నాగేశ్వరరావు, రాష్ట్ర ప్రధాన కార్యదర్శి సీహెచ్ నరసింగరావు పాల్గొన్నారు. రాష్ట్రంలోని అన్ని జిల్లాల నుంచి పెన్షనర్లు హాజరయ్యారు.

తెలంగాణ దంపతులకు టోకరా ఘటనపై దర్యాప్తు ముమ్మరం

విజయవాడ వైద్యం, న్యూస్‌టుడే: బిడ్డను అమ్మితామని తెలంగాణ దంపతులను విజయవాడలో మోసం చేసిన ఘటనపై నగర పోలీసులు, ఆసుపత్రుల అధికారులు దృష్టి సారించారు. ఇందులో భాగంగా ప్రత్యేక దర్యాప్తు బృందాన్ని నగర సీపీ రాజశేఖర్‌బాబు ఏర్పాటు చేసినట్టు తెలిసింది. ఇప్పటికే పోలీసులు రెండు ఆసుపత్రుల్లో సీసీ ఫుటేజ్ పరిశీలించారు. విజయవాడ ప్రభుత్వ ఆసుపత్రుల సూపరింటెండెంట్ డా.ఏవీ రావు మంగళవారం కలెక్టర్‌కు, రాష్ట్ర వైద్య ఆరోగ్య శాఖ అధికారులకు ఈ ఘటనపై నివేదిక ఇచ్చారు. డా.ఏవీ రావు మాట్లాడుతూ పత్రికల్లో వచ్చిన కథనాలను గమనించామని, అటువంటి ఘటన విజయవాడ కొత్త ప్రభుత్వాసుపత్రిలో చోటుచేసుకోలేదన్నారు. విజయవాడ పాత ఆసుపత్రిలో కూడా అప్పుడే పుట్టిన శిశువులకు జియోటాగింగ్ అనే ప్రత్యేక పరికరాన్ని ఏర్పాటు చేశామని, దొంగిలించడం వంటి ఘటనలకు ఆస్కారం లేదని వివరించారు. ఈ రెండు ఆసుపత్రుల్లో సీసీ ఫుటేజ్ పరిశీలించామని అటువంటి ఘటనకు ఆస్కారం లేదన్నారు. ఆసుపత్రి ఆవరణల్లో సీసీ ఫుటేజ్‌లను కూడా పరిశీలిస్తున్నట్టు తెలిపారు.

గువాహటిలో

భారీ తెలుగు వినాయకుడు



అస్సాంలోని గువాహటిలో 'ఆపరేషన్ సిందూర్'ను తలపించేలా 41 అడుగుల భారీ గణపయ్య కొలువుదీరుతున్నాడు. ఈ విగ్రహాన్ని స్థానిక తెలుగు ప్రజలు ఏర్పాటుచేయడం విశేషం. అస్సాం తెలుగు అసోసియేషన్, డాక్టర్ బి.ఆర్. అంబేడ్కర్ యూత్ క్లబ్ కలిసి గత నాలుగు దశాబ్దాలుగా గణేశ్ చతుర్థి వేడుకలను ఘనంగా నిర్వహిస్తున్నాయి. ఏటా వినాయక చవితికి తెలుగువారంతా ఒక చోటుకు చేరుతామని అస్సాం తెలుగు అసోసియేషన్ ప్రధాన కార్యదర్శి కె.శ్రీనివాసరావు తెలిపారు. అస్సాం రాష్ట్రవ్యాప్తంగా 2 లక్షలమంది తెలుగు ప్రజలు ఉంటారని, ఒక్క గువాహటిలోనే సుమారు 10,000 మంది ఉన్నారన్నారు.

ఈటీవీ భారత్

యాపిల్ గణనన..

'గిన్నిస్' గణపతి!



ఒడిశాలోని సంబల్‌పుర్‌లో 1,500 కిలోల యాపిల్ పండ్లతో 28 అడుగుల వినాయక విగ్రహాన్ని సిద్ధం చేశారు. ఆరోగ్య వరప్రదంపై అవగాహన కోసం ఈ రూపంలో విఘ్నేశ్వరుడిని కొలవనున్నట్టు నిర్వాహకులు తెలిపారు.

■ గుజరాత్‌లోని సూరత్‌కు చెందిన నగల వ్యాపారి వీరేన్ చోక్సీ కేవలం ఒక అంగుళం ఎత్తు, పది గ్రాముల బరువుతో లక్ష్మి, వినాయకుల విగ్రహాలను తయారు చేశారు. 3డీ ప్రింటింగ్ సాంకేతికతతో వీటి తయారీకి ఇరవై రోజుల సమయం పట్టింది. పది అడుగుల విగ్రహంలో కనిపించే స్పష్టతను ఇందులోనూ చూడవచ్చని చోక్సీ తెలిపారు. ఈ విగ్రహాలకు గిన్నిస్ బుక్ ఆఫ్ వరల్డ్ రికార్డ్స్‌లో స్థానం కోసం దరఖాస్తు చేశారు.

సమాజసేవకు

టైమ్ బ్యాంకులు




ఈటీవీ భారత్: ఇతరుల సేవకు సమయాన్ని కేటాయించే మానవతావాదులను ప్రోత్సహించాలనే సంకల్పంతో యూపీలోని కాన్పుర్‌లో 'టైమ్ బ్యాంక్ ఆఫ్ ఇండియా'ను స్థాపించారు. జపాన్ నుంచి అందిపుచ్చుకొన్న ఈ స్ఫూర్తి మన దేశంలోనూ శరవేగంగా విస్తరిస్తోంది. దేశంలోని వివిధ నగరాల్లో ప్రస్తుతం 7 వేల మందికి పైగా ఇందులో ఖాతాలు తెరిచారు. ఒక్క రూపాయి కూడా డిపాజిట్ చెల్లించాల్సిన అవసరం లేదు. ఆసక్తి ఉన్నవారు టైం బ్యాంక్ అధికారిక వెబ్‌సైట్‌లోకి వెళ్లి పేరు నమోదు చేసుకోవచ్చు. తీరిక సమయాల్లో సేవా కార్యక్రమాలకు కొంత సమయం కేటాయిస్తే చాలు. ఆ సమయాన్ని మీ పాస్‌బుక్‌లో జమ (క్రెడిట్) కింద రాస్తారు. ఈ వివరాలను ఖాతాదారులు ఎప్పటికప్పుడు తెలుసుకోవచ్చు.

ఓటు హక్కుతో రాజ్యాంగ రక్షణ: రాహుల్

మధుబనీ: ఓటుహక్కును ప్రజలు కాపాడుకోవాలని, రాజ్యాంగ పరిరక్షణకు అది అవసరమని కాంగ్రెస్ అగ్రనేత రాహుల్‌గాంధీ పేర్కొన్నారు. ఎన్నికల సంఘం ద్వారా ఓట్లచోరీకి భాజపా నేతలు ప్రయత్నిస్తున్నారని ఆరోపించారు. ఓటరు అధికార యాత్రలో భాగంగా మంగళవారం బిహార్‌లోని మధుబనీ జిల్లా సభలో రాహుల్ ప్రసంగించారు. "ఆర్ఎస్ఎస్ ఎప్పుడూ రాజ్యాంగాన్ని గౌరవించదు. అందరికీ సమాన హక్కులను ఇవ్వడం వారికి నచ్చదు. భాజపా ప్రభుత్వం మరో 40-50 ఏళ్ల వరకు అధికారంలో ఉంటుందని అమిత్ షా చాలాసార్లు చెప్పారు. అన్నేళ్లు అధికారంలో ఉంటారని ఆయనకు ఎలా తెలుసు? దానికి కారణం ఓటుచోరీయే అనే నిజం బయటపడింది" అని చెప్పారు. ఎంపీ ప్రియాంకాగాంధీ మాట్లాడుతూ.. ప్రజా విశ్వాసాన్ని కోల్పోయిన భాజపా ఇప్పుడు ఓట్లు, ఉద్యోగాలు, ప్రజల పౌరసత్వాలను చోరీ చేస్తోందన్నారు.

బిల్లులను ఆమోదించాల్సింది రాష్ట్రపతి, గవర్నర్లే



- న్యాయస్థానాలకు ఆ అధికారం లేదు
- సుప్రీంకోర్టులో భాజపా పాలిత రాష్ట్రాల వాదనలు

దిల్లీ: రాష్ట్ర శాసనసభలు ఆమోదించి పంపించిన బిల్లులకు సమ్మతి తెలపడం, తిరస్కరించడం లేదా తమ వద్దే నిలిపి ఉంచుకునే అధికారాన్ని రాజ్యాంగం.. రాష్ట్రపతి, గవర్నర్లకు మాత్రమే ఇచ్చిందని భాజపా పాలిత రాష్ట్రాలు పేర్కొన్నాయి. ఈ విషయంలో జోక్యం చేసుకునే అధికారం న్యాయస్థానాలకు లేదంటూ ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ బి.ఆర్.గవాయ్ నేతృత్వంలోని సుప్రీంకోర్టు రాజ్యాంగ ధర్మాసనం ముందు మంగళవారం వాదనలు వినిపించాయి. మహారాష్ట్ర తరఫున సీనియర్ న్యాయవాది హరీశ్ సాల్వే మాట్లాడుతూ..'రాష్ట్రాల బిల్లులకు ఆమోదం తెలిపేలా అధికారిక విధులు నిర్వర్తించాలని గవర్నర్లను న్యాయస్థానం ఆదేశించరాదు. చట్టానికి కోర్టు ఆమోదం తెలుపలేదు. ఆ విధి నిర్వర్తించాల్సింది గవర్నర్లు లేదా రాష్ట్రపతి మాత్రమే'నని పేర్కొన్నారు. శాసనసభలు పంపించిన బిల్లులపై రాజకీయ సంప్రదింపుల తర్వాత గవర్నర్లు, రాష్ట్రపతి నిర్ణయం తీసుకుంటారని, దీనికి ఎంత సమయమైనా పట్టవచ్చని హరీశ్ సాల్వే పేర్కొన్నారు. శాసనసభ 2020లో ఆమోదించి పంపించిన బిల్లును 2025 వరకు కూడా గవర్నర్ తన వద్దే పెండింగ్‌లో ఉంచితే ఎలా? ఆర్థిక బిల్లులను కూడా నిరవధికంగా నిలిపివేస్తారా? ఇలాంటి పరిస్థితుల్లో జోక్యం చేసుకునే అధికారం కోర్టులకు లేదా?.. అంటూ అంతకు ముందు ధర్మాసనం ప్రశ్నించింది. శాసనసభలు పంపించిన బిల్లుల ఆమోదానికి తనకు గడువును నిర్దేశించడంపై పలు ప్రశ్నలు సంధిస్తూ రాష్ట్రపతి కోరిన అభిప్రాయంపై జరుగుతున్న విచారణలో భాగంగా సుప్రీంకోర్టు రాజ్యాంగ ధర్మాసనం ముందు మధ్యప్రదేశ్, రాజస్థాన్, ఉత్తర్‌ప్రదేశ్, గోవా, ఛత్తీస్‌గఢ్, ఒడిశా రాష్ట్రాలు కూడా వాదనలు వినిపించాయి. రాష్ట్రపతి, గవర్నర్ అధికారాల్లో కోర్టుల జోక్యం తగదనే అభిప్రాయాన్ని వ్యక్తం చేశాయి. రాజ్యాంగ ధర్మాసనంలో సీజేఐ జస్టిస్ గవాయ్‌తో పాటు జస్టిస్ సూర్యకాంత్, జస్టిస్ విక్రమ్‌నాథ్, జస్టిస్ పి.ఎస్.నరసింహ, జస్టిస్ ఎ.ఎస్.చందూర్కర్ సభ్యులుగా ఉన్నారు.

జస్టిస్ పంచోలీకి పదోన్నతితో ప్రతికూల ఫలితాలు

- ఆయన్ను సుప్రీంకోర్టుకు సిఫారసు చేయడంపై జస్టిస్ నాగరత్న వ్యతిరేకత

దిల్లీ: గుజరాత్‌కు చెందిన పట్నా హైకోర్టు ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ విపుల్ మను భాయ్ పంచోలీకి సుప్రీంకోర్టు న్యాయమూర్తిగా పదోన్నతి కల్పించాలన్న కొలీజియం నిర్ణయంపై జస్టిస్ బి.వి.నాగరత్న తీవ్ర వ్యతిరేకత వ్యక్తంచేశారు. జస్టిస్ పంచోలీకి ఉన్నతి కల్పించడం న్యాయపరంగా ప్రతికూల ఫలితాలనిస్తుందని కొలీజియం సభ్యురాలైన ఆమె పేర్కొన్నారు. సీజేఐ జస్టిస్ బి.ఆర్.గవాయ్, జస్టిస్ సూర్యకాంత్, జస్టిస్ విక్రమ్‌నాథ్, జస్టిస్ జె.కె. మహేశ్వరి, జస్టిస్ నాగరత్నలతో కూడుకున్న సుప్రీంకోర్టు కొలీజియం బాంబే హైకోర్టు ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ అలోక్ అరాధే, జస్టిస్ పంచోలీలకు అత్యున్నత న్యాయస్థాన న్యాయమూర్తులుగా పదోన్నతి కల్పించాలని సోమవారం సిఫార్సు చేసిన విషయం విదితమే. అయితే జస్టిస్ పంచోలీ పదోన్నతిని జస్టిస్ నాగరత్న వ్యతిరేకిస్తూ అందుకు కారణాలను పేర్కొన్నారు. జస్టిస్ పంచోలీ తక్కువ సీనియారిటీ కలిగివున్నారని, గతంలో గుజరాత్ హైకోర్టు నుంచి పట్నాకు ఆయన బదిలీకి దారితీసిన పరిస్థితులు ప్రతికూల ప్రభావం చూపాయని ఆమె పేర్కొన్నారు. జస్టిస్ పంచోలీ పదోన్నతికి సమ్మతి తెలపడం కొలీజియంకు మిగిలివున్న విశ్వసనీయతనూ నశింపజేస్తుందని ఆమె ఆవేదన వ్యక్తం చేశారు. సుప్రీంకోర్టులో ప్రాంతీయ సమతుల్యాన్ని గురించి కూడా జస్టిస్ నాగరత్న ప్రస్తావించారు. జస్టిస్ పంచోలీకి పదోన్నతి కల్పించాలన్న ప్రతిపాదన గత మే నెలలోనే తలెత్తగా అప్పుడే ఆమె దాన్ని వ్యతిరేకించారని తెలిసింది. దాంతో జస్టిస్ పంచోలీ కంటే ముందుగా జస్టిస్ ఎన్.వి.అంజారియాకు సుప్రీంకోర్టు న్యాయమూర్తిగా పదోన్నతి లభించింది. 3 నెలల తర్వాత మళ్లీ జస్టిస్ పంచోలీ పేరు ముందుకు రావడంతో జస్టిస్ నాగరత్న తిరిగి తన వ్యతిరేకతను వ్యక్తం చేశారు.

ఏకత్వానికి మూలం భిన్నత్వమే

- ఆరెస్సెస్ శతాబ్ది ఉత్సవాల ప్రారంభంలో మోహన్ భాగవత్



దిల్లీ: భారత్‌లోని భిన్నత్వమే దేశ ఏకత్వానికి మూలాధారమని రాష్ట్రీయ స్వయంసేవక్ సంఘ్(ఆరెస్సెస్) అధినేత మోహన్ భాగవత్ పేర్కొన్నారు. భిన్నమైన భావజాలం కలిగి ఉండడం నేరమేమీ కాదనీ తెలిపారు. ఆరెస్సెస్ శతాబ్ది ఉత్సవాలకు శ్రీకారం చుడుతూ దిల్లీలోని విజ్ఞాన్‌భవన్‌లో మూడు రోజుల సదస్సును మంగళవారం ఆయన ప్రారంభించారు. వివిధ దేశాల దౌత్యవేత్తలు, పలువురు ప్రముఖులు హాజరయ్యారు. ఈ సందర్భంగా భాగవత్ ప్రసంగిస్తూ....'భారతీయుల మతం ఏదైనా సరే పూర్వీకుల నుంచి వారసత్వంగా అందిన సంప్రదాయాలు వారందరినీ ఐక్యంగా నిలుపుతున్నాయి. అఖండ భారత్‌లో 40వేల ఏళ్లకుపైగా అందరిదీ ఒకే డీఎన్ఏ' అని తెలిపారు. 'ఐక్యంగా ఉండటానికి అందరూ ఏకరూపకతతో ఉండాల్సిన అవసరం లేదని ఆరెస్సెస్ భావిస్తుంద'ని పేర్కొన్నారు. సామరస్యంతో కలిసిమెలిసి జీవించడం భారతీయ సంస్కృతిలో భాగమేనని తెలిపారు. వేర్వేరు విశ్వాసాలను కలిగి ఉన్నప్పటికీ అందరికీ సమన్యాయం జరుగుతుందన్నారు. హిందూ దేశం ఏ ఒక్కరికీ వ్యతిరేకం కాదని, అందరినీ తనలో కలుపుకొంటుందని వివరించారు. 'ఆరెస్సెస్ వందేళ్ల ప్రస్థానం'పై నిర్వహించిన ప్రసంగాల కార్యక్రమానికి కేంద్ర మంత్రులు జ్యోతిరాదిత్య సింధియా, అనుప్రియా పటేల్, యోగా గురు రాందేవ్, జేడీయూ నేత కె.సి.త్యాగి, సినీనటి, భాజపా ఎంపీ కంగనా రనౌత్ తదితరులు విచ్చేశారు.



కాలమే మాయ చేస్తుందని ఎదురుచూడొద్దు

మీరు కార్యాచరణకు ఉపక్రమించకుండా, కాలమే ఏదో ఒక మాయ చేస్తుందని ఆశగా ఎదురుచూస్తూ కూర్చోవడం మూర్ఖత్వం! ఎప్పటికప్పుడు విజ్ఞానం పెంచుకోండి. సరైన వ్యక్తులతో కలిసి ప్రయాణించండి. ముందు మీ వంతుగా చేయాల్సిన పనులన్నీ పూర్తిచేసి.. ఆపై ఓపికగా ఎదురుచూడండి. అప్పుడే ఫలితాలు అనుకూలంగా వస్తాయి.

– మైఖేల్ థ్రైవ్, విద్యారంగ నిపుణుడు

బాహుబలి రాకెట్



ఈ చిత్రంలో కనిపిస్తున్నది.. ప్రపంచ కుబేరుడు ఎలాన్ మస్క్‌కు చెందిన స్పేస్‌ఎక్స్ సంస్థ రూపొందించిన స్టార్‌షిప్ వీ-3 మోడల్ రాకెట్. దానికింద నిల్చుని చూస్తే అందులోని 33 ఇంజిన్లు ఇలా కనిపిస్తాయి. ఇందులోని ఒక్కో ఇంజిన్ సామర్థ్యం.. ఏ-747 విమానంలోని నాలుగు ఇంజిన్ల సామర్థ్యం కలిపితే ఎంత ఉంటుందో అంతకంటే రెట్టింపు ఉంటుంది. వీ-3 రాకెట్ స్టార్‌షిప్‌ల సిరీస్‌లో అత్యాధునికమైనది. దీని తర్వాత రూపొందించే వీ-4 రాకెట్‌లో 42 ఇంజిన్లను అమర్చనున్నట్లు ఎలాన్ మస్క్ ప్రకటించారు.

ఆ 18 మంది

మాజీ జడ్జీల ప్రకటన సరికాదు

- జస్టిస్ సుదర్శన్‌రెడ్డి పక్షం వహించడాన్ని తప్పుబట్టిన 56 మంది పూర్వ జడ్జీలు

దిల్లీ: ఉపరాష్ట్రపతి ఎన్నికలో ప్రతిపక్షాల అభ్యర్థి బి.సుదర్శన్‌రెడ్డి పక్షం వహిస్తూ 18 మంది మాజీ న్యాయమూర్తులు ప్రకటన వెలువరించడాన్ని మరో 56 మంది మాజీ న్యాయమూర్తుల బృందం మంగళవారం తప్పుపట్టింది. సుప్రీంకోర్టు న్యాయమూర్తిగా జస్టిస్ బి.సుదర్శన్ రెడ్డి "సల్వాజుడుం"కు వ్యతిరేకంగా తీర్పు వెలువరించి ఉండకపోతే 2020లోనే మావోయిజం అంతరించిపోయేదని కేంద్ర హోం మంత్రి అమిత్ షా పేర్కొన్న విషయం విదితమే. దీనిని ఖండిస్తూ 18 మంది మాజీ న్యాయమూర్తులు సోమవారం ప్రకటన వెలువరించారు. తాజాగా ఆ 18 మంది చేసిన ప్రకటనను తప్పు పడుతూ 56 మంది మాజీ న్యాయమూర్తులు రంగంలోకి దిగారు. "రాజకీయాల్లోకి ప్రవేశించిన వారు ఆ రంగంలోనే తమను తాము సమర్థించుకోనివ్వండి. న్యాయ వ్యవస్థను ఇలాంటి వివాదాలకు దూరంగా ఉంచాలి. 18 మంది న్యాయమూర్తులు చేసిన ప్రకటన.. న్యాయవ్యవస్థపై ప్రతికూల ప్రభావం చూపుతుంది. వారి ప్రకటన న్యాయమూర్తుల్ని రాజకీయ పాత్రలు పోషించేవారుగా చూపుతోంది" అని మాజీ న్యాయమూర్తులు తమ ప్రకటనలో తెలిపారు. సుప్రీంకోర్టు మాజీ ప్రధాన న్యాయమూర్తులు జస్టిస్ పి.సదాశివం, జస్టిస్ రంజన్ గొగోయ్, మాజీ న్యాయమూర్తులు జస్టిస్ ఏకే సీకరీ, జస్టిస్ ఎం.ఆర్.షా, జస్టిస్ ఎల్.నరసింహారెడ్డి, జస్టిస్ సురేశ్ కైత్, జస్టిస్ మొహమ్మద్ మగ్రే తదితరులు ఈ ప్రకటనపై సంతకాలు చేసినవారిలో ఉన్నారు.

స్వదేశీ.. మన జీవనమంత్రం కావాలి

- పెట్టుబడి ఎవరిదైనా స్వేదం మనవాళ్లదై ఉండాలి: మోదీ



అహ్మదాబాద్: భారత్‌లో తయారీ (మేకిన్ ఇండియా) అనేది దేశీయ తయారీదారుల్లోనే కాకుండా విదేశీ పెట్టుబడిదారులకూ సానుకూల వాతావరణం తీసుకువచ్చిందని ప్రధాని మోదీ చెప్పారు. స్వదేశీ అనేది మన జీవన మంత్రం కావాలని ఆకాంక్షించారు. మారుతీ సుజుకీ తొలి విద్యుత్తు వాహనమైన ఇ-విటారాను మంగళవారం అహ్మదాబాద్ సమీపంలోని హంసలపుర్ కర్మాగారంలో ఆయన ఆవిష్కరించారు. అనంతరం ప్రసంగించారు. 'స్వదేశీ నిర్వచనం చాలా సరళం. ఎవరి డబ్బును పెట్టుబడి పెట్టారు, అది డాలరా.. పౌండా, అది నల్లధనమా.. తెల్లధనమా అనేవి నాకు అనవసరం. కానీ ఆ డబ్బుతో తయారుచేసే ఉత్పత్తిలో మనవాళ్ల స్వేదమే ఉండాలి. ఆ ఉత్పత్తుల్లో మన మట్టి పరిమళం ఉంటుంది. జపాన్‌కు చెందినప్పటికీ మారుతీ సుజుకీ కూడా స్వదేశీ కంపెనీయే. స్వదేశీని మనం సగర్వంగా హత్తుకోవాలి. దేశీయ ఉత్పత్తులనే కొనాలి. భారత్‌లో తయారైన ఈవీలు ప్రపంచమంతా పరుగులు తీస్తుంటాయి. దేశంలో ఏ రాష్ట్రమూ వెనుకబడకూడదు. మన దేశానికి వచ్చే పెట్టుబడిదారులు ఏ రాష్ట్రానికి వెళ్లాలో తేల్చుకోలేక అయోమయానికి గురికావాలి. అభివృద్ధి ఆధారిత, సుపరిపాలన విధానాలను రూపొందించేందుకు అన్ని రాష్ట్రాలు పోటీపడాలి" అని మోదీ కోరారు.

సీఎంగా నేను కేటాయించిన స్థలమిది

2012లో తాను గుజరాత్ సీఎంగా ఉన్నప్పుడు ఈ కర్మాగారానికి స్థలాన్ని కేటాయించిన విషయాన్ని మోదీ గుర్తుచేసుకున్నారు. మేకిన్ ఇండియాపై అప్పట్లోనే తనకు దృష్టి ఉండేదని చెప్పారు. మారుతి లాంటి కంపెనీలు దేశంలో అతిపెద్ద ఎగుమతిదారుగా ఉంటూ మేకిన్ ఇండియాకు ప్రచారకర్తలుగా మారాయని అభినందించారు. "2047 నాటికి అభివృద్ధి చెందిన దేశంగా భారత్ అవతరించడం నా కల. మన కృషి, త్యాగాలు చూసి భవిష్య తరాలు గర్వపడాలి. దీనికోసం అందరం పాటుపడదాం. ఉజ్వల భవిత కోసం ఆత్మనిర్భర భారత్ మంత్రాన్ని పఠిస్తున్నాం. ఇప్పుడు కార్ల బ్యాటరీలూ మనమే ఉత్పత్తి చేసుకుంటున్నాం" అని చెప్పారు.



లఖ్‌నవూలో తాను చదువుకున్న పాఠశాలలో ఓ విద్యార్థి ప్రదర్శనను తిలకిస్తున్న శుభాంశు శుక్లా

ఇంటికి తిరిగి వచ్చినట్లుంది

చదువుకున్న పాఠశాల సందర్శనలో శుభాంశు శుక్లా

లఖ్‌నవూ: ఇటీవల అంతర్జాతీయ అంతరిక్ష కేంద్రాని(ఐఎస్ఎస్)కి వెళ్లివచ్చిన మన వ్యోమగామి శుభాంశు శుక్లా తన భార్య కామ్నా, కుమారుడు కియాశ్‌లతో కలిసి మంగళవారం తాను చదువుకున్న అలీగంజ్‌లోని సిటీ మాంటిస్సోరి పాఠశాలను సందర్శించారు. ఈ సందర్భంగా ఆయనకు విద్యార్థులు సాంస్కృతిక ప్రదర్శనలతో ఘన స్వాగతం పలికారు. శుక్లా తన పాఠశాల జ్ఞాపకాలను టీచర్లు, విద్యార్థులతో పంచుకున్నారు. "ఒకప్పుడు నృత్యం చేయడానికి టీచర్లను చూసి భయపడ్డ నేను ఈ రోజు వారిని కలవటం చాలా సంతోషంగా ఉంది. కాలం మారిపోయింది. ఇదంతా సుపరిచితంగా అనిపిస్తోంది. ఒకప్పుడు ఈ తరగతి గదుల్లో నేను చదువుకున్నాను. నాకు ఇంటికి తిరిగి వచ్చినట్లుగా ఉంది" అని తెలిపారు.



అది కవచం.. ఖడ్గం!

- ఇజ్రాయెల్ ఐరన్ డోమ్‌ను పోలి ఉంటుంది
- 'సుదర్శన్ చక్ర' తీరును వివరించిన త్రిదళాధిపతి

మహూ: భారత ప్రతిపాదిత గగనతల రక్షణ వ్యవస్థ 'సుదర్శన్ చక్ర'లో భాగంగా భారీ స్థాయిలో సెన్సర్లు, క్షిపణులు, నిఘా యంత్రాంగాలు, కృత్రిమ మేధ సాధనాలను అనుసంధానం చేయాల్సి ఉంటుందని త్రిదళాధిపతి జనరల్ అనిల్ చౌహాన్ తెలిపారు. ఈ వ్యవస్థ.. అటు కవచంలా.. ఇటు ఖడ్గంలా పనిచేస్తుందని చెప్పారు. అది ఇజ్రాయెల్‌కు చెందిన శక్తిమంతమైన గగనతల రక్షణ వ్యవస్థ.. ఐరన్ డోమ్‌ను పోలి ఉంటుందన్నారు. మంగళవారం మధ్యప్రదేశ్‌లోని మహూలో జరిగిన 'రణ్ సంవాద్' సదస్సులో ఆయన మాట్లాడారు. మే నెలలో పాకిస్థాన్ ఉగ్రమూకలపై జరిపిన సైనిక చర్య 'ఆపరేషన్ సిందూర్' గురించి చౌహాన్ వివరించారు. "అది ఒక ఆధునిక ఘర్షణ. దాని నుంచి అనేక పాఠాలు నేర్చుకున్నాం. వాటిలో అనేకం అమలు దశలో ఉన్నాయి. కొన్ని ఇప్పటికే అమలయ్యాయి" అని తెలిపారు. స్వాతంత్ర్య దినోత్సవ ప్రసంగంలో సుదర్శన్ చక్ర ప్రాజెక్టును ప్రధాని నరేంద్ర మోదీ ప్రకటించిన సంగతి తెలిసిందే. దాని వివరాలను అనిల్ చౌహాన్ వెల్లడించారు. అది భారత ఐరన్ డోమ్ లేదా గోల్డెన్ డోమ్ అని పేర్కొన్నారు. దేశంలోని వ్యూహాత్మక, పౌర, జాతీయ ప్రాముఖ్యత ఉన్న ప్రాంతాలను రక్షించడం దీని లక్ష్యమని వివరించారు. దీని కింద మౌలికవసతులు, శత్రు క్షిపణులు, యుద్ధవిమానాలను గుర్తించే, వాటిని నేలకూల్చే వ్యవస్థలను అభివృద్ధి చేయాల్సి ఉంటుందన్నారు. ఇందులో క్షిపణులు, లేజర్ల ప్రయోగం ఉంటాయని తెలిపారు. క్షిపణి కవచంలో నిఘా వ్యవస్థలు, వివిధ ఆయుధాలు ఉంటాయని వివరించారు. "ఈ ప్రాజెక్టు కింద భూతల, గగనతల, సముద్ర, సాగరగర్భం, అంతరిక్షంలోని సెన్సర్లను అనుసంధానించాల్సి ఉంటుంది. బహుళ రంగాలతో నెట్‌వర్క్ సిద్ధం చేయాలి. అప్పటికప్పుడు ప్రతిస్పందించాలంటే భారీ స్థాయిలో డేటాను విశ్లేషించాలి" అని పేర్కొన్నారు. ఈ వ్యవస్థలో కృత్రిమ మేధ, అధునాతన కంప్యూటేషన్, డేటా ఎనలిటిక్స్, బిగ్ డేటా, క్వాంటమ్ టెక్నాలజీలను ఉపయోగించాల్సి ఉంటుందన్నారు. భారతీయులు దీన్ని తక్కువ ఖర్చుతో సాకారం చేస్తారన్న ధీమాను ఆయన వ్యక్తంచేశారు.



జనరల్ అనిల్ చౌహాన్




ఆహా తాజ్! ఆ రోజులు మళ్లీ రావు

ఇంటర్నెట్ డెస్క్: దినేశ్ జ్ఞాని అనే ఛార్టెడ్ అకౌంటెంటు రెండ్రోజుల క్రితం 'ఎక్స్'లో చేసిన ఓ పోస్టు వైరల్‌గా మారింది. "ఆ గోల్డెన్ డేస్‌ను మిస్ అవుతున్నా. ఇండియన్ హోటల్స్‌కు చెందిన ఒక షేర్‌ను వంద రూపాయలకు కొన్నా. ముంబయి తాజ్‌మహల్ ప్యాలెస్ హోటలులో జరిగిన ఆ సంస్థ వార్షిక సమావేశానికి హాజరయ్యా. రూ.3,000 విలువచేసే లంచ్ బఫేను ఉచితంగా తిన్నా. నిజంగా అది విలువైన పెట్టుబడి" అని దినేశ్ పేర్కొన్నారు. తాజ్‌లో బస, ఆహార కూపన్లు మరచిపోలేనన్నారు. 'వికాస్ ప్రాపర్టీస్' వాటాలు కొన్నప్పుడు సైతం 2020లో ఐటీసీ జోధ్‌పుర్‌లో రాత్రి బస, భోజనం ఉచితంగా లభించాయన్నారు. కొవిడ్ తర్వాత అన్ని వార్షిక సమావేశాలు (ఏజీఎంలు) ఆన్‌లైనుకు మారిపోయాయని విచారం వ్యక్తంచేశారు. ఈ పోస్టుకు చాలామంది నెటిజన్లు స్పందిస్తూ తాము కూడా అటువంటి కానుకలు, కూపన్లు అందుకొన్నామంటూ అనుభవాలను పంచుకొన్నారు.

సరిహద్దుల్లో ఉద్దేశపూర్వకంగానే ప్రాదేశిక మార్పులు

- ఆ చొరబాట్లను నిలువరించాలి
- కేంద్రమంత్రి అమిత్ షా పిలుపు



దిల్లీ: దేశ సరిహద్దుల్లో అక్రమంగా మతపరమైన చొరబాట్లు పెద్దఎత్తున జరుగుతున్నాయని కేంద్ర హోంమంత్రి అమిత్ షా పేర్కొన్నారు. ఇవి ఉద్దేశపూర్వకంగా జరుగుతున్న ప్రాదేశిక మార్పులేనని, వీటివల్ల దేశ భద్రతపై ప్రత్యక్ష ప్రభావం పడుతుందని ఆయన వ్యాఖ్యానించారు. మంగళవారం దిల్లీలో జరిగిన వైబ్రంట్ విలేజెస్ ప్రోగ్రాం(వీవీపీ) వర్క్‌షాప్‌లో అమిత్‌షా పాల్గొని ప్రసంగించారు. సరిహద్దు జిల్లాల్లో జరుగుతున్న మతపరమైన చొరబాట్లపై తగిన చర్యలు తీసుకోవాలని, సరిహద్దుల నుంచి కనీసం 30 కి.మీ. దూరం వరకు జరుగుతున్న చొరబాట్లను నివారించాలని కలెక్టర్లను కోరారు. ఇవి కేవలం భౌగోళిక పరిస్థితుల కారణంగానే జరగటం లేదని...దీని వెనుక ఉద్దేశపూర్వక కుట్ర ఉందని ఆరోపించారు. ఈ సమస్యను పరిష్కరించడంలో గుజరాత్ అద్భుతంగా పనిచేస్తోందని రాష్ట్ర అధికారులపై ప్రశంసల జల్లు కురిపించారు. వీవీపీ లోగోను ఆవిష్కరించారు.



నదిలో పడిన వాహనం.. బాధితులను కాపాడేందుకు సహకరించిన రిజిజు

కార్గిల్: నదిలో ఓ ప్రైవేటు వాహనం పడిపోయిన ప్రమాదంలో అందులోని వ్యక్తులను కాపాడేందుకు కేంద్ర మంత్రి కిరణ్ రిజిజు సహకరించిన ఘటన మంగళవారం చోటుచేసుకుంది. మంత్రి కశ్మీర్ నుంచి కార్గిల్‌కు వెళ్తుండగా లద్దాఖ్‌లో ఓ వాహనం ద్రాస్ నదిలో పడిపోయింది. అది గమనించిన రిజిజు తన వాహనశ్రేణిని నిలిపివేయించారు. స్థానిక పోలీసులకు సమాచారం అందించారు. వారు వెంటనే ఘటనాస్థలికి చేరుకొని బనిహాల్‌కు చెందిన డ్రైవర్ హారూన్ రషీద్, రాంబన్‌కు చెందిన సహ డ్రైవర్ మహమ్మద్ అబ్బాస్‌ను రక్షించారు. ఈ ఘటనపై కేంద్ర మంత్రి 'ఎక్స్'లో పోస్టు చేశారు.

భాజపా కొత్త అధ్యక్షుడి ఎన్నికకు సన్నాహాలు!

దిల్లీ: భాజపా నూతన జాతీయ అధ్యక్షుడి ఎన్నికకు ఆ పార్టీ సన్నాహాలు చేస్తోంది. బిహార్ అసెంబ్లీ ఎన్నికల ప్రకటనకు ముందే ఈ నిర్ణయం వెలువడే అవకాశం ఉన్నట్లు సంబంధిత వర్గాలు మంగళవారం పేర్కొన్నాయి. ఈ అత్యున్నత పదవి కోసం ఇప్పటికే అర్హత కలిగిన అభ్యర్థుల జాబితాను పార్టీ అగ్ర నాయకులు రూపొందించినట్లు సమాచారం. సెప్టెంబరు 9న ఉపరాష్ట్రపతి ఎన్నిక తర్వాత నూతన సారథి ఎంపిక కోసం షెడ్యూల్ విడుదల చేయనున్నారు. ప్రస్తుత జాతీయ అధ్యక్షుడు జేపీ నడ్డా 2019 నుంచి ఆ పదవిలో కొనసాగుతున్నారు. నూతన అధ్యక్షుడి ఎన్నికకు ముందే కర్ణాటక, గుజరాత్, ఉత్తర్‌ప్రదేశ్ వంటి కీలక రాష్ట్రాల్లో భాజపా రాష్ట్ర అధ్యక్షులను నియమించే అవకాశం ఉంది.

బాంబే హైకోర్టు సీజేగా జస్టిస్ చంద్రశేఖర్

కొలీజియం సిఫార్సు


దిల్లీ: బాంబే హైకోర్టులో న్యాయమూర్తిగా పనిచేస్తున్న జస్టిస్ చంద్రశేఖర్‌కు అదే హైకోర్టు ప్రధాన న్యాయమూర్తిగా పదోన్నతి కల్పించాలని సుప్రీంకోర్టు కొలీజియం సిఫార్సు చేసింది. ఈ మేరకు సుప్రీంకోర్టు ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ బి.ఆర్.గవాయ్ నేతృత్వంలో సోమవారం సమావేశమైన కొలీజియం నిర్ణయించింది. జస్టిస్ చంద్రశేఖర్ ఝార్ఖండ్ హైకోర్టుకు చెందినవారు. బాంబే హైకోర్టులో అదనపు న్యాయమూర్తులుగా పనిచేస్తున్న జస్టిస్ సంజయ్ ఆనంద్‌రావ్ దేశ్‌ముఖ్, జస్టిస్ వృశాలీ విజయ్ జోషి, జస్టిస్ అభయ్ జైనారాయణ్‌జీ మంత్రి, జస్టిస్ శ్యాం ఛగన్‌లాల్ చండక్, జస్టిస్ నీరజ్ ప్రదీప్ ధోతే, జస్టిస్ సోమశేఖర్ సుందరేశన్‌లను శాశ్వత జడ్జీలుగా నియమించాలని కూడా కొలీజియం సిఫార్సు చేసింది. అదనపు జడ్జీలైన జస్టిస్ జాన్సన్ జాన్, జస్టిస్ గోపీనాథన్ ఉన్నిథన్ గిరీశ్, జస్టిస్ చెల్లప్పన్ నాదార్ ప్రదీప్ కుమార్‌లను కేరళ హైకోర్టు శాశ్వత న్యాయమూర్తులుగా నియమించాలని కూడా కొలీజియం సిఫార్సు చేసింది.

ఇండియా కూటమిలో లేనివారూ మద్దతిస్తామంటున్నారు

- జస్టిస్ సుదర్శన్‌రెడ్డి



లఖ్‌నవూ: ఇండియా కూటమిలో లేనివారు కూడా తనకు మద్దతిచ్చేందుకు ముందుకు వస్తున్నారని, వారికి కృతజ్ఞుడినని ఉపరాష్ట్రపతి ఎన్నికలో ప్రతిపక్షాల ఉమ్మడి అభ్యర్థి జస్టిస్ బి.సుదర్శన్‌రెడ్డి మంగళవారం పేర్కొన్నారు. పార్టీలకు అతీతంగా అన్ని రాజకీయ పక్షాలూ 'యోగ్యత, విలువల' ఆధారంగా తన అభ్యర్థిత్వానికి మద్దతు తెలపాలని విజ్ఞప్తిచేశారు. మంగళవారం ఉత్తరప్రదేశ్‌లోని సమాజ్‌వాదీ పార్టీ ప్రధాన కార్యాలయంలో జరిగిన విలేకరుల సమావేశంలో పార్టీ అధినేత అఖిలేశ్ యాదవ్, కాంగ్రెస్ నేతలతో కలిసి జస్టిస్ సుదర్శన్‌రెడ్డి మాట్లాడారు. "ప్రతిపక్షాలు నన్ను నమ్మి తమ అభ్యర్థిగా ఎంపిక చేశాయి. ఇండియా కూటమి మాత్రమే కాకుండా బయటివారు కూడా నాకు మద్దతిస్తున్నందుకు కృతజ్ఞతలు. కానీ నా స్నేహితుడు అఖిలేశ్ యాదవ్ లేకుండా ఇదంతా సాధ్యమయ్యేది కాదు" అని ఆయన అన్నారు. 'సల్వా జుడుం' తీర్పును గురించి అమిత్‌షా చేసిన వ్యాఖ్యలపై తాను చెప్పదలిచింది ఇప్పటికే చెప్పేశానని, ఈ విషయాన్ని పొడిగించ దలచుకోలేదని ఆయన అన్నారు.



తుపాను కారణంగా అమెరికాలోని ఆరిజోనా రాష్ట్రం ఫీనిక్స్ నగరంపై కమ్ముకున్న దుమ్ము

వచ్చే మహిళా దినోత్సవం నాటికి.. లక్ష మంది మహిళా పారిశ్రామికవేత్తలు

ఈనాడు, అమరావతి: వచ్చే ఏడాది మహిళా దినోత్సవం (మార్చి 8) నాటికి రాష్ట్రవ్యాప్తంగా లక్ష మంది మహిళా పారిశ్రామికవేత్తలను తయారు చేయాలనేది కూటమి ప్రభుత్వ లక్ష్యమని, వారికి తోడ్పాటు అందించేందుకు బ్యాంకర్లు ముందుకు రావాలని ముఖ్యమంత్రి చంద్రబాబు కోరారు. 'ఒక కుటుంబం- ఒక పారిశ్రామికవేత్త' నినాదంతో పనిచేస్తున్నామని, అందులో మహిళలకే పెద్దపీట వేస్తున్నామని చెప్పారు. మంగళవారం సచివాలయంలో జరిగిన 232వ రాష్ట్రస్థాయి బ్యాంకర్ల సమితి (ఎస్ఎల్‌బీసీ) సమావేశంలో వ్యవసాయం, ప్రాథమిక రంగాలు, ఎంఎస్ఎంఈ, డ్వాక్రా గ్రూపులకు రుణ వితరణ లక్ష్యాలు, గ్రామీణ ప్రాంతాల్లో బ్యాంకింగ్ సేవలపై సీఎం చంద్రబాబు సమీక్షించారు. అమెరికా, చైనా లాంటి దేశాలకు సవాలు విసిరేలా భారత ఆర్థిక వ్యవస్థ తయారవుతోందని చెప్పారు.

యువతకు చేయూతనివ్వండి

- అమరావతిలో రతన్ టాటా ఇన్నోవేషన్ హబ్ ప్రారంభించాం. విశాఖ, రాజమహేంద్రవరం, విజయవాడ, అనంతపురం, తిరుపతిలో ప్రాంతీయ కేంద్రాలు ఏర్పాటు చేస్తున్నాం.



రాష్ట్రస్థాయి బ్యాంకర్ల కమిటీ సమావేశంలో మాట్లాడుతున్న సీఎం చంద్రబాబు

- యువత, మహిళా పారిశ్రామికవేత్తలను పెద్దఎత్తున ప్రోత్సహిస్తున్నాం.
- పేద, మధ్య తరగతి విద్యార్థులకు ఉన్నత, విదేశీ విద్య అందించేలా కార్యాచరణ తయారు చేశాం.
- ఇన్నోవేషన్ హబ్‌లు, విద్యార్థుల ఉన్నత విద్యకు తక్కువ వడ్డీకి రుణాలివ్వడంపై బ్యాంకర్లు దృష్టి పెట్టాలి.
- స్టార్టప్ ఇండియా, ముద్ర, పీఎంఈజీపీ, ఎఫ్ఎంఈ, స్వనిధి పథకాలకు ప్రాధాన్యమివ్వాలి.

రెండేళ్లలో బ్యాంకుల భవనాలు

- అమరావతిలో ఫైనాన్షియల్ డిస్ట్రిక్ట్‌కు అవసరమైన భూమి కేటాయిస్తాం.
- అందులో అన్ని బ్యాంకుల ప్రధాన కార్యాలయాలు పెట్టాలి.
- ఐకానిక్ నిర్మాణాలు చేపట్టి రెండేళ్లలోనే పూర్తి చేయాలి.
- ఆర్థిక లావాదేవీల భద్రతకు క్వాంటమ్ వ్యాలీ సేవల్ని ఉపయోగించుకోండి.
- అమరావతి రైతులకు రిటర్నబుల్ ప్లాట్లపై రుణాలివ్వాలి. వారిని ఇబ్బంది పెట్టొద్దు.
- బీసీ, ఎస్సీ, ఎస్టీ కార్పొరేషన్ల రుణాలకు వచ్చే దరఖాస్తుల్ని త్వరితగతిన పరిష్కరించాలి.
- పీఎం సూర్యఘర్ అత్యంత ప్రాధాన్యాంశంగా గుర్తించాలి. ఈ పథకం కింద రుణాలు ఇచ్చేందుకు సిబిల్ స్కోర్‌ను పరిగణనలోకి తీసుకోవాల్సిన అవసరం లేదు.

లాజిస్టిక్స్‌లో అపార అవకాశాలు

- లాజిస్టిక్స్ వ్యయం తగ్గించాలి. రవాణా రంగంలో పెట్టుబడులకు అపార అవకాశాలున్నాయి.
- దీనికి ప్రత్యేక కార్పొరేషన్ పెట్టాం. పోర్టులు, ఎయిర్‌పోర్టులు, పారిశ్రామిక కారిడార్లు భారీగా చేపట్టాం.
- వయబిలిటీ గ్యాప్ ఫండింగ్ ద్వారా పట్టణ, గ్రామీణ ప్రాంతాల్లో పీపీపీ విధానంలో ప్రాజెక్టులు చేపడుతున్నాం.
- మౌలిక సౌకర్యాల ప్రాజెక్టులకు ఆర్థిక సంస్థలు, బ్యాంకులు సహకరించాలి.
- జలవనరుల ప్రాజెక్టుల ఫండింగ్‌కు బ్యాంకర్లు ముందుకు రావాలి.

'అర్హులందరికీ ఇళ్లు' పర్యవేక్షణకు మంత్రివర్గ ఉపసంఘం

- వైకాపా హయాంలో అవకతవకలపై నివేదిక
- ప్రభుత్వం ఉత్తర్వులు

ఈనాడు, అమరావతి: 'అర్హులందరికీ ఇళ్ల నిర్మాణం' కార్యక్రమ అమలు పర్యవేక్షణకు, వైకాపా హయాంలో అస్తవ్యస్తంగా జరిగిన ఇళ్ల స్థలాల కేటాయింపుపై విధాన పరమైన నిర్ణయాలు తీసుకునేందుకు కూటమి ప్రభుత్వం మంత్రివర్గ ఉపసంఘాన్ని ఏర్పాటు చేసింది. గృహనిర్మాణశాఖ మంత్రి కొలుసు పార్థసారథి, రెవెన్యూశాఖ మంత్రి అనగాని సత్యప్రసాద్, పురపాలక, పట్టణాభివృద్ధిశాఖ మంత్రి నారాయణ ఇందులో సభ్యులుగా ఉంటారు. ఈ ఉపసంఘానికి కన్వీనర్‌గా రెవెన్యూశాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి వ్యవహరిస్తారు. క్షేత్రస్థాయిలోని పలు సమస్యల్ని అధ్యయనం చేసి సమగ్ర నివేదిక ఇవ్వాలని ఈ కమిటీని ఆదేశిస్తూ మంగళవారం ఉత్తర్వులు జారీ అయ్యాయి.

మంత్రివర్గ ఉపసంఘం పరిశీలించాల్సిన అంశాలు ఇవి...

- ఆర్టీజీఎస్ డేటాబేస్ ఆధారంగా అర్హుల ఎంపికను పక్కాగా చేపట్టేందుకు గాను అనుసరించాల్సిన విధానంపై అధ్యయనం చేయాలి.
- అర్హులైన కుటుంబాలేవీ మిగిలిపోకుండా 100 శాతం పూర్తయ్యేలా అమలు చేయాల్సిన విధానాన్ని సూచించాలి.
- ఇళ్ల నిర్మాణానికి ఎదురవుతున్న ఇబ్బందులపై అధ్యయనం చేసి అమలు చేయాల్సిన విధానాన్ని సూచించాలి.
- వైకాపా ప్రభుత్వ హయాంలో ఇళ్ల స్థలాల కేటాయింపు, ఇళ్ల నిర్మాణ తీరును పరిశీలించి సమస్యల పరిష్కారానికి అనువైన విధానాన్ని సూచించాలి.
- వైకాపా ప్రభుత్వంలో కేటాయించి ఇప్పటికీ నిర్మాణాలు చేపట్టక ఖాళీగా ఉన్న స్థలాలపై ప్రత్యేక విధానాన్ని సూచించాలి.
- క్షేత్రస్థాయిలో ఎదురయ్యే ఇతర సమస్యల పరిష్కారానికి మార్గదర్శకాలను ప్రతిపాదించాలి.

వివేకా హత్య కేసులో బెదిరింపులపై విచారణ

కడప కేంద్ర కారాగారానికి ప్రత్యేక బృందం

ఈనాడు, కడప, న్యూస్‌టుడే- కడప నేర విభాగం: మాజీమంత్రి వివేకా హత్యకేసులో అప్రూవర్‌గా మారిన దస్తగిరిని.. అదే కేసులో నిందితుడు దేవిరెడ్డి శివశంకర్ రెడ్డి కుమారుడు డాక్టర్ చైతన్యరెడ్డి జైల్లో బెదిరించిన వ్యవహారంపై విచారణకు నియమించిన ప్రత్యేక బృందం మంగళవారం కడప జైలుకు చేరుకుని విచారణ చేపట్టింది. కర్నూలు ఎస్పీ విక్రాంత్ పాటిల్ ఆధ్వర్యంలో కడప జిల్లా వైద్య, ఆరోగ్య శాఖ అధికారి నాగరాజు, ఆర్డీవో జాన్ ఇర్విన్, విజయవాడ జైలు అధికారి ఇర్ఫాన్ ఈ బృందంలో సభ్యులుగా ఉన్నారు. ఈ విచారణకు దస్తగిరిని జిల్లా ఎస్పీ కార్యాలయానికి పిలిపించారు. సమయాభావం కారణంగా మరోసారి పిలుస్తామంటూ దస్తగిరికి చెప్పి పంపారు. మొదటిరోజు విచారణకు అప్పటి కారాగార వైద్యురాలు పుష్పలత హాజరయ్యారు. అప్పటి జైలు సూపరింటెండెంట్‌గా పనిచేసిన ప్రకాష్‌ను కూడా పిలిపించి ప్రశ్నిస్తున్నారు. అధికారులు కడపలోనే ఉంటూ నాలుగైదు రోజుల పాటు విచారణ కొనసాగించే అవకాశం ఉంది. దర్యాప్తుపై కర్నూలు ఎస్పీ, విచారణాధికారి విక్రాంత్ పాటిల్ మాట్లాడుతూ.. మొదటిరోజు విచారణ పూర్తయిందన్నారు. ఇదివరకు నిర్వహించిన దర్యాప్తును పరిశీలించామని, ఇంకొందరిని విచారించాల్సి ఉందన్నారు.

వ్యవ'సాయం'లో జాప్యం

- జూన్ ఆఖరుకు లక్ష్యంలో 31% మాత్రమే రుణాలు
- కౌలు రైతుకు రుణంలోనూ వెనకబాటే
- ఇలాగైతే రైతుకు ఉపయోగం ఉండదన్న సీఎం చంద్రబాబు

ఈనాడు, అమరావతి: పంట రుణాల మంజూరుతోపాటు కౌలు రైతులకు రుణ వితరణలోనూ బ్యాంకులు వెనకబడే ఉన్నాయి. ఖరీఫ్‌లో ఏప్రిల్ నుంచి జూన్ వరకు పరిశీలిస్తే అన్ని రంగాలకూ కలిపి 2,47,919 కోట్ల రుణాలిచ్చాయి. ఇందులో వ్యవసాయానికి రూ.94,666 కోట్లు మాత్రమే అందాయి. ఇది లక్ష్యంలో 30.94% మాత్రమే. సీజన్‌లోనే పంట రుణాలివ్వకపోతే రైతులకు ఎలాంటి ప్రయోజనం

2025 ఏప్రిల్ నుంచి జూన్ ఆఖరు వరకు రంగాల వారీగా ఇచ్చిన రుణాలు (రూ.కోట్లలో)

రంగం	రుణ లక్ష్యం	ఇచ్చింది	లక్ష్యంలో శాతం
వ్యవసాయం	3,06,000	94,666	31
ఎంఎస్ఎంఈ	1,28,000	49,831	39
ప్రాధాన్యేతర రంగాలు	2,02,000	1,00,278	50

> 'సాగు రుణాలు ఖరీఫ్ సీజన్‌లోనే పూర్తిగా ఇచ్చేలా బ్యాంకులు చర్యలు తీసుకోవాలి. కౌలు రైతులకు ఉదారంగా అప్పులివ్వాలి. తప్పుడు విధానంలో రుణాలివ్వాలని మేం చెప్పం. కానీ ఉత్పాదకత లేకుండా రుణాలివ్వడమూ మంచిది కాదు. పేదరిక నిర్మూలనకు ఉద్దేశించిన పీ4లో బ్యాంకర్లు భాగస్వాములు కావాలి.'
>
> – సీఎం చంద్రబాబు

ఉండదని.. మంగళవారం జరిగిన ఎస్ఎల్‌బీసీ సమావేశంలో బ్యాంకర్లను ఉద్దేశించి సీఎం చంద్రబాబు వ్యాఖ్యానించారు.

- కౌలు రైతులకు రూ.8 వేల కోట్ల రుణాలివ్వాలని లక్ష్యంగా నిర్దేశించగా.. జూన్ ఆఖరుకు రూ.985 కోట్లు మాత్రమే అందాయి.

ఆక్వా ఎగుమతిదారులకు వడ్డీ చెల్లింపులపై మారటోరియం

అమెరికా విధించిన సుంకాల నేపథ్యంలో.. సముద్ర ఉత్పత్తుల ఎగుమతిదారులు, భాగస్వాములకు అధిక మొత్తంలో రుణాలందించేందుకు చర్యలు తీసుకుంటున్నట్లు ఎస్ఎల్‌బీసీ మంగళవారం ప్రదర్శించిన ప్రజంటేషన్‌లో పేర్కొంది. ఎగుమతిదారులు తీసుకున్న రుణాలపై 240 రోజుల పాటు వడ్డీ చెల్లింపులపై మారటోరియం అమలు చేస్తున్నట్లు తెలిపింది.

దక్షిణాది రాష్ట్రాల్లో మనం ఎక్కడ?

2024-25లో దక్షిణాది రాష్ట్రాల్లో రంగాల వారీ రుణ మంజూరు (రూ.కోట్లలో)

రాష్ట్రం	వ్యవసాయం	ఎంఎస్ఎంఈ	అన్ని రంగాలకు రుణాలు
తమిళనాడు	4,51,924	2,54,850	16,69,601
కర్ణాటక	2,00,933	1,60,497	10,83,047
తెలంగాణ	1,37,346	1,21,343	7,52,374
ఆంధ్రప్రదేశ్	3,07,088	95,620	6,83,672
కేరళ	1,67,336	63,545	5,44,659

రెండెకరాలిస్తే.. పట్టాభి సీతారామయ్య పేరుతో పార్క్, స్మారకం

ప్రభుత్వం మచిలీపట్నంలో రెండు ఎకరాలు ఇస్తే ఆంధ్రాబ్యాంక్ వ్యవస్థాపకులు భోగరాజు పట్టాభి సీతారామయ్య పేరుతో పార్క్, మెమోరియల్ ఏర్పాటు చేస్తామని కేంద్ర ఆర్థికశాఖ కార్యదర్శి నాగరాజు ఎస్ఎల్‌బీసీ సమావేశంలో ప్రకటించారు. ముఖ్యమంత్రి చంద్రబాబు చెప్పినట్లు.. సేద్యానికి ముందే రైతులకు రుణాలు అందేలా చూడాల్సి ఉందని పేర్కొన్నారు. సీఎస్ విజయానంద్, ఎస్ఎల్‌బీసీ ఛైర్మన్ నితీష్ రంజన్, సీడ్బీ సీఎండీ మనోజ్ మిట్టల్, ఎగ్జిమ్ బ్యాంకు ఎండీ హర్ష బంగారి, కెనరా బ్యాంకు ఎండీ సత్యనారాయణ రాజు, పంజాబ్ నేషనల్ బ్యాంకు ఎండీ అశోక్ చంద్ర, ఇండియన్ బ్యాంకు ఎండీ బినోద్ కుమార్ తదితరులు సమావేశంలో పాల్గొన్నారు.

వచ్చే నెల రూ.1,120 కోట్ల ఆర్థిక సంఘం నిధులు: పవన్‌కల్యాణ్

ఈనాడు, అమరావతి: పెండింగ్‌లో ఉన్న 15వ ఆర్థిక సంఘం నిధులు రూ.1,120 కోట్లు వచ్చే నెల మొదటి వారంలో పంచాయతీలకు విడుదలవుతాయని ఉప ముఖ్యమంత్రి పవన్‌కల్యాణ్ ప్రకటించారు. ఈ మేరకు హామీ ఇచ్చిన ముఖ్యమంత్రి చంద్రబాబుకు ఆయన మంగళవారం ఒక ప్రకటనలో కృతజ్ఞతలు తెలిపారు. 'ఆర్థిక సంఘం నిధుల విడుదలతో రాష్ట్రవ్యాప్తంగా సర్పంచులకు ఉపశమనం కలగనుంది. హామీ ఇచ్చినట్లుగానే ఆర్థిక సంఘం నిధులను పంచాయతీల్లో సద్వినియోగం చేయాలన్న దృఢమైన వైఖరిని ప్రభుత్వం తీసుకుంది. స్థానిక స్వపరిపాలనను బలోపేతం చేస్తూ గ్రామ స్థాయిలో కనీస మౌలిక వసతులు, సేవలు సమర్థంగా అందించాలన్నదే మా ఉద్దేశం. రాష్ట్రానికి ఆర్థిక సంఘం నిధులు సకాలంలో విడుదల చేసినందుకు ప్రధాని మోదీకి హృదయపూర్వక ధన్యవాదాలు' అని ఉప ముఖ్యమంత్రి పేర్కొన్నారు. గత ప్రభుత్వం ఆర్థిక సంఘం నిధులను ఇతర పథకాలకు మళ్లించిందని విమర్శించారు.

గంజాయి విక్రయాలు.. వ్యభిచార ముఠాలు

- అరుణ ప్రధాన వ్యాపార వనరులివే
- మాజీ ఎమ్మెల్యేతో సన్నిహితంగా ఉంటూనే రాజకీయ ఎత్తుగడలు
- ఒప్పుకోనివారికి బెదిరింపులు.. అక్రమ కేసులు
- బాధితుడి ఫిర్యాదుతో వెలుగులోకి..

ఈనాడు డిజిటల్, తిరుపతి: తీగ లాగితే డొంక కదిలినట్లుగా లేడీ డాన్ అరుణ లీలలు రోజుకొకటి వెలుగులోకి వస్తున్నాయి. తన నేర సామ్రాజ్యానికి సహకరించని ఎవర్నైనా సరే ఆమె రౌడీమూకలతో బెదిరించేది.. రూ.లక్షలు డిమాండు చేసేది. వైకాపా ఎమ్మెల్యేలు, ప్రధాన నాయకుల అండదండలతో అరుణ చెలరేగిపోయింది. నెల్లూరు, గూడూరు, నాయుడుపేట, సూళ్లూరుపేట ప్రాంతాల్లో కొంతమంది రౌడీ మూకల్ని ఎంపిక చేసుకుని గంజాయి విక్రయాలు, వ్యభిచారం దందాలు చేయించేది. సీసీ కెమెరాలతో రహస్యంగా వీడియోలు చిత్రీకరించి ఎమ్మెల్యేలు, ప్రజాప్రతినిధులు, రాజకీయ నాయకుల్ని చెప్పుచేతుల్లో పెట్టుకుంది. దీంతో ఆమె ఉచ్చులో పడిన వారంతా కీలుబొమ్మలయ్యారు. ప్రస్తుతం వీరి వెన్నులో వణుకుపుడుతోంది.

వెన్నుపోటు పొడవడంలో ఆరితేరి..

సూళ్లూరుపేట నియోజకవర్గ పరిధిలో వైకాపా మాజీ ఎమ్మెల్యే కిలివేటి సంజీవయ్యతో అరుణ సన్నిహితంగా ఉంటూ రాజకీయ ఎత్తుగడలు వేసింది. సూళ్లూరుపేట, నాయుడుపేట ప్రాంతాల్లోని ప్రధాన హోటళ్లను కేంద్రాలుగా చేసుకుని అసాంఘిక కార్యకలాపాలకు పాల్పడింది. అందరినీ మచ్చిక చేసుకుని అధికారుల బదిలీల నుంచి తిరుమల వెంకన్న దర్శనాల వరకూ ప్రభావితం చేసే స్థాయికి వెళ్లింది. అరుణ భర్తకు సమీప బంధువు, నాయుడుపేటవాసి రాయపు శ్రీనివాసులును కొన్నేళ్ల క్రితం గంజాయి విక్రయాలు, వ్యభిచారం నిర్వహించేందుకు ఉసిగొల్పింది. ఆయన ఒప్పుకోకపోవడంతో రౌడీమూకలతో బెదిరించింది. దీనిపై అప్పట్లోనే నాయుడుపేటలోని మాజీ ఎమ్మెల్యే కిలివేటి సంజీవయ్య నివాసంలో అరుణ, శ్రీనివాసులు మధ్య పెద్ద గొడవే జరిగింది.

వ్యభిచారం చేయించాలని బెదిరించింది..

తాజాగా అరుణ నేరాలు బయటపడటంతో శ్రీనివాసులు కోవూరు పోలీసులకు సోమవారం ఫిర్యాదు చేశారు. తిరుపతి నుంచి అమ్మాయిలు వస్తారని వారితో వ్యభిచారం చేయించాలని బెదిరించిందని.. తాను ఒప్పుకోకపోవడంతో అక్రమ కేసులు పెట్టి ఇరికించిందని ఫిర్యాదులో పేర్కొన్నారు. రూ.50 లక్షలు ఇవ్వాలని మాజీ ప్రజాప్రతినిధిని సైతం బ్లాక్‌మెయిల్ చేసినట్లు తెలుస్తోంది. సూళ్లూరుపేట నియోజకవర్గ పరిధిలో రాజకీయ నాయకుల జన్మదిన వేడుకలు జరిగితే నెల్లూరు, గూడూరు నుంచి అరుణ ప్రియుడు శ్రీకాంత్ తరఫు బ్యాచ్ ద్విచక్రవాహనాలతో భారీగా చేరేవారు. నేరాలు, దందాలు, బెదిరింపుల నుంచి హత్యల వరకు ఇలాగే నేర సామ్రాజ్యాన్ని నడిపారు. వైకాపా హయాంలో గంజాయి తెప్పించుకుని, కళాశాలల విద్యార్థులను సైతం వాటికి అలవాటు చేశారు. జాతీయ రహదారుల పొడవునా ఉండే ప్రధాన హోటళ్లలో వ్యభిచారం నడిపారు. కూటమి ప్రభుత్వం వచ్చిన తర్వాత కొందరు కూటమి ఎమ్మెల్యేలతో పరిచయాలు పెంచుకుని, ఈ తరహా కార్యకలాపాలను కొనసాగించేందుకు ప్రయత్నించడం గమనార్హం.

నేటి నుంచి 50% సుంకాల భారం

(మొదటి పేజీ తరువాయి)

నుంచి ఎగుమతయ్యే 48 బిలియన్ డాలర్ల వాణిజ్యంపై ఇది ప్రభావం చూపనుంది. సుంకాల అమలుపై అమెరికా హోంలాండ్ భద్రతా విభాగం సోమవారం ముసాయిదా ఉత్తర్వులు జారీ చేసింది.

అదనపు సుంకాలు అమలయ్యేవి..

జౌళి వస్తువులు, దుస్తులు, జెమ్స్, ఆభరణాలు, రొయ్యలు, తోలు వస్తువులు, పాదరక్షలు, జంతు ఉత్పత్తులు, రసాయనాలు, విద్యుత్తు, మెకానికల్ యంత్రాలు.

వర్తించనివి..: ఔషధాలు, ఇంధన ఉత్పత్తులు, ఎలక్ట్రానిక్ వస్తువులు.

ముసాయిదా ఉత్తర్వుల్లో ఏముందంటే..

బుధవారం తెల్లవారుజామున 12.01 గంటల్లోగా ఓడల్లో లోడ్ చేసిన ఉత్పత్తులకు, రవాణాలో ఉన్న వాటికి అదనపు సుంకాలు వర్తించవు. వాటిని సెప్టెంబరు 17వ తేదీ తెల్లవారుజామున 12.01 గంటల్లోగా వినియోగిస్తున్నట్లుగా, గోదాముల నుంచి బయటకు వచ్చినట్లుగా పరిగణిస్తారు. వీటికి ప్రత్యేక కోడ్‌ను కేటాయిస్తారు.

పోటీదారులకు అవకాశం

భారత్, బ్రెజిల్‌లపైనే అమెరికా అత్యధికంగా 50శాతం సుంకాలను అమలు చేస్తోంది. వాణిజ్యశాఖ లెక్కల ప్రకారం.. అమెరికా అదనపు సుంకాలవల్ల 48.2 బిలియన్ డాలర్ల వాణిజ్యంపై ప్రభావం పడనుంది. మన దేశంపై అదనపు భారంవల్ల అమెరికాకు ఎగుమతుల్లో మనతో పోటీపడే దేశాలకు ప్రయోజనం కలగనుంది.

రొయ్యల పరిశ్రమకు కష్టకాలం

2021-22 నుంచి భారత్‌కు అమెరికా అతి పెద్ద వాణిజ్య భాగస్వామిగా ఉంది. 2024-25లో రెండు దేశాల మధ్య 131.8 బిలియన్ డాలర్ల వ్యాపారం జరిగింది. ఇందులో 86.5 బిలియన్ డాలర్ల ఎగుమతులు, 45.3 బిలియన్ డాలర్ల దిగుమతులున్నాయి.

- 50శాతం సుంకాలవల్ల జౌళి, జెమ్స్, ఆభరణాలు, రొయ్యల పరిశ్రమలపై తీవ్ర ప్రభావం పడనుంది. ఈ రంగాల్లోని కార్మికుల ఉపాధి దెబ్బతిననుంది.
- మేధోమథన సంస్థ జీటీఆర్ఐ అంచనా ప్రకారం.. అమెరికాకు జరిగే ఎగుమతుల్లో 66శాతం (60.2 బిలియన్ డాలర్లు) కీలక కార్మిక రంగాలైన దుస్తులు, జెమ్స్, ఆభరణాలు, రొయ్యలు, కార్పెట్లు, ఫర్నిచర్‌లలోనే ఉన్నాయి.
- 3.8శాతం ఆటోమొబైల్ ఎగుమతులపై 25 శాతం సుంకం పడనుంది. (వాణిజ్య విలువ 3.4 బిలియన్ డాలర్లు).
- 30.2 శాతం ఎగుమతులపై ప్రస్తుతానికి ఎటువంటి సుంకాలు లేవు.
- భారత్ నుంచి 2.4 బిలియన్ డాలర్ల విలువైన రొయ్యలు అమెరికాకు ఎగుమతి అవుతాయి. దీనివల్ల విశాఖపట్నం కేంద్రంగా జరిగే వ్యాపారం దెబ్బతిననుంది.
- వజ్రాలు, ఆభరణాల ఎగుమతులు 10 బిలియన్ డాలర్లు. దీనివల్ల సూరత్, ముంబయిల్లోని పరిశ్రమలపై ఒత్తిడి పడనుంది.
- జౌళి, దుస్తుల ఎగుమతుల విలువ 10.8 బిలియన్ డాలర్లు. ఇవి ప్రధానంగా కేంద్రీకృతమైన తమిళనాడులోని తిరుపూర్, దిల్లీ (ఎన్‌సీఆర్), బెంగళూరులలో ఉపాధి దెబ్బతిననుంది.
- 1.2 బిలియన్ డాలర్ల కార్పెట్ల వ్యాపారం జరుగుతోంది. మనపై అదనపు సుంకాలవల్ల తుర్కియే, వియత్నాం లాభపడతాయి.
- 6 బిలియన్ డాలర్ల వ్యవసాయ ఉత్పత్తులు అమెరికాకు ఎగుమతి అవుతాయి. ఇందులో బాస్మతి బియ్యం, మసాలా దినుసులు, టీపొడి ఉన్నాయి. మనపై భారంవల్ల పాకిస్థాన్, థాయ్‌లాండ్ లాభపడతాయి.

మనతో పోటీపడే దేశాలు.. వాటిపై సుంకాలు

దేశం	సుంకాలు (శాతాల్లో)
మయన్మార్	40
థాయ్‌లాండ్, కంబోడియా	36
బంగ్లాదేశ్	35
ఇండోనేసియా	32
చైనా, శ్రీలంక	30
మలేసియా	25
ఫిలిప్పీన్స్, వియత్నాం	20
భారత్	50

మన దేశం నుంచి ఇతర ఎగుమతులు (బిలియన్ డాలర్లలో..)

ఉక్కు, అల్యూమినియం, కాపర్: 4.7; ఆర్గానిక్ కెమికల్స్: 2.7; మెషినరీ: 6.7

బార్‌ల లైసెన్సులకు స్పందన కరవు

- 80% బార్‌లకు ఒక్క దరఖాస్తూ రాలేదు
- ఎక్సైజ్ శాఖ నిబంధనలపై వ్యాపారుల్లో నిరాసక్తి
- తప్పనిసరి పరిస్థితుల్లో గడువు పొడిగింపు

ఈనాడు, అమరావతి: మూడేళ్ల కాలపరిమితితో బార్ లైసెన్సుల జారీ కోసం ఎక్సైజ్ శాఖ దరఖాస్తులు ఆహ్వానించగా, వ్యాపారుల నుంచి స్పందన కొరవడింది. దీంతో తప్పనిసరి పరిస్థితుల్లో దరఖాస్తుల స్వీకరణ గడువును ఈ నెల 29 సాయంత్రం 6 గంటల వరకూ పొడిగించారు. తొలుత ప్రకటించిన షెడ్యూల్ ప్రకారం మంగళవారం సాయంత్రం 5 గంటలకే గడువు ముగిసింది. అయితే 840 బార్‌లకు గానూ, 175 బార్‌లకే దరఖాస్తులు వచ్చాయి. మిగతా వాటికి ఒక్కటీ రాలేదు. ప్రభుత్వం ప్రకటించిన నూతన పాలసీ ప్రకారం ప్రతి బార్‌కూ కనీసం 4 దరఖాస్తులు వస్తేనే.. వాటిలో నుంచి లాటరీ తీసి లైసెన్సుదారును ఎంపిక చేస్తారు. అయితే 56 బార్‌లకే 4, అంతకుమించి దరఖాస్తులు వచ్చాయి. అది కూడా 15 జిల్లాల్లోనే వచ్చాయి.

వ్యాపారుల్లో ఎందుకీ నిరాసక్తి?

- ఎక్సైజ్ శాఖ తెచ్చిన నూతన విధానం తమకు ఏ మాత్రం అనుకూలంగా లేదని, గిట్టుబాటు కాదనే కారణంతో వ్యాపారులు ఆసక్తి చూపించట్లేదు.
- ప్రతి బార్‌కు కనీసం 4 దరఖాస్తులు వస్తేనే లాటరీ తీస్తామనే నిబంధన పెట్టడం, అదనపు ఏఆర్ఈటీ 15 శాతాన్ని తొలగించకపోవడం.
- మద్యం దుకాణాలకు అనుబంధంగా పర్మిట్ రూమ్‌ల ఏర్పాటుకు ఇటీవల ప్రభుత్వం అనుమతివ్వడం.
- రూ.99కి దొరికే క్వార్టర్ మద్యాన్ని బార్‌లలో అమ్మడానికి వీల్లేదన్న నిబంధన పెట్టడం.
- ఎన్టీఆర్ జిల్లా పరిధిలో 130 బార్‌లు ఉండగా, కేవలం 10 బార్‌లకు, గుంటూరు జిల్లాలో 110కి గానూ 9 బార్‌లకు మాత్రమే 4, అంతకంటే ఎక్కువ దరఖాస్తులొచ్చాయి. కృష్ణా జిల్లా పరిధిలో 39 బార్‌లలో ఏడింటికి, కర్నూలు జిల్లాలో 23 బార్‌లకు ఆరింటికి మాత్రమే 4, అంతకుమించి దరఖాస్తులొచ్చాయి.
- మొత్తం 3,332 మంది రూ.10 వేలు ప్రాసెసింగ్ రుసుము చెల్లించి తమ వివరాలు రిజిస్ట్రేషన్ చేసుకున్నారని, వీరంతా దరఖాస్తులు వేస్తారని ఎక్సైజ్ అధికారులు చెబుతున్నారు.
- ఈ నెల 30న ఉదయం 8 గంటల నుంచి లాటరీ తీస్తామని ఎక్సైజ్ శాఖ కమిషనర్ నిశాంత్‌కుమార్ తెలిపారు. వినాయక చవితి, బ్యాంకు సెలవుల దృష్ట్యా దరఖాస్తుల స్వీకరణ గడువు పొడిగించినట్లు వెల్లడించారు.

తోటపై గంపగుత్తగా దండెత్తిన నత్తలు

- 5 వేల టమాటా మొక్కలు హాంఫట్
- బొప్పాయి పళ్లనూ వదలని వైనం
- పార్వతీపురం జిల్లాలో వింత సమస్య



బొప్పాయి పండును డొల్ల చేస్తున్న నత్తలు



బొప్పాయి చెట్టు పైకి ఎక్కి, ఆకులను తినేసి..



పోకచెక్క మొక్కపైనా...

కొమరాడ, న్యూస్‌టుడే: పంటలకు చీడ పీడలు పట్టడం చూశాం.. ఏనుగులు, ఇతర అడవి జంతువులు పడి పాడు చేయడం విన్నాం. కానీ ఎప్పుడూ లేని విధంగా నత్తలు పంటలపై గంపగుత్తగా దాడికి దిగాయి. పార్వతీపురం మన్యం జిల్లా కొమరాడ మండలంలోని గంగరేగువలసలో కందులపాటి సాయిబాబు అనే రైతు 7 ఎకరాల్లో బొప్పాయి, జామ, పోక చెక్క పండిస్తున్నారు. 15 రోజులుగా తోటలోకి పెద్ద సంఖ్యలో నత్తలు వరుసపెట్టి వస్తున్నాయి. ఇప్పటికే 4 ఎకరాల మేర పంటలను తినేశాయి. అంతర పంటగా వేసిన 5 వేల టమాటా మొక్కలను హాంఫట్ చేశాయి. అసలు అవి ఎలా, ఎక్కడ నుంచి వస్తున్నాయో కూడా తెలియడం లేదు. ఈ తోటల సమీపంలో జంఝావతి జలాశయం ఉంది. ఇటీవల కురిసిన వర్షాలతో వరద పెరిగి, నత్తలు వచ్చాయేమోనని స్థానికులు భావిస్తున్నారు. తొలుత పదుల సంఖ్యలో వచ్చినప్పుడు రోజూ తొలగించేవాడినని, తర్వాత వందల్లో వచ్చి మొత్తం తినేస్తున్నాయని రైతు సాయిబాబు వాపోతున్నారు. ఇప్పుడిప్పుడే పక్క తోటలకూ సమస్య విస్తరిస్తోందని తెలిపారు. నత్తల సమస్య తమ దృష్టికి మొదటి సారి వచ్చిందని, క్షేత్రస్థాయికి వెళ్లి పరిశీలిస్తామని ఉద్యాన శాఖ అధికారి గిరిజ తెలిపారు. గడ్డ ఉప్పును పంటల్లో వేస్తే ఉపశమనం లభించవచ్చని సూచించారు.

వాన్‌పిక్ ప్రాజెక్ట్స్ పిటిషన్ కొట్టివేత

జగన్ అక్రమాస్తుల కేసులో తెలంగాణ హైకోర్టు తీర్పు ● సీబీఐ అభియోగాలకు ప్రాథమిక ఆధారాలున్నాయని వ్యాఖ్య

ఈనాడు, హైదరాబాద్: ఏపీ మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అక్రమాస్తుల వ్యవహారంలో భాగంగా సీబీఐ నమోదు చేసిన కేసును కొట్టివేయాలంటూ వాన్‌పిక్ ప్రాజెక్ట్స్ ప్రైవేట్ లిమిటెడ్ దాఖలు చేసిన పిటిషన్‌ను తెలంగాణ హైకోర్టు మంగళవారం కొట్టివేస్తూ తీర్పు ఇచ్చింది. వాన్‌పిక్ ప్రాజెక్ట్స్‌పై సీబీఐ నమోదు చేసిన అభియోగాలకు ప్రాథమిక ఆధారాలున్నాయని, అందువల్ల ఈ కేసును కింది కోర్టులోనే తేల్చుకోవాలంటూ స్పష్టం చేసింది. సీబీఐ కేసును కొట్టివేయాలంటూ వాన్‌పిక్ ప్రాజెక్ట్స్ 2021లో హైకోర్టులో పిటిషన్ వేసింది. దానిపై విచారించిన న్యాయస్థానం.. 2022 జులైలో కేసును కొట్టివేస్తూ వాన్‌పిక్‌కు అనుకూలంగా తీర్పు వెలువరించింది. దీనిపై సీబీఐ.. సుప్రీంకోర్టులో అప్పీలు చేసింది. కాగ్నిజెన్స్‌కు సరైన కారణాలు పేర్కొనలేదన్న కారణంగా కేసును కొట్టివేయడం సరికాదని, కేసు పూర్వాపరాలపై విచారించి తీర్పు ఇవ్వాలంటూ తిరిగి హైకోర్టుకు పంపుతూ సుప్రీంకోర్టు ఉత్తర్వులిచ్చింది. అత్యున్నత న్యాయస్థానం నుంచి వెనక్కి వచ్చిన వాన్‌పిక్ ప్రాజెక్ట్స్ ప్రైవేట్ లిమిటెడ్ పిటిషన్‌పై జస్టిస్ ఇ.వి.వేణుగోపాల్ విచారణ చేపట్టి మంగళవారం తాజా తీర్పు వెలువరించారు.

కింది కోర్టులో విచారణ ఎదుర్కోండి

సీబీఐ తరఫు న్యాయవాది శ్రీనివాస్ కపాటియా హైకోర్టులో వాదనలు వినిపిస్తూ 'ప్రభుత్వానికి నష్టం వాటిల్లేలా నాటి వైఎస్ సర్కారు వాన్‌పిక్‌కు ప్రయోజనాలు కల్పించింది. ఇందుకు ప్రతిఫలంగా జగన్‌కు చెందిన కంపెనీల్లో నిమ్మగడ్డ ప్రసాద్ రూ.854 కోట్ల పెట్టుబడులు పెట్టారు. ఇది క్విడ్ ప్రో కో. 2012లో సీబీఐ అభియోగ పత్రం దాఖలు చేయగా, 2021 వరకూ వాన్‌పిక్ పిటిషన్ వేయలేదు. తొమ్మిదేళ్ల తర్వాత వేసిన ఈ వ్యాజ్యాన్ని కొట్టివేయండి. 2012 నుంచి కేసు విచారణ ముందుకు సాగలేదు. అభియోగాల నమోదు కూడా పూర్తికాలేదు' అని పేర్కొన్నారు. న్యాయమూర్తి స్పందిస్తూ, రికార్డులను పరిశీలించాక కేసుకు ప్రాథమిక ఆధారాలున్నాయని, సీబీఐ మోపిన అభియోగాలపై విచారణను కింది కోర్టులో ఎదుర్కొని తేల్చుకోవాలని స్పష్టంచేశారు. వాన్‌పిక్ ప్రాజెక్ట్స్ పిటిషన్‌ను కొట్టివేస్తూ తీర్పు వెలువరించారు.

ఈనాడు సినిమా

సరిగ్గా 30 సంవత్సరాల క్రితం... తారాలోకం నుంచి తెలుగు నేలన వినోదాల హరివిల్లులా విరిసి, ఆనందాల చిరుజల్లులా కురిసింది ఈటీవీ. ఏ కళ ప్రక్రియనైనా ఆదరించే తెలుగు ప్రజలు ఈటీవీ అందించిన కొత్తదనానికి, కార్యక్రమాల వైవిధ్యానికి స్వాగత హారతులు పట్టారు. అందరి ఆదరణతో ఘనంగా 30 ఏళ్లు పూర్తిచేసుకుంది.. మనందరి టీవీ ఈటీవీ.


'ఈటీవీ వరల్డ్'ని ప్రారంభిస్తున్న సుమన్. చిత్రంలో కిరణ్, రామోజీరావు

మరపురాని వినోదాల ప్రయాణం

ఈటీవీ 30 ఏళ్ల ప్రస్థానం





ఈటీవీ తొలి ప్రసారాలను ప్రారంభిస్తున్న నటి శ్రీదేవి, రామోజీరావు

రామోజీరావు ఆలోచనలే

ఈ అద్భుతం అలవోకగా అందివచ్చిన విజయం కాదు. ఈటీవీ ఆరంభానికి చాలా ముందునుంచే... ప్రతి అంశాన్ని, ప్రతి విభాగాన్ని నిశితంగా విశ్లేషించి ప్రణాళికలు రూపొందించారు ఈనాడు గ్రూప్ సంస్థల వ్యవస్థాపక ఛైర్మన్ రామోజీరావు. ఆలోచనలు ఆయనవి. అడుగులు ఈటీవీవి.



ఆనాటి ముఖ్యమంత్రి చంద్రబాబు చేతులమీదుగా నంది అవార్డు అందుకుంటోన్న సుమన్. చిత్రంలో అప్పటి సమాచార శాఖ మంత్రి సోమిరెడ్డి చంద్రమోహన్ రెడ్డి



'శ్రీకృష్ణ బలరామ యుద్ధం'లో సుమన్

తొలి తెలుగు శాటిలైట్ ఛానల్

1995 ఆగస్టు 27 శుభోదయాన... తొలి తెలుగు శాటిలైట్ ఛానల్ ఈటీవీ పురుడు పోసుకుంది. రంగవల్లికల లాంటి కార్యక్రమాలు, నవరసాలు రంగరించిన ధారావాహికలు, 24 గంటల వినోదంతో... పల్లె, పట్టణమనే తేడా లేకుండా ఈటీవీ పేరు మార్మోగింది. ప్రారంభమైన రోజు నుంచే.. తెలుగువారిని సంతోషాల ఊయలలో ఊగించింది. మురిపించి, మైమరపించి విజయకేతనాలు ఎగురవేసింది. ఈటీవీ రాకతో తెలుగునాట కేబుల్ పరిశ్రమ రూపస్వరూపాలే మారిపోయాయి. అత్యధిక శాటిలైట్ కేబుల్ కనెక్షన్లు గల రాష్ట్రంగా నాటి ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ అవతరించింది.

ఈటీవీ జైత్ర యాత్ర

అలా మూడు దశాబ్దాల క్రితం ప్రఖ్యాత నటి శ్రీదేవి జ్యోతి ప్రజ్వలన చేయగా... మొదటి కార్యక్రమంగా ఆనాటి ప్రధానమంత్రి, తెలుగుబిడ్డ పి.వి.నరసింహారావుతో సుమన్ చేసిన ఇంటర్వ్యూ ప్రసారమైంది. అదే శుభారంభం. ఆ తర్వాత అంతా ఈటీవీ జైత్రయాత్ర సంరంభం. సరికొత్త ప్రయోగాలకు పుట్టినిల్లుగా మారింది ఈటీవీ.

జనరంజకం

విభిన్న కథాకథనాలతో ఈటీవీ నిర్మించిన అంతరంగాలు, విధి, అన్వేషిత, లేడీ డిటెక్టివ్, చంద్రముఖి, అభిషేకం, శాంతి నివాసం, స్వాతిచినుకులు... ఇంకా అనేక ధారావాహికలు అనితర సాధ్యమైన విజయాలు సాధించాయి. ఆయా రంగాల్లో నిష్ణాతులైన వారిని ఎంచుకుని ఈటీవీ అందించిన ఢీ, జబర్దస్త్, వావ్ లాంటి షోస్... ఎంతటి ప్రజాదరణ పొందాయో చెప్పనవసరం లేదు. బాలు, చిత్ర, ఏసుదాస్, మంగళంపల్లి, ఎమ్మెస్ విశ్వనాథన్, శంకరమహదేవన్ లాంటి సంగీత దిగ్గజాలు సమర్పించిన 'స్వరాభిషేకం'... తెలుగువారికి సుమధుర రాగాభిషేకం.

అంతా సొంతంగానే

వ్యయప్రయాసలు పట్టించుకోకుండా అత్యాధునిక సాంకేతిక పరిజ్ఞానాన్ని అందుబాటులోకి తెచ్చారు. ఈటీవీ సొంతంగా స్టూడియోలు, ఎడిట్ సూట్లు, రికార్డింగ్ థియేటర్లు ఏర్పాటు చేసుకుంది. ప్రసారాల కోసం విదేశాలకు టేపును పంపాల్సిన పరిస్థితి నుంచి దేశంలోనే తొలిసారిగా ప్రైవేటురంగంలో ఎర్త్ స్టేషన్ ఆరంభించింది ఈటీవీ. వందల కొద్దీ చలనచిత్రాల హక్కులు కొనుగోలు చేసి... తిరుగులేని సినీ లైబ్రరీని సొంతం చేసుకుంది. ఆనాటి పరిస్థితుల్లో ఇదంతా ఓ అసిధారావ్రతమే. ఎందుకంటే తెలుగునాట ఈ మౌలిక సదుపాయాలేవీ ఏర్పడని కాలమది. తెలుగు టెలివిజన్ రంగంలో అవసరమైన ప్రతి వ్యవస్థని స్వయంగా రూపొందించుకుంది ఈటీవీ.



రామోజీరావు సమక్షంలో ఈటీవీ@20లోగోను ఆవిష్కరిస్తున్న అగ్ర కథానాయకుడు చిరంజీవి

రోజుకో సినిమా

వారానికి ఒక్క సినిమా చూడటానికి ఆత్రంగా నిరీక్షించిన తెలుగు ప్రజలకు రోజూ ఓ చలనచిత్రాన్ని అందించింది ఈటీవీ. సినీరంగ ప్రముఖుల్ని చిన్నితెరకు పరిచయం చేస్తూ రూపొందించిన సరిగమలు, మనసునమనసై, ప్రతిధ్వని, కౌంట్‌డౌన్, సినిమా క్విజ్, మాస్టర్‌మైండ్స్ తదితర కార్యక్రమాలు ప్రేక్షకుల్ని మంత్రముగ్ధుల్ని చేశాయి. గానగంధర్వుడు ఎస్.పి.బాలసుబ్రహ్మణ్యం వ్యాఖ్యాతగా దక్షిణ భారత దేశంలోనే తొలి రియాలిటీ షో 'పాడుతా తీయగా' సంగీతాభిమానుల్ని ఉర్రూతలూగించింది.

న్యూస్ బ్రాండ్

అన్నిటికన్నా మిన్నగా తెలుగు జనజీవితాల్లో భాగంగా మారింది ఈటీవీ న్యూస్. ప్రాంతీయ - జాతీయ - అంతర్జాతీయ వార్తలతోపాటు... సునిశిత వ్యాఖ్యలు - నిష్పక్షపాత విశ్లేషణలతో విశ్వసనీయతకు మరోపేరుగా నిలిచింది. ఈటీవీలో ప్రత్యేకంగా అన్నదాత ప్రసారం చేస్తే.. అది కర్షకులకు కానుకగా, పల్లెసీమలకు పచ్చటి ఆనందాల ఏరువాకగా మారింది.

డిజిటల్ నీరాజనం

టీవీ వీక్షణలలోనే కాదు... డిజిటల్ మాధ్యమంలోనూ ఈటీవీది విజయకేతనమే. ఈటీవీ యూట్యూబ్ సబ్‌స్క్రైబర్ల సంఖ్య 22.7 మిలియన్లు అంటే ఆశ్చర్యచకితులు కావాల్సిందే. మూడు దశాబ్దాలు గడిచినా... మూడు తరాలు మారినా... ఇప్పటికీ.. ఈటీవీకి అదే తరగని ఆదరణ, అభిమానం! తెలుగువారు ప్రపంచంలో ఏ దేశంలో ఉన్నా, అక్కడ ఈటీవీకి ఘన-జన నీరాజనం!! విలువలతో కూడిన వినోదం, అభిరుచులు, అనువైన ఆనందం... ఈ ఆదర్శాలకే ఈటీవీ అంకితం- అందుకే ఈ ప్రయాణం అప్రతిహతం.

అనుభవజ్ఞుల ఆధ్వర్యాన

రచయితగా, చిత్రకారుడిగా అప్పటికే ప్రఖ్యాతి చెందిన సుమన్... ఈటీవీ మేనేజింగ్ డైరెక్టర్‌గా సారథ్యం స్వీకరించారు. భారతదేశమంతా దూరదర్శన్ ప్రసార వ్యాప్తికి కారణమై... టీవీ ఇంజినీరింగ్ బ్రహ్మగా పేరొందిన వి.వి.రావు ఆధ్వర్యంలో ఎస్.ఎల్.కె.ప్రసాదరావు సాంకేతిక విభాగం అధిపతిగా బాధ్యతలు తీసుకున్నారు. ఈనాడులో ఇదికథకాదుతో సహా అనేక శీర్షికలు నిర్వహిస్తూ ప్రాచుర్యం పొందిన రచయిత అజయ్‌శాంతి ప్రోగ్రామింగ్ విభాగాధిపతిగా... మరెందరో నిపుణులు, నటీనటులు మేలుకలయికతో టీవీ రంగంలో కొత్త శకానికి శ్రీకారం చుట్టింది ఈటీవీ.

"తెలుగింటి ఛానల్ ఈటీవీ ప్రారంభమై 30 సంవత్సరాలు పూర్తి చేసుకుంది. ఈ సందర్భంగా మేనేజ్‌మెంట్‌కి, సిబ్బందికి, ప్రేక్షకులకు శుభాభినందనలు. ఈటీవీ వినోదాన్ని మాత్రమే కాదు.. విజ్ఞానాన్ని కూడా అందించింది. మన సంస్కృతి, సంప్రదాయాలు, నాగరికతను పరిరక్షించుకునేలా కార్యక్రమాలు రూపొందించింది. రామోజీరావు తెలుగులో ఈటీవీని తీసుకురావడమే కాకుండా వివిధ భాషల్లో ఛానళ్లు పెట్టారు. ఆ ఛానళ్ల అభివృద్ధికి సుమన్ కృషి చేశారు. అంచలంచెలుగా పెరిగిన ఈ ఛానల్ ప్రపంచంలో తెలుగు వాళ్లు ఎక్కడున్నా ఆదరించేలా ఎదిగింది. రాత్రి 9గంటల న్యూస్ చూస్తే పరిపూర్ణంగా సమాచారం అందినట్టు భావించేలా తీర్చిదిద్దారు. ఇదొక చరిత్ర. ఈటీవీని, తెలుగుజాతిని వేరు చేయలేం. ఈటీవీకి శుభాకాంక్షలు".

– చంద్రబాబు నాయుడు, ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి

"ఈటీవీ 30 వసంతాలు పూర్తి చేసుకున్న సందర్భంగా ఈటీవీ యాజమాన్యానికి, సిబ్బందికి, కార్యనిర్వాహకులందరికీ హృదయపూర్వక శుభాకాంక్షలు. రామోజీరావు ఈటీవీని విలువలతో నడిపించారు. సత్యానికి దగ్గరగా, సంచలనానికి దూరంగా, జనాలకు మార్గదర్శకంగా.. సరైన సమాచారాన్ని అందించడంలో ఈటీవీ ముందుంది. రామోజీరావు మన ముందు లేకపోయినా ఆయన స్ఫూర్తితో వారి కుమారుడు కిరణ్ నాయకత్వాన ఈటీవీ అప్రతిహతంగా ముందుకు సాగాలని ఆశిస్తున్నాను".

– వెంకయ్యనాయుడు, భారత మాజీ ఉపరాష్ట్రపతి

"ఈటీవీ.. మీ టీవీ' అంటూ తెలుగు ప్రజలను ఈటీవీ పలకరించడం మొదలై మూడు దశాబ్దాలు దిగ్విజయంగా పూర్తి చేసుకున్న సంతోషకర సమయంలో ఆ సంస్థ యాజమాన్యానికి, ఉద్యోగులకు, సాంకేతిక నిపుణులకు మనస్ఫూర్తిగా నా అభినందనలు. ఈటీవీ వినోద ఛానెల్‌గా ప్రారంభమై బహుముఖంగా విస్తరించడంలో రామోజీరావు ప్రణాళికాబద్ధమైన అడుగులు బలంగా ఉన్నాయి. ఈటీవీ ద్వారా ఎంతోమంది సాంకేతిక నిపుణులు, నటులు, రచయితలు సినిమా పరిశ్రమకు పరిచయమయ్యారు. అదే విధంగా సినీ రంగం వారి ప్రతిభను కూడా బుల్లితెరకు తగ్గ విధంగా మలుచుకుంది ఈటీవీ. తెలుగు భాష, సంస్కృతికి ప్రాధాన్యమిస్తూ ముందుకెళుతున్న ఈటీవీ సంస్థ మరిన్ని విజయాలు సొంతం చేసుకోవాలని ఆకాంక్షిస్తున్నాను".

– పవన్ కల్యాణ్, ఆంధ్రప్రదేశ్ ఉపముఖ్యమంత్రి

కొత్తదనం విషయంలో ఈటీవీ ఎప్పుడూ ముందే

"ఈ రోజు ఈటీవీ 30వ వార్షికోత్సవం. ఆనందంగా ఉంది. అప్పుడే ఇంతకాలం గడిచిపోయిందా అని ఆశ్చర్యంగానూ ఉంది. సంతృప్తి - సంతోషం కలగలిసిన ఈ సమయంలో.. ఈటీవీకి ప్రాణం పోసిన నాన్నని, ప్రాణం పెట్టి నిలబెట్టిన తమ్ముడు సుమన్‌ను మనసారా గుర్తుచేసుకుంటున్నాను. వాళ్ల కృషి, క్రమశిక్షణ, ప్రతిభ, పట్టుదల ఈటీవీకి పునాదిరాళ్లు. ఈ 30ఏళ్లలో ప్రేక్షకులు ఈటీవీకి ఎన్నో విజయాలు కట్టబెట్టారు. ఆంధ్ర, తెలంగాణల్లో మాత్రమే కాదు, దేశవిదేశాల్లో తెలుగువారు ఎక్కడున్నా అక్కడ ఈటీవీ పతాకం ఎగిరింది. ఎంతోమంది అభిరుచి కలిగిన ప్రేక్షకులు ఈటీవీకి అభిమాన హారతి పట్టారు. మరెంతో మంది కళాకారులు, నిర్మాతలు, సాంకేతిక నిపుణులు ఈటీవీ కార్యక్రమాలకు రూపశిల్పులుగా నిలిచారు. కేబుల్ ఆపరేటర్ల నుంచి ప్రకటనకర్తల వరకు ప్రతిఒక్కరూ ఈటీవీకి అండదండగా నడిచారు. వారందరికీ, మా ఈటీవీ సహచరులకు పేరుపేరునా ధన్యవాదాలు. కొత్తదనానికి స్వాగత తోరణాలు కట్టడంలో ఈటీవీ ఎప్పుడూ ముందే ఉంటుంది. ఇకముందు కూడా ఈటీవీ ఏరోజుకారోజు సరికొత్త రీతిలో ప్రేక్షకులను అలరిస్తుందని వినమ్రంగా విన్నవిస్తున్నాను".

– కిరణ్, రామోజీ గ్రూప్ సీఎండీ

సవాళ్ల మధ్య మాకున్న లైట్ హౌస్.. రామోజీరావు

"1995 ఈటీవీ ప్రారంభమైన సంవత్సరం. అప్పటికి తెలుగులో శాటిలైట్ ఛానల్స్ లేవు. ఎటువంటి సదుపాయాలు లేవు. అవసరమైన సాంకేతిక నిపుణులు లేరు. మన దేశం నుంచి అప్ లింకింగ్ చేసే సౌకర్యం లేదు. ఇలాంటి పరిస్థితుల్లో ఛానల్ ప్రారంభించడం నిజంగానే ఓ ఛాలెంజ్. అన్ని సవాళ్ల మధ్య మాకున్న ఒకే ఒక లైట్ హౌస్- ఛైర్మన్ రామోజీరావు. అలా సౌత్ ఇండియాలోనే మొట్టమొదటి 24గంటల తెలుగు శాటిలైట్ ఛానల్ ఈటీవీ ప్రయాణం మొదలైంది. మొదటి రోజు నుంచే ఈటీవీ అమితంగా ప్రేక్షకాదరణ పొందింది. పట్టణాల్లో మాత్రమే కాదు.. ప్రతి గ్రామంలో ప్రతి ఇంట్లో ఈటీవీ-మీటీవీ అన్న స్లోగన్ వినిపించింది. అసలు ఈటీవీ కోసమే కేబుల్ నెట్‌వర్క్ ప్రారంభించిన ఊళ్లు ఎన్నో. అది ఎంత సంచలనంగా మారిందంటే ఉమ్మడి రాష్ట్రంలో 26,102 గ్రామాలుంటే సుమారు 23వేల గ్రామాల్లో కేబుల్ నెట్‌వర్క్ ప్రారంభమయ్యింది. ఆ రోజు దేశంలోనే శాటిలైట్ అండ్ కేబుల్ హోమ్స్ అత్యధికంగా ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌లోనే నమోదు కావడానికి ఈటీవీ దోహదపడింది".

– బాపినీడు, ఈటీవీ నెట్‌వర్క్ సీఈవో



ఈటీవీ ప్లస్, ఈటీవీ లైఫ్, ఈటీవీ అభిరుచి, ఈటీవీ సినిమా ఛానెళ్లను ప్రారంభిస్తున్న దివిజ. చిత్రంలో బాపినీడు, శైలజా కిరణ్, కిరణ్, జగదీశ్ చంద్ర, రామోజీరావు, విజయేశ్వరి, రామ్మోహన్‌రావు



'పాడుతా తీయగా' 500 ఎపిసోడ్‌లో తోటి గాయకులతో కలిసి ఆలపిస్తోన్న గాయకుడు ఎస్పీ బాలసుబ్రహ్మణ్యం



ప్రముఖ దర్శకుడు దాసరి నారాయణరావు చేతులమీదుగా 'అభిషేకం' సీరియల్ 2000 ఎపిసోడ్ జ్ఞాపికను అందుకుంటున్న బాపినీడు. చిత్రంలో అజయ్‌శాంతి

ఈటీవీ ఆణిముత్యాలు




సంతృప్తినిచ్చిన చిత్రం... 'సుందరకాండ'



గౌతమ్, వెంకటేశ్, నారా రోహిత్, మనోజ్, సంతోశ్, సిరి, శ్రీదేవి


"చాలా సినిమాలు చేశా. సినిమా పూర్తయిన ప్రతిసారీ ఇంకా ఏదో చేయాలనే అభిప్రాయం కలిగేది. కానీ 'సుందరకాండ' విషయంలో మాత్రం పూర్తి సంతృప్తితో ఉన్నా" అన్నారు నారా రోహిత్. ఆయన హీరోగా వెంకటేశ్ నిమ్మలపూడి తెరకెక్కించిన చిత్రమే 'సుందరకాండ'. శ్రీదేవి విజయ్‌కుమార్, వృతి వాఘాని కథానాయికలు. సంతోశ్ చిన్నపొల్ల, గౌతమ్‌రెడ్డి, రాకేశ్ మహంకాళి నిర్మిస్తున్నారు. నేడు ఈ చిత్రం ప్రేక్షకుల ముందుకు రానుంది. ఈ సందర్భంగా ఇటీవల హైదరాబాద్‌లో విడుదలకి ముందస్తు వేడుకని నిర్వహించారు. ఈ వేడుకకి ముఖ్య అతిథిగా హాజరైన హీరో మంచు మనోజ్ మాట్లాడుతూ "నారా రోహిత్ మొదట్నుంచీ విభిన్నమైన కథల్ని ఎంచుకుంటున్నాడు. తను సొంతంగా ఈ స్థాయికి చేరుకున్నాడంటే కారణం అదే" అన్నారు. నారా రోహిత్ మాట్లాడుతూ "అందరూ వినాయక చవితిని చేసుకున్న తర్వాత కుటుంబ సభ్యులు, స్నేహితులతో కలిసి ఈ సినిమాని చూడండి. కచ్చితంగా ఆస్వాదిస్తార"ని చెప్పారు. ఈ కార్యక్రమంలో ఎమ్మెల్యే ఎమ్.ఎస్.రాజుతోపాటు నారా రోహిత్ కాబోయే భార్య సిరి పాల్గొన్నారు.

రెండు సినిమాలు వాయిదా




తేజ సజ్జా

ఇటీవల సినీ కార్మికులు వేతనాలు పెంపు కోరుతూ కొన్ని రోజులు ఆందోళన బాట పట్టడంతో ఆ ప్రభావం సినిమా విడుదలలపై పడింది. దీంతో 'మాస్ జాతర', 'మిరాయ్' చిత్రాలు అనుకున్న సమయానికి రాలేకపోతున్నాయి. రవితేజ హీరోగా నటించిన 'మాస్ జాతర' వాయిదా పడింది. త్వరలోనే కొత్త తేదీని ప్రకటిస్తామని నిర్మాతలు తెలిపారు. సెప్టెంబరు 5కు రావాల్సిన తేజ సజ్జా హీరోగా నటించిన 'మిరాయ్'.. అదే నెల 12న రానుంది.



రవితేజ

హర హర శంకర



తనికెళ్ల భరణి

రమణ్, వర్ష విశ్వనాథ్ జంటగా రామచంద్ర వట్టికూటి తెరకెక్కిస్తోన్న చిత్రం 'మటన్ సూప్'. విట్‌నెస్ ది రియల్ క్రైమ్స్... అనేది ఉపశీర్షిక. మల్లికార్జున ఎలికా (గోపాల్) అరుణ్‌చంద్ర వట్టికూటి, రామకృష్ణ సనపల నిర్మాతలు. ఈ చిత్రంలోని హర హర శంకర... అంటూ సాగే పాటని మంగళవారం హైదరాబాద్‌లో ప్రముఖ నటుడు తనికెళ్ల భరణి విడుదల చేశారు.

ఒగ్గు కళాకారుల కథ



ఆమని

ఆమని, బన్నీ రాజు, బలగం జయరామ్ ప్రధాన పాత్రధారులుగా రాంబాబు తెరకెక్కించిన చిత్రం 'బ్రహ్మాండ'. డి. సురేశ్ నిర్మించారు. ఈ సినిమా శుక్రవారం థియేటర్లలోకి రానుంది. ఈ నేపథ్యంలోనే ఇటీవల హైదరాబాద్‌లో ప్రీరిలీజ్ వేడుకను నిర్వహించారు. "ఒగ్గు కళాకారుల నేపథ్యంలో తెరకెక్కిన చిత్రమిది" అన్నారు నిర్మాత సురేశ్.

ఏఐ.. 6,600 ఏనుగుల ప్రాణదీపికై!

- గత 19 నెలల్లో రైళ్లు ఢీకొట్టకుండా పట్టాలు దాటించిన సాంకేతికత
- తమిళనాడు అటవీ ప్రాంతంలో సత్ఫలితాలు

ఈనాడు, చెన్నై: అడవిలో పట్టాలు దాటుతున్న ఏనుగులు రైలు కింద పడి మృత్యువాత పడకుండా తమిళనాడు అటవీ శాఖ కీలక ముందడుగు వేసింది. కృత్రిమ మేధ (ఏఐ) సాయంతో.. ఒక్క గజరాజు కూడా చనిపోకుండా కాపాడగలిగింది. కోయంబత్తూరు జిల్లా మదుక్కరై అటవీ ప్రాంతం మీదుగా తమిళనాడు-కేరళ రైల్వేలైను వెళ్తుంది. 2008-23 మధ్య ఆ ప్రాంతంలో రైలు ఢీకొని 11 ఏనుగులు మృత్యువాతపడ్డాయి. గాయాలపాలైన వాటి సంఖ్య వేలల్లోనే ఉంటుంది. మూగజీవాల రోదనలకు పరిష్కారంగా రెండేళ్లపాటు మేధోమథనం చేసి ఏఐ, మెషీన్‌లెర్నింగ్ సాంకేతికతతో కూడిన సీసీ కెమెరాల్ని తమిళనాడు ప్రభుత్వం డిజైన్ చేయించింది. పట్టాల వెంబడి ఉన్న 12 టవర్లపై రెండేసి చొప్పున 24 కెమెరాలను అమర్చింది. ఇవి రాత్రుళ్లు వెలుతురు లేకున్నా చాలా స్పష్టంగా వీడియో, ఫోటో డేటాను అందిస్తున్నాయి. ఒక్కో కెమెరా 150 మీ. మేర నిఘా పెడుతుంది. తన పరిధిలోకి ఏనుగులు రాగానే కంట్రోల్‌రూమ్‌లో అలారం కూడా మోగుతుంది.


గిరిజనులే ఉద్యోగులు

ఈ వ్యవస్థను పర్యవేక్షించడానికి, సమన్వయం చేయడానికి ప్రత్యేకంగా మదుక్కరైలో కంట్రోల్‌రూం ఏర్పాటు చేశారు. స్థానికంగా చదువుకున్న 25 మంది గిరిజన యువతనే సిబ్బందిగా నియమించారు. 24 గంటలూ షిఫ్టుల వారీగా వారు సేవలందిస్తున్నారు. ఏఐ టవర్ల నుంచి సమాచారం అందుకోగానే.. కంప్యూటర్లపై లైవ్ ఫుటేజ్ చూస్తూ ఏనుగుల కదలికల్ని రైల్వేట్రాక్ పర్యవేక్షకులకు, అటవీశాఖ సిబ్బందికి చేరవేస్తున్నారు. అదే సమయంలో కంట్రోల్ రూం నుంచి డ్రోన్ ఎగురవేసి. . ఏనుగుల గుంపును అనుసరిస్తున్నారు. సిబ్బంది ఆ సమాచారం ఆధారంగా ఏనుగులున్న చోటుకి వెళ్లి పట్టాలకు దూరంగా వాటిని పంపడమో, రైలును కాసేపు నిలిపివేయడమో చేస్తున్నారు. ఈ కెమెరాలు వచ్చిన 2024 ఫిబ్రవరి నుంచి ఇప్పటి వరకు ఒక్క ఏనుగూ మృత్యువాత పడలేదు. ఈ 19 నెలల్లో ప్రమాదపుటంచున ఉన్న 6,600 ఏనుగుల్ని సురక్షితంగా పట్టాలు దాటించారు. వీటిలో ఒకటి కంటే ఎక్కువసార్లు ముప్పు నుంచి తప్పించుకున్నవీ ఉన్నాయి.





పట్టాల వెంట అమర్చిన అధునాతన ఏఐ కెమెరా ★ రిమోట్ ద్వారా డ్రోన్‌ను ఎగురవేసి కంప్యూటర్‌పై ఏనుగుల కదలికలను పర్యవేక్షిస్తున్న సిబ్బంది



ఏఐ కెమెరాలో రికార్డయిన.. పట్టాలు దాటుతున్న ఏనుగులు, వాటిని దూరంగా పంపేందుకు వస్తున్న సిబ్బంది

15 రాష్ట్రాల్లోనూ ప్రయోగాలు

దేశంలోని 15 రాష్ట్రాల్లో 150 వరకు ఏనుగు కారిడార్లు ఉన్నట్లు అంచనా. అక్కడ కూడా ఈ విధానాన్ని అవలంబించేందుకు ఏఐ కెమెరాల ఉపయోగాలు, నిర్వహణపై ఆయా రాష్ట్రాల సిబ్బందికి తమిళనాడు యంత్రాంగం ప్రత్యేక శిక్షణ ఇస్తోంది. ఏఐ, కంట్రోల్‌రూమ్ విధానాల్ని కేవలం ఏనుగుల కారిడార్లలోనే కాకుండా.. ఆయా అడవుల్లో ఉండే ఇతర వన్యమృగాల రక్షణకూ వినియోగించాలని కేంద్ర అటవీశాఖ ప్రతిపాదనలు చేసింది. ఆ శాఖ మంత్రి భూపేందర్‌యాదవ్ ఈ విషయాన్ని ఇటీవల ధ్రువీకరించారు.

పది విద్యార్థిపై పైశాచికత్వం

- పొట్ట, చేతులపై ఇస్త్రీపెట్టెతో కాల్చిన సహచరులు
- సీసీ కెమెరాల ధ్వంసంపై యాజమాన్యానికి చెప్పాడని దారుణం



రాజోలు ప్రభుత్వాసుపత్రిలో కుమారుడి వద్ద ఆవేదనతో తల్లి లక్ష్మీకుమారి

రాజోలు, మలికిపురం, రాజమహేంద్రవరం (శ్యామలాసెంటర్), న్యూస్‌టుడే: పదోతరగతి చదువుతున్న ఓ దళిత విద్యార్థిపై సహచర విద్యార్థులు దారుణానికి ఒడిగట్టారు. తమ గురించి పాఠశాల యాజమాన్యానికి ఫిర్యాదు చేశాడనే ఉక్రోషంతో కొట్టి.. పొట్ట, చేతులు, అరికాళ్లపై ఇస్త్రీపెట్టెతో కాల్చేశారు. విషయం ఎవరికైనా చెబితే చంపేస్తామని బెదిరించారు. భయపడిపోయిన ఆ బాలుడు బాధనంతా తనలోనే దాచుకున్నాడు. ఎట్టకేలకు తల్లికి చెప్పడంతో వెలుగులోకి వచ్చింది. రాజమహేంద్రవరం గ్రామీణం మోరంపూడిలోని శ్రీచైతన్య పాఠశాల వసతిగృహంలో ఈ నెల 18న ఈ ఘటన చోటుచేసుకోగా బాధితులు పోలీసులకు తెలియజేయడంతో మంగళవారం వెలుగులోకి వచ్చింది. డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లా మలికిపురం మండలం శంకరగుప్తానికి చెందిన గుర్రం విన్సెంట్ ప్రసాద్ శ్రీచైతన్య పాఠశాలలో పదోతరగతి చదువుతూ అదే వసతిగృహంలో ఉంటున్నాడు. ఇటీవల ఈ పాఠశాలలో సీసీ కెమెరాలు ధ్వంసమయ్యాయి. దీనిపై యాజమాన్యం ఆరాతీయగా అదే తరగతిలో ఇద్దరు విద్యార్థులు ఈ పని చేసినట్లు విన్సెంట్‌ప్రసాద్ చెప్పాడు. దీంతో వారు కక్షగట్టి ప్రసాద్‌పై ఈ దురాగతానికి పాల్పడ్డారు. బాధితుడి తండ్రి మూడు నెలల క్రితం మృతిచెందారు. తల్లి లక్ష్మీకుమారి సోమవారం కుమారుడిని చూసేందుకు పాఠశాలకు వెళ్లగా విషయం బయటపడింది. వెంటనే కుమారుడిని ఇంటికి తీసుకొచ్చి మంగళవారం రాజోలు ప్రభుత్వాసుపత్రిలో చేర్పించారు. ఘటనపై ఫిర్యాదు అందడంతో రాజమహేంద్రవరం గ్రామీణం బొమ్మూరు పోలీసులు కేసు నమోదుచేశారు.



ఆ మూల్యంలో భాగంగా భావించండి

సంప్రదాయ విధానాలకు భిన్నంగా ఏ చిన్న పని చేసినా మీరు విమర్శలు ఎదుర్కోక తప్పదు! కొత్త వ్యాపారం ప్రారంభించినా.. కెరీర్‌లో వేరే రంగంలోకి మారినా.. అలవాట్లు మార్చుకున్నా.. మీ గురించి ఇతరులు ఏదో ఒకటి మాట్లాడుకుంటూనే ఉంటారు. అంతమాత్రాన వారిపై పోరుకు దిగకండి. జీవితంలో మెరుగయ్యేందుకు చెల్లించాల్సిన మూల్యంలో ఒక భాగంగా వారి విమర్శలను భావించి ముందుకెళ్లండి. **– చార్లెస్ మిల్లర్, కాపీరైటర్**

సైన్స్ గ్రూపుల్లోనూ అంధ విద్యార్థులకు ప్రవేశాలు

ఈనాడు, అమరావతి: ఇంటర్మీడియట్ విద్యలో అంధ విద్యార్థులకూ ఇకపై ఎంపీసీ, బైపీసీ కోర్సుల్లో ప్రవేశాలు కల్పించాలని ప్రభుత్వం నిర్ణయించింది. ఇప్పటివరకు వీరికి ఆర్ట్స్ గ్రూపుల్లోనే ప్రవేశాలున్నాయి. వారికి ప్రాక్టికల్స్‌కు ఇబ్బంది లేకుండా పరీక్షను బిట్ పేపర్ విధానంలో పెడతారు. పరీక్షలు రాసేందుకు స్క్రైబ్ సహాయం ఉంటుంది. దీంతో ప్రాక్టికల్స్‌కు ఇబ్బంది ఉండదు. ఈ ఏడాది నుంచి ఇంటర్మీడియట్ ప్రథమ సంవత్సరం సిలబస్‌ను పూర్తిగా మార్చిన అధికారులు.. పరీక్షల విధానాన్నీ మార్చారు. ఎంపీసీ విద్యార్థులు ఐచ్ఛికంగా జీవశాస్త్రం చదివేలా, బైపీసీ విద్యార్థులు గణితం చదివేలా ఎంబైపీసీని తీసుకొచ్చారు. ఈ ఏడాది ఇప్పటివరకు ఎంబైపీసీ గ్రూపును 7,714 మంది తీసుకోగా.. ఎంపీసీలో జీవశాస్త్రం సబ్జెక్టును 3,849 మంది విద్యార్థులు ఎంపిక చేసుకున్నారు.

ఐదు సబ్జెక్టులకు..: దివ్యాంగ విద్యార్థులకు ఇంటర్‌లో ఒక భాష సబ్జెక్టుకు మినహాయింపు ఉంది. దీంతో వారు నాలుగు సబ్జెక్టులే చదివినట్లు అవుతోంది. జేఈఈ మెయిన్స్, అడ్వాన్స్‌డ్, నీట్ ప్రవేశాలకు కనీసం ఐదు సబ్జెక్టులు చదవాలనే నిబంధన ఉంది. ఈ సమస్యను పరిష్కరించేందుకు నాలుగు సబ్జెక్టుల్లో వచ్చిన సగటు మార్కులను ఐదో సబ్జెక్టు మార్కులుగా ఇచ్చేందుకు ఇంటర్మీడియట్ విద్యాశాఖ ప్రభుత్వానికి ప్రతిపాదనలు పంపింది. ఈ ఏడాది నుంచి శాశ్వతంగా ఐదు సబ్జెక్టులకు మార్కులు ఇస్తారు. దివ్యాంగ విద్యార్థులకు ఇబ్బంది లేకుండా చూసేందుకు ప్రభుత్వం ఈ నిర్ణయం తీసుకుంది.

కశ్మీర్‌లో ఆకస్మిక వరదలు



ఉధంపుర్‌లో ప్రమాదకర స్థాయిలో ప్రవహిస్తున్న తావి నది

జమ్మూ: ఎడతెరిపి లేకుండా కురుస్తున్న వర్షాలు కశ్మీర్‌ను ముంచెత్తుతున్నాయి. పలుచోట్ల కొండచరియలు విరిగిపడుతున్నాయి. ఫలితంగా 13 మంది మరణించారు. సుప్రసిద్ధ మాతా వైష్ణోదేవి ఆలయ మార్గంలో మంగళవారం కొండచరియలు విరిగిపడి 9 మంది మృతి చెందారు. 21 మంది గాయపడ్డారు. దీంతో ముందు జాగ్రత్తగా ఆలయానికి వెళ్లే రెండు మార్గాలను అధికారులు మూసివేశారు. మరోవైపు, దోడా జిల్లాలో మేఘవిస్ఫోటం కారణంగా నలుగురు మృతి చెందారు. కతువా, కిశ్త్‌వాడ్‌లోనూ దాదాపు ఇదే పరిస్థితి నెలకొంది. వర్షాల ధాటికి కిశ్త్‌వాడ్, దోడా, రాజౌరీ జిల్లాల్లో పదుల సంఖ్యలో ఇళ్లు ధ్వంసమయ్యాయి. పలు ప్రాంతాల్లో బ్రిడ్జిలు, రోడ్లు కొట్టుకుపోయాయి. జమ్మూ, సాంబ, కతువా, రియాసి. ఉదంపుర్, రాజౌరీ, రాంబన్, దోడా, కిశ్త్‌వాడ్ జిల్లాల్లో మెరుపు వరదలు సంభవించే అవకాశం ఉందని వాతావరణ శాఖ హెచ్చరించింది. ఈ విపత్కర వాతావరణ పరిస్థితుల కారణంగా విద్యాసంస్థలన్నింటికీ సెలవు ప్రకటించారు. భారీ వర్షాలకు తోడు రాంబన్ జిల్లాలోని చందర్‌కోట్, కేలా మోర్, బ్యాటరీ చెష్మా వద్ద కొండచరియలు విరిగిపడటంతో.. ముందు జాగ్రత్త చర్యగా జమ్మూ-శ్రీనగర్ జాతీయ రహదారిపై ట్రాఫిక్‌ను నిలిపేశారు. చీనాబ్, తావి, రావిలతో పాటు హిమాచల్‌ప్రదేశ్, ఉత్తరాఖండ్‌లోని తదితర నదులు ప్రమాదకర స్థాయిలో ఉద్ధృతంగా ప్రవహిస్తున్నాయి.

హిమాచల్‌ప్రదేశ్‌లోనూ..: హిమాచల్‌ప్రదేశ్‌లో భారీ వర్షాలకు పలు చోట్ల కొండచరియలు విరిగిపడ్డాయి. దీంతో రహదారులు, ఇళ్లు, దుకాణాలు దెబ్బతిన్నాయి. బియాస్ నది ప్రమాదకర స్థాయిలో ప్రవహిస్తోంది. వరద ధాటికి పలు చోట్ల రహదారులు కొట్టుకుపోయాయి. 795 రోడ్లను మూసివేశామని హిమాచల్ ప్రదేశ్ విపత్తు నిర్వహణ శాఖ తెలిపింది.

మట్టి ప్రతిమల తయారీలో రికార్డు



ప్రతిమలు తయారుచేస్తున్న విద్యార్థులు, స్వచ్ఛంద సంస్థల ప్రతినిధులు

విజయవాడ క్రీడలు, న్యూస్‌టుడే: పర్యావరణ హిత మట్టి గణపతి ప్రతిమల తయారీలో ఎన్టీఆర్ జిల్లా రికార్డు సాధించిందని వరల్డ్ బుక్ ఆఫ్ రికార్డ్స్(డబ్ల్యూబీఆర్-లండన్) దక్షిణ భారత సంయుక్త కార్యదర్శి డాక్టర్ యు.ఇలియాజర్ ప్రకటించారు. మంగళవారం విజయవాడలోని ఐజీఎంసీ స్టేడియంలో జిల్లా అధికార యంత్రాంగం, వీఎంసీ, రాష్ట్ర కాలుష్య నియంత్రణ మండలి సంయుక్త ఆధ్వర్యంలో ఈ కార్యక్రమం నిర్వహించారు. మహారాష్ట్రలో 4,464 ఏకో ఫ్రెండ్లీ వినాయక ప్రతిమలతో గతంలో రికార్డు నమోదు కాగా.. తాజాగా విజయవాడలో 7,730 ప్రతిమల తయారీతో సరికొత్త రికార్డు నమోదైంది. ఈ రికార్డు సాధించినందుకు కలెక్టర్ జి.లక్ష్మీశకు ధ్రువపత్రం అందుకున్నారు. కార్యక్రమంలో 20 పాఠశాలలు, కళాశాలల విద్యార్థులతో పాటు సుమారు 20 స్వచ్ఛంద సంస్థల ప్రతినిధులు పాల్గొన్నారు.



ధ్రువపత్రం చూపుతున్న మంత్రి సత్యకుమార్, ఎంపీ కేశినేని శివనాథ్, ఎమ్మెల్యే బొండా ఉమా, కలెక్టర్ లక్ష్మీశ, సీపీ రాజశేఖరబాబు తదితరులు

కరుణాకరరెడ్డిని తిరుపతి నుంచి తరిమికొట్టాలి

- జగన్ ప్యాలెస్‌లో తుపాకీతో బెదిరించి, దేవలోక్ భూములు లాక్కున్నారు
- తితిదే ఛైర్మన్ బీఆర్ నాయుడు



తిరుపతిలో మీడియాతో మాట్లాడుతున్న తితిదే ఛైర్మన్ బీఆర్ నాయుడు, పక్కన సభ్యులు భానుప్రకాష్‌రెడ్డి, దివాకర్‌రెడ్డి, పనబాక లక్ష్మి

తిరుపతి (తితిదే), న్యూస్‌టుడే: పవిత్ర తిరుమల క్షేత్రాన్ని అపవిత్రం చేసి, తిరుపతిలో లెక్కలేనన్ని అరాచకాలు, అవినీతికి పాల్పడిన భూమన కరుణాకరరెడ్డికి తిరుపతిలో ఉండే అర్హత లేదని.. ఆయన్ను ఇక్కడి ప్రజలే తరిమికొట్టాలని తితిదే పాలకమండలి ఛైర్మన్ బీఆర్ నాయుడు పేర్కొన్నారు. కరుణాకరరెడ్డి తన హయాంలో చేసిన తప్పులు కప్పిపుచ్చుతూ ప్రస్తుత పాలకమండలి, శ్రీవారి విశిష్టతపై లేనిపోని ఆరోపణలు చేస్తున్నారని మండిపడ్డారు. మంగళవారం తిరుపతి పద్మావతి అతిథిగృహంలో ఆయన విలేకర్లతో మాట్లాడారు. 'అలిపిరి సమీపంలో అజయ్‌కుమార్ అనే వ్యక్తికి చెందిన దేవలోక్ ప్రాజెక్టుకు 2008లో వైఎస్సార్ ప్రభుత్వం భూమి కేటాయించింది. తర్వాత వైకాపా హయాంలో బెంగళూరులోని జగన్ ప్యాలెస్‌లో అజయ్‌కుమార్‌పై పాయింట్ బ్లాంక్‌లో గన్నుపెట్టి బెదిరించి భూములను బలవంతంగా ముంతాజ్ హోటల్‌కు బదలాయించారు. ముంతాజ్‌తోపాటు వైకాపా మాజీ ఎమ్మెల్యే మేడా మల్లికార్జునరెడ్డికి కేటాయించిన ఐదెకరాలు, పర్యాటక శాఖకు కేటాయించిన భూమితో కలిపి 50 ఎకరాల వరకు తితిదేకు దక్కేలా ప్రస్తుత ప్రభుత్వం చర్యలు తీసుకుంది. ముంతాజ్‌కు అలిపిరి రోడ్డుకు తిరుపతి నగరం వైపు ఉన్న భూములు బదలాయించే అంశం ప్రతిపాదన మాత్రమే. పూర్తిస్థాయిలో నిర్ణయం తీసుకోలేదు. దీనిపై కరుణాకరరెడ్డి అనవసర విమర్శలు మానుకోవాలి' అని పేర్కొన్నారు.

రూ.వేల కోట్లు ఎలా సంపాదించారు?

ఒకప్పుడు రోడ్లపై తిరిగిన కరుణాకరరెడ్డి రూ.వేల కోట్ల ఆస్తులకు అధిపతి ఎలా అయ్యారని నాయుడు ప్రశ్నించారు. గత ప్రభుత్వ హయాంలో తితిదేలో అవినీతి, అక్రమాలకు పాల్పడిన దోషులపై విజిలెన్స్ నివేదిక ఆధారంగా కచ్చితంగా చర్యలు తీసుకుంటామన్నారు. శ్రీవారిపై అదేపనిగా అబద్ధాలు ప్రచారం చేస్తే చూస్తూ ఊరుకోబోమని, ఆయనకు జైలుశిక్ష తప్పదని హెచ్చరించారు. తిరుపతిలో భూమన కుటుంబం అవినీతికి చిరునామాగా మారిందని తితిదే పాలకమండలి సభ్యుడు భానుప్రకాష్‌రెడ్డి విమర్శించారు. పరకామణిలో రూ.100 కోట్ల అవినీతికి పాల్పడిన వ్యక్తిని కాపాడి, ఆయన పెద్ద ఎత్తున లబ్ధి పొందారన్నారు. కరుణాకరరెడ్డి అబద్ధాలు చెప్పడం మానుకోవాలని పాలకమండలి సభ్యులు దివాకరరెడ్డి, పనబాక లక్ష్మి పేర్కొన్నారు.

అవినీతి అనకొండ.. ఆ అధికారిణి

- ఆమె చీర లక్షన్నర.. విగ్గు రూ.50 లక్షలు
- 35 ఏళ్లుగా ఉద్యోగం చేస్తూ వేలకోట్లు లూటీ చేశారు
- ఐఏఎస్ అధికారి శ్రీలక్ష్మిపై పరోక్షంగా విరుచుకుపడ్డ భూమన కరుణాకరరెడ్డి



ఈనాడు డిజిటల్, తిరుపతి; తిరుపతి(జీవకోన), న్యూస్‌టుడే: "అవినీతిలో అనకొండ ఆ అధికారిణి. డబ్బు సంపాదన తప్ప నైతిక విలువల్లేవు. ఆవిడ ధరించే చీర రూ.లక్షన్నర.. రూ.50 లక్షల కంటే ఖరీదైన విగ్గులు 11 ఉన్నాయి. ఒక్కోరోజు ఒక్కో విగ్గుతో దర్శనమిస్తారు. ఒక్క మాటలో చెప్పాలంటే తన కింది అధికారులతో తాటకిలా వ్యవహరించేవారు. పూతనకు ఏ మాత్రం తక్కువ కాదు.. లంకిణి కంటే విపరీతమైన చేష్టలున్నాయి. ఆధునిక రజియా సుల్తానా.." ఓఎంసీ కేసులో నిందితురాలు, వైకాపా ప్రభుత్వంలో కీలక ఐఏఎస్ అధికారిణి శ్రీలక్ష్మిని ఉద్దేశించి.. జగన్‌కు అత్యంత సన్నిహితుడైన భూమన కరుణాకరరెడ్డి చేసిన తీవ్ర ఆరోపణలివి. ఇద్దరూ మాజీ సీఎం జగన్‌కు వీర విధేయులే. 'ఆమె అవినీతిపై మాట్లాడతానని గతంలో (వైకాపా ప్రభుత్వంలో) సీఎంఓలోని సీనియర్ అధికారితో చెప్పా. అప్పుడు వీలుకాలేదు. ఇప్పుడు మాట్లాడక తప్పట్లేదు' అని ఏడు నిమిషాల వీడియోను మంగళవారం విడుదల చేశారు. అయితే, ఎక్కడా శ్రీలక్ష్మి పేరు ప్రస్తావించకుండా.. ఆమే అని అర్థం వచ్చేలా ఆయన మాట్లాడారు. రెండేళ్లుగా తన మనసులోనే బాధపడుతున్నానని అందులో పేర్కొన్నారు. 'పురపాలకశాఖ మంత్రి నారాయణ సోమవారం తిరుపతి పర్యటన సందర్భంగా.. టీడీఆర్ బాండ్ల విషయంలో ఏమీ జరగలేదని చెప్పినట్లు పత్రికల్లో చూశా.. ఆయన మళ్లీ మాట మార్చి భిన్నంగా మాట్లాడినా అభ్యంతరం లేదు' అని చెప్పారు. వీడియోలోని అంశాలు ఆయన మాటల్లోనే..

- అప్పుడు (వైకాపా ప్రభుత్వంలో) రాష్ట్రంలోని మంత్రుల్ని కూడా మహిళా అధికారిణి పూచిక పుల్లల్లా చూసేవారు. తన శాఖ బాధ్యతలు చూసే మంత్రులను లెక్క కూడా చేసేవారు కాదు.
- తిరుపతిలో మేమే కొత్తగా రోడ్లు వేస్తుంటే.. టీడీఆర్ బాండ్ల పేరుతో రూ.వందల కోట్ల దోపిడీకి ఆమె పన్నిన కుటిల పన్నాగాన్ని అడ్డుకున్నాం.
- ఆ కోపంతోనే మాపై పక్క జిల్లా తెదేపా నేతలతో మాట్లాడిస్తున్నారు. రూ.2వేల కోట్ల అవినీతి జరిగిందని అప్పట్నుంచి ఇప్పటివరకు ప్రచారం చేయిస్తున్నారు.
- టీడీఆర్ బాండ్లపై ఏ విచారణకైనా సిద్ధమే. ఒక్క రూపాయి అవినీతైనా చేసి ఉంటే శిక్షకు బద్ధుడినే.
- ఆ అవినీతి అధికారిణి.. 30-35 ఏళ్లుగా ఎక్కడ పనిచేసినా రూ.వేల కోట్లు లూటీ చేశారు.
- చివరకు అత్యున్నత న్యాయస్థానం కూడా.. మీ నీతి మాకు తెలుసులే అని వ్యంగ్యంగా వ్యాఖ్యానించింది.
- ఆమె చేసే ఉద్యోగం ఏంటి? వచ్చే జీతం ఎంత? ధరించే చీరల ఖరీదెంత?
- భూమిని కొల్లగొట్టారనే పేరుంది. గతించిన ఒక తెలుగుదేశం నాయకుడితో ఆమె అంటకాగారు.
- ఆ ఘోరం చూడలేక, అడ్డుకట్ట వేశాననే నాపై కోపం.
- అందుకే తెదేపా వాళ్లను నాపై ఉసిగొల్పి రూ.వేల కోట్ల అవినీతి జరిగిందనే ప్రచారం చేయించారు.
- రాష్ట్రంలో ఎక్కడా లేనంతగా 21 మాస్టర్ ప్లాన్ రోడ్లు నిర్మించాం. చిన్న తప్పు కూడా జరగలేదు.
- ఐదేళ్ల పాలనలో మేం చేసిన పనుల కారణంగా తిరుపతిలో ట్రాఫిక్ రద్దీ 70% తగ్గించాం. మా నాయకుడు జగన్ ఇచ్చిన స్వేచ్ఛ వల్లే ఈ పనులు చేశా.
- ఇలాంటి నీచపు ఆలోచనలున్న అధికారిణుల వల్ల సమస్యలు వస్తాయి. భరిస్తాం.. రాజకీయాల్లో ఇవన్నీ సహజం.
- ఇలాంటి కొద్దిమంది.. రాష్ట్రాన్ని లూటీ చేసేందుకు ఉద్యోగాల్లో చేరారు. రాజకీయ నాయకులు చాలా జాగ్రత్తగా ఉండాలని కోరుతున్నా.

EENADU Vol: 52, Issue: 18 | Printed and Published by M Nageswara Rao on behalf of Ushodaya Publications, a division of Ushodaya Enterprises Pvt Ltd. Printed and Published at Ushodaya Publications, Eenadu Press, Survey No. 239/3, 240/3B & 240/4, Gudavalli Village, Vijayawada Rural Mandal, NTR District - 521 104, Andhra Pradesh. Editor: M Nageswara Rao. Phones: 0866-2494900, 2862111. Regd. No. VJ/013/2024-26. RNI No.32238/1978. Air Surcharge Extra. Mumbai, Kolkata, Goa. Re. 1.00, Portblair Rs. 10.00. | Founder Ramoji Rao

వసుంధర

vasundhara@eenadu.in

స్త్రీశక్తి రూపం... వినాయకి!

విఘ్నేశ్వరుడిని... వినాయకుడు, గణేశుడు, గణపతి... ఇలా ఎన్నో పేర్లతో కొలుచుకుంటాం. ఏ పేరుతో పిలిచినా పురుష రూపమే! కానీ దేశంలో కొన్ని ప్రాంతాల్లో వినాయకుడిని స్త్రీరూపంలో 'విఘ్ననాయకి'గా ఆరాధిస్తారు. ఈ స్త్రీమూర్తి అవతారం వెనకా బోలెడు కథలు...



పురాణాల ప్రకారం చాలామంది దేవుళ్లు లోకకల్యాణార్థం స్త్రీరూపం దాల్చారు. వినాయకుడు అలా ధరించిన రూపమే 'వినాయకి'. గజానని, వైనాయకి, విఘ్నేశ్వరి, గణేశిని, గణేశ్వరి అనే పేర్లతోనూ పిలుస్తారు. మత్స్య పురాణం ప్రకారం ఈ స్త్రీ రూప వినాయకుడు ఆదిపరాశక్తి 64 మంది యోగినుల్లో ఒకరని చెబుతారు. సప్త మాతృకలతో పాటు మహాలక్ష్మి ఎనిమిదో మాతృక, వినాయకిని తొమ్మిదో మాతృకగా పరిగణిస్తారు. సుయజ్ఞ అనే రాక్షసిని సంహరించేందుకు విఘ్నేశ్వరుడు మహిళగా అవతరించాడని ఓ కథ. పరమేశ్వరుడు అంధకాసురుడనే రాక్షసుడిని వధించే సమయంలో అతడి రక్తబిందువులు దేవతలపై పడి, ఆయా పురుష దేవతల నుంచి స్త్రీ రూపాలు ఉద్భవించాయట. అలా వినాయకుడి నుంచి వినాయకి అవతరించిందని మరో కథనం. ముద్గల పురాణం.. విఘ్నాలను తొలగించే ఆయన స్త్రీరూపాన్ని 'ప్రజాదేవి'గా పిలిచింది. కాశీని రక్షించడానికి శివుడు నియమించిన శక్తుల్లో విఘ్నేశ్వరి ఒకటని స్కందపురాణం చెబుతోంది. వినాయకి, విఘ్నేశ్వరుడు కవలలన్న కథలూ ఉన్నాయి. మత్స్యపురాణం, విష్ణుధర్మోత్తర పురాణంలోనూ వినాయకి ప్రస్తావన ఉంది. దేవీ పురాణం విఘ్ననాయకుని శక్తి (సృష్టి) రూపమే వినాయకి అని చెబుతోంది.

తమిళనాడులోని శుచీంద్రంలో 'గణేశ్వరి'ని చూడొచ్చు. తలపై మకుటం, పైచేతుల్లో అంకుశం, పాశం.. కింది చేతుల్లో అభయ, వరద ముద్రలతో కనిపిస్తుంది. హారం, కుండలాలు, ఎడమపాదాన్ని తాకేంత పెద్ద తొండంతో ఉంటుందీ విగ్రహం. మధురైలోని మీనాక్షి ఆలయంలోనూ విఘ్నేశ్వరిని దర్శించుకోవచ్చు. చొక్కనాథన సన్నిధి పక్కనే ఓ స్తంభంలోనూ కనిపిస్తుంది. కాశీలోని వినాయకి నడుము కింది భాగాన పులి రూపం ఉంటుంది. అందుకే 'వ్యాఘ్రపాద వినాయకి'గా పిలుస్తారు. చిదంబరంలో శాంతి కామకి, మధ్యప్రదేశ్‌లోని చౌసత్ యోగిని ఆలయంలో 'శ్రీ ఐన్గిని'గా భూతేశ్వర ఆలయంలో చిన్నారి వినాయకిగా కనిపిస్తుంది. ఉత్తర్ ప్రదేశ్, బిహార్, కర్ణాటకల్లోనూ ఈ దేవిని దర్శించుకోవచ్చు. హిందూ మతంలోనే కాదు.. బౌద్ధ, జైన సాహిత్యాల్లోనూ వినాయకి ప్రస్తావన ఉంది.

ఏదేమైనా స్త్రీశక్తికి రూపం... ఈ వైనాయకి. చెడును అంతమొందించే శక్తిగా ఈమెకి పేరు. తెలివితేటలు, సమయస్ఫూర్తికి చిహ్నమే. ఎలాంటి అవాంతరాలైనా మహిళలు తమ అంతర్గత శక్తి, బుద్ధికుశలతతో అధిగమించొచ్చన్న పాఠాన్నీ చెబుతుంది. సృష్టిలో మగ, ఆడ ఇద్దరూ సమానమే. ఆ సమన్వయం సరిగా సాగినప్పుడే లోకకల్యాణం సాధ్యమన్న పరమార్థాన్నీ వివరిస్తుంది వినాయకి.




మహిళా సాధికారత కథాంశంగా వచ్చిన సినిమా 'పరదా'. దీని వెనకా మహిళా శక్తి దాగుంది. పూజితా శ్రీకంటి 'పరదా' రచయితల్లో ఒకరు కాగా, ఆ కథను దృశ్యకావ్యంగా మలిచారు సినిమాటోగ్రాఫర్ మృదుల్ సేన్. వీరిద్దరూ తమ సినీ ప్రయాణాన్ని వసుంధరతో పంచుకున్నారిలా!

కనిపించని పరదాల్నీ చూపించాం!

మహిళలు ప్రపంచాన్ని చూడాలి! – పూజిత

పుట్టిపెరిగింది హైదరాబాద్‌లో. నిఫ్ట్ హైదరాబాద్ నుంచి 'కమ్యూనికేషన్ డిజైనింగ్'లో డిగ్రీ పూర్తిచేశా. ముంబయి కేంద్రంగా పనిచేసే ప్రఖ్యాత అడ్వర్టైజింగ్ ఏజెన్సీ 'ఈక్వినాక్స్'లో ఇంటర్న్‌గా చేస్తున్నప్పుడు... ఆ సంస్థ 'నీర్జా' సినిమా తీస్తోంది. కొన్నాళ్లు ఆ డైరెక్షన్ టీమ్‌లో పనిచేశా. తర్వాత హైదరాబాద్‌లోనే అసిస్టెంట్ డైరెక్టర్‌గా ప్రయత్నించాను. 'పిడా'కి కొన్నాళ్లు పనిచేశా. ఒక షార్ట్‌ఫిల్మ్ తీశా. పుస్తకాలు చదువుతా. దాంతో క్రమంగా కథలు రాయడం, అందులోని పాత్రలను తీర్చిదిద్దడంపైన ఆసక్తి పెరిగింది. 'పరదా'కు ముందే డైరెక్టర్ ప్రవీణ్ కండ్రేగులతో కలిసి ఒక కథపైన పనిచేశా. ఆ సమయంలో 'పరదా' కాన్సెప్ట్‌మీద సినిమా తీయాలన్న ఆలోచనని పంచుకున్నారు ప్రవీణ్. అక్కణ్నుంచి కథా చర్చలు మొదలయ్యాయి. మాతో ప్రహస్ కూడా కలిశారు. ఒకమ్మాయి జీవితంలో పరదా ఎలా అడ్డంకిగా మారింది, దాన్నుంచి బయటపడటానికి ఏం చేస్తుందనేది కథ. ఆ సమయంలోనే పుణె ఫిల్మ్ ఇన్‌స్టిట్యూట్‌లో స్క్రీన్‌ప్లే రైటింగ్ కోర్సుల్లో సీటు రావడంతో చేరాను. ఏ విషయాన్నైనా ఒప్పించేలా చెప్పడం ఎలానో ఫిల్మ్ ఇన్‌స్టిట్యూట్ నేర్పింది. అక్కణ్నుంచే పరదా కథా చర్చల్లో పాల్గొనేదాన్ని. సెలవుల్లో వచ్చి షూటింగ్‌కి హాజరయ్యేదాన్ని. ద్వితీయార్ధంలో వచ్చే ధర్మశాల షెడ్యూల్‌లో మాత్రం పూర్తిగా ఉన్నాను. ఈ సినిమాలో సుబ్బలక్ష్మి పాత్రకే పరదా ఉంటుంది. కానీ బయట మహిళలకు కనిపించని పరదాలెన్నో! గృహిణులకూ, కార్పొరేట్ రంగంలో వారికీ ఉండే ఆ పరదాల గురించి చూపించాం. మహిళల్ని అణచివేయడానికి సంప్రదాయాలూ, ఆచారాల పేరిట ఎన్నో చేస్తుంటారు. దేన్నీ గుడ్డిగా నమ్మొద్దు, సైన్స్ కోణంలో చూడమని చెప్పే ప్రయత్నం చేశాం. మహిళలు ఇల్లు, ఊరు దాటి ప్రపంచం చూడాలి. అప్పుడే తమకు ఏది సరైనదో తెలుసుకోగలరు. ఆ విషయాన్నీ దీన్లో చూపించాం.



పనితోనే స్ఫూర్తిగా నిలవాలి! – మృదుల్

పరదా కథ వినగానే కనెక్టయ్యా. మహిళలు తమ సమస్యను తామే పరిష్కరించుకోవాలన్న అంశం చుట్టూ అల్లుకున్న కథ ఇది. ఇంట్లో అందరికంటే చిన్నదాన్ని. అమ్మ, అక్క దృఢమైన మహిళలు. వాళ్లద్వారా మహిళా స్వేచ్ఛను ప్రత్యక్షంగా చూశాను. ఈ సినిమాలో నటి దర్శన పోషించిన అమీ పాత్ర నిజ జీవితంలో నాకు దగ్గరగా ఉంటుంది. ఎవరికీ ఎందులోనూ తీసిపోనని నమ్ముతా. సినిమాలో అనుపమ ముఖంపైనుంచి పరదా ఎగిరిపోయే సీన్ చాలా కీలకం. ఏదైనా పరికరం ఉపయోగించి, గ్రాఫిక్స్ ద్వారా దాన్ని చేయొచ్చు. కానీ సహజంగానే తీద్దామని ప్రవీణ్ చెప్పారు. మేం పెట్టిన బ్లోయర్లకు తోడు గాలి కూడా వీయడంతో ఆ సీన్ చాలా సహజంగా వచ్చింది. గృహిణిగా 'సంగీత' పడే హైరానాని మూడు నిమిషాల నిడివిలో ఒకటే షాట్‌లో తీయాలనుకున్నాం. దానికి ఆరు గంటలు పట్టింది. ఎలాగైతేనేం, అనుకున్నది తీశాం. ధర్మశాల సన్నివేశాల్లో డ్రోన్‌నూ ఎక్కువగా ఉపయోగించాం. షూట్‌ని ఎంతో ఎంజాయ్ చేశాను. పుట్టి పెరిగింది ముంబయిలో. అక్కడే బీఏ చేశా. నాన్న సుజిత్ సేన్. బాలీవుడ్‌లో స్టడీకేమ్ ఆపరేటర్. స్కూల్ రోజుల్లోనే కెమెరా పట్టుకున్నా. డిగ్రీ తర్వాత ఫ్యాషన్, టెక్ ఫొటోగ్రాఫర్‌గా పనిచేశా. తర్వాత న్యూయార్క్ ఫిల్మ్ అకాడమీ నుంచి సినిమాటోగ్రఫీ కోర్సు చేశా. అక్కడ ఎంచుకున్న కోర్సుతోపాటు ఒకరి సినిమా కోసం మిగతావాళ్లు పనిచేస్తూ డైరెక్షన్, ఎడిటింగ్, కలర్ గ్రేడింగ్... ఇలా అన్నీ నేర్చుకుంటారు. మరాఠా సినిమా 'ఖారీ బిస్కట్'కి అవార్డునీ అందుకున్నా. తెలుగులో 'శుభం' వెబ్‌సిరీస్‌కి మొదటిసారి పనిచేశా. సినీ రంగంలో మహిళల సంఖ్య పెరుగుతోంది. సమస్యల్ని అధిగమించి నిశ్శబ్దంగా పనిచేసుకుంటూ, ఒక్కో మెట్టు పైకెక్కుతున్నారు. సినిమాటోగ్రఫీని శారీరక శ్రమతో కూడిన పనిగా భావిస్తారు. కానీ డెస్క్ జాబ్‌లో ఉండే మానసిక ఒత్తిడి తక్కువేం కాదు కదా! వీటి గురించి చర్చించడంకంటే మన పనితో నలుగురికీ స్ఫూర్తి కలిగించడమే మేలనుకుంటా.



తిన్న వెంటనే ఆకలేస్తుందా..!



భోజనం చేసే టైమ్ అయ్యింది... 'ఫలానా సమయానికి తినేయాలి. లేదంటే ఆరోగ్యం పాడవుతుంది. లంచ్ అయ్యాక చేయొచ్చులే అని పని మధ్యలో వదిలేసి లేచేస్తాం... కానీ వర్క్ పెండింగ్ ఉంది, సాయంత్రానికే సబ్మిట్ చేయాలి' అన్న ఆలోచనలు వెంటాడుతుంటాయి ఉద్యోగినులకు. 'తొందరగా తినేసి, పిల్లలకి ఏదైనా కొత్త వంటకం చేయాలి. 2గం. అయింది సీరియల్ చూస్తూ తిందాం' అనుకుంటారు గృహిణులు. అమ్మాయిల విషయం చెప్పనక్కర్లేదు... ఫోన్లు చూస్తూ, చదువుతూ తింటుంటారు. ఇలా హడావుడిగా, గబగబా తినడం వల్ల ఎన్ని సమస్యలో మీకు తెలుసా? ఇదే అధిక ఆకలికీ బరువు పెరగడానికీ జీర్ణ సంబంధిత సమస్యలకూ కారణం అంటున్నారు నిపుణులు. తినేదానిపై ధ్యాస లేకపోతే కడుపు నిండుతుంది, కానీ మెదడు దాన్ని అంగీకరించదు. మనం తిన్నాం అన్న సంకేతాలు మెదడుకు చేరవు. దాంతో వెంటనే ఆకలి వేస్తుంది. అంతేనా, తృప్తిని కలిగించే లెప్టిన్, గ్రెలిన్ లాంటి హార్మోన్లు విడుదల కావు. దీనివల్ల ఎంత తిన్నా తృప్తి కలగదు. మనం భోజనం చేస్తున్నప్పుడు ఆ సంకేతాలు మెదడు గ్రహించడానికి దాదాపు 8 నుంచి 20 నిమిషాల సమయం పడుతుందట. అందుకే నిదానంగా తినడమే మేలంటున్నారు నిపుణులు. ఎంత తిన్నాం అన్న దానికన్నా... ఎంత మైండ్‌ఫుల్‌గా తిన్నాం అన్నదానిమీదే ధ్యాస ఉంచాలి అంటున్నారు. లేదంటే లేనిపోని అనారోగ్య సమస్యలు తలుపుతడతాయని హెచ్చరిస్తున్నారు. మీరూ ఈ తప్పులు చేస్తున్నారేమో గమనించుకోండి.

బంగారం - వెండి



26న ముగింపు

	బంగారం (24క్యా)	ఆర్నమెంట్ (22క్యా)	వెండి (కిలో)
హైదరాబాద్	1,03,900	93,950	1,19,345
విజయవాడ	1,00,880	93,550	1,20,100
ప్రొద్దుటూరు	1,02,250	94,070	1,19,100
రాజమహేంద్రవరం	1,02,060	93,550	1,30,000
విశాఖపట్నం	1,01,690	93,550	1,26,000
తమిళనాడు	-----	93,550	1,30,000

బుకింగ్ నుంచి భద్రత వరకు...





రైల్వేస్టేషన్‌లో విధులంటే సవాలే కాదు సాహసోపేతం కూడా. గుంపులుగుంపులుగా ప్రయాణికులు తరలివచ్చేప్పుడు ప్రమాదాలు జరగకుండా చూడాలి. చోరీల్ని నియంత్రించాలి. చాంతాడంత క్యూలో ఉన్న ప్రయాణికులకి రైలు వచ్చేలోగా టకటకా టికెట్లు జారీ చేయాలి. స్టేషన్‌లోకి వచ్చే, వెళ్లే రైళ్లకు పక్కాగా సిగ్నళ్లు ఇవ్వాలి. దీంతో క్షణం ఏమరుపాటుగా ఉన్నా జరిగే నష్టం అంతాఇంతాకాదు. ప్రయాణికులతో కిక్కిరిసిపోయే రైల్వేస్టేషన్ల నిర్వహణ ఆషామాషీ అసలే కాదు. ఇంత క్లిష్టమైన విధులను మహిళా రైల్వే ఉద్యోగులు భుజాన వేసుకుని సమర్థంగా నిర్వర్తిస్తున్నారు. ఇక్కడ విశేషమైన అంశం ఏమిటంటే... ఆ రైల్వే స్టేషన్లలో బుకింగ్ క్లర్క్స్ నుంచి భద్రత చూసే పోలీసుల వరకు... స్టేషన్ మాస్టర్ నుంచి విచారణ సిబ్బంది వరకు అంతా మహిళలే. దక్షిణ మధ్య రైల్వే పరిధిలో తెలంగాణలోని బేగంపేట, విద్యానగర్, గుండ్లపోచంపల్లి, ఆంధ్రప్రదేశ్‌లో రామవరప్పాడు, చంద్రగిరి రైల్వేస్టేషన్లలో మహిళాధికారులే ఆయా స్టేషన్లను చూసుకుంటూ, రైళ్ల రాకపోకల్ని విజయవంతంగా నడిపిస్తున్నారు.


భయపడకుండా...

అందరూ ఉద్యోగినులే కావడంతో మహిళా ప్రయాణికులు ఎలాంటి భయం, సంకోచం లేకుండా తమ సందేహాల్ని నివృత్తి చేసుకుంటున్నారు. ఆయా స్టేషన్లలో కమర్షియల్ క్లర్క్‌లు, ఎంక్వైరీ కమ్ రిజర్వేషన్ క్లర్క్‌లు, సబ్‌ఇన్‌స్పెక్టర్, స్టేషన్ మాస్టర్ వంటి పోస్టుల్లో ఉద్యోగినులు ఉన్నారు. విజయవాడలోని వ్యాగన్ డిపోలోని ఓవర్‌హాలింగ్ విభాగంలో 35 మంది ఉద్యోగులు మహిళలే. గూడ్సు రైళ్ల వ్యాగన్ల నిర్వహణలో ఈ విభాగానిది కీలకపాత్ర. మహిళల విభాగం ఏర్పాటు తర్వాత ఇక్కడ పనితీరు గణనీయంగా మెరుగైందని ద.మ.రైల్వే అధికారులు చెబుతున్నారు.

– సోమశేఖర్ సుతారపు, హైదరాబాద్

గణనాయకుడికి... ఆరోగ్య నివేదన!

ఈ రోజు వినాయకచవితి... ఇంట్లో అందరికీ ఇష్టమైన పండుగ. కానీ మనకే ఊపిరాడనంత పని... ఓ చేత్తో పూజకోసం సిద్ధం చేసుకోవాలి. మరోచేత్తో నైవేద్యాలు చేయాలి. పైగా మిగిలిన పండుగల్లా ఒకటో రెండో వండితే సరిపోదు... గణపయ్యకి ఇష్టమైనవీ నవ వంటకాలంటూ ప్రయాసపడుతుంటాం కానీ వాటిని ఆరగించేది మనమే కదా. కాబట్టి ఆయనకు ఇష్టమైనవి రెండు రకాలు నివేదించినా సంతుష్టిపడతాడు పైగా ఆ ఉమాసుతుడికి పెట్టేవన్నీ ఆరోగ్యప్రసాదితమే...



కుడుములు, ఉండ్రాళ్లు: వినాయకుడికి ప్రీతికరమైనవిగా భావిస్తాం. వీటిని ఒక్కో ప్రాంతంలో ఒక్కో రకంగా చేస్తారు. కొన్నిచోట్ల బియ్యప్పిండి లేదా రవ్వలో పాలు, నెయ్యి, సెనగపప్పు, బెల్లం వేసి ఉడికించి చేసిన కుడుముల్నే ఉండ్రాళ్లుగానూ పెడతారు. వీటినే గుండ్రంగానూ బిళ్లలుగానూ చేస్తారు. మరికొన్నిచోట్ల బియ్యప్పిండితోనే చిన్న సైజు ఉండ్రాళ్లు చేసి కొన్ని విడిగా పెడతారు, మరికొన్ని పాకంలో వేస్తారు. ఈమధ్య వీటిని జొన్న లేదా రాగి పిండితోనూ చేస్తున్నారు. వీటిల్లో పిండిపదార్థాలు, సెనగపప్పులో ప్రొటీన్లు, పీచు, ఖనిజాలు ఉండటంతో చిన్నాపెద్దా అందరికీ బలవర్ధకమైన ఆహారమే. జీర్ణశక్తికీ మంచిదే.

పాయసం, పాలతాలికలు: పాలు, బెల్లం, సగ్గుబియ్యం, బియ్యప్పిండి కలిపి చేసే ఈ వంటకాల్లో పిండిపదార్థాలతోపాటు కొద్దిపాళ్లలో ఖనిజాలూ ఉంటాయి.

మోదకాలు, పూర్ణాలు: కంది లేదా సెనగపప్పు- కొబ్బరి- బెల్లం ఉడికించిన పూర్ణం పెట్టి వాటికి పూతగా బియ్యప్పిండి పెట్టి వండే ఈ వంటకాల్లో ప్రొటీన్లు, సహజ చక్కెరలూ లభిస్తాయి.

ఇవేకాదు, పెసరపప్పు, బెల్లం, ఉడికించిన శనగలు, అరటి, వెలగ పండ్లు... ఏవైనా ప్రసాదంగా పెట్టొచ్చు. ఈ నైవేద్యాల్లోని పోషకాలు తక్షణ శక్తినివ్వడమే కాదు, పొట్ట ఆరోగ్యానికీ మేలే.

అయినా బోలెడు రకాలు చేయాలనో భారీ సైజుల్లో కావాలనో ఆ విఘ్నేశ్వరుడు కోరలేదు. కాబట్టి అనవసర ప్రయాస పడకుండా మీకు సాధ్యమైనవీ తినగలిగినవీ మోతాదులో చేసుకోండి. ఆపై వాటిని వృథా చేయకుండా చుట్టపక్కాలకి పంచండి. అంతా కలిసి ఆనందంగా ఆరగించండి. ఆరోగ్యంగా ఉండండి. అప్పుడే ఆ పండుగ ప్రసాదాలకి అర్థం... పరమార్థం!

ఏఐని అడగొచ్చుగా!

జాబ్ మార్కెట్ పోటీ గురించి ప్రత్యేకంగా చెప్పక్కర్లేదు కదూ! ఉద్యోగం వెతుక్కునే క్రమంలో శారీరకంగానే కాదు మానసికంగానూ అలసిపోతుంటాం. అమ్మాయిలు మల్టీటాస్కర్లు అంటుంటారు. నిజానికి వేగంగా పనులు పూర్తవడానికి కాస్త స్మార్ట్‌గా ఆలోచిస్తుంటాం మరి. ఉద్యోగం విషయంలోనూ ఆ విధానాన్ని ప్రయత్నించండి. మీ పని సులువయ్యేలా ఏఐ సాయం తీసుకోండి.



'నా క్వాలిఫికేషన్‌కి తగ్గ కొలువులు దొరకట్లేదు' చాలా మంది చెప్పేమాటే ఇది. పోనీ దొరికినా ఎక్కడో దూర ప్రదేశాల్లో ఉంటాయి. ఇలాంటప్పుడు 'ఏఐ జాబ్ మ్యాచింగ్ టెక్నాలజీస్' సాయం తీసుకోండి. జీతం, చదువు, కెరియర్ గోల్స్ వంటివి ఇస్తే... కీవర్డ్స్ ఆధారంగా తగ్గ ఉద్యోగాలు అదే వెతికి చూపెడుతుంది.

రెజ్యూమె మారాలి

నిరుద్యోగి ఆస్తి రెజ్యూమెనే. మీపై తొలి అభిప్రాయం ఏర్పరిచేదీ ఇదే. అలాంటప్పుడు దీన్ని ఎంత బాగా తయారుచేసుకోవాలి? అలాగని ఏ ఉద్యోగమైనా ఒకటే పంపిస్తామన్నా కుదరదు. ఉద్యోగం, దాని అవసరాలను బట్టి, దీన్నీ తగ్గట్టుగా మార్చుకోవాలి. నిజానికి సంస్థలు ఇప్పటికే రెజ్యూమె స్క్రీనింగ్‌లో భాగంగా ఏఐని ఉపయోగిస్తున్నాయి. తొలి దశలోనే తిరస్కరణ రావొద్దంటే సరైన కీవర్డ్స్ ఇవ్వాలి. అలాంటప్పుడూ చాట్‌జీపీటీ వంటి ఏఐ టూల్స్ సాయం తీసుకోవచ్చు. అక్షరదోషాల దగ్గర్నుంచి ఆకర్షణీయంగా తీర్చిదిద్దడం వరకూ అన్నీ చేసిపెడుతుంది.

కవర్ చేసిస్తుంది

మీ గురించి, విద్యార్హత వగైరా తెలియజేయడానికి రెజ్యూమె చాలు. కానీ మీరెవరు? మీరేం చేయగలరు? ఫలానా ఉద్యోగానికి మీరే ఎందుకు అర్హులు అని చెప్పే అవకాశమిచ్చేది కవర్ లెటరే. అది ప్రభావవంతంగా చేయాలన్నా దీని సాయం తీసుకోవచ్చు. జాబ్ పోస్టింగ్ ఆధారంగా దానికి తగ్గట్టుగా మీకున్న నైపుణ్యాలు, సంస్థ కోరుకునే అంశాల ఆధారంగా తీర్చిదిద్ది ఇస్తుంది.


ఇంటర్వ్యూకి సాయపడుతుంది

తొలి దశలు దాటినా ఇంటర్వ్యూలోనూ నెగ్గాలి. అప్పుడే కొలువు వరిస్తుంది. కానీ... 'ఏ ప్రశ్నలు అడుగుతారో' అన్న భయం. చాట్‌జీపీటీ, బిగ్ ఇంటర్వ్యూ, గూగుల్ ఇంటర్వ్యూ వార్మప్‌ల సాయం తీసుకోండి. సంస్థ, ఏ హోదాకి దరఖాస్తు చేశారో చెబితే చాలు. దానికి తగ్గ ప్రశ్నలు అడుగుతాయి. అంతేకాదు, మీరు చెప్పిన సమాధానాలనూ రివ్యూ చేస్తాయి. దానికి తగ్గట్టుగా సిద్ధమైతే సరి.

ఫాలోఅప్ చేస్తుంది

ఉద్యోగవేటలో ఉన్నప్పుడు ఆర్గనైజ్‌డ్‌గా ఉండటం తప్పనిసరి. తుది గడువులు, ఇంటర్వ్యూ షెడ్యూల్, ఫాలోఅప్ అన్నీ గుర్తుంచుకోవడం కాస్త కష్టమే. పోనీ రాసిపెట్టుకున్నా వెతుక్కోవడం కష్టమే. క్లిక్అప్, కెరియర్‌ఫ్లో, నోషన్ ఏఐ సాయం తీసుకోండి. వీటన్నింటినీ ఒక క్రమపద్ధతిలో అమర్చడమే కాదు... రిమైండర్లనీ ఇస్తుంది. చూశారా వెతకాలే గానీ ఎన్ని సాయాలో... వాటిని ఉపయోగించుకోవడం, విజయం సాధించడం మీ చేతులోనే ఉంది. ఇంకేం ప్రయత్నించండి.

మీకు తెలుసా?



శిశువులు పెద్ద శబ్దాలకు భయపడతారని తెలిసిందే. అయితే, బయటనుంచి వచ్చే శబ్దాలు మాత్రమే కాదు, వాళ్ల ఏడుపు విని వాళ్లే భయపడతారట శిశువులు. దీన్నే 'మోరో రిఫ్లెక్స్' అని అంటారు. ఇది వాళ్లలో అప్రయత్నంగా జరుగుతుంది. కొన్ని నెలల తరవాత ఈ రిఫ్లెక్స్ ఆగిపోతుందట.

మూతలకీ ప్యాచ్‌లు..!

పాల డబ్బాలు పాడవకుండా ఓ బ్యాగు... వెల్లుల్లి పాయలు పొట్టు తీయడానికీ ఓ పరికరం... మూతలు జారకుండా ప్యాచ్‌లు... ఇవేంటో తెలుసుకోవాలనుందా? అయితే, చదివేయండి మరి...

స్మార్ట్ కిచెన్



వెల్లుల్లి కోసం...

వెల్లుల్లిపాయలు పొట్టు తీయటం ఓ పని. ఆ పని సులువు చేస్తుందీ ఆటోమేటిక్ ఎలక్ట్రిక్ పీలర్. దీన్లో వెల్లులి వేస్తే సెకన్లలో పొట్టు తీసేస్తుంది. అంతేకాదు, ద్రాక్ష, చెర్రీ, టొమాటో లాంటి వాటి తొక్కను తీసేందుకూ ఇది ఉపయోగపడుతుంది. రీఛార్జబుల్ కాబట్టి, ఎక్కడికైనా దీన్ని తీసుకెళ్లొచ్చు.



వస్తువులు పాడవకుండా...

డిష్‌వాషర్‌లో పెద్ద గిన్నెలు, గరిటెలు వేసినప్పుడు పర్లేదు. కానీ, చిన్న చిన్న వస్తువులు... ముఖ్యంగా పిల్లల పాల డబ్బాలు, బ్రెస్ట్ పంపులు, మూతలు... వంటివి వేసినప్పుడు అవి ఓ దగ్గర ఉండవు. వాటిని వెతికి తీయటం కష్టం. పైగా పాడయ్యే అవకాశమూ ఉంటుంది. అలాకాకుండా ఉపయోగపడతాయి ఈ డిష్‌వాషర్ బ్యాగులు. వీటిలో ఆ చిన్న వస్తువులను ఉంచి మెషిన్‌లో వేస్తే సరి. ఆ తరవాత ఆ బ్యాగ్ బయటకు తీసి వాటిని తేలిగ్గా సర్దేసుకోవచ్చు.







మూత పోదిక...

కొన్ని రకాల గిన్నెలు, క్యాస్‌రోల్స్ వంటివాటి మూతలు అంత గట్టిగా ఉండవు. దాంతో వాటిని ఎక్కడికైనా తీసుకెళ్లాలన్నా, ఎవరికైనా ఆహారం ప్యాక్ చేసి ఇవ్వాలన్నా ఇబ్బందే. ఆ కష్టం లేకుండా చేస్తాయి 'లిడ్ ప్యాచ్‌లు'. వీటిని ఆ గిన్నెల చుట్టూ చుట్టేస్తే, మూత పడిపోకుండా గట్టిగా ఉంటుంది. ప్రయాణాల్లోనూ ఈ గిన్నెలను తీసుకెళ్లొచ్చు.





వావ్‌కు రూ.6.6 కోట్ల పెట్టుబడులు

ఈనాడు, హైదరాబాద్: పూర్వ విద్యార్థులను కలిపే వేదిక వావ్ రూ.6.6 కోట్ల పెట్టుబడులను సాధించింది. వీసీ మింట్ నుంచి ఆదిత్య పూచి, జాగల్ వ్యవస్థాపకుడు రాజ్ నారాయణం ఈ మొత్తాన్ని అందించారు. పరేశ్ మసాదే, యశస్వి పీసపాటి, జైపాల్‌రెడ్డి సహ వ్యవస్థాపకులుగా ఈ అంకుర సంస్థను తీసుకొచ్చారు. సొంత నిధులు, ఏంజెల్ ఇన్వెస్టర్లు, మిత్రుల నుంచి పెట్టుబడులు తీసుకొని, ఈ సంస్థ ఏర్పాటు చేశారు. ప్రస్తుతం ఈ సంస్థ 28 దేశాల్లోని 1,200లకు పైగా విద్యా సంస్థలతో కలిసి పనిచేస్తోంది. ఇందులో ఐఐటీలు, ఐఐఎంలు, నిట్‌లాంటివి ఉన్నాయి. 35 కార్పొరేట్ అలమ్ని ప్లాట్‌ఫామ్‌లకూ సేవలను అందిస్తోంది.

ఆర్డీ ఇంజినీరింగ్ ఐపీఓకు సెబీ అనుమతి

ఈనాడు, హైదరాబాద్: హైదరాబాద్ కేంద్రంగా కార్యకలాపాలు సాగిస్తున్న ఆర్డీ ఇంజినీరింగ్ లిమిటెడ్ త్వరలో తొలి పబ్లిక్ ఇష్యూ (ఐపీఓ)కు రానుంది. రూ.580 కోట్లు సమీకరించటానికి వీలుగా ఈ సంస్థ దాఖలు చేసిన ఐపీఓ దరఖాస్తును సెబీ అనుమతించింది. దీని ప్రకారం ఆర్డీ ఇంజినీరింగ్ కొత్తగా రూ.500 కోట్ల విలువైన ఈక్విటీ షేర్లు జారీ చేస్తుంది. ఇదే కాకుండా ఆఫర్ ఫర్ సేల్ (ఓఎఫ్ఎస్) కింద రూ.80 కోట్ల విలువైన షేర్లను ప్రమోటరు చంద్రశేఖర్ మోటూరు విక్రయిస్తారు. పబ్లిక్ ఇష్యూ ద్వారా కంపెనీకి లభించే నిధుల్లో రూ.280 కోట్లను తెలంగాణ రాష్ట్రంలో కొత్తగా ఏర్పాటు చేసే యూనిట్ కోసం వెచ్చిస్తారు. దీంతో పాటు రూ.45 కోట్లను ఆంధ్రప్రదేశ్‌లోని పరవాడ వద్ద ఏర్పాటు చేసే ప్లాంటుపై ఖర్చు చేస్తారు. అప్పు తీర్చటానికి, ఇతర అవసరాలకు రూ.65 కోట్లు కేటాయిస్తారు.

మలబద్ధకానికి డాక్టర్ రెడ్డీస్ ఔషధం

ఈనాడు, హైదరాబాద్: తీవ్రమైన మలబద్ధకానికి చికిత్సలో వినియోగించే లినక్లోటైడ్ అనే ఔషధాన్ని డాక్టర్ రెడ్డీస్ లేబొరేటరీస్ దేశీయ మార్కెట్లో విడుదల చేసింది. జీసీ-సీ (గ్వానలేట్ సైక్లాసీ-సీ) తరగతికి చెందిన ఈ ఔషధాన్ని 'కొలోజో' అనే బ్రాండు పేరుతో తీసుకువచ్చినట్లు డాక్టర్ రెడ్డీస్ పేర్కొంది. ఈ ఔషధాన్ని తీసుకురావటంతో గ్యాస్ట్రోఇంటెస్టినల్ విభాగంలో తమ ఔషధాల శ్రేణి విస్తరించినట్లు అవుతోందని డాక్టర్ రెడ్డీస్ సీఈఓ (బ్రాండెడ్ మార్కెట్స్-భారత్, వర్ధమాన దేశాలు) ఎం.వి.రమణ తెలిపారు.

కెన్‌స్టార్ నుంచి 5 స్టార్ ఎయిర్ కూలర్లు

హైదరాబాద్: విద్యుత్ గృహోపకరణాల సంస్థ కెన్‌స్టార్, 5 స్టార్ బీఈఈ రేటింగ్ కలిగిన ఎయిర్ కూలర్ల శ్రేణిని తీసుకొచ్చింది. 5 స్టార్ బీఈఈ రేటింగ్‌తో ఇంధన ఆదా చేసే కూలర్లను మన దేశంలో తీసుకు రావడం ఇదే మొదటిసారని కంపెనీ తెలిపింది. ఈ కూలర్లపై 5 ఏళ్ల వారెంటీని అందిస్తోంది. కెన్‌స్టార్ 'ది పవర్ ఆఫ్ 5' ప్రచార కార్యక్రమంలో స్థిరత్వం, విద్యుత్ ఆదాకు సంస్థ కట్టుబడి ఉందని పేర్కొంది. సరికొత్త సాంకేతికత కలిగిన ఈ కూలర్లు అద్భుతమైన చల్లదనాన్ని అందిస్తాయని వెల్లడించింది. బీఎల్‌డీసీ మ్యాక్స్ టెక్నాలజీ, క్వాడ్రా ఫ్లో టెక్నాలజీ వల్ల వేగంగా గాలి రావడం, కూలింగ్ ప్యాడ్స్ మన్నిక పెరుగుతుందని వివరించింది. ఇంధన ఆదాకు సంస్థ కట్టుబడి ఉందని, ప్రభుత్వ లక్ష్యాలకు అనుగుణంగా బీఈఈ 5 స్టార్ కూలర్లను తీసుకొచ్చినట్లు కెన్‌స్టార్ సీఈఓ సునీల్ జైన్ తెలిపారు.

కోడి గుడ్లు

27న ఫారం వద్ద రైతు అమ్మకం ధరలు (నెక్)

(100కు రూపాయలలో)

హైదరాబాద్	500
వరంగల్	502
విజయవాడ	550
గోదావరి	540
విశాఖపట్నం	540
చిత్తూరు	558

సామాన్యులకూ అర్థమయ్యేలా కొత్త ఆదాయపు పన్ను చట్టం



☛ అన్ని నిబంధనలూ ఒకే చోట

☛ ఈటీవీ భారత్ ఇంటర్వ్యూలో ఆర్ఎన్ పర్బత్

కొత్త ఆదాయపు పన్ను(ఐటీ) చట్టం ఏప్రిల్ 1 నుంచి అమల్లోకి రానుంది. కేంద్ర ప్రత్యక్ష పన్నుల బోర్డు (సీబీడీటీ) దీని అమలుకు సన్నాహాలు చేస్తోంది. పన్ను చెల్లింపుదారులకు సులభంగా అర్థమయ్యేలా, ఇబ్బందులు లేకుండా అన్ని వ్యవస్థలూ సిద్ధమవుతున్నాయి. ఈ చట్టం 1961 నుంచి అమల్లో ఉన్న పాత చట్టాన్ని భర్తీ చేస్తుంది. 'సరళ, స్పష్టమైన భాషలో వస్తోన్న కొత్త చట్టం సాధారణ పౌరులకు పన్ను ఫైలింగ్‌ను సులభతరం చేయనుంది. చట్టపరంగా ఉన్న గందరగోళాన్ని, వివాదాలను తగ్గిస్తుంది. ప్రస్తుత డిజిటల్ ఆర్థిక వ్యవస్థకు అనుగుణంగా వస్తోంద'ని సీబీడీటీ సభ్యుడు (లెజిస్లేషన్) ఆర్.ఎన్. పర్బత్ అన్నారు. 'ఈటీవీ భారత్‌'తో ఈ విషయాలపై ప్రత్యేకంగా మాట్లాడారు.

? ప్రస్తుతం అమల్లో ఉన్న 1961 చట్టాన్ని మార్చాలనుకోవడానికి కారణం?

ఆదాయపు పన్ను వ్యవస్థలో ఉన్న నిబంధనలు చాలా కాలంగా ఈ విషయాన్ని చర్చిస్తున్నారు. 1961 చట్టానికి దాదాపు 4,000 సవరణలు వచ్చాయి. పాత, క్లిష్టమైన పద బంధాలతో అది ఉంది. చట్టం సామాన్యులకు అర్థమయ్యేలా, సులభంగా ఉండాలని ప్రధాని పలు సందర్భాల్లో చెప్పారు. పాత చట్టాన్ని మార్చాలని సూచించారు. దీన్ని పాటించేందుకే ఆర్థిక మంత్రి తన బడ్జెట్ ప్రసంగంలో కొత్త ఆదాయపు పన్ను చట్టాన్ని తీసుకొస్తున్నట్లు ప్రకటించారు. ఈ ప్రక్రియలో ఏళ్ల తరబడి పేరుకుపోయిన పాత నిబంధనలను తొలగించాం. ఒకే విషయానికి సంబంధించి వేర్వేరు చోట్ల చెల్లాచెదురుగా ఉన్న నిబంధనలను ఒకే దగ్గరకు తీసుకొచ్చాం. ఫలితంగా సామాన్య ప్రజలు చట్టాన్ని అర్థం చేసుకోవడం చాలా సులభమవుతుంది.

? కొత్త ఆదాయపు పన్ను చట్టం సామాన్య ప్రజలు పన్ను దాఖలు చేయడాన్ని ఎంత మేరకు సులభతరం చేస్తుంది?

కొత్త ఆదాయపు పన్ను చట్టం సులభమైన, సరళమైన భాషలో రాబోతోంది. సంక్లిష్టమైన చట్టపరమైన పదజాలానికి దూరంగా ఉంటుంది. ఇది సామాన్య ప్రజలకు సులభంగా అర్థమవుతుంది. దీనివల్ల పన్ను చెల్లింపుదారులు చట్టాన్ని పూర్తిగా అర్థం చేసుకోవడంతో పాటు, పన్నులను ఎందుకు చెల్లించాలి, ఎలా చెల్లించాలి అన్న విషయాలను సులభంగా గ్రహించగలరు.

? కొత్త చట్టంలో వివాదాలను తగ్గించేందుకు ఎలాంటి ఏర్పాట్లు ఉన్నాయి.

పాత చట్టానికి సరళీకృత రూపమే కొత్త చట్టం. దీన్ని మరింత ప్రభావవంతంగా అమలు చేసేందుకు పని ప్రారంభమైంది. మరింత సమగ్రంగా అమలు జరుగుతుంది. డిజిటల్ వ్యవస్థకు తగ్గట్లుగానే చట్టంలో నిబంధనలు ఉంటాయి.

? చట్టంపై ప్రజల్లో అవగాహన కల్పించేందుకు ఐటీ విభాగం, ప్రభుత్వం ఏ చర్యలు తీసుకుంటున్నాయి.

ప్రజలు సులభంగా చట్టాన్ని అర్థం చేసుకునేందుకు ప్రశ్న-జవాబులను (ఎఫ్ఏక్యూ) అందుబాటులోకి తెస్తాం. పలు వీడియోలను విడుదల చేస్తాం. మార్గదర్శకాలనూ త్వరలో జారీ చేస్తాం.

నేను చెప్పినట్లు తీర్పు రావాలి..!

- చెన్నై ఎన్‌క్లాట్ జ్యుడీషియల్ సభ్యుడిపై ఉన్నతస్థాయి ఒత్తిళ్లు
- కేసు విచారణ నుంచి తప్పుకోవాలని నిర్ణయం
- కేఎల్ఎస్ఆర్ ఇన్‌ఫ్రాటెక్ కేసులో ఆసక్తికర పరిణామం



జస్టిస్ శరద్ కుమార్

దిల్లీ: చెన్నైలోని నేషనల్ కంపెనీ లా అప్పిలేట్ ట్రైబ్యునల్ (ఎన్‌క్లాట్) జ్యుడీషియల్ సభ్యుడిగా ఉన్న జస్టిస్ శరద్ కుమార్ శర్మకు అనుకోని పరిస్థితి ఎదురైంది. ఒక కేసులో తాను చెప్పిన వ్యక్తికి అనుకూలంగా తీర్పు ఇవ్వాలని న్యాయవ్యవస్థలో అత్యున్నత స్థానంలో ఉన్న ఒక గౌరవప్రదమైన సభ్యుడు ఆయనను సంప్రదించారు. దీనిపై మనస్తాపానికి గురైన జస్టిస్ శరద్ కుమార్ శర్మ ఆ కేసు విచారణ నుంచి తప్పుకున్నారు. అంతేకాకుండా ఆ విషయాన్ని అధికారికంగా రికార్డు చేస్తూ, కేసు విచారణ నుంచి తాను తప్పుకుంటున్నానని, కేసు విచారణను వేరే బెంచ్ ముందుంచాలని సూచిస్తూ ఉత్తర్వులు జారీ చేశారు.

ఈ కేసు హైదరాబాద్‌కు చెందిన ఒక ఇన్‌ఫ్రా కంపెనీకి సంబంధించింది కావడం ఆసక్తికరం. కేఎల్ఎస్ఆర్ ఇన్‌ఫ్రాటెక్ అనే ఈ కంపెనీపై ఎన్‌సీఎల్‌టీ హైదరాబాద్ బెంచ్‌లో దివాలా స్మృతి (ఐబీసీ) కింద ఏఎస్ మెట్ కార్ప్ ప్రైవేట్ లిమిటెడ్ అనే కంపెనీ దివాలా పిటిషన్ దాఖలు చేసింది. ఈ పిటిషన్‌ను ఎన్‌సీఎల్‌టీ అనుమతించడమే కాకుండా దివాలా ప్రక్రియ చేపట్టడానికి వీలుగా తాత్కాలిక పరిష్కార నిపుణుడి(ఐఆర్‌పీ)ని నియమించింది. ఎన్‌సీఎల్‌టీ ఉత్తర్వులను సవాలు చేస్తూ కేఎల్ఎస్ఆర్ ఇన్‌ఫ్రాటెక్ డైరెక్టర్‌గా ఉండి సస్పెండ్ అయిన అట్లూరు శ్రీనివాసులు రెడ్డి చెన్నైలోని ఎన్‌క్లాట్‌లో అప్పీలు చేశారు. ఎన్‌క్లాట్‌లో విచారణ పూర్తయింది. ఈ నెల 13న తుది ఉత్తర్వులు వెలువడాల్సి ఉంది. ఈ పిటిషన్‌ను విచారించిన ఎన్‌క్లాట్ బెంచ్‌లో జస్టిస్ శరద్ కుమార్ శర్మ, జతీంద్రనాథ్ స్వెయిన్ (టెక్నికల్ సభ్యుడు) ఉన్నారు. ఉత్తర్వులు జారీ చేయాల్సిన రోజున జస్టిస్ శరద్ కుమార్ శర్మ విచారణ నుంచి తప్పుకుంటున్నట్లు స్పష్టం చేశారు. అందుకు గల కారణాలను రాతపూర్వకంగా తన ఉత్తర్వుల్లో ప్రస్తావించారు.

గతంలోనూ: జస్టిస్ శర్మ ఉత్తరాఖండ్ హైకోర్టు న్యాయమూర్తిగా పనిచేసి 2023 డిసెంబరు 31న పదవీ విరమణ చేశారు. ఆ తర్వాత ఎన్‌క్లాట్‌లో జ్యుడీషియల్ సభ్యుడిగా నియమితులయ్యారు. గతంలోనూ కొన్ని కేసుల్లో విచారణ నుంచి వివిధ కారణాలతో తప్పుకొన్న ఉదంతాలు ఉన్నాయి.

మారుతీ తొలి ఈవీ ఇ-విటారా ఎగుమతులు ప్రారంభం

గుజరాత్ ప్లాంటులో లిథియం అయాన్ బ్యాటరీ సెల్‌ల తయారీ

హంసలపుర్: మారుతీ సుజుకీ మొట్టమొదటి విద్యుత్ వాహన మోడల్ ఇ-విటారా ఎగుమతులను మంగళవారం ప్రధాని నరేంద్ర మోదీ ప్రారంభించారు. 100 దేశాలకు వీటిని కంపెనీ ఎగుమతి చేయనుంది. మారుతీ సుజుకీ ఇండియాకు చెందిన సుజుకీ మోటార్ గుజరాత్ (ఎస్ఎంజీ) ప్లాంటులో ఇ-విటారాను తయారు చేశారు. ఇ-విటారా తొలి విడత ఎగుమతులు పిపావావ్ పోర్టు నుంచి బయలుదేరి యునైటెడ్ కింగ్‌డమ్, జర్మనీ, నార్వే, ఫ్రాన్స్, డెన్మార్క్, స్విట్జర్లాండ్, నెదర్లాండ్స్, స్వీడన్, హంగేరీ, ఇటలీ, ఆస్ట్రియా, స్విట్జర్లాండ్ సహా ఐరోపా ప్రాంత దేశాలకు సరఫరా అవుతాయి. గుజరాత్ ప్లాంటులోనే హైబ్రిడ్ విద్యుత్ వాహనాల కోసం లిథియం అయాన్ బ్యాటరీ సెల్‌ల తయారీని కూడా మారుతీ సుజుకీ ప్రారంభించింది.

భారత్‌లో విడుదల ఎందుకు లేదు?

భారత్‌లో ఇ-విటారాను విడుదల చేయకపోవడంపై మారుతీ సుజుకీ ఇండియా ఛైర్మన్ ఆర్ సి భార్గవ స్పందిస్తూ... ఎగుమతి ఆర్డర్లను పూర్తి చేయాల్సి ఉండటమే కాకుండా, బ్యాటరీని దిగుమతి చేసుకోవడం వల్ల ఈ ఈవీ ధర కాస్త ఎక్కువగా ఉండటమూ ఒక కారణంగా చెప్పారు.

రూ.70,000 కోట్ల పెట్టుబడి: సుజుకీ మోటార్

భారత్‌లో కార్యకలాపాలను బలోపేతం చేసుకునేందుకు వచ్చే 5-6 ఏళ్లలో రూ.70,000 కోట్ల పెట్టుబడి పెట్టనున్నట్లు జపాన్ వాహన తయారీ సంస్థ సుజుకీ మోటార్ కార్పొరేషన్ డైరెక్టర్, ప్రెసిడెంట్ తొషిహిరో సుజుకీ తెలిపారు. పర్యావరణహిత వాహనాల వినియోగం పెరిగే దిశగా భారత్ నిర్దేశించుకున్న లక్ష్య సాధనకు, వికసిత్ భారత్ కార్యక్రమానికి తమ వంతు సహకారం అందిస్తామని వెల్లడించారు. ఏటా 50 లక్షల వాహనాల తయారీకి ఈ పెట్టుబడులు ఉపయోగపడతాయని భార్గవ తెలిపారు. మౌలిక వసతులు, పరిశోధన-అభివృద్ధి, కొత్త సాంకేతికతలను అందిపుచ్చుకోవడం కోసం అధిక నిధులు అవసరమవుతాయని తెలిపారు. గుజరాత్‌లో రెండో ప్లాంటు ఏర్పాటుపై సెప్టెంబరు 4న జరిగే జీఎస్టీ మండలి సమావేశం తర్వాత తమ సమాధానమే మిటో చెబుతామన్నారు. లిథియం అయాన్ దిగుమతి కోసం చైనాపై పూర్తిగా ఆధారపడటం వల్లే భారత్‌లో బ్యాటరీ సెల్ తయారీ కోసం పెట్టుబడులు పెట్టేందుకు పెట్టుబడిదార్లు ఆసక్తి చూపడం లేదని తెలిపారు.



ఇ-విటారాతో ప్రధాని నరేంద్ర మోదీ, సుజుకీ మోటార్ కార్పొరేషన్ డైరెక్టర్, ప్రెసిడెంట్ తొషిహిరో సుజుకీ

ఫార్మా పరిశ్రమకు మేలు జరిగేలా జీఎస్‌టీలో మార్పులు

డాక్టర్ రెడ్డీస్ ఛైర్మన్ సతీష్‌రెడ్డి ఆశాభావం



దిల్లీ: మన దేశంలో ఫార్మా పరిశ్రమ ఎదుర్కొంటున్న సమస్యలకు కొంతమేరకైనా పరిష్కారాన్ని చూపే విధంగా జీఎస్‌టీలో మార్పులు వస్తాయనే ఆశాభావాన్ని డాక్టర్ రెడ్డీస్ ఛైర్మన్ సతీష్‌రెడ్డి వ్యక్తపరిచారు. జీఎస్‌టీలో కేంద్ర ప్రభుత్వం మార్పులు ప్రతిపాదిస్తున్న విషయం విదితమే. ఇప్పటి వరకూ ఉన్న నాలుగు శ్లాబుల స్థానంలో రెండు శ్లాబుల వ్యవస్థను ఆవిష్కరించేందుకు అవకాశాలు కనిపిస్తున్నాయి. అత్యవసర వస్తువులను 5 శాతం పన్ను శ్లాబులోకి తీసుకువస్తారనే ప్రచారమూ జరుగుతోంది. ఈ నేపథ్యంలో సతీష్‌రెడ్డి స్పందిస్తూ 'ఎంతోకాలంగా ఫార్మా పరిశ్రమ పలు రకాలైన సవాళ్లను ఎదుర్కొంటోంది. అధిక జీఎస్‌టీ భారం కూడా అందులో ఒకటి. దీనికి తోడు 'ఇన్వెర్టెడ్ డ్యూటీ స్ట్రక్చర్' వల్ల మెరుగైన ఉత్పత్తి సామర్థ్యాన్ని సాధించలేని పరిస్థితి కూడా ఉత్పన్నం అవుతోంది. దీనివల్ల మందుల ధరలు పెరిగి ప్రజలపై భారం పడుతోంద'ని అన్నారు. ఈ సమస్యలను దృష్టిలో పెట్టుకొని జీఎస్‌టీలో మార్పులు తీసుకువస్తారని ఆశిస్తున్నట్లు ఆయన పేర్కొన్నారు. జీఎస్‌టీ భారం తగ్గించడం వల్ల ప్రజలకు మందుల ఖర్చు తగ్గుతుందని, ఫార్మా పరిశ్రమకు కూడా మేలు జరుగుతుందని అన్నారు.

సాధారణ వైద్య పరికరాలపై 12 శాతం జీఎస్‌టీని కొనసాగించాలని, ఖరీదైన పరికరాలకు 5 శాతం జీఎస్‌టీ మాత్రమే వర్తింపజేయాలని మరోపక్క అసోసియేషన్ ఆఫ్ ఇండియన్ మెడికల్ డివైజ్ ఇండస్ట్రీ (ఏఐఎంఈడీ) ఒక ప్రకటనలో కోరింది. ప్రస్తుతం వైద్య పరికరాలపై 12 శాతం, వాటి తయారీకి ఉపయోగించే ముడిపదార్థాలపై 18 శాతం జీఎస్‌టీ విధిస్తున్నారు. వైద్య పరికరాలు, ఎలక్ట్రానిక్స్, రీఏజెంట్స్, ఇంప్లాంట్స్‌పై జీఎస్‌టీని 5 శాతానికి తగ్గించాలని ఏఐఎంఈడీ ప్రతినిధి కోరారు.

తిరుప్పూర్, నోయిడా, సూరత్ వస్త్ర తయారీదార్లు ఉత్పత్తి ఆపేశారు

యూఎస్ టారిఫ్‌ల వల్లే: ఫియో

దిల్లీ: భారత ఉత్పత్తులకు అమెరికా అధిక సుంకాలు విధించడంపై ఎగుమతిదార్ల సంఘం ఫియో తీవ్ర ఆందోళనను వ్యక్తం చేసింది. ఈ సుంకాల కారణంగా పోటీ సామర్థ్యంపై ప్రభావం పడటంతో తిరుప్పూర్, నోయిడా, సూరత్‌లోని వస్త్ర తయారీదార్లు తమ ఉత్పత్తిని నిలిపేశారని పేర్కొంది. ఈ పరిణామంతో భారత్‌కు అతిపెద్ద ఎగుమతి విపణి అయిన అమెరికాకు దేశీయ వస్తువుల సరఫరా బాగా తగ్గుతుందని ఫియో ప్రెసిడెంట్ ఎస్ సి రల్హాన్ తెలిపారు. తోలు, రొయ్యలు, సెరామిక్స్, రసాయనాలు, చేనేత వస్త్రాలు, కార్పెట్లు లాంటి కార్మిక ప్రభావిత ఎగుమతి రంగాలు కూడా ఐరోపా, ఆగ్నేయాసియా, మెక్సికో తయారీదార్ల నుంచి గట్టి పోటీని ఎదుర్కోవాల్సి వస్తుందని అభిప్రాయపడ్డారు. వడ్డీ రాయితీ పథకాలు, ఎగుమతులకు రుణ సహకారం అందించడంపై ప్రభుత్వం దృష్టి పెట్టాలని తెలిపారు.

అమెరికా అధిక టారిఫ్‌ల ప్రభావంతో ప్రస్తుత ఆర్థిక సంవత్సరంలో భారత రెడీమేడ్ వస్త్రాల పరిశ్రమ ఆదాయ వృద్ధి సగానికి తగ్గి 3-5 శాతానికి పరిమితం కావొచ్చని క్రిసిల్ తెలిపింది. గత ఆర్థిక సంవత్సరంలో 16 బిలియన్ డాలర్ల విలువైన రెడీమేడ్ దుస్తులు ఎగుమతులు అయ్యాయి.

టోల్‌ప్లాజా ఉద్యోగుల పిల్లల చదువులకు 'ప్రాజెక్ట్ ఆరోహణ్'

ఈనాడు, దిల్లీ: జాతీయ రహదారుల్లోని టోల్‌ప్లాజాల్లో పనిచేసే ఉద్యోగులకు చెందిన ప్రతిభావంత పిల్లలకు ఆర్థికసాయం చేయడానికి వెర్టిస్ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ ట్రస్ట్‌తో కలిసి 'ప్రాజెక్ట్ ఆరోహణ్'ను జాతీయ రహదారుల ప్రాధికార సంస్థ(ఎన్‌హెచ్ఏఐ) ప్రకటించింది. తొలిదశలో 2025 జులై నుంచి 2026 మార్చి మధ్యకాలానికి రూ.కోటి నిధిని కేటాయిస్తున్నారు. ఇంటర్ నుంచి గ్రాడ్యుయేషన్ వరకు చదివే 500 మంది పిల్లలకు ఒక్కొక్కరికి 2025-26లో రూ.12,000 స్కాలర్‌షిప్ అందిస్తారు. పోస్టుగ్రాడ్యుయేట్ కోర్సు చేయాలనుకున్న 50 మంది ప్రతిభావంతమైన విద్యార్థులకు రూ.50,000 చొప్పున స్కాలర్‌షిప్ సమకూర్చనున్నట్లు ఎన్‌హెచ్ఏఐ ఛైర్మన్ సంతోష్‌కుమార్ యాదవ్ ఇక్కడ సంస్థ ప్రధాన కార్యాలయంలో పేర్కొన్నారు. దీనికి సంబంధించిన దరఖాస్తు ప్రక్రియ అంతా ఆన్‌లైన్‌లో జరుగుతుంది.

సాయి లైఫ్‌సైన్సెస్ నుంచి టీపీజీ ఏషియా నిష్క్రమణ!

14.72% వాటా రూ.2,683 కోట్లకు విక్రయం



ఈనాడు, హైదరాబాద్: హైదరాబాద్ కేంద్రంగా కార్యకలాపాలు సాగిస్తున్న సీఆర్‌డీఎంఓ విభాగానికి చెందిన కంపెనీ, సాయి లైఫ్‌సైన్సెస్‌లో ప్రైవేట్ ఈక్విటీ(పీఈ) పెట్టుబడుల సంస్థ అయిన టీపీజీ ఏషియా భారీగా షేర్లు విక్రయించినట్లు తెలుస్తోంది. ఈ ఏడాది జూన్ ఆఖరుకు సాయి లైఫ్‌సైన్సెస్‌లో టీపీజీ ఏషియాకు 14.72 శాతం (3.07 కోట్ల షేర్లు) వాటా ఉంది. ఈ షేర్లన్నింటినీ స్టాక్ ఎక్స్ఛేంజీల్లో బల్క్ డీల్ విండోలో ఒక్కో షేరును రూ.874 ధరకు విక్రయించినట్లు సమాచారం. దీంతో టీపీజీ ఏషియాకు దాదాపు రూ.2,683 కోట్లు వచ్చినట్లు తెలుస్తోంది. సాయి లైఫ్‌సైన్సెస్ షేరు ధర బీఎస్ఈలో క్రితం రోజు ముగింపు రూ.906 కాగా, దీంతో పోలిస్తే దాదాపు 4% తక్కువ ధరకే తన షేర్లను టీపీజీ ఏషియా విక్రయించింది. మంగళవారం ఈ షేరు బీఎస్ఈలో రూ.859 వద్ద స్థిరపడింది. క్రితం రోజుతో పోలిస్తే 5.20% (రూ.47) నష్టపోయింది. ఈ షేర్ల విక్రయంతో సాయి లైఫ్‌సైన్సెస్ నుంచి టీపీజీ ఏషియా పూర్తిగా బయటకు వెళ్లిపోయినట్లు అవుతోందని స్టాక్‌మార్కెట్ వర్గాలు వివరిస్తున్నాయి.

సాయి లైఫ్‌సైన్సెస్ గతేడాది డిసెంబరులో పబ్లిక్ ఇష్యూకు వచ్చింది. బుక్ బిల్డింగ్ పద్ధతిలో ఒక్కో షేరును రూ.549 ధరకు విక్రయించింది. అప్పట్లోనే ఆఫర్ ఫర్ సేల్ (ఓఎఫ్ఎస్) విధానంలో కొన్ని షేర్లను టీపీజీ ఏషియా విక్రయించింది. మిగిలిన షేర్లను ఇప్పుడు స్టాక్‌ఎక్స్ఛేంజీల్లో విక్రయించినట్లు స్పష్టమవుతోంది. సాయి లైఫ్ సైన్సెస్ ఈ ఆర్థిక సంవత్సరం మొదటి త్రైమాసికానికి మెరుగైన ఫలితాలు నమోదు చేసింది. ఆదాయం 77 శాతం వృద్ధితో రూ.496 కోట్లు కాగా, నికరలాభం క్రితం ఆర్థిక సంవత్సరం ఇదేకాలంలో నమోదైన రూ.13 కోట్ల నుంచి రూ.60 కోట్లకు పెరిగింది. లాభాల మార్జిన్ 12 శాతం ఉంది. డిస్కవరీ, డెవలప్‌మెంట్, కమర్షియల్ మాన్యుఫ్యాక్చరింగ్ విభాగాల్లో మెరుగైన పనితీరు ప్రదర్శించినట్లు ఈ సందర్భంగా సాయి లైఫ్ సైన్సెస్ ఎండీ, సీఈఓ కృష్ణ కనుమూరి పేర్కొన్నారు.

టీసీఎస్ కొత్త ఏఐ యూనిట్ ఏర్పాటు

దిల్లీ: కృత్రిమ మేధ (ఏఐ), సర్వీసెస్ ట్రాన్స్‌ఫర్మేషన్ కోసం కొత్త విభాగాన్ని టాటా కన్సల్టెన్సీ సర్వీసెస్ (టీసీఎస్) ఏర్పాటు చేసింది. ఈ విభాగానికి సారథ్య బాధ్యతలను అమిత్ కపూర్‌కు అప్పగించింది. సెప్టెంబరు 1 నుంచి ఆయన నియామకం అమల్లోకి రానుంది. ప్రస్తుతం టీసీఎస్ యూకే, ఐర్లాండ్ వ్యాపారాలను అమిత్ చూస్తున్నారు. ఇప్పుడు ఈ స్థానంలోకి విజయ్ సింఘ్వీ రానున్నారని టీసీఎస్ సీఈఓ కె కృతివాసన్ తెలిపారు. కృత్రిమ మేధలో సామర్థ్యాలను, ప్రస్తుత బృందాలను ఈ కొత్త ఏఐ యూనిట్ అనుసంధానం చేస్తుంది. ఇతర సేవల విభాగాలతో పాటు వివిధ పరిశ్రమల వ్యాపారాల విభాగాలతోనూ ఇది కలిసి పనిచేయనుంది. ప్రస్తుతం ఉన్న ఏఐ, డేటా యూనిట్ ఈ కొత్త విభాగం కిందకు వస్తుందని టీసీఎస్ తెలిపింది.

భారత్‌లో యాపిల్ నాలుగో స్టోర్

దిల్లీ: ఐఫోన్ల తయారీ సంస్థ యాపిల్, సెప్టెంబరు 4న పుణెలో తన కొత్త విక్రయశాలను ప్రారంభించనున్నట్లు మంగళవారం తెలిపింది. సెప్టెంబరు 2న బెంగళూరులో ఒక విక్రయశాలను తెరవనున్నట్లు ఇటీవల ప్రకటించిన సంగతి తెలిసిందే. పుణెలో ఏర్పాటు చేయబోతున్న స్టోరు భారత్‌లో యాపిల్‌కు నాలుగోది కావడం గమనార్హం.

స్పైస్‌జెట్ కాగితరహిత బోర్డింగ్

గువాహటీ: స్పైస్‌జెట్ మంగళవారం షిల్లాంగ్ విమానాశ్రయంలో కాగిత రహిత బోర్డింగ్ సౌకర్యాన్ని ప్రారంభించింది. దీంతో ప్రయాణికులు వేచి ఉండే సమయం తగ్గుతుందని తెలిపింది. రాబోయే రోజుల్లో ఇతర దేశీయ విమానాశ్రయాల్లోనూ ఈ కాగితరహిత సేవలను విస్తరించనున్నట్లు తెలిపింది.

ఎఫ్ఐఐ విక్రయాలు: రూ.6,516 కోట్లు
డీఐఐ కొనుగోళ్లు: రూ.7,060 కోట్లు

అమెరికా సుంకాల అమలు ప్రభావంతో..

● డీలా పడ్డ సూచీలు ● 81,000 పాయింట్ల దిగువకు సెన్సెక్స్

సమీక్ష

సెన్సెక్స్ ▼849 80787 | నిఫ్టీ ▼256 24712

భారతీయ ఉత్పత్తులపై బుధవారం నుంచి అదనంగా మరో 25 శాతం (మొత్తం 50 శాతం) సుంకాల అమలు కోసం అమెరికా ముసాయిదా నోటీసు జారీ చేయడంతో మన మార్కెట్లపై ఒత్తిడి పెరిగింది. మదుపర్లు భారీగా విక్రయాలకు దిగడంతో మంగళవారం సూచీలు డీలా పడ్డాయి. డాలరుతో పోలిస్తే రూపాయి మారకపు విలువ 12 పైసలు నష్టపోయి 87.68 వద్ద స్థిరపడింది. బ్యారెల్ బ్రెంట్ ముడి చమురు 1.48 శాతం తగ్గి 67.78 డాలర్ల వద్ద ముగిసింది. ఆసియా మార్కెట్లలో హాంకాంగ్, జపాన్, దక్షిణ కొరియా, షాంఘై సూచీలు నష్టపోయాయి. ఐరోపా మార్కెట్లు కూడా ఇదే ధోరణిలో కదలాడాయి.

✦ బీఎస్ఈలోని నమోదిత కంపెనీల మార్కెట్ విలువ రూ.5.41 లక్షల కోట్లు తగ్గి, రూ.449.45 లక్షల కోట్ల (5.12 లక్షల కోట్ల డాలర్ల)కు చేరింది.

✦ సెన్సెక్స్ ఉదయం 81,377.39 పాయింట్ల వద్ద (క్రితం ముగింపు 81,635.91 పాయింట్లు) ప్రతికూలంగా ప్రారంభమైంది. 81,450.28 వద్ద గరిష్ఠాన్ని తాకినా, రోజంతా ప్రతికూలంగా కదలాడి ఒక దశలో 80,685.98 పాయింట్ల కనిష్ఠ స్థాయిని నమోదు చేసింది. చివరకు 849.37 పాయింట్ల నష్టంతో 80,786.54 పాయింట్ల వద్ద ముగిసింది. నిఫ్టీ 50 సైతం 255.70 పాయింట్లు తగ్గి 24712.05 పాయింట్ల వద్ద స్థిరపడింది. ఇంట్రాడేలో ఈ సూచీ 24,919.65-24,689.60 పాయింట్ల మధ్య కదలాడింది.

✦ సెన్సెక్స్ 30 షేర్లలో 25 నష్టపోయాయి. సన్ ఫార్మా 3.40%, టాటా స్టీల్ 2.88%, బజాజ్ ఫైనాన్స్ 2.67%, ట్రెంట్ 2.45%, ఎం అండ్ ఎం 2.02%, బజాజ్ ఫిన్‌సర్వ్ 2%, రిలయన్స్ ఇండస్ట్రీస్ 1.95%, యాక్సిస్ బ్యాంక్ 1.86%, అదానీ పోర్ట్స్ 1.85%, ఎల్ అండ్ టీ 1.76%, బీఈఎల్ 1.65%, టైటన్ 1.62%, టెక్ మహీంద్రా 1.61%, పవర్‌గ్రిడ్ 1.53%, ఎన్‌టీపీసీ 1.36%, భారతీ ఎయిర్‌టెల్ 1.31%, ఐసీఐసీఐ బ్యాంక్ 1.15% చొప్పున పడ్డాయి. హెచ్‌యూఎల్ 2.38%, మారుతీ సుజుకీ 1.75%, ఐటీసీ 0.93%, టీసీఎస్ 0.49% మేర పెరిగాయి.

✦ రంగాల వారీ సూచీలకొస్తే స్థిరాస్తి 2.24%, లోహ 2.10%, టెలికాం 2.04%, ఇంధన 1.68%, ఆరోగ్య సంరక్షణ 1.65%, యుటిలిటీస్ 1.61%, పారిశ్రామిక 1.59%, విద్యుత్ రంగాలు 1.53% పడ్డాయి. ఎఫ్ఎంసీజీ రంగం ఒక్కటే లాభపడింది. బీఎస్ఈలో 1,155 షేర్లు సానుకూలంగా, 2,973 షేర్లు ప్రతికూలంగా ముగిశాయి. 113 షేర్లలో ఎలాంటి మార్పు లేదు.

✦ అమెరికాకు చెందిన సౌర, ఇంధన నిల్వ ప్రాజెక్టుల డెవలపర్‌కు 452 మెగావాట్ల అధునాతన సౌర మాడ్యూళ్లను సరఫరా చేయడానికి తమ యూఎస్ విభాగం వారీ సోలార్ అమెరికాస్ ఆర్డర్ దక్కించుకుందని వారీ ఎనర్జీస్ వెల్లడించింది.

✦ ఆదిత్య బిర్లా గ్రూప్‌లోని ప్రధాన సంస్థ అయిన గ్రాసిమ్ ఇండస్ట్రీస్ మార్కెట్ విలువ రూ.2 లక్షల కోట్లకు చేరుకుందని కంపెనీ ఛైర్మన్ కుమార మంగళం బిర్లా మంగళవారం కంపెనీ 78వ వార్షిక సర్వసభ్య సమావేశంలో తెలిపారు.



✦ జిల్లా స్థాయి ఆధార్ సేవా కేంద్రాన్ని స్థాపించి, నిర్వహించడానికి భారత విశిష్ట గుర్తింపు ప్రాధికార సంస్థ (యూఐడీఏఐ) నుంచి రూ.2,055.35 కోట్ల ఆర్డరు లభించిందని బీఎల్ఎస్ ఇంటర్నేషనల్ సర్వీసెస్ తెలిపింది.

✦ జొమాటో, బ్లింకిట్ బ్రాండ్లను కలిగి ఉన్న ఎటెర్నల్ రూ.40 కోట్లకు పైగా 3 పన్ను డిమాండ్ నోటీసులను జీఎస్టీ విభాగం నుంచి అందుకుంది.

✦ ఆదిత్య బిర్లా రియల్ ఎస్టేట్ లిమిటెడ్ (ఏబీఆర్ఈఎల్)కు చెందిన కాగితపు గుజ్జు, కాగిత వ్యాపారాన్ని రూ.3,498 కోట్లకు కొనుగోలు చేసేందుకు కాంపిటీషన్ కమిషన్ ఆఫ్ ఇండియా (సీసీఐ) నుంచి ఐటీసీ అనుమతి కోరింది.

✦ వీఐపీ ఇండస్ట్రీస్‌లో వాటా కొనుగోలుకు మల్టిపుల్స్ ఈక్విటీ నేతృత్వంలోని పెట్టుబడిదార్ల బృందానికి సీసీఐ అనుమతి లభించింది.

✦ జైప్రకాశ్ అసోసియేట్స్ కొనుగోలు చేసేందుకు అదానీ గ్రూప్‌నకు సీసీఐ సూత్రప్రాయ ఆమోదం తెలిపింది.

✦ సగ్స్ లాయిడ్ లిమిటెడ్ రూ.85.6 కోట్ల నిధుల సమీకరణ కోసం ఐపీఓకు రాబోతోంది. ధరల శ్రేణిని రూ.117-123గా నిర్ణయించింది. ఈ నెల 29 నుంచి సెప్టెంబరు 2 వరకు ఈ ఇష్యూ ఉంటుంది.

✦ హైదరాబాద్ కేంద్రంగా హైబ్రిడ్ క్లౌడ్ ప్లాట్‌ఫామ్ సేవలను అందించే సంస్థ క్లౌడ్4సీని కొనుగోలు చేయడానికి ఒప్పందం కుదుర్చుకున్నట్లు ఐటీ దిగ్గజ సంస్థ క్యాప్‌జెమినీ ప్రకటించింది.

✦ ఇ-త్రిచక్ర వాహనం నియో హైరేంజ్‌ను 3 వేరియంట్లలో విడుదల చేయడం ద్వారా వాణిజ్య ప్రయాణికుల వాహన విభాగంలోకి అడుగుపెట్టినట్లు యూలర్ మోటార్స్ ప్రకటించింది.

✦ భారత నౌకాదళానికి అధునాతన యుద్ధనౌకల కోసం 8,000 టన్నుల క్రిటికల్-గ్రేడ్ ఉక్కును సరఫరా చేసినట్లు ప్రభుత్వ రంగ సంస్థ సెయిల్ తెలిపింది.

✦ **స్టాక్ మార్కెట్లకు సెలవు:** గణేశ్ చతుర్థి సందర్భంగా నేడు స్టాక్ మార్కెట్లకు సెలవు. ఎన్ఎస్ఈ, బీఎస్ఈతోపాటు కరెన్సీ మార్కెట్లు పని చేయవు.

ఈనాడు ప్రతిభ
బుధవారం, ఆగస్టు 27, 2025
17 https://pratibha.eenadu.net https://eenadupratibha.net
విద్య, ఉద్యోగ పరీక్షల ప్రత్యేకం!

సంపదలు కొల్లగొట్టి.. సంస్కృతిని ధ్వంసం చేసి!


సిరిసంపదలు, సకల ఐశ్వర్యాలు, సౌభాగ్యాలతో తులతూగే భారత్‌పై ప్రాచీన కాలం నుంచి దండయాత్రలు జరిగాయి. కానీ పదకొండు, పన్నెండో శతాబ్దాల్లో ఇద్దరు దోపిడీదారులు, మతావేశపరులు సాగించిన యుద్ధాలు, అరాచకాలు దేశ చరిత్ర గతిని సమూలంగా మార్చేశాయి. వారి దాడులు కేవలం యుద్ధాలు, రాజ్య విస్తరణతో ఆగలేదు. భారతీయ సమాజం, మతం, ఆర్థిక వ్యవస్థ, సంస్కృతులపై తీవ్రమైన ప్రభావాన్ని చూపాయి. ఒకడు దోపిడీ ప్రధాన లక్ష్యంగా అపార ధనరాశులను, ఆలయాల్లో నిక్షిప్తమై ఉన్న సంపదను దోచుకున్నాడు. వేలమంది ప్రాణాలను బలితీసుకున్నాడు. పుణ్యక్షేత్రాలను ధ్వంసం చేశాడు. మరొకడు దోపిడీతోపాటు ముస్లిం సామ్రాజ్యాన్ని స్థాపించాలనే దీర్ఘకాలిక లక్ష్యంతో అడుగుపెట్టాడు. ఈ ఇద్దరు మహమ్మద్‌ల దండయాత్రలు భారత్‌లో రాజకీయ, మత, సామాజికపరమైన మార్పులకు దారితీసిన తీరును పోటీ పరీక్షార్థులు తెలుసుకోవాలి.

గజనీ మహమ్మద్, ఘోరీ మహమ్మద్ దండయాత్రలు

(భారతదేశంలో ముస్లిం రాజ్యస్థాపన)

క్రీ.శ.8వ శతాబ్ది నాటి అరబ్బుల భారతదేశ దండయాత్ర వారికి శాశ్వత రాజకీయ ఫలితాన్ని ఇవ్వలేదు. ఆ దాడుల నుంచి భారతీయ రాజులు కూడా ఎలాంటి గుణపాఠం నేర్చుకోలేదు. క్రీ.శ.750లో ఉమర్ వంశ పతనంతో ఆగిపోయిన ఇస్లాం విస్తరీకరణ ఉద్యమాన్ని తురుష్కులు తిరిగి క్రీ.శ.10వ శతాబ్ది చివరిలో చేపట్టారు. తురుష్కులు అరబ్బులను మించిన మతావేశపరులు.

జనరల్ స్టడీస్
భారతదేశ చరిత్ర


భారత్‌పై గజనీ దండయాత్ర చిత్రం

గజనీ మహమ్మద్ (1000-1027)

భారతదేశంపై దండయాత్ర చేసిన మొదటి తురుష్కుడు గజనీ మహమ్మద్. అఫ్గానిస్థాన్‌లోని గజనీ రాజ్యాన్ని పాలించిన సుబక్తజిన్ కుమారుడు. అసలు పేరు అబ్దుల్ ఖాసీం మహమ్మద్. గజనీ పాలకుడు కావడంతో గజనీ మహమ్మద్ అని పిలిచేవారు. మహమ్మద్ తీవ్రమైన ధనకాంక్ష, రాజ్యకాంక్ష ఉన్న యోధుడు. పర్షియా, మధ్య ఆసియా, అఫ్గానిస్థాన్‌లను కలిపి తన సామ్రాజ్యాన్ని ఏర్పరచాలనేది అతడి లక్ష్యం. అప్పటికే భారతదేశ ఐశ్వర్యం, సంపద గురించి విని తన లక్ష్యసాధనకు కావాల్సిన ఆర్థిక వనరులను ఇక్కడ కొల్లగొట్టి సంపాదించాలని నిశ్చయించుకున్నాడు. ఉత్తర భారతదేశంపై క్రీ.శ.1000-1027 మధ్య సుమారు 17 సార్లు దండయాత్రలు చేసి అపార ధనరాశులను దోచుకెళ్లాడు.


గజనీ మహమ్మద్

గజనీ ప్రధాన దండయాత్రలు: ✦ మొదటి దండయాత్రలో భారతదేశ వాయవ్య దిశలో కొన్ని కోటలను ఆక్రమించాడు. ✦ రెండో దండయాత్రలో పంజాబ్ పాలకుడైన హిందూషాహీ వంశ జయపాలుడిని పెషావర్ యుద్ధంలో ఓడించి, బందీగా పట్టుకుని, అపార ధనరాశులను తీసుకుని తర్వాత వదిలిపెట్టాడు. ఆ అవమానాన్ని భరించలేక జయపాలుడు ఆత్మాహుతి చేసుకున్నాడు. ✦ మూడో దండయాత్రలో భాటియా రాజ్యంపై దండెత్తి బిజయ్ రాయ్‌ను ఓడించి అతడి సంపద దోచుకున్నాడు. ✦ 1004-1006: నాలుగు, అయిదు దండయాత్రల్లో ముల్తాన్‌ను పాలించే ఫతే దావూద్‌ను ఓడించి అతడిని రాజ్యం నుంచి తొలగించాడు. జయపాలుడి మనుమడైన సుఖపాలుడిని ఇస్లాం మతం స్వీకరించే విధంగా చేసి 'నవాషాహ్' అనే పేరుతో ముల్తాన్ సింహాసనంపై కూర్చోబెట్టాడు. తర్వాత అతడిని తొలగించి ముల్తాన్‌ను ఆక్రమించాడు. ✦ క్రీ.శ.1008లో ఆరో దండయాత్రలో జయపాలుడి కుమారుడు ఆనందపాలుడిని వైహింద్ యుద్ధంలో ఓడించి పంజాబ్‌ను ఆక్రమించాడు. ✦ 7, 8, 9, 10, 11 దండయాత్రల్లో నాగర్ కోట, నారాయణపుర్, కశ్మీర్, స్థానేశ్వరం, మథుర నగరాలను దోచుకుని ధ్వంసం చేశాడు. దీంతో పంజాబ్‌లో హిందూషాహీ వంశం అంతమైంది. 1009లో నాగర్ కోటలోని జ్వాలాముఖి దేవాలయ సంపద కొల్లగొట్టాడు. 1014లో స్థానేశ్వరంలోని చక్రస్వామి ఆలయ సంపదను దోచుకున్నాడు. ✦ పన్నెండో దాడిలో కనౌజ్‌పై దండెత్తగా ప్రతీహార రాజ్యపాలకుడు కనౌజ్ వదిలి పారిపోయాడు. కనౌజ్‌ను గజనీ దోచుకున్నాడు. ✦ 14వ దండయాత్ర కాలింజర్ కోట లక్ష్యంగా సాగింది. అప్పటి రాజు చండేలా విద్యాధరుడు. ఈ దండయాత్ర విజయవంతం కాలేదు. ✦ గజనీ 15వ దండయాత్ర (1025-26) అత్యంత ఐశ్వర్యవంతమైన సోమనాథ్ దేవాలయం లక్ష్యంగా సాగింది. కథియవాడ్ పాలకుడైన సోలంకి రాజు భీమదేవుడిని ఓడించి సోమనాథ్ ఆలయాన్ని కొల్లగొట్టి ధ్వంసం చేశాడు. ఈ విజయమే అతడి ఇస్లాం మతావేశాన్ని స్పష్టం చేసింది. ✦ చివరి దండయాత్రలో (1027) సోమనాథ్ దేవాలయాన్ని దోచుకున్న అనంతరం స్వదేశానికి తిరిగి వెళ్లే సమయంలో జాట్‌లు దాడి చేశారు. దీంతో గజనీ వారిని శిక్షించి, జాట్‌ల గ్రామాలను దోచుకున్నాడు. క్రీ.శ.1030లో మహమ్మద్ గజనీ మరణించాడు.





✦ అల్బెరూనీ అనే చరిత్రకారుడు గజనీ మహమ్మద్‌తో భారతదేశానికి వచ్చాడు. కొంతకాలం ఇక్కడ నివసించి సంస్కృతం నేర్చుకుని ఇక్కడి విశేషాలను తన గ్రంథాల్లో ప్రస్తావించాడు. అతడు రాసిన 'కితాబ్ ఉల్ హింద్' చరిత్రకారులకు ఉపయుక్త గ్రంథం. గజనీ మహమ్మద్ చరిత్ర 'షానామా'ను అతడి ఆస్థాన పండితుడైన ఫిరదౌసి రాశాడు.

గజనీ దండయాత్రల ఫలితాలు:

1) గజనీ వరుస దండయాత్రలతో పంజాబ్‌లోని హిందూషాహీ పాలన, ముల్తాన్, మన్సురాలోని అరబ్బుల పాలన, కనౌజ్‌లో ప్రతీహారుల పాలన అంతమైంది. పంజాబ్, ముల్తాన్ గజనీ సామ్రాజ్యంలో అంతర్భాగాలయ్యాయి. 2) ఉత్తరాపథంలో అనేక పట్టణాల్లోని ఐశ్వర్యాన్ని కొల్లగొట్టడంతో సిరిసంపదలు భారతదేశాన్ని దాటి వెళ్లిపోయాయి. భారతదేశం ఆర్థికంగా, రాజకీయంగా బలహీనమైంది. 3) తరచూ జరిగిన దాడులతో రాజపుత్రుల సైన్యం బలహీనమైంది. దీంతో ఆ తర్వాత సంభవించిన విదేశీ దాడులను అరికట్టలేకపోయారు. 4) భారత వాయవ్య సరిహద్దులోని అనేక కోటలు, నగరాలను గజనీ ధ్వంసం చేసి భారతదేశంలో మహమ్మదీయ రాజ్యస్థాపనకు అనుకూల పరిస్థితులను కల్పించాడు. 5) మహమ్మదీయులు విగ్రహారాధనకు వ్యతిరేకులు. వీరి దాడుల్లో భారతీయ అపురూప వాస్తు శిల్పసంపద నాశనమైంది. 6) గజనీ దాడుల ఫలితంగా భారతదేశంలో ఇస్లాం మత వ్యాప్తి జరిగింది.

మహమ్మద్ ఘోరీ (1175-1206)

గజనీ మహమ్మద్ మరణానంతరం అతడి రాజ్యం పతనమైంది. ఆ తర్వాత అఫ్గానిస్థాన్‌లో గజనీ-హీరత్‌ల మధ్య ఘోరీ రాజ్యం వెలసింది. ఈ వంశంలో సుప్రసిద్ధ పాలకుడు షిహాబుద్దీన్. ఇతడే మహమ్మద్ ఘోరీగా ప్రసిద్ధి చెందాడు. ఇతడు కూడా గజనీ మాదిరి భారతదేశంపై దండయాత్రలు సాగించాడు.


మహమ్మద్ ఘోరీ

ఘోరీ దండయాత్రలు: క్రీ.శ. 1175లో ముల్తాన్‌పై దండయాత్ర చేసి ఆక్రమించాడు. క్రీ.శ.1178లో గుజరాత్‌పై దండయాత్ర చేసి సోలంకి రెండో భీమరాజు చేతిలో ఓడిపోయాడు. క్రీ.శ.1179లో పెషావర్‌పై దండెత్తి ఆక్రమించాడు. ఇక క్రీ.శ. 1191, క్రీ.శ.1192లో జరిగిన రెండు స్థానేశ్వర యుద్ధాలు భారతదేశ చరిత్రను మలుపు తిప్పాయి. మొదటి స్థానేశ్వర యుద్ధంలో పృథ్వీరాజ్ చౌహాన్ చేతిలో ఘోరీ ఓడిపోయాడు. పరాభవాన్ని తట్టుకోలేక తిరిగి వచ్చి రెండో స్థానేశ్వర యుద్ధంలో పృథ్వీరాజ్‌ను ఓడించి చంపాడు. రెండో స్థానేశ్వర యుద్ధ ఫలితంగా రాజపుత్రులు పతనమయ్యారు. ఘోరీకి ఉత్తర భారతంలో రాజ్యస్థాపన సులభతరమైంది. తర్వాత 1194లో చందవర్ యుద్ధంలో జయచంద్రుడిని ఓడించాడు. దాంతో ఘోరీ రాజ్యం కాశీ వరకు విస్తరించింది. ఘోరీ సేనానులు కుతుబుద్దీన్ ఐబక్, భక్తియార్ ఖిల్జీలు అనేక రాజపుత్ర రాజ్యాలను జయించి రాజ్యాన్ని బెంగాల్ వరకు విస్తరించారు. ✦ ఘోరీ విజయాలతో తురుష్క రాజ్య భాగాలు పెషావర్, సింధ్, ముల్తాన్ నుంచి బెంగాల్ వరకు వ్యాపించాయి. స్వదేశానికి తిరిగి వెళుతూ మధ్యలో పంజాబ్‌లో ఖోకర్‌ల చేతిలో హతుడయ్యాడు. ఘోరీ భారత్‌లో జయించిన ప్రాంతాలకు కుతుబుద్దీన్ ఐబక్ క్రీ.శ.1206లో పాలకుడయ్యాడు. ఉత్తర భారతంలో దిల్లీ సుల్తాన్‌ల రాజ్యం ఏర్పడి, ముస్లిం పాలన ప్రారంభమైంది. ✦ ఇంత జరిగినప్పటికీ ఉత్తరాది రాజ్యాలు ఎలాంటి గుణపాఠం నేర్చుకోలేదు. రాజకీయ అనైక్యత, పరస్పర కలహాలు, ఈర్ష్యాద్వేషాలు పాలకుల్లో చోటు చేసుకున్నాయి. పశ్చిమ దేశాలతో వ్యాపారాలు క్షీణించి, బయటి ప్రపంచంతో సంబంధాలు తెగిపోయాయి.


రచయిత
వి.వి.ఎస్.రామావతారం

మాదిరి ప్రశ్నలు



కరెంట్ అఫైర్స్

✿ కమ్లా పెర్సాద్ బిస్సెస్సార్ ఇటీవల ఏ దేశ ప్రధాన మంత్రిగా తిరిగి పదవి చేపట్టారు? (ఈమె ఈ దేశానికి తొలి మహిళా ప్రధానిగా 2010 నుంచి 2015 వరకు కొనసాగారు.)

జ: ట్రినిడాడ్ అండ్ టొబాగో

✿ 2025, ఆగస్టు 15న ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం మహిళల కోసం ప్రారంభించిన ఉచిత బస్సు పథకం పేరు?

జ: స్త్రీ శక్తి

✿ భారత మొదటి ఏఐ - పవర్డ్ లెర్నింగ్ యాప్‌ను ఏ ఐఐటీ ప్రారంభించింది?

జ: ఐఐటీ పాలక్కాడ్

✿ భారత్‌లో సౌరశక్తితో నడిచే మొదటి అసెంబ్లీ ఏది? జ: దిల్లీ శాసనసభ

✿ 2025లో ఏ గ్రాండ్ స్లామ్ టోర్నీ ప్రైజ్‌మనీని రికార్డుస్థాయిలో 53.5 మిలియన్ పౌండ్లుగా ప్రకటించారు? (ఈ మెగాటోర్నీలో పురుష, మహిళల సింగిల్స్ విజేతలకు 3 మిలియన్ పౌండ్ల బహుమతి మొత్తాన్ని ప్రకటించారు.)

జ: వింబుల్డన్

✿ భారత రాష్ట్రపతికి మొదటి మహిళా ఏడీసీ (ఎయిడ్-డి-క్యాంప్)గా ఇటీవల ఎవరు నియమితులయ్యారు?

జ: లెఫ్టినెంట్ కమాండర్ యశస్వి సోలంకి

మరింత సమాచారం

ధ్యాస కుదరాలంటే కదలాల్సిందే!

లైఫ్ స్కిల్స్



'ఏకాగ్రత లోపం' ఒక అంతర్జాతీయ సమస్య. ఇష్టం ఉన్నా లేకపోయినా స్టడీ అవర్ల పేరుతో కదలకుండా, కనురెప్పలు ఆర్పకుండా కఠిన నియమాలు, ఒత్తిళ్ల మధ్య పిల్లలు చదువుతున్నారు. ఇదంతా కదలకుండా చదివితే మంచి ఫలితాలు వస్తాయని భావించడం వల్లే చేస్తున్నారు. కానీ వాస్తవం అందుకు భిన్నంగా ఉంది. అసలు పాఠ్యాంశాలపై ధ్యాస కుదరాలంటే.. కదులుతూ ఉండాలని నిపుణులు చెబుతున్నారు. చదివేటప్పుడు మెత్తని బంతిని చేతితో నొక్కుతూ ఉండటం, చేతివేళ్లతో స్పిన్ తిప్పడం, లయాత్మకమైన సంగీతం వినడం, లవంగం నోట్లో వేసుకోవడం తదితరాలన్నీ ఏకాగ్రతకు సాయపడతాయట. మరిన్ని వివరాలకు క్యూఆర్ కోడ్ స్కాన్ చేయండి.

దరఖాస్తు చేశారా?

☛ ఐబీపీఎస్‌లో ఉద్యోగాలు (10,277)
చివరి తేదీ: 2025 ఆగస్టు 28

☛ యూనియన్ పబ్లిక్ సర్వీస్ కమిషన్‌లో పోస్టులు (15)
చివరి తేదీ: 2025 ఆగస్టు 28


అదే భూమిపై మొదటి జీవి ఆవిర్భావానికి మూలం!

తరతరాలుగా జీవుల లక్షణాల్లో వచ్చే మార్పులు, అవి పరిసరాలకు అనుగుణంగా మారేందుకు, మనుగడ సాగించేందుకు సాయపడతాయి. దీనినే జీవ పరిణామం అంటారు. మంచు ప్రాంతంలో జీవించే జంతువు చలిని తట్టుకోడానికి వీలుగా దాని శరీరంపై దట్టంగా వెంట్రుకలు పెరుగుతాయి. సంతానం కూడా అదే లక్షణాలతో పుడుతుంది. ఆ విధంగా భూమిపై జీవుల పుట్టుక, అభివృద్ధికి జీవ పరిణామమే మూలం. ఈ అంశాలపై పోటీ పరీక్షార్థులు కనీస అవగాహన పెంచుకోవాలి. సహజావరణం, ఉత్పరివర్తనం, వంశపారంపర్యత తదితర ప్రాథమిక భావనలను నేర్చుకోవాలి. సౌరవ్యవస్థ, భూమి, మనిషి ఆవిర్భావ సిద్ధాంతాల వివరాలను, డార్విన్ పరిశోధనలను, లామార్కిజాన్ని తెలుసుకోవాలి.

జనరల్ స్టడీస్ - బయాలజీ

జీవ పరిణామం


1. కిందివాటిలో సత్యవాక్యాన్ని ఎన్నుకోండి.
   ఎ) జీవ పరిణామం అంటే వికసించడం/దొర్లడం.
   బి) జీవపరిణామం అనే పదాన్ని ప్రతిపాదించిన వ్యక్తి హెర్బర్ట్ స్పెన్సర్.
   సి) 'పరిణామ దృక్పథం లేని జీవశాస్త్రం తగిన పరిజ్ఞానాన్ని అందించలేదు', అని పేర్కొన్న వ్యక్తి - థియోడోసియస్ డబ్ జాన్స్కీ
   డి) 'ప్రిన్సిపల్స్ ఆఫ్ బయాలజీ' అనే గ్రంథాన్ని రచించిన వ్యక్తి - హెర్బర్ట్ స్పెన్సర్
   1) ఎ, బి, సి, డి 2) ఎ, బి, సి
   3) ఎ, సి, డి 4) ఎ, బి


హెర్బర్ట్ స్పెన్సర్

2. కిందివాటిని జతపరచండి.

సిద్ధాంతం	సిద్ధాంతకర్తలు
1) బయోజెనిసిస్ సిద్ధాంతం	ఎ) ఒపారిన్
2) ప్రళయత్వ సిద్ధాంతం	బి) లూయీ పాశ్చర్
3) కోసర్వేట్ సిద్ధాంతం	సి) లామార్క్
4) ఆర్జిత గుణాల అనువంశికత	డి) జార్జ్ కువియర్

   1) 1-బి, 2-డి, 3-సి, 4-ఎ
   2) 1-బి, 2-ఎ, 3-సి, 4-డి
   3) 1-బి, 2-డి, 3-ఎ, 4-సి
   4) 1-బి, 2-సి, 3-ఎ, 4-డి
3. కింది వాక్యాల్లో ఏ వ్యక్తి అభిప్రాయం సరికాదో తెలపండి.
   ఎ) ప్రత్యేక సృష్టి సిద్ధాంతం ప్రకారం భూమిపై జీవులన్నీ దైవశక్తి వల్ల ఏర్పడ్డాయని కుమార్ తెలిపాడు.
   బి) హంస - మెడ ఫ్లాస్క్ ప్రయోగం ద్వారా జీవుల ఏర్పాటును జేబీఎస్ హాల్డెన్ వివరించారని బిట్టు తెలిపాడు.
   సి) ప్రాథమిక వాతావరణంలో అధిక మొత్తంలో ఆక్సిజన్ ఉందని రమ తెలిపింది.
   డి) భూమి సుమారు 4.5 - 5 బిలియన్ల ఏళ్ల కిందట ఏర్పడిందని కిట్టు పేర్కొన్నాడు.
   1) అందరి అభిప్రాయాలు సరికావు.
   2) కిట్టు - బిట్టు అభిప్రాయాలు సరికావు.
   3) బిట్టు - రమ అభిప్రాయాలు సరికావు.
   4) కుమార్ అభిప్రాయం మాత్రమే సరికాదు.
4. ఈ భూమిపై మొదటిగా ఏర్పడిన జీవి ఏది?
   1) సయానో బ్యాక్టీరియా 2) బ్యాక్టీరియం పుటిడే
   3) ఆర్కిబ్యాక్టీరియా
   4) థియోమార్గరీటా నమీబియన్సీస్
5. కింది వాక్యాల్లో సరైన జతను ఎన్నుకోండి.
   ఎ) చేపలు, ఉభయచరాలకు మధ్య సంధాన సేతువు యూస్థినాప్టెరాన్.
   బి) ఉభయచరాలు, సరీసృపాలకు మధ్య సైమూరియా సంధాన సేతువు.
   సి) సరీసృపాలు, పక్షులకు మధ్య ఆర్కియోప్టెరిక్స్ సంధాన సేతువు.
   డి) సరీసృపాలు, క్షీరదాలకు మధ్య సయనోగ్నాథస్ సంధాన సేతువు.
   1) ఎ, బి 2) ఎ, బి, సి
   3) ఎ, బి, డి 4) ఎ, బి, సి, డి
6. మానవుడిని నడిచే అవశేష అవయవాల ప్రదర్శనశాలగా వర్ణించిన వ్యక్తి ఎవరు?
   1) విల్డర్ షీమ్ 2) డార్విన్
   3) ఎర్నెస్ట్ హెకెల్ 4) వాన్ బేయర్
7. శిలాజీకరణ చెందిన జీవుల మల విసర్జకాలను ఏమంటారు?
   1) లినియేజ్ 2) ఫైలోజని
   3) కాప్రోలైట్‌లు 4) ట్రేస్‌లు
8. కిందివారిలో పురాతన పిండోత్పత్తి శాస్త్ర పితామహుడు-
   1) వాన్ బేయర్ 2) అరిస్టాటిల్
   3) ఎర్నెస్ట్ హెకెల్ 4) ఎవరూకాదు
9. కింది వాటిలో అసత్య వాక్యాన్ని ఎన్నుకోండి.
   1) పూర్వీక జీవుల జీవిత చరిత్రను 'పెట్రిఫికేషన్' అంటారు.
   2) అవసానంలో ఏర్పడిన ఒక జీవి సంతతిని లినియేజ్ అంటారు.
   3) ఒక జీవి అభివృద్ధి చరిత్రను 'ఫైలోజని' అంటారు.
   4) శిలాజీకరణ చెందిన జీవుల మల విసర్జనను కాప్రోలైట్‌లు అంటారు.
10. భూకాలమానంలో 88% కలిగి ఉండే మహాయుగం?
    1) పేలియోజాయిక్ యుగం
    2) మీసోజాయిక్ యుగం
    3) ప్రీకేంబ్రియన్ యుగం 4) సీనోజాయిక్ యుగం
11. కింది వాటిలో ఏ చేప విలుప్తం చెందిందని భావించారు?
    1) సీలావతి 2) ప్రోజెనిటికా
    3) మిగ్రాల్ 4) సీలకాంత్
12. వాదన – ఎ: ఇక్తియోసారస్ అనేది చేపను పోలిన సరీసృపం.
    వాదన – బి: ఇక్తియోసారస్ సరీసృపమైనా ఇదొక జలచర జీవి.
    1) ఎ, బి లు రెండూ సరైనవి; ఎ కు బి సరైన వివరణ.
    2) ఎ సరైంది కానీ, బి సరికాదు.
    3) ఎ సరికాదు కానీ, బి సరైంది.
    4) ఎ, బి లు రెండూ సరికావు.
13. కింది ఏ ఖండాల్లో క్షీరదాల పరిణామక్రమం – ఆవిర్భావం జరిగింది?
    1) దక్షిణ అమెరికా 2) ఆస్ట్రేలియా
    3) ఆసియా 4) 1, 2
14. కింది వారిలో ఏ వ్యక్తి లామార్కిజాన్ని వ్యతిరేకించారు?
    1) డార్విన్ 2) ఆగస్ట్ వీస్‌మాన్
    3) స్పెన్సర్ 4) ఆస్‌బార్న్
15. కింది వాక్యాల్లో అసత్యమైన దాన్ని ఎన్నుకోండి.
    1) డార్విన్ 'ప్రకృతి వరణ సిద్ధాంతం' పరిణామం అంటే ఏమిటో వివరించింది.
    2) ప్రకృతి వరణం ప్రకృతిలో పరిణామం ఏ విధంగా సంభవించిందో వివరిస్తుంది.
    3) డార్విన్ థామస్ మాల్థస్ ప్రచురణలకు ప్రభావితం అయ్యారు.
    4) ప్రిన్సిపల్స్ ఆఫ్ జియాలజీ గ్రంథకర్త - సర్ చార్లెస్ లయల్


డార్విన్

16. కిందివాటిలో సరికాని జతను గుర్తించండి.
    1) ఈనోథీరా ట్రివిస్టైలిస్‌లో చిన్న కీలకం ఉంటుంది.
    2) ఈనోథీరా లెవిఫోలియాలో నునుపైన పత్రాలు ఉంటాయి.
    3) ఈనోథీరాననెల్లాలో - పెద్దరూపం ఉంటుంది.
    4) డ్రాసోఫిలా మెలనోగాస్టర్ పై ప్రయోగాలు చేసింది టి.హెచ్. మోర్గాన్
17. కింది వాటిని జతపరచండి.

యుగం	ప్రాముఖ్యత
1) క్వాటర్‌నరీ	ఎ) పక్షుల ఆవిర్భావం
2) జురాసిక్	బి) చేపల స్వర్ణ యుగం
3) డివోనియన్	సి) ట్రైలోబైట్‌ల ఆవిర్భావం
4) కేంబ్రియన్	డి) మానవ నాగరికత ప్రారంభం

    1) 1-డి, 2-ఎ, 3-సి, 4-డి
    2) 1-డి, 2-ఎ, 3-బి, 4-సి
    3) 1-బి, 2-ఎ, 3-సి, 4-డి
    4) 1-ఎ, 2-సి, 3-డి, 4-బి
18. మానవ ఆవిర్భావం ఏ శకంలో ప్రారంభమైంది?
    1) ప్లిస్టోసీన్ 2) మయోసీన్
    3) హోలోసీన్ 4) ఇయోసీన్
19. భూమి, సౌర వ్యవస్థ ఆవిర్భావాన్ని వివరించిన సిద్ధాంతం?
    1) ప్రత్యేక సృష్టి సిద్ధాంతం
    2) కాస్మోజోయిక్ సిద్ధాంతం
    3) నెబ్యులా సిద్ధాంతం
    4) బయోజెనెసిస్ సిద్ధాంతం
20. భూమిపై మొదటిగా ఏర్పడిన కేంద్రకామ్లం
    1) డీఎన్ఏ 2) ఆర్ఎన్ఏ
    3) గ్వానిన్ 4) అడినిన్
21. ఉత్పరివర్తన సిద్ధాంతాన్ని పరిచయం చేసిన వ్యక్తి?
    1) హ్యూగోడివ్రీస్ 2) డార్విన్
    3) టి.హెచ్.మోర్గాన్ 4) ఇన్‌గ్రామ్
22. కిందివాటిని జతపరచండి.

సంధాన సేతువు	జీవులు
1) నియోపిలైనా	ఎ) మొక్కలు - జంతువులు
2) బెలనోగ్లాసెస్	బి) జీవులు - నిర్జీవులు
3) యుగ్లీనా	సి) అనెలిడా - ఆర్థ్రోపోడా
4) వైరస్	డి) ఇకైనోడర్మేటా - కార్డేటా

    1) 1-బి, 2-ఎ, 3-సి, 4-డి
    2) 1-ఎ, 2-డి, 3-బి, 4-సి
    3) 1-సి, 2-డి, 3-ఎ, 4-బి
    4) 1-సి, 2-డి, 3-బి, 4-ఎ
23. శిలాజాలపై ప్రయోగాలు చేసిన భారతదేశ పితామహుడు ఎవరు?
    1) ఎల్లాప్రగడ సుబ్బారావు
    2) బీర్బల్ సహాని
    3) విలియం హార్వే
    4) లిన్నేయస్


బీర్బల్ సహాని

24. కార్బన్ డేటింగ్‌లో ఉపయోగించే ఐసోటోప్
    1) C_{14} 2) C_{21} 3) నికెల్ 4) ఐరన్
25. ఈ భూమిపై ఉద్భవించిన మొదటి మానవ ప్రతిరూపం?
    1) హోమో సెపియన్స్
    2) హోమో సెపియన్స్ నియాండర్తలెన్సిస్
    3) హోమో హెబిలస్ 4) 1, 3
26. ఒక జన్యువు, ఒక పాలీపెప్టైడ్ సిద్ధాంత రూపకర్త?
    1) మెండల్ 2) లామార్క్
    3) ఇన్‌గ్రామ్ 4) మేయర్
27. భూమి పై మొదటిగా జీవి ఏర్పాటుకు సహాయపడిన ద్రవం?
    1) ఉష్ణ జలపులుసు 2) నీరు
    3) మంచినీరు 4) 1, 3
28. భూమి ఏర్పడినప్పుడు, వాతావరణంలో అధిక మోతాదులో ఉన్న వాయువు ఏది?
    1) నైట్రోజన్ 2) ఆక్సిజన్
    3) ఓజోన్ 4) కార్బన్ డయాక్సైడ్
29. కోటసారస్ అనేది ఒక.....
    1) అనెలిడా వర్గపు జీవి 2) ఆర్థ్రోపోడా జీవి
    3) డైనోసార్
    4) ప్రోటోజోవా జీవి
30. ప్రళయత్వ సిద్ధాంత రూపకర్త
    1) డార్విన్
    2) లూయీ పాశ్చర్
    3) క్యువియర్
    4) ఒపారిన్


రచయిత: వట్టిగౌనళ్ల పద్మనాభం

సమాధానాలు

1-1; 2-3; 3-3; 4-1; 5-4; 6-1; 7-3; 8-2; 9-1; 10-3, 11-4, 12-1; 13-4; 14-2; 15-1; 16-3; 17-2; 18-1; 19-3; 20-1; 21-1; 22-3; 23-2; 24-1; 25-3; 26-3; 27-1; 28-3; 29-3; 30-3.

సారూప్యత అర్థమైతే.. సమాధానం తెలిసినట్లే!

పోటీపరీక్షల్లో రీజనింగ్ విభాగంలోని సారూప్యత అనే అంశం నుంచి తరచుగా ప్రశ్నలు అడుగుతుంటారు. ఇందులో చిత్ర, అక్షర, సంఖ్యా రూపంలో, కొన్నిసార్లు అన్నీ మిళితం చేసి ప్రశ్నలు సంధిస్తుంటారు. దీనిలో ఒక సిరీస్ ఇచ్చి, వాటిలో ఒకే రకమైన సారూప్యతను ఇస్తారు. దాన్ని కనిపెట్టి ప్రశ్నార్థకం స్థానంలో వచ్చేది ఏమిటో ఐచ్ఛికాల నుంచి కనుక్కోవాల్సి ఉంటుంది. ఈ విధమైన ప్రశ్నలకు జవాబులు గుర్తించడానికి నిత్య సాధన అవసరం.



ఏపీపీఎస్సీ పరీక్షల ప్రత్యేకం

రీజనింగ్

వినాయక చవితి శుభాకాంక్షలు...



సారూప్యత



రచయిత
బూసర గణేష్,
విషయ నిపుణులు

సూచన (ప్ర. 1 – 7): కింది ప్రశ్నలకు సమాధానం గుర్తించండి.

1. 456 : 15 :: 789 : ?

1) 24 2) 18 3) 16 4) 15

సాధన: $456 \Rightarrow 4+5+6=15$

$789 \Rightarrow 7+8+9=24$

సమాధానం: 1

2. 0.16 : 0.0016 :: 1.02 : ?

1) 1.020 2) 0.102 3) 0.0102 4) 10.20

సాధన: $\frac{0.16}{100} = 0.0016; \frac{102}{100} = 0.0102$

సమాధానం: 3

3. 7 : 17 :: ? : 50

1) 124 2) 26 3) 126 4) 23

సాధన: $7 \times 2 + 3 = 17$


$23 \times 2 + 4 = 50$


సమాధానం: 4

4. 7584 : 5362 :: 4673 : ?

1) 2485 2) 2451 3) 2367 4) 2531

సాధన:





సమాధానం: 2

5. 24 : 60 :: 120 : ?

1) 300 2) 160 3) 220 4) 108

సాధన: $24 \times \frac{5}{2} = 60$

$120 \times \frac{5}{2} = 300$

సమాధానం: 1

6. 520 : 738 :: ? : 350

1) 248 2) 222 3) 220 4) 230

సాధన: $520 = 8 \times 8 \times 8 + 8 = 512 + 8 = 520$

$738 = 9 \times 9 \times 9 + 9 = 729 + 9 = 738$

$350 = 7 \times 7 \times 7 + 7 = 343 + 7 = 350$

$222 = 6 \times 6 \times 6 + 6 = 222$

సమాధానం: 2

7. 17 : 60 :: 20 : ?

1) 93 2) 81 3) 57 4) 69

సాధన: $17 \times 3 + 9 = 51 + 9 = 60$

$20 \times 2 + 9 = 60 + 9 = 69$

సమాధానం: 4

సూచన (ప్ర. 8 – 10): దిగువ ఇచ్చిన ప్రశ్నలకు సమాధానాలు గుర్తించండి.

8. ADHM : ZWSN :: CFJO : ?

1) WTPI 2) ZXVJ 3) YVRM 4) XWTP

సాధన: $A \xrightarrow{+3} D \xrightarrow{+4} H \xrightarrow{+5} M$

$Z \xrightarrow{-3} W \xrightarrow{-4} S \xrightarrow{-5} N$

ఇదేవిధంగా

$C \xrightarrow{+3} F \xrightarrow{+4} J \xrightarrow{+5} O$


$Y \xrightarrow{-3} V \xrightarrow{-4} R \xrightarrow{-5} M$

సమాధానం: 3


9. ACEG : NPRT :: ADGJ : ?

1) ORVX 2) NQTW 3) NQSU 4) NRTX

సాధన:



ఇదేవిధంగా




సమాధానం: 2


10. KIJM : QOPS :: MKLO : ?

1) OMNS 2) KMOQ 3) LMOR 4) OMNQ

సాధన:



ఇదేవిధంగా



సమాధానం: 4

754 Word of the Day

Quorum

Telugu meaning: కనీస సంఖ్య, సంఖ్యా బలం

English meaning: The word quorum (కోరం) is a noun that refers to the minimum number of members required to be present in a meeting for decisions to be valid.

Synonyms: Legal majority, Required number

Antonyms: Minority, Insufficient number

Usage: **1.** The board meeting could not proceed because the quorum was not met.

2. A decision on the proposal will be delayed until a quorum is present.

కరెంట్ అఫైర్స్



భారత క్రికెట్ సీనియర్ బ్యాట్స్‌మెన్ చెతేశ్వర్ పుజారా ఆటకు వీడ్కోలు పలికాడు. ఈ మేరకు ఆగస్టు 24న సోషల్ మీడియా వేదికగా పోస్టు చేశారు. ఈయన 2010లో టెస్టుల్లో అరంగేట్రం చేశారు. 103 టెస్టుల్లో 43.60 సగటుతో 7195 పరుగులు చేశాడు. ఇందులో 19 సెంచరీలు, 35 అర్ధశతకాలు ఉన్నాయి. దేశం తరఫున టెస్టుల్లో అత్యధిక పరుగులు చేసిన వారిలో ఈయన ఎనిమిదో స్థానంలో ఉన్నారు. ఫస్ట్ క్లాస్ క్రికెట్‌లో 21301 పరుగులు చేశాడు. ఇతడు 5 వన్డే మ్యాచ్‌లు కూడా ఆడాడు. పుజారా చివరిసారిగా 2023లో అంతర్జాతీయ మ్యాచ్ ఆడాడు.



దేశ తొలి సమీకృత గగనతల రక్షణ ఆయుధ వ్యవస్థ (ఐఏడీడబ్ల్యూఎస్) పరీక్షను ఒడిశా తీరానికి సమీపంలో ఆగస్టు 23న విజయవంతంగా నిర్వహించారు. ఈ మేరకు రక్షణ శాఖ ఆగస్టు 24న ఒక ప్రకటన చేసింది. ఇది శత్రు క్షిపణులు, యుద్ధ విమానాలు, డ్రోన్ల నుంచి రక్షణ కల్పించే బహుళ అంచె గగనతల రక్షణ వ్యవస్థ. ఇందులో మూడు భిన్న ఆయుధాలు ఉన్నాయి. ఈ ప్రాజెక్టులో డీఆర్‌డీఓ నోడల్ ఏజెన్సీగా పనిచేసింది.



ప్రపంచ యూత్ ఆర్చరీ ఛాంపియన్‌షిప్‌లో తెలంగాణకు చెందిన తానిపర్తి చికిత విజేతగా నిలిచింది. ఈ ఘనత సాధించిన తొలి భారత క్రీడాకారిణిగా ఈమె రికార్డు నెలకొల్పింది. అండర్-21 మహిళల కాంపౌండ్ ఫైనల్లో చికిత 142-136తో యెరిన్ పార్క్ (కొరియా)పై గెలిచింది.

డిప్యూటీ జాతీయ భద్రతా సలహాదారు (ఎన్ఎస్ఏ)గా సీఆర్‌పీఎఫ్ మాజీ డైరెక్టర్, ఇండో టిబెటన్ బోర్డర్ పోలీస్ (ఐటీబీపీ) డైరెక్టర్ జనరల్ అనీశ్ దయాళ్ సింగ్ నియమితులయ్యారు. ఈయన ఈశాన్య రాష్ట్రాల్లో వేర్పాటువాదం, నక్సల్ సమస్య, జమ్మూకశ్మీర్ వ్యవహారాలు, దేశ అంతరంగిక విషయాలపై దృష్టి సారించనున్నారు. గతంలో ఈయన ఇంటెలిజెన్స్ బ్యూరోలో సుమారు 30 ఏళ్లు పనిచేశారు.

మరిన్ని కరెంట్ అఫైర్స్ కోసం క్యూఆర్ కోడ్ స్కాన్ చేయండి.

ప్రపంచ సరస్సు దినోత్సవం

ఆగస్టు 27

చరిత్రలో ఈనాడు



భూగ్రహంపై అత్యంత ముఖ్యమైన సహజ వనరుల్లో సరస్సులు ఒకటి. ఇవి సాధారణంగా మడుగులు, చెరువుల కంటే పెద్దగా, లోతుగా ఉంటాయి. సరస్సులు అనేక రకాల మొక్కలు, జలచరాలు, వన్యప్రాణులకు ఆవాసం కల్పిస్తూ జీవవైవిధ్యాన్ని కాపాడటంలో కీలకంగా వ్యవహరిస్తున్నాయి. వీటి ప్రాముఖ్యతను తెలియజేసే లక్ష్యంతో ఏటా ఆగస్టు 27న 'ప్రపంచ సరస్సు దినోత్సవం' (World Lake Day)గా నిర్వహిస్తారు. కాలుష్యాల బారి నుంచి సరస్సులను సంరక్షించడం, పునరుద్ధరించడం, స్థిరంగా నిర్వహించేందుకు చేపట్టాల్సిన చర్యల గురించి అవగాహన కల్పించడం ఈ రోజు ముఖ్య ఉద్దేశం.

- సరస్సు అనేది గణనీయమైన పరిమాణంలో ఉన్న ఒక నీటి వనరు. వీటి గురించి చేసే అధ్యయనాన్ని 'లిమ్నాలజీ' అంటారు. పర్వతాలు, సముద్ర తీరాలు, హిమనీనద ప్రాంతాల్లో ఇవి అధికంగా కనిపిస్తాయి. ఐక్యరాజ్యసమితి ప్రకారం, భూమిపై 117 మిలియన్లకు పైగా సరస్సులు ఉన్నాయి. అవి మొత్తం భూభాగంలో దాదాపు 4% ఆక్రమించాయి. వీటిలో 55% మంచినీటి సరస్సులు, 45% ఉప్పునీటి సరస్సులు.
- వాతావరణంలో తేమ శాతాన్ని పెంచుతూ, భూభాగాన్ని చల్లగా ఉంచడంలో సరస్సులు సహాయపడతాయి. అధిక అవపాతం, వరదలు, పోటు సమయంలో ఇవి అధికంగా నీటిని గ్రహిస్తాయి. ఆ సమయంలోనే వీటి సగటు నీటి స్థాయి పెరుగుతూ ఉంటుంది. సరస్సుల అధిక వినియోగం, వాతావరణ మార్పులు, కాలుష్యం కారణంగా ఇవి దుష్ప్రభావానికి గురవుతున్నాయి. ఎరువులు, కలుషితాలు, వ్యర్థాలు నేరుగా సరస్సుల్లో కలవడం వల్ల ఆ ఆవరణ వ్యవస్థ పూర్తిగా దెబ్బతింటోంది.

చారిత్రక నేపథ్యం:

ప్రపంచవ్యాప్తంగా ఉన్న సరస్సులను రక్షించుకోవాలనే లక్ష్యంతో 1984, ఆగస్టు 27న మొదటి 'వరల్డ్ లేక్ కాన్ఫరెన్స్' జరిగింది. జపాన్‌లోని షిగా ప్రిఫెక్చర్‌లో బివా సరస్సు ఒడ్డున ఈ సమావేశం జరిగింది. సరస్సుల నిర్వహణలో శాస్త్రీయ విధానాలను అనుసరించాలని ఇందులో దేశాలన్నీ తీర్మానించాయి. దీని జ్ఞాపకార్థం ఏటా ఆ తేదీని 'ప్రపంచ సరస్సు దినోత్సవం'గా నిర్వహించాలని ఐక్యరాజ్యసమితి జనరల్ అసెంబ్లీ 2024, డిసెంబరు 12న ప్రకటించింది. 2025లో మొదటిసారి దీన్ని జరుపుకుంటున్నాం.


☛ **2025 నినాదం:**
Lakes: the lifeblood of our planet

భారతదేశంలోని ముఖ్యమైన సరస్సులు - ఉన్న ప్రాంతం మొదలైన వివరాలతోపాటు.. పూర్తి సమాచారం కోసం క్యూఆర్ కోడ్ స్కాన్ చేయండి.

జనరల్ స్టడీస్ - రసాయనశాస్త్రం

రసాయన బంధం

అణువులోని రెండు పరమాణువులను బంధించి ఉంచేది రసాయన బంధం. దీన్నే అణువుల మధ్య ఆకర్షణగా పేర్కొంటారు. పరమాణువులు స్థిర స్థితిని చేరడానికి అష్టక నియమాన్ని పాటిస్తాయి. అంటే అవి ఎలక్ట్రాన్‌లను కోల్పోవడం, స్వీకరించడం లేదా పంచుకోవడం ద్వారా వాటి బాహ్య కర్పరంలో ఎనిమిది ఎలక్ట్రాన్‌లను నిలుపుకోవడానికి ప్రయత్నిస్తాయి.



సమన్వయ సమయోజనీయ బంధం

ఒక పరమాణువు లేదా అయాన్ వ్యతిరేక స్పిన్‌లు ఉన్న ఎలక్ట్రాన్ జంటను దానం చేస్తే, రెండో పరమాణువు లేదా అయాన్ దాన్ని స్వీకరించినప్పుడు ఏర్పడే బంధాన్ని 'సమన్వయ సమయోజనీయ బంధం' అంటారు.

లోహబంధం

లోహంలోని ఎలక్ట్రాన్ మేఘానికి, ధనావేశ లోహ అయాన్‌లకు మధ్య ఉన్న స్థిరవిద్యుత్ ఆకర్షణ బలాలను 'లోహబంధం' అంటారు.

వాండర్ వాల్ బలాలు - రకాలు, హైడ్రోజన్ బంధం - రకాలు, సిగ్మా బంధం, పై బంధం, సంకరీకరణం - లక్షణాలు - రకాలు మొదలైన విషయాలతో సహా పూర్తి సమాచారం ఈనాడు ఈప్రతిభ వెబ్‌సైట్‌లో 'జనరల్ స్టడీస్ ఈ-బుక్స్' కోర్సులో ఈ-బుక్ రూపంలో అందుబాటులో ఉంది. మరిన్ని వివరాలకు క్యూఆర్ కోడ్ స్కాన్ చేయండి.

Latest Updates

MTS Jobs in Hyderabad IICT

CSIR-Indian Institute of Chemical Technology (CSIR-IICT) Hyderabad is inviting applications for the Junior stenographer and Multi Tasking Staff posts. The total no.of posts is 9. Application fee is Rs.500. Last Date for Online Application is 12 September 2025.

Assistant Jobs in Midhani

Mishra Dhatu Nigam Limited (MIDHANI), Hyderabad is conducting interviews to fill the Assistant posts in various departments. The total no.of posts is 50. Interviews conducted from 2025 September 8, 9, 10, 11, 12, 15, 16, 17.

UPSC Notification

Union Public Service Commission (UPSC) is inviting applications for the recruitment of Assistant Public Prosecutor, Public Prosecutor and Lecturer in various departments. Total no.of posts is 84. The last date for online applications is 11 September 2025.

Did You Apply..?

August 27 is the last date for the following Jobs/ Apprentice posts

☛ 29 Manager Jobs in Rail Vikas Nigam Limited.
Eligibility: BE/BTech.

☛ 167 Apprentice posts in Hindustan Copper Limited.
Qualification: ITI.

For more information and other notifications - scan QR code

Bank Exams

English

Error Detection - Tenses

Directions (Qs. 1 - 30): In the following question, a sentence is divided into four parts and one of those fragments may have errors. Find out which part of the sentence has an error and select the appropriate option. If a sentence is free from error, select 'No Error' as your answer.

1. The teacher (A)/ explained the lesson (B)/ before the students has arrived (C)/ in the classroom. (D)/ No error. (E)

2. By the time we will reach (A)/ the station, the train (B)/ will already have left (C)/ and we will miss it. (D)/ No error. (E)

3. She is playing (A)/ the piano beautifully (B)/ when the guests (C)/ entered the hall. (D)/ No error. (E)

4. He told me (A)/ that he will help me (B)/ with my project (C)/ the next day. (D)/ No error. (E)

5. They had completed (A)/ the construction of the bridge (B)/ before the rains (C)/ had started. (D)/ No error. (E)

6. I am knowing (A)/ the answer to this, (B)/ but I will wait (C)/ until my turn comes. (D)/ No error. (E)

7. The workers (A)/ are protesting outside the office (B)/ since three hours (C)/ without any break. (D)/ No error. (E)

8. She has left (A)/ the school yesterday (B)/ without informing anyone (C)/ in her class. (D)/ No error. (E)

9. He will meet me (A)/ at the cafe (B)/ after he finished (C)/ his office work. (D)/ No error. (E)

10. If she studied (A)/ hard, she will (B)/ definitely pass (C)/ the final examination. (D)/ No error. (E)


11. I was going (A)/ to the market (B)/ when I have met (C)/ an old friend of mine. (D)/ No error. (E)

12. She said (A)/ that she is busy (B)/ and cannot come (C)/ to the party that night. (D)/ No error. (E)

13. The manager (A)/ has been checking (B)/ the accounts carefully (C)/ since the last two hours. (D)/ No error. (E)

14. He had been reading (A)/ the novel for two hours (B)/ before he goes (C)/ to sleep. (D)/ No error. (E)

15. They are living (A)/ in Delhi since (B)/ they have joined (C)/ their new company. (D)/ No error. (E)



16. She will tell (A)/ me everything after she (B)/ returned back (C)/ from her trip. (D)/ No error. (E)

17. He told me (A)/ that he will meet me (B)/ in the evening at (C)/ the restaurant nearby. (D)/ No error. (E)

18. The teacher (A)/ asked the students what (B)/ are they doing (C)/ in the corridor. (D)/ No error. (E)

19. I wish I (A)/ know the answer (B)/ to this difficult question (C)/ in the exam. (D)/ No error. (E)

20. By next December (A)/ he completed (B)/ twenty years of (C)/ service in this company. (D)/ No error. (E)

21. She told me that she (A)/ will come to the meeting (B)/ tomorrow without (C)/ any delay. (D)/ No error. (E)

22. He has been working here (A)/ since five years (B)/ but now he wants (C)/ to move abroad. (D)/ No error. (E)

23. By the time the police arrived (A)/ the thief had (B)/ already escaped (C)/ from the spot. (D)/ No error. (E)

24. She is knowing (A)/ all the answers to the (B)/ questions asked by (C)/ the teacher. (D)/ No error. (E)

25. When I was a child (A)/ I am going (B)/ to the village (C)/ every summer vacation. (D)/ No error. (E)

26. She has completed (A)/ her homework yesterday (B)/ before going out (C)/ with her friends. (D)/ No error. (E)

27. She had been knowing (A)/ him for more than (B)/ ten years before they (C)/ finally got married. (D)/ No error. (E)

28. I am seeing (A)/ the principal tomorrow (B)/ regarding the scholarship (C)/ application. (D)/ No error. (E)

29. She is here (A)/ for over an hour (B)/ but no one (C)/ has attended her yet. (D)/ No error. (E)

30. He had gone (A)/ to Delhi last year (B)/ to meet his (C)/ old classmates. (D)/ No error. (E)

Scan the QR code for Key

Writer: *P. Manoj Kumar, Subject Expert*

ఎకనామిక్స్ తర్వాత ఏఐ?

బీఏ (ఎకనామిక్స్) చదువుతున్నాను. ఈ డిగ్రీ తర్వాత ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ నేర్చుకోవచ్చా? ఎలాంటి అర్హతలు కావాలి? - బిందు





■ బీఏ ఎకనామిక్స్ డిగ్రీ పూర్తయ్యాక ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ (ఏఐ) చదవడం సాధ్యమే. ఎకనామిక్స్ విద్యార్థులు డిగ్రీలో మేథమెటిక్స్, స్టాటిస్టిక్స్ చదువుతారు కాబట్టి ఏఐ నేర్చుకోవడం కొంత సులభమవుతుంది. ఈ రంగంలో ప్రవేశించాలంటే ప్రాథమికంగా లీనియర్ ఆల్జీబ్రా, ప్రాబబిలిటీ, కాలిక్యులస్ వంటి అంశాలపై బలమైన పట్టు ఉండాలి. ఇవి ఏఐలో వాడే అల్గారిథమ్స్‌ను అర్థం చేసుకోవడానికి అవసరం. వీటితో పాటు కంప్యూటర్ పరిజ్ఞానం చాలా ముఖ్యం. ముఖ్యంగా ఎంఎస్ ఎక్సెల్‌తో పాటు ఆర్, పైతాన్, ఎస్‌క్యూఎల్ వంటి ప్రోగ్రామింగ్ లాంగ్వేజ్‌లను నేర్చుకోవాలి. ఎకనామిక్స్‌లో డేటా అనాలిసిస్ అనుభవమున్న విద్యార్థులు ఈ ప్రోగ్రామింగ్ నైపుణ్యాలను త్వరగా నేర్చుకోవచ్చు. ఏఐలో ఎక్కువగా డేటా అనాలిసిస్, మెషిన్ లెర్నింగ్ మోడల్స్, ప్రెడిక్టివ్ అనలిటిక్స్, డేటా విజువలైజేషన్ ఉంటాయి.

బీఏ ఎకనామిక్స్ తర్వాత ఏఐలో ప్రవేశించాలంటే సర్టిఫికెట్/ డిప్లొమా/పీజీ డిప్లొమా ఇన్ ఏఐ, ఎమ్మెస్సీ డేటా సైన్స్, ఎంబీఏ బిజినెస్ అనలిటిక్స్ లాంటి కోర్సుల్లో చేరవచ్చు. కోర్స్ ఎరా, ఎడ్‌ఎక్స్, ఎన్‌పీటెల్ లాంటి ఆన్‌లైన్ వేదికల్లో ప్రత్యేక సర్టిఫికేషన్లు కూడా పొందవచ్చు. ఈ సర్టిఫికెట్ల సహాయంతో ఫైనాన్షియల్ అనాలిసిస్, ఎకనామిక్ మోడలింగ్, పాలసీ సిమ్యులేషన్స్ లాంటి రంగాల్లో ఉద్యోగాలు లభిస్తాయి.

– ప్రొ. బెల్లంకొండ రాజశేఖర్, కెరియర్ కౌన్సెలర్

నోటీస్ బోర్డు

ఉద్యోగాలు

సీఎస్‌యూలో అసిస్టెంట్ ప్రొఫెసర్లు

దిల్లీలోని కేంద్ర సంస్కృత విశ్వవిద్యాలయం (సీఎస్‌యూ) ఒప్పంద ప్రాతిపదికన 36 అసిస్టెంట్ ప్రొఫెసర్ ఉద్యోగాల భర్తీకి దరఖాస్తులను కోరుతోంది.
విభాగాలు: సాహిత్యం, వ్యాకరణం, వేదం, దర్శనం, ద్వైత వేదాంత, విశిష్టాద్వైత పురాణేతిహాస, జ్యోతిష, వేద-వేదాంగ భాష, వేద కర్మకాండ పౌరోహిత్, బౌద్ధదర్శన్, పొలిటికల్ సైన్స్, ఎకనామిక్స్, కంప్యూటర్.
అర్హత: పోస్టును అనుసరించి కనీసం 55 శాతం మార్కులతో పీజీ (సంస్కృతం, పొలిటికల్ సైన్స్, ఎకనామిక్స్, కంప్యూటర్, కౌన్సిలింగ్, సైకాలజీ, ఎడ్యుకేషన్, అడ్మినిస్ట్రేషన్)తో పాటు ఉద్యోగానుభవం.
ఆన్‌లైన్ దరఖాస్తుకు చివరి తేదీ: 03.09.2025.
ఎంపిక: ఇంటర్వ్యూతో. **వెబ్‌సైట్:** https://sanskrit.nic.in/

రైట్స్ లిమిటెడ్‌లో ల్యాబ్ టెక్నీషియన్లు

గుడ్‌గావ్‌లోని రైల్ ఇండియా టెక్నికల్ అండ్ ఎకనామిక్ సర్వీస్ లిమిటెడ్ (రైట్స్) ఒప్పంద ప్రాతిపదికన 3 రెసిడెంట్ ల్యాబ్ టెక్నీషియన్ పోస్టుల భర్తీకి దరఖాస్తులు కోరుతోంది. **అర్హత:** పోస్టును అనుసరించి డిగ్రీ, పీజీతో పాటు పని అనుభవం. **వయసు:** 14.09.2025 నాటికి 40 ఏళ్లు ఉండాలి. **వేతనం:** నెలకు రూ.42,478. **ఆన్‌లైన్ దరఖాస్తుకు చివరి తేదీ:** 14.09.2025.
ఎంపిక: ఇంటర్వ్యూతో.
వెబ్‌సైట్: https://www.rites.com/Career

ఎన్‌హెచ్‌పీసీలో ఫీల్డ్ ఇంజినీర్లు

హరియాణ, ఫరిదాబాద్‌లోని నేషనల్ హైడ్రో ఎలక్ట్రిక్ పవర్ కార్పొరేషన్... ఒప్పంద ప్రాతిపదికన 9 ఖాళీల భర్తీకి దరఖాస్తులను ఆహ్వానిస్తోంది.
✦ ఫీల్డ్ ఇంజినీర్ (సివిల్): 06 ✦ ఫీల్డ్ ఇంజినీర్ (ఎలక్ట్రికల్): 02
✦ మెడికల్ ఆఫీసర్: 01
అర్హత: సంబంధిత విభాగంలో బ్యాచిలర్స్ డిగ్రీ, ఎంబీబీఎస్‌తో పాటు ఉద్యోగానుభవం. **వేతనం:** నెలకు రూ.లక్ష
వయసు: 35 సంవత్సరాలు మించకూడదు.
ఎంపిక: ఇంటర్వ్యూతో.
ఆన్‌లైన్ దరఖాస్తుకు చివరి తేదీ: 08.09.2025
వెబ్‌సైట్: https://www.nhpcindia.com/welcome/job

ఎఫ్‌డీడీఐలో టెక్నాలజిస్టులు

నోయిడాలోని ఫుట్‌వేర్ డిజైన్ అండ్ డెవలప్‌మెంట్ ఇన్‌స్టిట్యూట్ (ఎఫ్‌డీడీఐ)లలో.. ఒప్పంద ప్రాతిపదికన 6 టెక్నాలజిస్ట్ పోస్టుల భర్తీకి దరఖాస్తులు కోరుతున్నారు.
✦ జూనియర్ టెక్నాలజిస్ట్: 04 ✦ టెక్నాజిస్ట్: 02
అర్హత: పోస్టును అనుసరించి డిప్లొమా, బీఈ/ బీటెక్, డిగ్రీ, పీజీ, ఎంటెక్/ ఎంఈతో పాటు ఉద్యోగానుభవం, కంప్యూటర్ పరిజ్ఞానం.
వేతన శ్రేణి: నెలకు జూనియర్ టెక్నాలజిస్ట్‌కు రూ.37,000- రూ.64,000; టెక్నాలజిస్ట్‌కు రూ.53,000- రూ.93,000.
వయసు: జూనియర్ టెక్నాలజిస్ట్‌కు 30 ఏళ్లు; టెక్నాజిస్ట్‌కు 35 ఏళ్లు మించకూడదు. **ఎంపిక:** రాత పరీక్ష, ఇంటర్వ్యూలతో.
ఆన్‌లైన్ దరఖాస్తుకు చివరి తేదీ: 22.09.2025.
ఆఫ్‌లైన్‌లో స్వీకరించడానికి తేదీ: 26.09.2025.
వెబ్‌సైట్: https://fddiindia.com/

హైస్పీడ్ రైల్ కార్పొరేషన్‌లో..

నేషనల్ హైస్పీడ్ రైల్ కార్పొరేషన్ లిమిటెడ్ ఒప్పంద ప్రాతిపదికన 36 టెక్నికల్ మేనేజర్ పోస్టుల భర్తీకి దరఖాస్తులు కోరుతోంది.
✦ అసిస్టెంట్ టెక్నికల్ మేనేజర్: 18 ✦ జూనియర్ టెక్నికల్ మేనేజర్: 18
అర్హత: పోస్టును అనుసరించి సంబంధిత విభాగంలో బీఈ/బీటెక్‌తో పాటు పని అనుభవం. **వయసు:** 45 ఏళ్లు.
వేతనం: నెలకు అసిస్టెంట్ టెక్నికల్ మేనేజర్‌కు రూ.50,000 - 1,60,000, జూనియర్ టెక్నికల్ మేనేజర్‌కు రూ.40,000 - రూ.1,40,000.
ఆన్‌లైన్ దరఖాస్తుకు చివరి తేదీ: 15.09.2025
దరఖాస్తు ఫీజు: జనరల్, ఓబీసీ, ఈడబ్ల్యూఎస్‌లకు రూ.400. ఎస్సీ, ఎస్టీ, పీడబ్ల్యూబీడీలకు ఫీజు ఉండదు.
ఎంపిక: డాక్యుమెంట్ వెరిఫికేషన్, ఇంటర్వ్యూ, మెడికల్ ఎగ్జామినేషన్‌తో.
వెబ్‌సైట్: https://nhsrcl.in/index.php/en/career/vacancynnotice

అప్రెంటిస్‌షిప్

సదరన్ రైల్వేలో 3,518 పోస్టులు

చెన్నైలోని రైల్వే రిక్రూట్‌మెంట్ సెల్ సదరన్ రైల్వే పరిధిలోని డివిజన్‌లు/ వర్క్‌షాప్‌లు/ యూనిట్లలో వివిధ ట్రేడుల్లో 3,518 యాక్ట్ అప్రెంటిస్ ఖాళీల భర్తీకి దరఖాస్తులు కోరుతోంది.
I. ఫ్రెషర్ క్యాటగిరి:
✦ క్యారేజ్ అండ్ వ్యాగన్ వర్క్స్/ పెరంబూర్: 60
✦ సిగ్నల్ అండ్ టెలికమ్యూనికేషన్ వర్క్‌షాప్/ పొదనూర్, కోయంబత్తూరు- 20
✦ రైల్వే హాస్పిటల్/ పెరంబూర్ (మెడికల్ ల్యాబొరేటరీ టెక్నీషియన్)- 20
II. ఎక్స్‌-ఐటీఐ క్యాటగిరి:
✦ క్యారేజ్ అండ్ వ్యాగన్ వర్క్స్/ పెరంబూర్- 390
✦ చెన్నై డివిజన్- 492
✦ ఎలక్ట్రికల్ వర్క్‌షాప్, పెరంబూర్- 150
✦ ఈడబ్ల్యూఎస్/ ఏజేజే డివిజన్- 51
✦ సెంట్రల్ వర్క్‌షాప్‌లు, పొన్మలై- 390
✦ లోకో వర్క్స్/ పెరంబూర్- 228
✦ మధురై డివిజన్- 160
✦ రైల్వే హాస్పిటల్ (పెరంబూర్)- 03
✦ పాలక్కడ్ డివిజన్- 410
✦ సేలం డివిజన్- 442
✦ సిగ్నల్ అండ్ టెలికమ్యూనికేషన్ వర్క్‌షాప్/ పొదనూర్, కోయంబత్తూర్- 95
✦ తిరుచిరాపల్లి డివిజన్- 307
✦ త్రివేండ్రం డివిజన్- 300
విభాగాలు: ఫిట్టర్, వెల్డర్, పెయింటర్, రేడియాలజీ, పాథాలజీ, కార్డియాలజీ, కార్పెంటర్, టర్నర్, పీఏఎస్ఎస్ఏ, ఎలక్ట్రీషియన్, ఎలక్ట్రానిక్స్ మెకానిక్, మెషినిస్ట్, సీఓపీఏ తదితరాలు.
అర్హత: కనీసం 50 శాతం మార్కులతో 10, 12వ తరగతి, సంబంధిత ట్రేడులో ఐటీఐ.
వేతనం: నెలకు ఫ్రెషర్స్‌కు (పదో తరగతి ఉత్తీర్ణులు): రూ.6000; ఫ్రెషర్స్ (ఇంటర్ ఉత్తీర్ణులకు): రూ.7000; ఎక్స్‌-ఐటీఐకు రూ.7000.
వయసు: 25.08.2025 నాటికి ఫ్రెషర్లు 15 నుంచి 24 ఏళ్ల సంవత్సరాల మధ్య ఉండాలి.
ఎంపిక: విద్యార్హత మార్కులు, రూల్ ఆఫ్ రిజర్వేషన్, డాక్యుమెంట్ వెరిఫికేషన్, వైద్య పరీక్షలతో.
దరఖాస్తు ఫీజు: రూ.100.
ఆన్‌లైన్ దరఖాస్తుకు చివరి తేదీ: 25.09.2025.
వెబ్‌సైట్: https://sr.indianrailways.gov.in/

కెరియర్, ఉన్నతవిద్యలకు సంబంధించి మీకు ఏ సందేహాలు ఉన్నా వాటిని మాకు పంపండి. నిపుణులు సమాధానాలు ఇస్తారు.

చదువు
మా చిరునామా: **చదువు**, ఈనాడు కార్యాలయం, అనాజ్‌పూర్, అబ్దుల్లాపూర్‌మెట్ మండలం, రామోజీ ఫిల్మ్‌సిటీ – 501 512
edc@eenadu.in

హోదాలకు అతీతంగా అధికార కేంద్రాలు!

కార్పొరేట్ స్కిల్స్



ప్రతి కార్పొరేట్ సంస్థలోనూ కొన్ని అధికార కేంద్రాలుంటాయి. అవి పొజిషన్లకు అతీతంగానూ ఉండవచ్చు. సుపీరియర్ ఎవరన్నది ఆర్గనైజేషన్ చార్టులో తెలుస్తుంది. ఆ వ్యక్తిని ఎవరు ప్రభావితం చేస్తున్నారన్నది అనుభవంతో తెలుస్తుంది. ఇది సంస్థల్లో గోప్యంగా జరిగే విషయం. ఫ్రెష్ గ్రాడ్యుయేట్లు ఈ సున్నితమైన అంశాన్ని అర్థం చేసుకుంటే తమ సమయం వృథా చేసుకోకుండా సరైన వ్యక్తులను సకాలంలో కలిసి తమ లక్ష్యాలను సాధించవచ్చు.

పేరున్న పారిశ్రామిక సంస్థలో ట్రెయినీ ఆఫీసర్ శ్రీకర్ తనకు అప్పగించిన ప్రాజెక్టు 'సినాప్సిస్' ను అప్రూవల్ కోసం హెచ్‌ఓడీ రాజేష్‌కు పంపాడు. ప్రజెంటేషన్ గడువు దగ్గర పడుతున్నప్పటికీ ఎటువంటి స్పందనా లేదు. కెఫెటీరియాలో సహోద్యోగితో మాట్లాడుతుంటే తెలిసింది.. తన హెచ్‌ఓడీకి ఈ వ్యవహారాలపై అవగాహన లేనందున అనిల్ అనే ఉద్యోగితో సంప్రదించి అప్రూవ్ చేస్తాడని. దీంతో అనధికారికంగా అనిల్‌తో మాట్లాడి సకాలంలో తన ప్రాజెక్టును ఉన్నతాధికారులకూ, క్లయింటుకూ విజయవంతంగా ప్రజెంట్ చేయగలిగాడు శ్రీకర్.

ఏ ఉద్యోగి ఎవరికి రిపోర్టు చేస్తారు, సంస్థలో ఎవరి స్థాయి ఏమిటన్నది తెలిపే అధికారిక హైరార్కీ ని 'ఆర్గనైజేషన్ చార్టు' ద్వారా తెలుపుతారు. ఓ ఉదాహరణ చూద్దాం.

సీ ఈ ఓ
- వైస్ ప్రెసిడెంట్- ఫైనాన్స్
  - జీఎం అకౌంట్స్
  - జీఎం కాస్టింగ్
- వైస్ ప్రెసిడెంట్- ఆపరేషన్స్
  - జీఎం ప్రొడక్షన్
  - జీఎం మెయిన్‌టెనెన్స్
- వైస్ ప్రెసిడెంట్- హెచ్.ఆర్.
  - జీఎం హెచ్.ఆర్. ఆపరేషన్స్
  - జీఎం హెచ్.ఆర్. సర్వీసెస్

ఇది అధికారిక హైరార్కీ. అయితే కొన్ని సందర్భాల్లో నిజమైన నిర్ణాయక శక్తి ఈ హైరార్కీ ప్రకారం ఉండాలనేమీ లేదు.

గోప్యమైన అధికారిక కేంద్రాలను గుర్తించడానికి ఫ్రెష్ గ్రాడ్యుయేట్లు దృష్టిలో పెట్టుకోవలసిన అంశాలు కొన్ని ఉన్నాయి.

1) ఎవరి ఆలోచనలు అమలవుతున్నాయి?

కొన్ని విధానపరమైన నిర్ణయాలు తీసుకునేందుకు జరిగే చర్చల్లో అధికారులు తమ అభిప్రాయాలు తెలుపుతుంటారు. ఈ సమావేశాల్లో ముఖ్యంగా ఎవరి ఆలోచనలూ, సలహాలకు ఎక్కువ విలువ ఉంటుందో గమనించాలి. హైరార్కీలో వారి స్థాయి ముఖ్యం కాదు.

ఉదా: ఒక ఐటీ సంస్థలో టీమ్ లీడర్‌గా పనిచేస్తున్న రజని ఆర్గనైజేషన్ చార్టు ప్రకారం తన మేనేజర్‌కు రిపోర్ట్ చేస్తుంది. మేనేజర్ కంటే టాలెంటెడ్‌గా ఉన్నందున సీఈఓ నేరుగా ఆమెతోనే కమ్యూనికేట్ చేస్తూ నిర్ణయాలు తీసుకుంటాడు. అధికారికంగా రజని టీమ్ లీడర్ అయినా, కొన్ని నిర్ణయాల్లో ఆమె సలహాలు కీలకంగా మారాయి. దీనితో ఇతర మేనేజర్లు కూడా సలహా కోసం రజనీని సంప్రదించేవారు. ఈ పరిస్థితి మేనేజర్‌కు కొంత అసౌకర్యంగా ఉన్నప్పటికీ ఈ వాస్తవ పరిస్థితిని అంగీకరించక తప్పలేదు.

2) అందరి చూపూ బాస్ వైపు- బాస్ చూపు ఎవరి వైపు?

కొన్ని అంశాలపై అఫిషియల్ కమ్యూనికేషన్స్ ఒకవైపు నడుస్తూ ఉన్నప్పటికీ అవే అంశాలపై బాస్ మరొకరితో చర్చిస్తుండవచ్చు. కొన్ని ముఖ్యమైన సమాచారాలు ఇతరులకు తెలియకముందే వీరికి తెలుస్తుంటాయి. ఈ అదృశ్య వ్యక్తులు హైరార్కీలో ఏ స్థాయిలో ఉన్నా సంస్థలో నిర్ణయాలను ప్రభావితం చేస్తుంటారు. వీరిని గుర్తించగలిగిన యువ ఉద్యోగులు సరైన పద్ధతిలో తమ కెరియర్‌ను అభివృద్ధి చేసుకోగలరు.

మీ నెట్‌వర్కింగ్‌తో పరిచయాలు పెంచుకొని వారితో నేరుగా మాట్లాడే అవకాశాల కోసం కొన్ని వేదికలు సృష్టించుకోండి. వారితో సానుకూల సంబంధాలు పెంచుకోవడానికి తెలివిగా మెలగండి.

3) సమాచార నియంత్రణ

ఏ ముఖ్యమైన నిర్ణయం తీసుకోవాలన్నా గణాంకాల సమాచారం అవసరం. ఈ డేటాను నిర్వహించే ఉద్యోగులు తమ స్థాయికి అతీతంగా సమావేశాల్లో పాల్గొంటుంటారు. వీరితో ఉన్నతాధికారులకు ఎక్కువ ఇంటరాక్షన్ ఉంటుంది. వీరి అభిప్రాయాలకూ విలువ ఉంటుంది. కొన్నిసార్లు వీరు కూడా సంస్థ నియమాలను ప్రభావితం చేసే అవకాశం ఉంటుంది.

అధికార కేంద్రాలను గుర్తించడం ఒక వ్యూహం. ఇది అకడమిక్ డిగ్రీలతో రాదు. వీటిని గమనించడం ఒక నైపుణ్యం. కార్పొరేట్ సంస్థల్లో ఉద్యోగాలు ఆశించే ఉద్యోగార్థులు ఈ నైపుణ్యం పెంచుకుంటే కార్పొరేట్ ప్రపంచంలో వేగంగా ఎదగవచ్చు.



- దొరైరాజ్
సీనియర్ జనరల్ మేనేజర్, ఎలక్ట్రోస్టీల్ కాస్టింగ్స్ లిమిటెడ్

ఇంటర్న్‌షిప్స్

వర్క్ ఫ్రమ్ హోమ్

డిజిటల్ అడ్వర్‌టైజింగ్
సంస్థ: గ్లోబల్ ట్రెండ్
నైపుణ్యాలు: ఫేస్‌బుక్ యాడ్స్, గూగుల్ అనలిటిక్స్, గూగుల్ యాడ్‌వర్డ్స్, ఇన్‌స్టాగ్రామ్, పింట్‌రెస్ట్ మార్కెటింగ్
స్టైపెండ్: రూ.10,000
☛ internshala.com/i/519390

వీడియో ఎడిటర్
సంస్థ: పాకెట్ ఎఫ్ఎం నైపుణ్యాలు: అడోబ్ ఫొటోషాప్, ప్రీమియర్ ప్రో
స్టైపెండ్: రూ.15,000-20,000
☛ internshala.com/i/a05792

గ్రాఫిక్ డిజైన్
సంస్థ: సూపర్‌నోవా ఏఐ
నైపుణ్యాలు: అడోబ్ ఇలస్ట్రేటర్, ఫొటోషాప్, ఫిగ్మా, కేన్వా స్టైపెండ్: రూ.15,000-35,000
☛ internshala.com/i/62408b

కేర్ ఫార్మా
సంస్థ: జైలా హెల్త్ నైపుణ్యం: ఫార్మకాలజీ
స్టైపెండ్: రూ.10,000
☛ internshala.com/i/7e9651

వీటన్నిటికీ దరఖాస్తు గడువు: సెప్టెంబరు 13

పీహెచ్‌పీ డెవలప్‌మెంట్
సంస్థ: ఎక్జెరోన్ నైపుణ్యాలు: ఎజాక్స్, కోడ్ ఇగ్నైటర్, జేక్వెరీ, జావాస్క్రిప్ట్, పీహెచ్‌పీ, మైఎస్‌క్యూఎల్, హెచ్‌టీఎంఎల్, లారావెల్
స్టైపెండ్: రూ.12,000
☛ internshala.com/i/d26259

అకౌంట్స్
సంస్థ: ఫ్రెజున్ ఇన్‌కార్పొరేషన్
నైపుణ్యాలు: అకౌంటింగ్, గూగుల్ డాక్స్, గూగుల్ షీట్స్, జీఎస్టీ, జర్నల్ ఎంట్రీస్, జోహో బుక్స్ స్టైపెండ్: రూ.15,000
☛ internshala.com/i/48d11c

మార్కెటింగ్
సంస్థ: మేవ్‌నాక్స్ ప్రైమ్ ప్రై.లి.
నైపుణ్యాలు: డిజిటల్, ఈమెయిల్, సోషల్ మీడియా మార్కెటింగ్, ఎంఎస్-ఆఫీస్, ఇంగ్లిష్ మాట్లాడటం స్టైపెండ్: రూ.10,000-20,000
☛ internshala.com/i/9b2c7b

వీటన్నిటికీ దరఖాస్తు గడువు: సెప్టెంబరు 12

క్రియేటివ్ డిజైన్
సంస్థ: రెట్రో క్యాడీ నైపుణ్యాలు: అడోబ్ ఇలస్ట్రేటర్, ఇన్‌డిజైన్, ఫొటోషాప్, ప్రీమియర్ ప్రో, కోరల్‌డ్రా, యూఐ అండ్ యూఎక్స్ డిజైన్ స్టైపెండ్: రూ.3,500-11,000
దరఖాస్తుకు చివరి తేదీ: సెప్టెంబరు 19
☛ https://shorturl.at/vwkMh

Wordwise

ఆహ్లాదకరంగా ఇంగ్లిష్ పదజాలం పెంచుకుందామా? ఇక్కడ ఇచ్చిన Wordwise ను పూర్తిచేయండి. పోటీ పరీక్షలకు ఎంతో ఉపయోగపడుతుంది!

ACROSS
1. Do this to fireworks to make them boom.
6. Greek temple's inner room where the god's statue stands and offerings are placed.
7. What a waiter does — Es are missing.
8. Hands on hips? You're touching these (plural).
9. Roll these dotted cubes in a board game.
10. B.Tech. branch (abbr.) for Electronics & Communication Engineering.
11. Short for 'Mister,' a title before a man's name.

DOWN
1. When it rains, stay ___ the house.
2. With ginger, it's a common kitchen paste.
3. Not an expert: a newbie just starting out.
4. One edition of a magazine/newspaper.
5. The 'rubber' at the end of a pencil.

1	2	3	4		5
6				■	
7				■	
8					
9				■	
10			■	11	


ANSWERS
ACROSS
1. IGNITE
6. NAOS ((pro-nounced NAY-oss))
7. SRVS (SERVES)
8. ILIUMS
9. DICE
10. ECE
11. MR

DOWN
1. INSIDE
2. GARLIC
3. NOVICE
4. ISSUE
5. ERASER

- డా. వంగీపురం శ్రీనాథాచారి

నేర్చుకుందాం వేగంగా.. సమర్థంగా!

నేర్చుకోవడం కేవలం కళాశాలకో, విశ్వవిద్యాలయానికో పరిమితం కాకూడదు. ఇది జీవితకాల ప్రక్రియ. ముఖ్యంగా నేటి ప్రపంచంలో కొత్త విషయాలను వేగంగా, సమర్థంగా నేర్చుకోవడం తప్పనిసరి. బార్బరా ఓక్లీ, ఓలావ్ స్కేవే రచించిన 'లెర్న్ లైక్ ఎ ప్రో' పుస్తకం ఈ నైపుణ్యాన్ని ఎలా పెంపొందించుకోవాలో వివరిస్తుంది. ఈ పుస్తకం సిద్ధాంతాలను చెప్పి వదిలేయకుండా ఆచరణాత్మకమైన పద్ధతులను అందిస్తుంది. అద్భుతమైన మార్గదర్శిగా నిలుస్తుంది.



మన మెదడు పనిచేసే రెండు రకాల ఆలోచనా విధానాలను (ఫోకస్డ్ మోడ్, డిఫ్యూజ్డ్ మోడ్) ఈ పుస్తకం వివరిస్తుంది. ఫోకస్డ్ మోడ్ అంటే ఒక విషయంపై పూర్తి ఏకాగ్రతతో పనిచేయడం. ఉదాహరణకు ఒక గణిత సమస్యను పరిష్కరించడం/ ఒక పేజీ పాఠ్యాన్ని శ్రద్ధగా చదవడం. ఈ సమయంలో మెదడులోని ఆలోచనలు ఒక నిర్దిష్ట మార్గంలో పయనిస్తాయి. అయితే, డిఫ్యూజ్డ్ మోడ్ దీనికి భిన్నమైనది. ఈ స్థితిలో మెదడు విశ్రాంతిగా ఉంటూ, ఆలోచనలు స్వేచ్ఛగా విహరిస్తాయి. స్నానం చేస్తున్నప్పుడూ, నడుస్తున్నప్పుడూ, నిద్రపోతున్నప్పుడూ మెదడు ఈ స్థితిలో ఉంటుంది. కష్టమైన సమస్యలకు సృజనాత్మక పరిష్కారాలు దొరికేదీ, కొత్త ఆలోచనలు పుట్టేదీ ఈ మోడ్‌లోనే.

సమర్థంగా నేర్చుకోవాలంటే ఈ రెండు మోడ్‌ల మధ్య సమతుల్యత సాధించడం చాలా ముఖ్యం. ఒకే పనిపై గంటల తరబడి కూర్చోవడం కన్నా.. మధ్యమధ్యలో చిన్న విరామాలు తీసుకోవడం వల్ల మెదడు డిఫ్యూజ్డ్ మోడ్‌లోకి వెళ్తుంది. నేర్చుకున్నదాన్ని బాగా గ్రహిస్తుంది.

చదివిందే.. మళ్లీ మళ్లీ

ఈ పుస్తకం అనేక శక్తిమంతమైన అభ్యాస టెక్నిక్‌లను పరిచయం చేస్తుంది. వాటిలో ముఖ్యమైనవి యాక్టివ్ రీకాల్, స్పేస్డ్ రిపిటిషన్. చాలామంది విద్యార్థులు చేసే పొరపాటు.. చదివిన విషయాన్ని మళ్లీ మళ్లీ చదవడం (పాసివ్ రీరీడింగ్). దీనివల్ల ఆ విషయం మనకు తెలుసనే భ్రమ కలుగుతుంది. కానీ నిజానికి అది మెదడులో బలంగా నాటుకోదు. ఇందుకు భిన్నంగా యాక్టివ్ రీకాల్ పద్ధతిని ఉపయోగించాలి. అంటే పుస్తకం మూసివేసి, చదివినదాన్ని గుర్తుకు తెచ్చుకోవడానికి ప్రయత్నించాలి. ఇది మెదడుకు ఒక వ్యాయామంలా పనిచేసి, సమాచారాన్ని దీర్ఘకాలిక జ్ఞాపకశక్తిలోకి పంపుతుంది.

అలాగే ఒక విషయాన్ని చదివిన వెంటనే కాకుండా కొంత విరామం (ఒక గంట తర్వాత, మూడు రోజుల తర్వాత, వారం తర్వాత) తర్వాత పునశ్చరణ చేయాలి. (స్పేస్డ్ రిపిటిషన్). రోజుల, వారాల వ్యవధిలో ఇలా చేయడం వల్ల ఆ విషయం శాశ్వతంగా గుర్తుండిపోతుంది. వీటితో పాటు ఒకేసారి ఒకే సబ్జెక్టు కాకుండా, వేర్వేరు సబ్జెక్టులను/ టాపిక్‌లను మార్చి మార్చి చదవడం (ఇంటర్‌లీవింగ్) వల్ల కూడా అభ్యాసం మెరుగుపడుతుందని రచయితలు వివరిస్తారు.

పుస్తకంలోని ముఖ్య సూచనలు

పరీక్షల ఒత్తిడి, సిలబస్ భారం, వాయిదా వేసే అలవాటు లాంటి సమస్యలను అధిగమించడానికి విద్యార్థులకు ఈ పుస్తకం సహాయపడుతుంది.

వాయిదా వేయడాన్ని జయించడం: 25 నిమిషాలు ఏకాగ్రతతో పనిచేసి, 5 నిమిషాల విరామం తీసుకోవడం లాంటి పద్ధతులు పనిని చిన్నచిన్న భాగాలుగా విభజించి, సులభంగా పూర్తి చేయడానికి సహాయపడతాయి.

సమర్థంగా పరీక్షలకు తయారీ: కేవలం బట్టీ పట్టకుండా యాక్టివ్ రీకాల్, స్వీయ-పరీక్షల ద్వారా కాన్సెప్టులను లోతుగా అర్థం చేసుకోవచ్చు. పరీక్షల్లో సమాధానాలను గుర్తుకు తెచ్చుకోవడానికి ఇదెంతగానో ఉపయోగపడుతుంది.

లోతైన అవగాహన: ఫోకస్డ్, డిఫ్యూజ్డ్ మోడ్‌ల మధ్య మారడం ద్వారా క్లిష్టమైన విషయాలను కూడా సులభంగా అర్థం చేసుకోవచ్చు. ఒక సమస్యకు సమాధానం దొరకనప్పుడు కాసేపు విరామం తీసుకుని వేరే పని చేయడం వల్ల మెదడు దానికి కొత్త పరిష్కారాన్ని కనుగొంటుంది.

కెరియర్ ప్రారంభ దశలో ఉంటే..

ఉద్యోగంలో చేరిన కొత్తలో నేర్చుకోవలసినవి చాలా ఉంటాయి. కొత్త టెక్నాలజీలు, కంపెనీ ప్రక్రియలు, ప్రాజెక్ట్ అవసరాలు వేగంగా అలవర్చుకోవాలి. ఈ పుస్తకంలోని సూత్రాలు ఇక్కడ కూడా అద్భుతంగా పనిచేస్తాయి.

1 **నిరంతర అభ్యాసం:** కెరియర్‌లో ఎదగాలంటే నిరంతరం కొత్త నైపుణ్యాలు నేర్చుకోవడం తప్పనిసరి. ఈ పుస్తకంలోని పద్ధతులు కొత్త నైపుణ్యాలను వేగంగా, శాశ్వతంగా నేర్చుకోవడానికి పునాది వేస్తాయి.


2 **వేగంగా అలవర్చుకోవడం:** కొత్త సాఫ్ట్‌వేర్ లేదా పని విధానాన్ని నేర్చుకోవడానికి యాక్టివ్ రీకాల్ పద్ధతిని ఉపయోగించవచ్చు. ఉదాహరణకు ఒక శిక్షణ సెషన్ తర్వాత నేర్చుకున్న విషయాలను సొంతంగా గుర్తుకు తెచ్చుకుని నోట్స్ రాసుఉంటే అవి బాగా గుర్తుంటాయి.

3 **సమస్య పరిష్కార నైపుణ్యాలు:** పనిలో ఎదురయ్యే క్లిష్టమైన సమస్యలను పరిష్కరించడానికి డిఫ్యూజ్డ్ థింకింగ్ చాలా అవసరం. ఒక సమస్యతో ఇబ్బంది పడుతున్నప్పుడు కాసేపు విరామం తీసుకుని వేరే పనిపై దృష్టి పెడితే మెరుగైన పరిష్కారాలు లభిస్తాయి.

ఇది కేవలం ఓ పుస్తకం కాదు- అభ్యాస సామర్థ్యాన్ని పెంచే సాధనాల పెట్టె (టూల్ కిట్). రచయితలు సంక్లిష్టమైన మానసిక (మెదడు సంబంధిత) విషయాలను కూడా సరళమైన భాషలో, ఆచరణాత్మక ఉదాహరణలతో వివరించారు. రచనా శైలి సులువుగా ఉండటం వల్ల అనాయాసంగా చదవవచ్చు. చెప్పిన పద్ధతులను వెంటనే ఆచరణలో పెట్టవచ్చు.

– రహ్మాన్

శ్రీలంక మాజీ అధ్యక్షుడికి బెయిలు



కొలంబో: ప్రభుత్వ నిధుల్ని దుర్వినియోగం చేశారన్న ఆరోపణపై ఇటీవల అరెస్టయిన శ్రీలంక మాజీ అధ్యక్షుడు రణిల్ విక్రమసింఘేకు కోర్టు మంగళవారం బెయిలు మంజూరు చేసింది. కొలంబో జాతీయ ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న విక్రమసింఘే ఆస్పత్రి నుంచే వర్చువల్ పద్ధతిలో కోర్టు కార్యకలాపాల్లో పాల్గొన్నారు. కొలంబో కోట మేజిస్ట్రేట్ నిలుపుల లంకాపుర మాజీ అధ్యక్షుడికి బెయిలు మంజూరు చేశారు. దేశ క్రిమినల్ దర్యాప్తు విభాగం (సీఐడీ) గత శుక్రవారం విక్రమసింఘేను అరెస్టు చేసిన సంగతి తెలిసిందే. కోర్టు ఆయనకు విధించిన రిమాండు మంగళవారంతో ముగిసింది. తన వ్యక్తిగత పనుల కోసం బ్రిటన్‌ను సందర్శించిన ఆయన 1.66 కోట్ల శ్రీలంక రూపాయలను దుర్వినియోగం చేశారని విక్రమసింఘేపై ఆరోపణ.

లిథువేనియా కొత్త ప్రధానిగా మహిళ



విల్నియస్: లిథువేనియా నూతన ప్రధానమంత్రిగా ఇంగా రుగినియెనె (44) ఎన్నికయ్యారు. సోషల్ డెమొక్రటిక్ పార్టీ నాయకురాలిగా ఆమె సంకీర్ణ ప్రభుత్వానికి నాయకత్వం వహిస్తారు. మంగళవారం జరిగిన ఎన్నికలో మాజీ కార్మిక నాయకురాలు, కొత్తగా రాజకీయాల్లోకి ప్రవేశించిన రుగినియెనెను లిథువేనియా పార్లమెంటు ప్రధానమంత్రిగా ఎన్నుకుంది. ఈ ఎన్నికలో ఆమెకు 78 ఓట్లు పోలవగా ఆమె ప్రత్యర్థికి 35 ఓట్లు వచ్చాయి. గత సంవత్సరం సాధారణ ఎన్నికలకు ముందు ఆమె సోషల్ డెమొక్రటిక్ పార్టీలో చేరారు. అవకతవకలకు పాల్పడ్డారన్న ఆరోపణలపై గత ప్రధాని గింటాటాస్ పలుక్కాస్ తన పదవికి రాజీనామా చేయడంతో ఈ ఎన్నిక అనివార్యమైంది.

యూరోపియన్ దేశాలతో ఇరాన్ చర్చలు

జెనీవా: ఈ3 దేశాలుగా ప్రసిద్ధమైన బ్రిటన్, ఫ్రాన్స్, జర్మనీ దేశాల ప్రతినిధులు మంగళవారం జెనీవాలో ఇరాన్‌తో సంప్రదింపులు ప్రారంభించారు. ఇవి గత నెల 25న ఇస్తాంబుల్‌లో జరిగిన చర్చలకు కొనసాగింపని ఇరాన్ అధికార ప్రతినిధి తెలిపారు. ఇరాన్ యురేనియం అణ్వాయుధ స్థాయికి శుద్ధిచేస్తోందన్న నేపథ్యంలో ఈ సంప్రదింపులు అవసరమయ్యాయి.

కార్చిచ్చుకు బలవుతున్న మానవాళి

- 2 దశాబ్దాల్లో 40 శాతం పెరిగిన ప్రమాదాలు
- ఓ అధ్యయనంలో వెల్లడి

దిల్లీ: ప్రపంచవ్యాప్తంగా చోటుచేసుకుంటున్న కార్చిచ్చు ప్రమాదాలు మానవాళిపై తీవ్ర దుష్ప్రభావాన్ని చూపుతున్నాయి. గత రెండు దశాబ్దాల్లో ఇలాంటి ప్రమాదాలు 40 శాతం అధికమయ్యాయని ఓ అధ్యయనం వెల్లడించింది. 1979 నుంచి మారుతూ వస్తున్న వాతావరణం ఆధారంగా కార్చిచ్చు 54 శాతం పరిణామాలపై ఈ అధ్యయనం నిర్వహించారు. 2002 నుంచి 2021 వరకు జనాభా పెరుగుదల, వలస కారణంగా 11.13 కోట్ల మంది కార్చిచ్చు ప్రమాదాలకు గురయ్యారని ఐక్యరాజ్య సమితి విశ్వవిద్యాలయం(యూఎన్‌యూ)లోని నిపుణులు తెలిపారు. [illegible] దీనిని తాజాగా 'సైన్స్' జర్నల్ ప్రచురించింది. ఈ అధ్యయనం ప్రకారం ఎదురైన కార్చిచ్చుల్లో దాదాపు 85 శాతం ప్రభావం ఆఫ్రికాలోనే ఉంటోందని, ఆ తర్వాత అమెరికా, ఆసియా ఖండాల్లో దీని ప్రభావం ఉంటోందని అధ్యయనం తేల్చింది. ఈ సమస్యను పరిష్కరించడానికి కార్చిచ్చు చెలరేగిన ప్రాంతాలను సకాలంలో గుర్తించడం, అందుకను మెరుగైన వ్యూహాలను రచించడం, అగ్ని నిరోధక మౌలిక సదుపాయాలలో పెట్టుబడులు పెట్టడం తప్పనిసరి అని అధ్యయనం సూచించింది.

బిహార్‌లో ప్రియురాలిని చంపి ఆత్మహత్య చేసుకున్న ప్రియుడు

బిహార్: తనతో సహజీవనం చేసిన మహిళ పెళ్లికి నిరాకరించిందని ఆమెను కాల్చి చంపి అనంతరం ఆమె ప్రియుడు ఆత్మహత్య చేసుకున్న ఘటన బిహార్‌లోని రోహ్‌తాస్ జిల్లాలో చోటుచేసుకుంది. బలియాకు చెందిన జాకీ నాజ్, కాజల్ కుమారిలు సహజీవనం చేస్తున్నారు. ఈ క్రమంలో తనను పెళ్లి చేసుకోవాలంటూ కాజల్‌ను జాకీ పలుమార్లు కోరాడు. వేర్వేరు కులాలు కావడంతో ఆమె పెళ్లికి నిరాకరించింది. దీంతో ఆవేశానికి గురైన జాకీ ఓ హోటల్ గదిలో తుపాకీతో ఆమెను కాల్చి, అనంతరం తానూ కాల్చుకుని ఆత్మహత్య చేసుకున్నాడు. పోలీసులు ఘటనా స్థలికి చేరుకొని పిస్టల్, క్యాట్రిడ్జ్ షెల్స్‌ను స్వాధీనం చేసుకున్నారు.

పాక్ నదుల్లో పెరుగుతున్న నీటి మట్టం

- సురక్షిత ప్రాంతాలకు 2 లక్షల మంది

లాహోర్: పాకిస్థాన్‌లోని తూర్పు నదుల్లో నీటి మట్టం పెరుగుతోంది. వరద ముప్పున్న ప్రాంతాల నుంచి దాదాపు 2 లక్షల మందిని సురక్షిత ప్రదేశాలకు తరలించారు. సింధు, చీనాబ్, రావి, సట్లెజ్ నది పరివాహక ప్రాంతాల్లో కుండపోత వర్షం కారణంగా నదుల్లో వరదనీరు పెరుగుతోంది. రాబోయే 48 గంటల్లో మరింత భారీ వర్షాలు కురిసే అవకాశముందని అధికారులు హెచ్చరించారు. వరద తాకిడికి వందలాది ఆవాసాలు దెబ్బతిన్నాయి. భారత్ అధికారిక దౌత్యపద్ధతి ద్వారా పాకిస్థాన్‌కు వరద హెచ్చరికలు జారీ చేసింది. మే నెలలో జరిగిన సైనిక ఘర్షణ అనంతరం మొట్టమొదటిసారిగా పాకిస్థాన్‌తో భారత్ సంప్రదింపులు జరిపింది.

ఎస్.సి.ఒ. సభలో ఉగ్రవాదంపై గురి

దిల్లీ: చైనాలోని టియాన్‌జిన్ నగరంలో వచ్చే వారం జరగనున్న షాంఘై సహకార సంస్థ(ఎస్.సి.ఒ.) వార్షిక సమావేశం సీమాంతర ఉగ్రవాదాన్ని నిర్ద్వంద్వంగా ఖండిస్తుందని భారత్ ఆశాభావంతో ఉందని విదేశాంగ శాఖ సీనియర్ అధికారులు విక్రమ్ మిస్త్రీ, తన్మయ లాల్ మంగళవారం ప్రకటించారు. ప్రధాని నరేంద్ర మోదీ ఈనెల 29 నుంచి సెప్టెంబరు 1 వరకు జపాన్, చైనాలను సందర్శించనున్న సమయంలో వారు ఈ ప్రకటన చేశారు. ఎస్.సి.ఒ.కు 2023లో భారత్ అధ్యక్షత వహించినప్పుడు ఉగ్రవాదం, వేర్పాటువాదం, తీవ్రవాద భూతాలను ఎదుర్కోవాలని సంయుక్త ప్రకటన విడుదలైందని తన్మయ లాల్ గుర్తుచేశారు. ఈసారి కూడా ఎస్.సి.ఒ. సభ్య దేశాలు ఉగ్రవాదాన్ని, ముఖ్యంగా సీమాంతర ఉగ్రవాదాన్ని ముక్తకంఠంతో ఖండిస్తూ సంయుక్త ప్రకటన వెలువరిస్తాయని ఆశిస్తున్నట్లు లాల్ చెప్పారు.

ప్రైవేటు చదువులకు 10 రెట్లు ఖర్చెక్కువ!

- ప్రభుత్వ పాఠశాలలతో పోలిస్తే బహు భారం
- పట్టణ ప్రాంతాల్లో ఎక్కువ మంది ప్రైవేటులోనే..
- దేశవ్యాప్తంగా చూస్తే సర్కారీ బడుల్లో విద్యార్థులెక్కువ..
- సమగ్ర నిర్మాణాత్మక సర్వేలో వెల్లడి

ఈనాడు, దిల్లీ: దేశవ్యాప్తంగా ఇప్పటికీ ప్రభుత్వ పాఠశాలల్లోనే విద్యార్థులు ఎక్కువగా చదువుతున్నారని తేలింది. అయితే పట్టణ ప్రాంతాలతో పోలిస్తే గ్రామీణ ప్రాంతాల్లోని విద్యార్థులే ఈ పాఠశాలల్లో అధికంగా చదువుతున్నారు. మరోవైపు ప్రభుత్వ పాఠశాలలతో పోలిస్తే ప్రైవేటు పాఠశాలల్లో 10 రెట్లు అధికంగా ఫీజులున్నాయి. దీంతోపాటు ప్రతి ముగ్గురిలో ఒకరు ప్రైవేటుగా కోచింగ్ తీసుకుంటున్నారు. ఇది పట్టణ ప్రాంతాల్లో ఎక్కువగా ఉంది. 80వ జాతీయ శాంపిల్ సర్వేలో (ఎన్ఎస్ఎస్) భాగంగా కేంద్ర ప్రభుత్వం నిర్వహించిన సమగ్ర నిర్మాణాత్మక సర్వేలో (సీఎంఎస్) ఈ వివరాలు వెల్లడయ్యాయి. పాఠశాల విద్య కోసం కుటుంబాలు చేసే వ్యయంపై ఈ సర్వే జరిగింది. కంప్యూటర్ ఆధారిత వ్యక్తిగత ఇంటర్వ్యూ (సీఏపీఐ) ద్వారా 52,085 ఇళ్ల యజమానులు, 57,742 మంది విద్యార్థుల నుంచి ప్రభుత్వం సమాచారాన్ని సేకరించింది. ఏప్రిల్-జూన్ మధ్యకాలంలో ఈ సర్వే జరిగింది.



- దేశంలో 55.9% మంది విద్యార్థులు ప్రభుత్వ పాఠశాలల్లో చదువుతున్నారు. ఇందులో గ్రామీణ ప్రాంతాల్లోని విద్యార్థుల్లో 66శాతం మంది ప్రభుత్వ పాఠశాలల్లో చదువుతున్నారు. పట్టణ ప్రాంతాల్లో కేవలం 30.1 శాతం మందే ప్రభుత్వ పాఠశాలల్లో చదువుతున్నారు.) వీరి చదువుల కోసం ఒక్కో కుటుంబం సంవత్సరానికి రూ.2,863 ఖర్చు చేస్తోంది.
- ప్రైవేటు అన్ఎయిడెడ్ స్కూళ్లలో చదువుతున్న విద్యార్థులు దేశవ్యాప్తంగా 31.9% మంది ఉన్నారు. (వారిపై ఒక్కో కుటుంబం సగటున రూ.28,693 వరకూ ఖర్చు చేస్తోంది. ఇది ప్రభుత్వ పాఠశాలల విద్యార్థులతో పోలిస్తే 10 రెట్లు అధికం.
- ఈ ఏడాది పాఠశాలల్లో చదువుతున్న మొత్తం విద్యార్థుల్లో 27శాతం మంది ప్రైవేటు కోచింగ్ తీసుకుంటున్నారు. ఇందులో పట్టణ ప్రాంతాల్లోని వారు 30.7శాతం, గ్రామీణ ప్రాంతాల్లోనివారు 25.5 శాతం ఉన్నారు.
- పట్టణ ప్రాంతాల్లో ప్రైవేటు కోచింగ్‌కు ఏటా రూ.3,988 ఖర్చు అవుతుండగా.. గ్రామీణ ప్రాంతాల్లో రూ.1,793 ఖర్చవుతోంది. ఉన్నత పాఠశాల విద్యార్థులకు పట్టణ ప్రాంతాల్లో కోచింగ్ వ్యయం ఏటా రూ.9,950 అవుతుండగా.. గ్రామీణ ప్రాంతాల్లో రూ.4,548 అవుతోంది.
- 90శాతానికిపైగా విద్యార్థుల చదువులకయ్యే వ్యయాన్ని కుటుంబ సభ్యులే భరిస్తున్నారు. ప్రభుత్వ ఉపకార వేతనాల ద్వారా చదువుకునే విద్యార్థులు కేవలం 1.2శాతమే ఉన్నారు.
- అన్ని పాఠశాలలను కలిపి చూస్తే సగటున ఒక్కో విద్యార్థికి కోర్సు ఫీజు వ్యయం రూ.7,111 అవుతోంది. పాఠ్యపుస్తకాలు, స్టేషనరీ కోసం రూ.2,002 వ్యయం చేయాల్సి వస్తోంది.
- పట్టణ ప్రాంతాల్లో కోర్సు ఫీజు సగటున రూ.15,143 ఉండగా.. గ్రామీణ ప్రాంతాల్లో రూ.3,979 ఉంది.

సగటు ఫీజులు (రూ.లలో)

	గ్రామీణ	పట్టణ	గ్రామీణ+ పట్టణ
ప్రభుత్వ పాఠశాలల్లో	2,639	4,128	2,863
ప్రైవేటు ఎయిడెడ్	11,209	20,748	15,364
ప్రైవేటు అన్ఎయిడెడ్	22,869	35,758	28,693
ఇతర పాఠశాలలు	10,918	21,102	14,315
మొత్తం	8,382	23,470	12,616

ఫీజుల్లో దేనికెంత వాటా (రూ.లలో)

	గ్రామీణ	పట్టణ	గ్రామీణ+ పట్టణ
కోర్సు ఫీజు	3,979	15,143	7,111
రవాణా	1,359	3,082	1,842
యూనిఫాం	887	1,540	1,070
పాఠ్య పుస్తకాలు, స్టేషనరీ	1,664	2,867	2,002
ఇతరత్రా	494	838	590

ఇరాన్ జాతి విద్వేష దాడులకు పాల్పడుతోంది: ఆస్ట్రేలియా ప్రధాని



మెల్‌బోర్న్: ఆస్ట్రేలియాలో జరుగుతున్న వరుస జాత్యహంకార దాడులపై ఆ దేశ ప్రధాని ఆంథోని అల్బనీస్ ఆందోళన వ్యక్తం చేశారు. గత కొంతకాలంగా ఆస్ట్రేలియాలో యూదులపై జరుగుతున్న దాడులకు ఇరాన్ కారణమని ఆరోపించారు. జాతి విద్వేషపూరిత దాడులకు పాల్పడుతూ.. ప్రజల్లో భయాందోళనలు సృష్టిస్తోందని ఆగ్రహం వ్యక్తం చేశారు. ఇందుకుగాను ఇరాన్ రాయబారిని తమ దేశం నుంచి బహిష్కరిస్తున్నట్లు వెల్లడించారు. సిడ్నీలోని రెస్టారెంట్, మెల్‌బోర్న్‌లోని ప్రార్థనా స్థలంపై దాడులకు ప్రయత్నించిన వారికి ఇరాన్ నేతలతో సంబంధాలు ఉన్నట్లు ఆస్ట్రేలియా నిఘా వర్గాలు తమ దర్యాప్తులో గుర్తించినట్లు ప్రధాని పేర్కొన్నారు. 2023లో ఇజ్రాయెల్-హమాస్ యుద్ధం ప్రారంభమైనప్పటి నుంచి ఆస్ట్రేలియాలోని పలు నగరాల్లో జాతి విద్వేషపూరిత దాడులు ఆందోళనకరంగా మారాయన్నారు. వీటిలో పలు దాడులను ఇరాన్ స్వయంగా పర్యవేక్షించినట్లు తమ నిఘా సంస్థలు గుర్తించినప్పటికీ.. ఆ దేశం తమ ప్రమేయాన్ని దాచిపెట్టడానికి ప్రయత్నిస్తోందని ఆస్ట్రేలియా ప్రధాని ఆరోపించారు.

పాక్ ఆపరేటర్‌తో భారత అధికారులకు సంబంధాలు

దిల్లీ: పాక్ గూఢచారి సీఆర్‌పీఎఫ్ అసిస్టెంట్ సబ్ ఇన్‌స్పెక్టర్ మోతీరామ్ జాట్‌తో సంబంధం ఉన్న పాకిస్థాన్ ఆపరేటర్‌కు భారత సైన్యం, పారామిలిటరీ, ప్రభుత్వ అధికారులతో భారీగా సంబంధాలున్నట్లు సమాచారం. వారికి చెందిన 15 ఫోన్ నంబర్లతో పాక్ ఆపరేటర్ సంప్రదింపులు జరిపినట్లు కేంద్ర నిఘా వర్గాల పేర్కొంటున్నాయి. దాయాది దేశానికి కీలక సమాచారం చేరవేసినందుకు జాట్‌ను మే 27న ఎన్ఐఏ అరెస్టు చేసి అతడిపై దర్యాప్తు కొనసాగిస్తోంది. "జాట్‌ను విచారించడమే కాకుండా సాంకేతికత సాయంతో ఇంటెలిజెన్స్ అధికారులు అన్వేషిస్తున్నారు. సలీం అహ్మద్ అనే కోడ్‌తో ఉన్న పాకిస్థాన్ ఆపరేటివ్ నంబరుకు చెందిన కాల్ డేటా రికార్డులు, ఇంటర్నెట్ ప్రోటోకాల్ వివరాలను శోధించగా అతడు 15 ఫోన్ నంబర్లతో సంప్రదింపులు జరిపినట్లు తెలిసింది. వీటిలో నాలుగు భారత ఆర్మీ, మరో నాలుగు పారామిలిటరీ అధికారులవి కాగా మిగిలినవి ప్రభుత్వ అధికారులకు చెందిన ఇతర నంబర్లుగా గుర్తించాం" అని విశ్వసనీయ వర్గాలు తెలిపాయి. పాక్ ఆపరేటర్‌తో సంబంధం ఉన్న కోల్‌కతా వ్యక్తి జాట్‌కు ఓ ఫోన్ నంబరును సమకూర్చినట్లు తెలుస్తోంది.

3 నెలలకు మించిన రిజర్వు తీర్పుల వివరాలు సీజేల దృష్టికి తేవాలి

- హైకోర్టు రిజిస్ట్రార్ జనరళ్లకు 'సుప్రీం' ఆదేశం
- త్వరిత తీర్పు కోరుతూ కక్షిదారూ దరఖాస్తు చేసుకోవచ్చని స్పష్టీకరణ



దిల్లీ: హైకోర్టు పరిధిలో మూడు నెలలకు మించి రిజర్వులో ఉంచిన తీర్పుల వివరాలను సంబంధిత ప్రధాన న్యాయమూర్తు(సీజే)ల దృష్టికి తేవాలని దేశంలోని హైకోర్టు రిజిస్ట్రార్ జనరళ్లను సుప్రీంకోర్టు మంగళవారం ఆదేశించింది. ఓ క్రిమినల్ అప్పీలుపై అలహాబాద్ హైకోర్టు 2021 డిసెంబరులో రిజర్వు చేసి ఉంచిన తీర్పును ఏడాదైనా ప్రకటించక పోవడంపై జస్టిస్ సంజయ్ కరోల్, జస్టిస్ ప్రశాంత్ కుమార్ మిశ్రలతో కూడిన ధర్మాసనం ఆందోళన వ్యక్తం చేసింది. "ఈ కేసులో అప్పీలుపై విచారణ ముగిసి ఏడాది దాటినా తీర్పు వెలువరించకపోవడం దిగ్భ్రాంతి కలిగిస్తోంది. విచారణ పూర్తై నెలలు సంవత్సరాలూ గడిచినా తీర్పు వెలువరించని అనేక ఉదంతాలు మా దృష్టికి వస్తున్నాయి" అని ధర్మాసనం పేర్కొంది. 'అత్యధిక శాతం హైకోర్టుల్లో తీర్పుల ప్రకటనలో తీవ్రజాప్యం ఎదురైనప్పుడు ఆ విషయాన్ని సంబంధిత ధర్మాసనం లేదా ప్రధాన న్యాయమూర్తి దృష్టికి ఎలా తీసుకెళ్లాలో కక్షిదారులకు తెలీదు. అలాంటి సందర్భాల్లో కక్షిదారుడు న్యాయ ప్రక్రియపై నమ్మకం కోల్పోతాడు. ఇది న్యాయ అంతిమ లక్ష్యాన్నే దెబ్బతీస్తుంది' అని జస్టిస్ మిశ్ర అన్నారు. విచారణ పూర్తై మూడు నెలలు గడిచినా తీర్పు వెలువరించకపోతే రిజిస్ట్రార్ జనరల్ ఆ విషయాన్ని తమ హైకోర్టు ప్రధాన న్యాయమూర్తి దృష్టికి తీసుకెళ్లాలని సుప్రీం ధర్మాసనం పేర్కొంది. ప్రధాన న్యాయమూర్తి ఆ విషయాన్ని సంబంధిత ధర్మాసనం దృష్టికి తీసుకెళ్లి ఆ తేదీ నుంచి రెండు వారాల్లోగా తీర్పు వెలువడేలా చూడాలి అని ఆదేశించింది. తీర్పు రిజర్వు చేసి ఉంచిన మూడు నెలల వరకూ దాన్ని ప్రకటించని పక్షంలో కక్షిదారుడు త్వరితంగా తీర్పు వెల్లడించాలని కోరుతూ హైకోర్టుకు దరఖాస్తు సమర్పించవచ్చని స్పష్టం చేసింది.

హత్యాచార కేసులో ఇద్దరిని నిర్దోషులుగా విడుదల చేసిన సుప్రీంకోర్టు

దిల్లీ: ఓ మైనర్ బాలిక హత్యాచార కేసులో మరణశిక్ష పడిన నిందితుడు సహా ఇద్దరిని సుప్రీంకోర్టు నిర్దోషులుగా ప్రకటించింది. ఇది అత్యంత అసమగ్ర, పేలవ దర్యాప్తుకు తిరుగులేని ఉదాహరణగా అభివర్ణించింది. ఇద్దరు నిందితుల నుంచి రక్త నమూనాలను సేకరించినట్లుగా ఎటువంటి పత్రాలను సాక్ష్యంగా సమర్పించకపోవడంతో కేసుకు సంబంధించిన డీఎన్ఏ నివేదికను చిత్తు కాగితం ముక్కగా పేర్కొంది. నేరాన్ని నిరూపించడంలో, సాక్ష్యాలను సేకరించడంలో ప్రాసిక్యూషన్ ఘోరంగా విఫలమైందని జస్టిస్ విక్రమ్‌నాథ్, జస్టిస్ సంజయ్ కరోల్, జస్టిస్ సందీప్ మెహతాలతో కూడిన ధర్మాసనం వ్యాఖ్యానించింది. 2018 అక్టోబరులో అలహాబాద్ హైకోర్టు ఇచ్చిన ఆదేశాలను సవాలు చేస్తూ దాఖలైన అభ్యర్థనపై సుప్రీంకోర్టు ఈ తీర్పునిచ్చింది. 2012 సెప్టెంబరు 4న 12 ఏళ్ల బాలిక అదృశ్యమై...కొద్ది రోజుల తర్వాత ఓ పొలంలో నిర్జీవంగా కనిపించింది. ఇద్దరు నిందితులను అరెస్టు చేయగా వారిలో ఒకరికి అలహాబాద్ హైకోర్టు మరణశిక్ష విధించింది.

ప్రమాణాలకు తగినట్టు లేదు: సీజేఏఆర్

దిల్లీ: సుప్రీంకోర్టు న్యాయమూర్తుల నియామకానికి సంబంధించి కొలీజియం ఎంచుకున్న ప్రమాణాలకు తగినట్టుగా జస్టిస్ పంచోలీ నియామకం లేదని క్యాంపెయిన్ ఫర్ జ్యుడీషియల్ అకౌంటబిలిటీ అండ్ రిఫార్మ్స్ (సీజేఏఆర్) అనే స్వచ్ఛంద సంస్థ పేర్కొంది. జస్టిస్ పంచోలీ ప్రస్తుతం సుప్రీంకోర్టులో పని చేస్తున్న మూడో గుజరాతీ న్యాయమూర్తి కావడంతో పాటు అఖిలభారత హైకోర్టు న్యాయమూర్తుల సీనియారిటీ జాబితాలో 57వ స్థానంలో ఉన్నారని సీజేఏఆర్ తెలిపింది. పరిమాణ రీత్యా ఎంతో చిన్నదైన గుజరాత్ హైకోర్టుకు చెందిన ముగ్గురు న్యాయమూర్తులు సుప్రీంకోర్టుకు ఎంపిక కావడం ప్రాంతీయ ప్రాతినిధ్య అసమతుల్యానికి దారితీస్తుందని ఆ సంస్థ అభిప్రాయపడింది.

21 మంది అధ్యాపకులకు జాతీయ అవార్డులు

- తెలంగాణ, ఏపీల నుంచి ఇద్దరేసి..

దిల్లీ: పాలిటెక్నిక్‌లు, విశ్వవిద్యాలయాలు, అత్యున్నత విద్యా సంస్థల్లో పని చేసే 21 మంది అధ్యాపకులకు కేంద్ర ప్రభుత్వం 2025 ఏడాదికిగానూ జాతీయ పురస్కారాలను ప్రకటించింది. ఇందులో తెలంగాణ, ఆంధ్రప్రదేశ్, కర్ణాటక, మధ్యప్రదేశ్, గుజరాత్, మహారాష్ట్రల నుంచి ఇద్దరేసి ఉన్నారు. పుదుచ్చేరి, కేరళ, పంజాబ్, తమిళనాడు, ఉత్తర్ ప్రదేశ్, బెంగళూరు, మిజోరం, అరుణాచల్ ప్రదేశ్, దిల్లీల నుంచి ఒక్కొక్కరున్నారు.

అణుశక్తి సవరణ బిల్లులను శీతాకాల సమావేశాల్లో ప్రవేశపెడతారా?

- ప్రభుత్వాన్ని ప్రశ్నించిన కాంగ్రెస్



దిల్లీ: ప్రైవేటు కంపెనీలు అణువిద్యుత్ ప్లాంట్లను స్థాపించడానికి అనుమతించేందుకు.. రెండు బిల్లులను సవరిస్తామని ఇచ్చిన హామీని ఎప్పటిలోగా అమల్లోకి తీసుకొస్తారని కాంగ్రెస్ మంగళవారం కేంద్ర ప్రభుత్వాన్ని ప్రశ్నించింది. అందుకు సంబంధించిన బిల్లులను శీతాకాల సమావేశాల్లో ప్రవేశపెడతారా? లేదా? అని నిలదీసింది. ఈ మేరకు కాంగ్రెస్ ప్రధాన కార్యదర్శి జైరాం రమేశ్ మాట్లాడుతూ.. 'అణుశక్తి సంస్థలో భాగం కాని స్వతంత్ర నియంత్రణ సంస్థ స్థాపన బిల్లు సంగతి ఏంటి? 2025-26 బడ్జెట్‌ను ప్రవేశపెడుతున్నప్పుడు కేంద్ర ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్.. ప్రైవేటు సంస్థలు అణు విద్యుత్ ప్లాంట్లను స్థాపించడానికి అనుమతించేలా అణు నష్టానికి పౌర బాధ్యత చట్టం-2010, అణుశక్తి చట్టం-1962లను సవరించడం ద్వారా అణుశక్తికి ఊతమిస్తామని వాగ్దానం చేశారు. కానీ ఇటీవల ముగిసిన పార్లమెంటు సమావేశాల్లో ఆ బిల్లులను ప్రవేశపెట్టకపోవడం ఆశ్చర్యంగా ఉంది. ప్రైవేటు పెట్టుబడులను ప్రోత్సహించాలంటే ఆ బిల్లులను తీసుకురావడం చాలా ముఖ్యం" అని పేర్కొన్నారు.

ఇండో- పసిఫిక్ దేశాల శాంతికి భారత్-జపాన్ నిబద్ధతతో పనిచేస్తాయి

- విదేశీ వ్యవహారాల శాఖ కార్యదర్శి మిస్రీ



దిల్లీ: ప్రధాని మోదీ శుక్రవారం నుంచి జపాన్‌లో రెండు రోజులు పర్యటించనున్నారు. ఈ నేపథ్యంలో.. ఇండో-పసిఫిక్ దేశాల్లో స్థిరత్వానికి, సుసంపన్నతకు, శాంతి కోసం భారత్-జపాన్ దేశాలు సంయుక్తంగా తమ నిబద్ధతను పునరుద్ఘాటిస్తాయి అని విదేశాంగ కార్యదర్శి విక్రమ్ మిస్రీ మంగళవారం పేర్కొన్నారు. ప్రధాని పర్యటన ఇరుదేశాల మధ్య స్నేహాన్ని బలోపేతం చేయటమే కాక కొత్త సహకార మార్గాలకు పునాది అవుతుందని అన్నారు. జపాన్ పర్యటన అనంతరం చైనాలోని తియాంజిన్‌లో జరగనున్న షాంఘై సహకార సంస్థ(ఎస్‌సీవో) వార్షిక సమావేశానికి మోదీ హాజరవుతారు.



హిమాచల్‌ప్రదేశ్‌లోని కుల్లూలో భారీవర్షాల కారణంగా ఉప్పొంగి ప్రవహిస్తున్న బియాస్ నది ✦ తావి నదికి వరద పోటెత్తడంతో జమ్ములో నీట మునిగిన గణేశుడి విగ్రహం ✦ హిమాచల్‌ప్రదేశ్‌లోని మనాలీలో వర్షాల కారణంగా రహదారి ధ్వంసం కావడంతో నదిలో కొట్టుకుపోతున్న వాహనం

ఆప్ నేత సౌరభ్ భరద్వాజ్ ఇంట్లో ఈడీ సోదాలు



దిల్లీ: ఆమ్ ఆద్మీ పార్టీ(ఆప్) జాతీయ ప్రతినిధి, దిల్లీ మాజీ మంత్రి సౌరభ్ భరద్వాజ్ నివాసంలో ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టరేట్(ఈడీ) అధికారులు మంగళవారం సోదాలు నిర్వహించారు. ఆప్ ప్రభుత్వ హయాంలో ఆరోగ్య మౌలిక సదుపాయాల ప్రాజెక్టులో జరిగిన కుంభకోణానికి సంబంధించిన మనీలాండరింగ్ దర్యాప్తులో భాగంగా భరద్వాజ్ సహా మరికొందరిపై కేసు నమోదుచేసిన ఈడీ, వారికి సంబంధించిన 13 ప్రాంతాల్లో ఏకకాలంలో సోదాలు నిర్వహించింది. వీటిలో భరద్వాజ్ ఇల్లు, కె.జి. మార్గ్, వెస్ట్ పటేల్ నగర్‌లోని ప్రైవేట్ గుత్తేదారులు, రియల్‌ఎస్టేట్ డెవలపర్ల నివాసాలు, కార్యాలయాలు ఉన్నాయి. జూన్ 26న దిల్లీ అవినీతి నిరోధక శాఖ నమోదుచేసిన ఎఫ్ఐఆర్ ఆధారంగా భరద్వాజ్‌పై ఈడీ దర్యాప్తు కొనసాగించింది. ఈ సోదాలను ఆమ్ ఆద్మీ పార్టీ తీవ్రంగా ఖండించింది. ఈడీ చెబుతున్న సమయంలో ఆయన మంత్రిగా లేరని తెలిపింది. కేంద్ర దర్యాప్తు సంస్థలను దుర్వినియోగం చేస్తున్న మోదీ ప్రభుత్వానికి ఆప్ భయపడదని ఆ పార్టీ జాతీయ కన్వీనర్, మాజీ ముఖ్యమంత్రి అరవింద్ కేజ్రీవాల్ వ్యాఖ్యానించారు.

ఏమిటీ కేసు?: 2018-19లో ఆమ్ ఆద్మీ పార్టీ అధికారంలో ఉన్న సమయంలో 24 ఆసుపత్రుల నిర్మాణం కోసం రూ.5,590 కోట్లతో ప్రాజెక్టుకు ఆమోదం తెలిపింది. ఓ ఐసీయూ ఆసుపత్రిని ఆరు నెలల్లో పూర్తి చేయాల్సి ఉండగా.. మూడేళ్లు దాటినా అది పూర్తికాలేదు. ఇందుకోసం రూ.800 కోట్లు ఖర్చు చేసినా.. కేవలం సగం పనులు మాత్రమే పూర్తయ్యాయి. దీంతో ఆ ప్రాజెక్టులో అవకతవకలు ఉన్నట్లు ఆరోపణలు వచ్చాయి. వీటి ఆధారంగా ఈడీ మనీలాండరింగ్ కేసు నమోదు చేసింది. ఈ కేసులోనే సౌరభ్ నివాసంలో ఈడీ తనిఖీలు చేపట్టింది.

స్వదేశానికి చేరుకున్న ఝార్ఖండ్ కూలీలు

రాంచీ: ఆఫ్రికాలోని కామెరూన్‌లో గత కొన్ని నెలలుగా చిక్కుకుపోయిన ఝార్ఖండ్‌కు చెందిన 17 మంది వలస కూలీలు సురక్షితంగా స్వదేశానికి చేరుకున్నారు. విదేశీ వ్యవహారాల శాఖ (ఎంఈఏ), రాష్ట్ర కార్మిక శాఖ సహకారంతో కూలీలు సోమవారం రాంచీ వచ్చారని అధికారులు వెల్లడించారు. ఝార్ఖడ్ వలస విభాగం అధికారిణి శిఖా లక్రా వార్తాసంస్థతో మాట్లాడుతూ.. 'బొకారో హజారీబాగ్ జిల్లాకు చెందిన 19మంది కూలీలు విద్యుత్ ప్రాజెక్టులో పనిచేయడానికి ఓ ప్రైవేట్ ఏజెన్సీ ద్వారా కామెరూన్‌కు వెళ్లారు. తర్వాత ఆ యజమానులు నాలుగు నెలలపాటు వేతనాలు ఇవ్వకుండా వారిని ఇబ్బందులకు గురిచేశారు. దీనిపై ఆ కూలీలు ఓ వీడియోను సామాజిక మాధ్యమాల్లో షేర్ చేశారు. ఈ విషయాన్ని గుర్తించిన కార్మిక శాఖ వెంటనే చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించింది' అని తెలిపారు. కార్మికుల పెండింగ్ వేతనాలు తిరిగి ఇచ్చేలా ప్రభుత్వం చర్యలు చేపట్టిందన్నారు.



కేరళలోని త్రిశూర్‌లో ఓనమ్ వేడుకల సందర్భంగా పూలతో వేసిన భారీ రంగోలి

గోవధతో శాంతి భద్రతలకు ముప్పు

- పంజాబ్ హరియాణా హైకోర్టు

చండీగఢ్: గోవు పూజనీయమైనదనీ, దాని పవిత్రతను ఉల్లంఘించే చర్యలు ప్రజల భక్తివిశ్వాసాలకు విఘాతం కలిగించి శాంతిభద్రతలకు భంగం కలిగిస్తాయని పంజాబ్, హరియాణా హైకోర్టు పేర్కొంది. గోవులను కబేళాకు తరలిస్తున్నాడనే ఆరోపణపై అరెస్టయిన ఒక వ్యక్తి ముందస్తు బెయిలు దరఖాస్తును తిరస్కరిస్తూ, పైవిధంగా వ్యాఖ్యానించింది. హరియాణలోని నుహ్‌కు చెందిన నిందితుడు మరో ఇద్దరు వ్యక్తులు రాజస్థాన్ కబేళాలకు పశువులను తరలిస్తూ పట్టుబడ్డారు. వారిపై హరియాణా గోవంశ సంరక్షణ, గోసంవర్ధన చట్టం(2015), క్రూరత్వ నిరోధ చట్టం(1960) కింద కేసు పెట్టారు. నిందితుడు పదేపదే గోవధకు పాల్పడటం రాజ్యాంగం నిర్దేశించిన నైతిక ప్రమాణాలను, సామాజిక సామరస్యాన్నీ దెబ్బతీస్తోందని జడ్జి సందీప్ మౌద్గిల్ పేర్కొన్నారు. అతని బెయిలు దరఖాస్తును తిరస్కరిస్తున్నట్టు ప్రకటించారు.


నిరసన కార్యక్రమాలకు ముందస్తు అనుమతి తప్పనిసరి

- బాంబే హైకోర్టు

ముంబయి: బహిరంగ ప్రదేశాలను ఆక్రమించి ఎల్లకాలం ఆందోళనలు చేపట్టలేరని బాంబే హైకోర్టు వ్యాఖ్యానించింది. నిరసన కార్యక్రమాలకు అధికారుల ముందస్తు అనుమతి తప్పనిసరని పేర్కొంది. ఓబీసీ కోటా కింద తమకు 10 శాతం రిజర్వేషన్ ఇవ్వకపోతే ఈ నెల 29న ముంబయికి తన అనుచరులతో కవాతు చేస్తానని, తర్వాత ఆమరణ నిరాహార దీక్షకు దిగుతానని ప్రభుత్వానికి మరాఠా కోటా ఉద్యమకారుడు మనోజ్ జరాంగే ఇటీవల అల్టిమేటం జారీ చేశారు. దీనిని సవాలు చేస్తూ ఓ సంస్థ దాఖలు చేసిన పిటిషన్‌పై హైకోర్టు న్యాయమూర్తులు జస్టిస్ ఆలోక్ అరాధే, జస్టిస్ సందీప్ మార్నేల ధర్మాసనం మంగళవారం విచారణ జరిపింది. వినాయక చవితి సంబరాల నేపథ్యంలో పోలీసులు తీరిక లేకుండా ఉంటారని, ఇలాంటి సమయంలో ఆందోళనలు చేపడితే భద్రతాపరమైన ఇబ్బందులు తలెత్తుతాయని వ్యాఖ్యానించింది. ఈ పిటిషన్‌పై స్పందన తెలియజేయాలని జరాంగేకు నోటీసులు జారీ చేస్తూ తదుపరి విచారణను వచ్చే నెల 9కి వాయిదా వేసింది.



ఉత్తర్‌ప్రదేశ్‌లోని ఆగ్రాలో తాజ్‌మహల్ వద్ద అంతర్జాతీయ మిస్ టీన్ 2025 పోటీదారులు



పోస్టర్ ఆవిష్కరిస్తున్న చంద్రబాబు. చిత్రంలో కృష్ణయ్య, శరవణన్

మట్టి గణపతిని పూజిద్దాం

పీసీబీ సందేశాల పోస్టర్లను ఆవిష్కరించిన చంద్రబాబు

ఈనాడు, అమరావతి: రాష్ట్రంలోని ప్రజలు పర్యావరణహిత వినాయక చవితి నిర్వహించుకోవాలని, మట్టి, విత్తన గణపతులను పూజించాలని ముఖ్యమంత్రి చంద్రబాబు పిలుపునిచ్చారు. ఈ మేరకు కాలుష్య నియంత్రణ మండలి (పీసీబీ) రూపొందించిన సందేశాల పోస్టర్లను మంగళవారం ఆయన ఆవిష్కరించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. 'పీవోపీతో తయారు చేసిన విగ్రహాల్లో జిప్సమ్, గంధకం, ఫాస్పరస్, మెగ్నీషియం వంటి రసాయనాలు ఉంటాయి. అవి పర్యావరణానికి హాని కలిగిస్తాయి. అందుకే అందరం మట్టి గణపతులను పూజిద్దాం' అని పేర్కొన్నారు. పీసీబీ ఛైర్మన్ డా.పి.కృష్ణయ్య, కార్యదర్శి శరవణన్ మాట్లాడుతూ.. రాష్ట్రవ్యాప్తంగా 3 లక్షల మట్టి, విత్తన గణపతి విగ్రహాలను పంపిణీ చేశామని తెలిపారు. శ్రీకాకుళంలో ఇళ్ల వద్దకే విగ్రహాలు పంపిణీ చేశామని, గుంటూరులో మట్టి విగ్రహాలు తయారు చేసే వీడియోలు పంపించిన వారికి బహుమతులిచ్చామని చెప్పారు. విజయవాడలో 7,500 మట్టి విగ్రహాలు తయారు చేయించి, వరల్డ్ బుక్ ఆఫ్ రికార్డు సాధించామని వివరించారు.

అందరి విఘ్నాలు తొలగిపోవాలి

గవర్నర్ అబ్దుల్ నజీర్

ఈనాడు, అమరావతి: వినాయక చవితి సందర్భంగా రాష్ట్ర ప్రజలకు గవర్నర్ అబ్దుల్ నజీర్ శుభాకాంక్షలు తెలిపారు. కుటుంబసభ్యులతో కలిసి భక్తితో, ఉత్సాహంగా నిర్వహించుకునే వినాయక చవితి భక్తుల విఘ్నాలన్నీ తొలగిపోవాలని, శాంతి, శ్రేయస్సు, సామరస్యంతో కూడిన జీవితాన్ని గడిపేందుకు మనందరికీ వినాయకుడు ఆశీస్సులు అందించాలని ఆకాంక్షించారు.

గణేశుడి ఆశీస్సులతో అందరికీ సకల శుభాలు కలగాలి: సీఎం చంద్రబాబు

ఈనాడు, అమరావతి: వాడవాడలా మండపాలు ఏర్పాటు చేసి భక్తిశ్రద్ధలు, ఆనందోత్సాహాలతో గణేశుడిని పూజిస్తున్న ప్రజలకు సకల శుభాలు కలగాలని వినాయకుడిని ప్రార్థిస్తున్నానని సీఎం చంద్రబాబు 'ఎక్స్'లో పోస్టు చేశారు. 'తెలుగు ప్రజలందరికీ వినాయక చవితి శుభాకాంక్షలు. మీ కుటుంబ ప్రగతికి, లక్ష్యాలకు ఎలాంటి విఘ్నాలు కలగకుండా ఆ గణపతి మిమ్మల్ని అనుగ్రహించాలని కోరుకుంటున్నా' అని పేర్కొన్నారు.

ప్రజలకు సకల సంపదలు సిద్ధించాలి: జగన్

ఈనాడు, అమరావతి: వినాయక చవితి సందర్భంగా రాష్ట్ర ప్రజలందరికీ వైకాపా అధ్యక్షుడు జగన్ శుభాకాంక్షలు తెలిపారు. అందరికీ గణనాథుని ఆశీస్సులు ఉండాలని, సకల సంపదలు సిద్ధించాలని ఆకాంక్షించారు.

పొగాకు కొనుగోలు చేయాలని వినతి

ఈనాడు, అమరావతి: పొగాకు నిల్వలు కొనుగోలు చేసి నగదు చెల్లించేలా తగు చర్యలు తీసుకోవాలని ప్రకాశం జిల్లా పామూరు మండలం కోడిగుంపల గ్రామానికి చెందిన కొప్పుల నాగేశ్వరరావు కోరారు. ఈ మేరకు మంగళగిరిలోని తెదేపా కేంద్ర కార్యాలయంలో ఏపీ పట్టణాభివృద్ధి సంస్థ ఛైర్మన్ పి.వాణి వెంకటశివప్రసాద్, ఏపీ టైలర్ల అభివృద్ధి సహకార సమాఖ్య ఛైర్మన్ ఆకాశపు స్వామిలకు వినతిపత్రం సమర్పించారు. 'సాగు చేసిన బర్లీ పొగాకును ప్రైవేట్ కంపెనీ తక్కువ ధరకు కొనుగోలు చేసి మోసం చేసింది. నాతోపాటు గ్రామంలో అనేక మంది రైతులది ఇదే పరిస్థితి. పామూరు మండలంలో వెయ్యి క్వింటాళ్ల పొగాకు నిల్వలు ఉన్నాయి. వాటిని కొనుగోలు చేయాలి' అని విజ్ఞప్తి చేశారు.

డిగ్రీ ప్రవేశాల రిజిస్ట్రేషన్ గడువు పొడిగింపు

ఈనాడు, అమరావతి: డిగ్రీ ఆన్‌లైన్ ప్రవేశాల రిజిస్ట్రేషన్ గడువును ఉన్నత విద్యామండలి సెప్టెంబరు 1 వరకు పొడిగించింది. మొదట ప్రకటించిన షెడ్యూల్ ప్రకారం మంగళవారంతో గడువు ముగిసింది. విద్యార్థుల అభ్యర్థన మేరకు పొడిగించినట్లు మండలి తెలిపింది. వెబ్ ఐచ్ఛికాల నమోదుకు సెప్టెంబరు 2 వరకు అవకాశం కల్పించారు. సెప్టెంబరు 6న సీట్ల కేటాయింపు, 8 నుంచి తరగతులు ప్రారంభమవుతాయి.


విద్యార్థులను అభినందించే సంస్కారం కూడా జగన్‌కు లేదు

లిడ్ క్యాప్ ఛైర్మన్ పిల్లి మాణిక్యరావు

ఈనాడు, అమరావతి: కష్టపడి చదివి రాణించిన ఎస్సీ, ఎస్టీ విద్యార్థులను అభినందించే సంస్కారం కూడా వైకాపా అధ్యక్షుడు జగన్‌కు లేదని ఏపీ లిడ్ క్యాప్ ఛైర్మన్ పిల్లి మాణిక్యరావు విమర్శించారు. మంగళగిరిలోని తెదేపా కేంద్ర కార్యాలయంలో మంగళవారం ఆయన విలేకర్ల సమావేశంలో మాట్లాడారు. 'దళిత విద్యార్థుల విజయాలపై జగన్ ఒక్క పోస్టు కూడా పెట్టలేదు. వారి చదువు, అభివృద్ధి ఆయనకు ఇష్టం లేదా? వైకాపా ప్రభుత్వంలో ఉన్నప్పుడు 'పేదల విద్య'పై ఎలాంటి శ్రద్ధ చూపలేదు. విద్య ద్వారా సామాజిక మార్పు అనే ఫూలే, అంబేడ్కర్ ఆశయాలకు అనుగుణంగా కూటమి ప్రభుత్వం పని చేస్తోంది. గురుకుల విద్యార్థులు పదో తరగతిలో 89.5 శాతం, ఇంటర్‌లో 94.2 శాతం ఉత్తీర్ణత సాధించారు. ఐఐటీ, నీట్ లాంటి పరీక్షల్లో రాణించిన 55 మందికి సీఎం చంద్రబాబు రూ.లక్ష చొప్పున బహుమతి అందజేశారు. ఈ ఏడాది 1,500 మంది విద్యార్థులకు కోచింగ్ ఇచ్చేందుకు ప్రత్యేక సెంటర్లు ఏర్పాటు చేయడం విశేషం' అని పేర్కొన్నారు.

ఏఐ యుగంలో విద్యాబోధన ఎలా?

- పాఠశాల, ఉన్నత విద్యలో సంస్కరణలపై టాస్క్‌ఫోర్స్ నియామకం
- ఐఐటీ కౌన్సిల్ సమావేశంలో నిర్ణయం



ఈనాడు, హైదరాబాద్: అనేక రంగాల్లోకి కృత్రిమ మేధ(ఏఐ) ప్రవేశిస్తున్న నేపథ్యంలో విద్యారంగంలో తీసుకురావాల్సిన సంస్కరణలపై ఐఐటీలు దృష్టి సారించాయి. పాఠశాల, ఉన్నత విద్య స్థాయిలో పాఠాల బోధన తీరును యుద్ధప్రాతిపదికన అధ్యయనం చేయాలని నిర్ణయించాయి. దేశంలోని 23 ఐఐటీల డైరెక్టర్లు, ఛైర్మన్లు, యూజీసీ, ఏఐసీటీఈ, కేంద్ర విద్యాశాఖ అధికారులతో ఏటా కేంద్ర విద్యాశాఖ మంత్రి ఆధ్వర్యంలో ఐఐటీ కౌన్సిల్ సమావేశాలు నిర్వహిస్తుంటారు. దాదాపు రెండున్నర సంవత్సరాల విరామం తరువాత తాజాగా దిల్లీలో నిర్వహించిన ఈ సమావేశంలో పలు అంశాలపై చర్చించారు. ఏఐ వినియోగం పెరుగుతున్న నేపథ్యంలో ఇప్పటితరం అవసరాలకు అనుగుణంగా విద్యనందించేందుకు విద్యా ప్రణాళిక(కరిక్యులమ్), బోధనారీతుల్లో తీసుకురావాల్సిన సంస్కరణలపై టాస్క్‌ఫోర్స్ కమిటీ నియమించాలని సమావేశంలో నిర్ణయించారు. 'చాట్ జీపీటీ అందుబాటులోకి రావడంతో ఉపాధ్యాయులు/అధ్యాపకులు ఇచ్చిన ఎసైన్‌మెంట్లు, హోంవర్క్‌ను విద్యార్థులు ఇట్టే పూర్తి చేస్తున్నారు. ఇలాంటి పరిస్థితుల్లో బోధన శైలి ఎలా ఉండాలి? తరగతి గదిలో పాఠాలు బోధిస్తే సరిపోతుందా? విద్యార్థులతో కలిసి టీచర్లు చర్చించాలా? అన్న అంశాలపై సమావేశంలో చర్చ జరిగింది' అని ఐఐటీ డైరెక్టర్ ఒకరు తెలిపారు. కమిటీ నివేదిక ఇచ్చిన తరువాత విద్యారంగంలో కీలక మార్పులు వచ్చే ఆస్కారం ఉందని ఆయన అభిప్రాయపడ్డారు.

సమావేశంలో చర్చించిన అంశాలు

◆ ఐఐటీల ప్రపంచ ర్యాంకింగ్ మెరుగుపడాలన్నా, వాటిని పరిశోధనా కేంద్రాలుగా మార్చాలన్నా పీహెచ్‌డీ నాణ్యత మెరుగుపడాలి. ప్రధాన మంత్రి రీసెర్చ్ ఫెలోషిప్(పీఎంఆర్ఎఫ్)ల సంఖ్య పెంచాలి. ప్రపంచ ర్యాంకింగ్ మెరుగుపర్చుకునేందుకు విదేశీ ఆచార్యులను నియమించుకోవాలని కొన్నేళ్ల క్రితం తీసుకున్న నిర్ణయం అమలులో ఎదురవుతున్న సవాళ్లను పరిష్కరించాలి. ◆ 2047 నాటికి వికసిత్ భారత్ లక్ష్యాలను చేరుకోవడంలో భాగంగా ఐఐటీల భవిష్యత్ అభివృద్ధి కోసం వ్యూహాత్మక రోడ్‌మ్యాప్ రూపొందించాలి. ◆ విద్యాసంస్థలు, పరిశ్రమల మధ్య అనుసంధానం పెంచేందుకు, అంతర్జాతీయ భాగస్వామ్యం కోసం, పెట్టుబడులను ఆకర్షించేందుకు ఐఐటీలు నిర్వహిస్తున్న ఆర్ అండ్ డీ ప్రదర్శనలకు అంతర్జాతీయ గుర్తింపు లభించేలా చర్యలు చేపట్టాలి. ◆ ఐఐటీల్లో ప్రాంతీయ భాషల్లో బోధించాలని కేంద్ర మంత్రి ధర్మేంద్ర ప్రధాన్ కోరినా... దానిపై పూర్తిస్థాయిలో అంగీకారం కుదరలేదని సమాచారం.

అనుమతులు ఉన్న కళాశాలలనే కౌన్సెలింగ్‌లో పెట్టారు

- సాంకేతిక విద్యాశాఖ డైరెక్టర్ గణేష్ కుమార్

ఈనాడు, అమరావతి: విశ్వవిద్యాలయాలు, రాష్ట్ర ప్రభుత్వం, అఖిల భారత సాంకేతిక విద్యా మండలి (ఏఐసీటీఈ) నుంచి అనుమతులు పొందిన 293 బీబీఏ, బీసీఏ కోర్సుల కళాశాలల జాబితాను ఇటీవల ఉన్నత విద్యామండలికి పంపించామని సాంకేతిక విద్యా శాఖ డైరెక్టర్ గణేష్ కుమార్ ఓ ప్రకటనలో తెలిపారు. 'ఈనాడు'లో మంగళవారం ప్రచురితమైన '101 బీబీఏ, బీసీఏ కళాశాలలు ఏవీ?' అనే వార్తకు ఆయన వివరణ ఇచ్చారు. 'బీబీఏ, బీసీఏ కోర్సులకు సంబంధించి మరో 105 కళాశాలల జాబితాను ఉన్నత విద్యామండలికి పంపించాం. ఇందులో 21 డిగ్రీ కళాశాలలకు మాత్రం ఏఐసీటీఈ, వర్సిటీ అనుబంధ గుర్తింపు ఉన్నందున వాటిని కౌన్సెలింగ్‌లో పెట్టారు. 48 కళాశాలలకు విశ్వవిద్యాలయాల అనుబంధ గుర్తింపు లేదు. కొత్తగా కోర్సులు ప్రారంభించాలనుకున్న 36 ఇంజినీరింగ్ కళాశాలలకు ప్రభుత్వం నుంచి ఎన్‌వోసీ లేదు. బీబీఏ, బీసీఏ కోర్సులకు అనుమతులు జారీ చేసే ప్రక్రియను మాత్రమే సాంకేతిక విద్యా శాఖ చూస్తోంది. ఉన్నత విద్యామండలి ఆధ్వర్యంలో ప్రవేశాలు జరుగుతున్నాయి. డిగ్రీ ఆన్‌లైన్ ప్రవేశాల ప్రకటన షెడ్యూల్‌పై ఎలాంటి సమాచారం లేదు' అని పేర్కొన్నారు.

ఇక విద్యార్థుల చేతికి కాస్మెటిక్ కిట్స్

ప్రతి రెండు నెలలకొకసారి వస్తువులు అందజేత

ఈనాడు, అమరావతి: సాంఘిక సంక్షేమ వసతి గృహాల్లో ఉండే విద్యార్థుల ఇక్కట్లు తీర్చేలా కూటమి ప్రభుత్వం కీలక నిర్ణయం తీసుకుంది. తరగతుల వారీగా ఒక్కో విద్యార్థికి అందించే నగదుకు సరిపడా ప్రతి రెండు నెలలకొకసారి విద్యార్థుల చేతికి నేరుగా కాస్మెటిక్స్ కిట్లను అందించాలని మంగళవారం ఉత్తర్వులు జారీ చేసింది. ఈ కిట్‌లో హెయిర్ ఆయిల్, టూత్ పేస్ట్, టూత్‌బ్రష్, పౌడర్, షాంపూ, స్నానపు సబ్బు, డిటర్జెంట్ సోప్, శానిటరీ నాప్కిన్ ఉండనున్నాయి. వీటి కొనుగోలును ఆన్‌లైన్ టెండర్ల ద్వారా చేపట్టనుంది. వస్తువులు నాణ్యతగా ఉండాలని, సరఫరా ట్రాకింగ్, ఆడిట్ వ్యవస్థ ఉండాలని పేర్కొంది. ఈ విధానం ఎప్పటికప్పుడు అంచనా వేయాలని అధికారులను సూచించింది. కాస్మెటిక్ ఛార్జీల కింద వైకాపా ప్రభుత్వం అస్తవ్యస్తంగా చేపట్టిన నగదు చెల్లింపు విధానాన్ని రద్దు చేసింది.

ఏపీ డ్రోన్ కార్పొరేషన్ బోర్డు పునర్నిర్మాణం

ఈనాడు, అమరావతి: ఏపీ డ్రోన్ కార్పొరేషన్ లిమిటెడ్ బోర్డును పునర్నిర్మిస్తూ ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. బోర్డు ఛైర్మన్‌గా మౌలిక సదుపాయాలు, పెట్టుబడుల శాఖ (ఐఅండ్ఐ) కార్యదర్శి వ్యవహరిస్తారని, డైరెక్టర్లుగా ఐఅండ్ఐ, ఆర్థిక, హోమ్ శాఖల అదనపు/జాయింట్/డిప్యూటీ/అసిస్టెంట్ సెక్రటరీలు, ఏపీ డ్రోన్ కార్పొరేషన్ సీఈవో, ఏపీ స్టేట్ ఫైబర్ నెట్ లిమిటెడ్ ఎండీ వ్యవహరిస్తారని పేర్కొంది.

సిమెంటు ధరలు పెంచుతారా?

- బస్తాకు రూ.30 - 40 పెంచేందుకు కంపెనీల పన్నాగం

ఈనాడు, హైదరాబాద్: జీఎస్టీ శ్లాబులను తగ్గించడం ద్వారా ప్రజలకు ధరల భారం నుంచి ఉపశమనం కల్పించాలని కేంద్ర ప్రభుత్వం ఆలోచిస్తుండగా.. కంపెనీలు, వ్యాపారులు దానికి గండికొట్టే యత్నాలు చేస్తున్నారు. నిర్మాణ రంగానికి కీలక ముడిసరకైన సిమెంటు ధరలపై ప్రస్తుతం 28% జీఎస్టీని వసూలు చేస్తుండగా, దాన్ని 18 శాతానికి తగ్గించవచ్చని ప్రచారం జరుగుతోంది. ఈ తరుణంలో పన్ను తగ్గింపు లాభం వినియోగదారులకు చేరేలోపే ధరలు పెంచేందుకు కొన్ని కంపెనీలు కసరత్తు చేస్తున్నట్టు సమాచారం. బస్తాపై అదనంగా రూ.30 నుంచి 40 వరకు పెరిగే సూచనలున్నట్లు క్షేత్రస్థాయిలోని వ్యాపారులకు కొన్ని కంపెనీల ఫీల్డ్ ఆఫీసర్ల నుంచి వాట్సప్ సందేశాలు వచ్చినట్లు తెలిసింది. 'అధికారికంగా కంపెనీలు ప్రకటన చేయకపోయినప్పటికీ ప్రతిరోజూ ఉదయం ధరలు పెరిగాయా లేదా అనేది నిర్ధారణ చేసుకున్న తర్వాత మాత్రమే సరకు కొనుగోలుకు డబ్బు పంపాలంటూ' ఫీల్డ్ ఆఫీసర్లు వ్యాపారులకు సూచిస్తున్నట్లు విశ్వసనీయంగా తెలిసింది. దీనిపై 'ఈనాడు' వాణిజ్య పన్నుల శాఖ రాష్ట్ర అధికారులను సంప్రదించగా సిమెంటు ధరలు పెంచుతున్నట్లు తమకు ఎలాంటి సమాచారం లేదని వివరించారు. వ్యాపారుల క్రయవిక్రయాల విలువపైనే నిబంధనల ప్రకారం జీఎస్టీ వసూలు చేస్తామని తెలిపారు.

జెన్‌కోకు రూ.16 కోట్ల నష్టం

- జరిమానా నిబంధన లేకపోవడమే కారణం
- అనంతపురం సోలార్ పార్క్-2 పనితీరుపై కాగ్ విశ్లేషణ

ఈనాడు, దిల్లీ: అనంతపురం సోలార్‌పార్క్-2లో టెండర్ డాక్యుమెంట్లలో పేర్కొన్న విధంగా కనీస వార్షిక ఉత్పత్తి చేయకపోవడంవల్ల జెన్‌కోకు రూ.16 కోట్ల నష్టం సంభవించినట్లు కాగ్ వెల్లడించింది. ఇలా జరిగినప్పుడు ఉత్పత్తి సంస్థ నుంచి జరిమానా వసూలుచేసే క్లాజ్‌ను ఒప్పందంలో పెట్టకపోవడంవల్ల ఆ మేరకు జెన్‌కో నష్టపోవాల్సి వచ్చిందని తెలిపింది. 'ఏపీ సోలార్ పవర్ కార్పొరేషన్ లిమిటెడ్ అనంతపురం సోలార్ పార్క్-2 డెవలపర్‌గా వ్యవహరించింది. ఇక్కడ 400 మెగావాట్ల పవర్ ప్రాజెక్టు ఏర్పాటుచేయడంతోపాటు ఐదేళ్ల నిర్వహణ కాంట్రాక్టులను బిడ్డింగ్ ద్వారా ఏపీ జెన్‌కో ముగ్గురు కాంట్రాక్టర్లకు అప్పగించింది. బిడ్ డాక్యుమెంట్ల ప్రకారం ప్రతి 100 మెగావాట్లకు ఏటా కనీసం 178 మిలియన్ యూనిట్ల విద్యుత్తు ఉత్పత్తి చేయాలి. అయితే ఈ కాంట్రాక్టు దక్కించుకున్న సంస్థల్లో ఒకటైన ఎంసీ నల్లి భారత్ ఇంజినీరింగ్ కంపెనీ లిమిటెడ్ వాణిజ్య కార్యకలాపాలు మొదలుపెట్టిన నాటి నుంచి కూడా కనీస ఉత్పత్తి లక్ష్యాన్ని (20.3%) సాధించలేదు. ఇలా జరిగితే జరిమానా విధిస్తామన్న నిబంధన కాంట్రాక్ట్‌లో లేకపోవడంవల్ల ఉత్పత్తి తగ్గుదల కారణంగా సంభవించిన నష్టాన్ని రికవరీ చేసుకోవడానికి ఏపీజెన్‌కోకు అవకాశం లేకుండాపోయింది. దీంతో ఆ సంస్థకు మూడేళ్లలో రూ.16.85 కోట్ల మేర నష్టం జరిగింది' అని కాగ్ పేర్కొంది.

రాష్ట్రంలో ఏర్పాటుచేసిన పార్కుల్లో జరిగిన జాప్యం ఇలా (నెలల్లో)

పార్కు పేరు	సామర్థ్యం మె.వా.	అనుమతించిన తేదీ	డీపీఆర్ తయారీలో	భూసేకరణలో	ఫైనాన్షియల్ క్లోజర్‌లో	పూలింగ్‌స్టేషన్, ల్యాండ్ డెవలప్‌మెంట్‌లో	ట్రాన్స్‌మిషన్, గ్రిడ్ కనెక్టివిటీలో
కర్నూలు	1,000	28.11.2014	0	15	0	13	8
అనంతపురం-1	1,400	28.11.2014	0	15	0	56	28
అనంతపురం-2	500	15.01.2016	17	2	25	21	16
కడప	1,000	09.10.2015	16	5	34	26	24
రామగిరి	300	11.11.2021	13	0	17	4	4

ట్రంప్ వీసా నిబంధనలతో..

భారతీయ ట్రక్కు డ్రైవర్లకు అవస్థలు

ఇంటర్నెట్ డెస్క్: అమెరికాలోని ఫ్లోరిడాలో జరిగిన ఒక్క రోడ్డు ప్రమాదం అక్కడ పనిచేయాలనుకునే విదేశీ డ్రైవర్ల జీవితాల్లో చీకటి నింపుతోంది. దీనిని సాకుగా చూపించి ట్రంప్ సర్కారు విదేశీ ట్రక్కు డ్రైవర్లకు వర్కర్ వీసాలు, వాణిజ్య, రవాణా డ్రైవింగ్ లైసెన్స్‌ల జారీని నిలిపివేసింది. అమెరికాలోని రవాణారంగం చాలామంది డ్రైవర్లను ఆకర్షించడానికి ప్రధాన కారణం ఆదాయం భారీగా ఉండటమే.



ఏటా రూ.40 లక్షల ఆదాయం..!

అమెరికాలో డ్రైవర్లకు మైళ్ల ఆధారంగా రేటు చెల్లిస్తుంటారు. ఒక్కో మైలుకు ప్రాంతాన్ని బట్టి 0.60 డాలర్ల నుంచి 0.70 డాలర్ల వరకు ఆదాయం ఉంటుంది. ప్రతి డ్రైవరు రోజుకు 500-600 మైళ్లు సులువుగా ప్రయాణిస్తాడు. ఈ లెక్కన భారత కరెన్సీలో నెలకు రూ.4.2 లక్షల నుంచి రూ.6.7 లక్షల వరకు సంపాదిస్తారు. కొన్ని సంస్థలు మాత్రం డ్రైవర్లకు గంటకు రూ.1,680-రూ.2,520 చొప్పున లెక్కగట్టి ఇస్తాయి. సగటున ఏటా ఒక డ్రైవర్ రూ.40 లక్షలు సంపాదిస్తాడు. ఇక వాల్‌మార్ట్, అమెజాన్ వంటి కంపెనీలైతే సీజనల్ డ్రైవర్లకు ఏటా రూ.92 లక్షల వరకు చెల్లిస్తాయి.

తీవ్రకొరత

అమెరికాలో ట్రక్కు డ్రైవర్ల కొరత తీవ్రంగా ఉంది. భారత్‌లోని పంజాబ్ నుంచి యువత ఎక్కువగా అమెరికా వెళ్లి డ్రైవర్లుగా స్థిరపడుతున్నారు. 2025 బడ్జెట్ సంవత్సరంలో అమెరికాలో విదేశీ డ్రైవర్లకు 1,490 హెచ్-2బీ వీసాలను జారీ చేశారు. అంతకుముందు ఏడాదికి 1,400 ఇచ్చారు.

ఎంతమంది భారతీయులపై ప్రభావం..?

2021 లెక్కల ప్రకారం అమెరికాలో 7.2 లక్షల మంది విదేశీ కమర్షియల్ డ్రైవర్లు ఉన్నారు. అమెరికా ట్రక్కు రవాణా రంగంలో ఇది 18 శాతానికి సమానం. భారత్‌లోని పంజాబ్, హరియాణా నుంచి పెద్దసంఖ్యలో యువకులు ఇక్కడికి వస్తుంటారు. 2018 గణాంకాల ప్రకారం కేవలం రెండేళ్ల వ్యవధిలోనే 30,000 మంది భారతీయ సిక్కులు ఈ రంగంలో చేరారు. చట్టపరమైన అనుమతులతో ఇప్పటికే పనిచేస్తున్నవారికి ఇబ్బందులు లేకపోయినా.. వీసా పునరుద్ధరణ సమయాల్లో మాత్రం చిక్కులు తప్పేలా లేవు. దీంతో వేలమంది భారతీయులు భవిష్యత్తులో ఉద్యోగాలు కోల్పోవాల్సి ఉంటుంది.

భారత్‌లో మితిమీరిన సిజేరియన్లు


తల్లీబిడ్డలకు హానికరం

దిల్లీ: తల్లి పొత్తి కడుపునకు, గర్భాశయానికీ కోతలు పెట్టి శస్త్రచికిత్స ద్వారా బిడ్డను ప్రసవింపజేసే సిజేరియన్ ఆపరేషన్లు భారత్‌లో మితిమీరుతున్నాయని, ప్రపంచ ఆరోగ్య సంస్థ సిఫార్సు చేసిన పరిమితిని మించి పోయాయని వైద్య విజ్ఞాన పత్రిక 'లాన్సెట్' ప్రచురించిన ఒక అధ్యయనం వెల్లడించింది. 2005లో భారత్ లో 8.5 శాతంగా ఉన్న సిజేరియన్ శస్త్రచికిత్సలు 2021 వచ్చేసరికి 21.5 శాతానికి పెరిగిపోవడం ఆందోళనకరం. బంగ్లాదేశ్ లో 2011లో సిజేరియన్లు 18 శాతం కాగా 2022కల్లా అవి 45 శాతానికి పెరిగాయి. పాకిస్థాన్ లో 1990లో 3 శాతంగా ఉన్న ఈ తనహా ఆపరేషన్లు 2018 కల్లా 20 శాతానికి పెరిగాయి. బెంగళూరులోని ఇన్ స్టిట్యూట్ ఆఫ్ పబ్లిక్ హెల్త్, తమిళనాడుకు చెందిన వేలూరులోని క్రిస్టియన్ మెడికల్ కాలేజ్ పరిశోధకులు ఈ అధ్యయనం జరిపారు. అనవసరంగా సిజేరియన్ చికిత్సలు చేయించుకొంటే ఎక్కువ కాలం ఆస్పత్రిలో ఉండి, ఎక్కువ ఖర్చు చేయవలసి వస్తుంది. ఈ పద్ధతిలో పుట్టిన పిల్లలకు ఉబ్బసం, స్థూలకాయం, ఎలర్జీలు, టైప్ 1 మధుమేహం సంప్రాప్తించే ప్రమాదం ఎక్కువ. భారత్, బంగ్లాదేశ్, పాకిస్థాన్ తదితర దక్షిణాసియా దేశాలలో అత్యధిక సిజేరియన్ ఆపరేషన్లు ప్రైవేటు ఆస్పత్రుల్లో జరుగుతున్నాయి. భారత్‌లో ప్రైవేటు ఆస్పత్రులలో ప్రతి సిజేరియన్ ఆపరేషన్‌కు సగటున రూ.43,000 ఖర్చయితే, ప్రభుత్వ ఆస్పత్రిలో రూ. 8,500 ఖర్చవుతోంది. ఆరోగ్య బీమా సౌకర్యాన్ని దుర్వినియోగం చేయడం, సరైన నియంత్రణలు లేకపోవడం వల్లనే అనవసరంగా సిజేరియన్ శస్త్ర చికిత్సలు జరుగుతున్నాయి. ఆసియాలో 1990లో 4.4 శాతంగా ఉన్న ఈ శస్త్రచికిత్సలు 2014 కల్లా 19.5 శాతానికి పెరిగాయి.

29న పోలవరానికి విదేశీ నిపుణుల బృందం

ఈనాడు, అమరావతి: పోలవరం ప్రాజెక్టు పరిశీలించి వివిధ అంశాలపై నిర్ణయాలు తీసుకునేందుకు విదేశీ నిపుణుల బృందం రాబోతోంది. ఈ నెల 29 నుంచి 31 వరకు పోలవరంలోనే ఉండనున్నారు. వీరు రావడం ఇది అయిదోసారి. మే నెలలో వచ్చి పలు అంశాలపై తమ సిఫార్సులు అందించారు. విదేశీ నిపుణులైన ఛార్లెస్ రిచర్డ్ డొన్నెల్లీ, డగ్లస్ హించ్‌బెర్గర్, బ్రియాన్‌పాల్, డి.సిస్కోలు ఆసాంతం ప్రాజెక్టును సమీక్షించనున్నారు. ఈ నెల 29న తొలుత నిర్మాణ పనుల తీరును పరిశీలిస్తారు. ఈ పర్యటనలో ప్రధాన డ్యాం రెండో భాగం నిర్మాణ ఆకృతులపై కీలకంగా చర్చించనున్నారు. ఈ పనులను నవంబరు నుంచే జలవనరులశాఖ ప్రారంభించాలని అనుకుంటోంది. దీంతో పాటు నాణ్యత నియంత్రణ ముసాయిదా, గైడ్ బండ్ పునరుద్ధరణ, అప్రోచ్ ఛానల్ తవ్వకంలో జాగ్రత్తలు తదితర అంశాలన్నీ చర్చకు రానున్నాయి.

జీఎంఆర్‌తో స్పీకర్ అయ్యన్నపాత్రుడు భేటీ



ఈనాడు, అమరావతి: శాసన సభాపతి అయ్యన్నపాత్రుడు మంగళవారం దిల్లీలో జీఎంఆర్ కన్‌స్ట్రక్షన్స్ అధినేత గ్రంధి మల్లికార్జున రావును కలిసి మాట్లాడారు. భోగాపురం విమానాశ్రయానికి అల్లూరి సీతారామరాజు పేరును పెట్టినందుకు కృతజ్ఞతలు తెలిపారు. నర్సీపట్నంలో చేపట్టిన ట్యాంక్‌బండ్ నిర్మాణం గురించి ఆయనతో మాట్లాడారు. శాసన సభాపతితో పాటు ఆయన తనయుడు, తెదేపా రాష్ట్ర ప్రధాన కార్యదర్శి చింతకాయల విజయ్ ఉన్నారు.

4 లక్షల పింఛన్లు తొలగించడం దగా కాదా?

మాజీ ముఖ్యమంత్రి జగన్

ఈనాడు, అమరావతి: 'ఆంక్షలు లేకుండా పింఛన్లు ఇస్తామని ఎన్నికలపుడు ఊదరగొట్టారు.. కానీ, ఇప్పుడు కొత్త పింఛన్లను ఇవ్వకపోగా ఉన్నవాటిలో కోత పెట్టి ప్రజలను మోసం చేస్తున్నారు' అని ముఖ్యమంత్రి చంద్రబాబును మాజీ సీఎం జగన్ విమర్శించారు. మంగళవారం రాత్రి 'ఎక్స్'లో చేసిన పోస్టులో ఆయన.. '2024, మార్చిలో ఉన్న పెన్షన్ల సంఖ్య 66 లక్షలు, కానీ, మీరు ఈ ఆగస్టులో ఇచ్చిన పెన్షన్లు 62 లక్షలు, అంటే 4 లక్షల పింఛన్లను నిర్దాక్షిణ్యంగా కత్తిరించడం దగా కాదా? దివ్యాంగుల పట్ల జాలి, దయ చూపకుండా అమానవీయంగా వారి పెన్షన్లను కట్ చేశారు' అని విమర్శించారు.

దివ్యాంగుల పింఛన్లపై వైకాపా తప్పుడు ప్రచారం

విభిన్న ప్రతిభావంతుల కార్పొరేషన్ ఛైర్మన్ నారాయణస్వామి

ఈనాడు, అమరావతి: రాజకీయ ప్రయోజనాల కోసం దివ్యాంగుల పింఛన్లపై వైకాపా తప్పుడు ప్రచారం చేస్తోందని విభిన్న ప్రతిభావంతుల కార్పొరేషన్ ఛైర్మన్ జి.నారాయణస్వామి ఆగ్రహం వ్యక్తంచేశారు. మంగళగిరిలోని తెదేపా కేంద్ర కార్యాలయంలో మంగళవారం విలేకర్ల సమావేశంలో మాట్లాడారు. 'జగన్ పాలనలో దివ్యాంగులను అనేక ఇబ్బందులకు గురిచేశారు. అధికారం కోల్పోయాక తప్పుడు ప్రచారంతో వారి మనోభావాలు దెబ్బతీస్తున్నారు. శ్రీసత్యసాయి జిల్లాలో ఓ వ్యక్తి పింఛను రద్దు చేశారంటూ ఫేక్ వీడియో తీయించి, వైకాపా నాయకులు తమ అనుకూల మీడియాలో ప్రచారం చేశారు. ఆ తర్వాత ఆ వ్యక్తికి రెండు చేతులు ఉన్న వీడియో బయటపడింద'ని గుర్తుచేశారు. ఆర్థిక ఇబ్బందులున్నా ముఖ్యమంత్రి చంద్రబాబు దివ్యాంగుల పింఛన్‌ను భారీగా పెంచారని, కార్పొరేషన్ ఏర్పాటుతో విభిన్న ప్రతిభావంతుల సంక్షేమానికి చర్యలు తీసుకున్నారని నారాయణస్వామి తెలిపారు. అర్హులైన దివ్యాంగులకు అండగా నిలుస్తామని, నకిలీలను బయటపెడతామని స్పష్టంచేశారు.

దొంగ పింఛన్లపై చర్యలు సబబే

అర్హులకు మాత్రం అన్యాయం చేయొద్దు: షర్మిల

ఈనాడు, అమరావతి: వికలాంగుల ముసుగులో అక్రమంగా పింఛన్లు తీసుకుంటున్న అనర్హులను ఏరివేయడం హర్షించదగ్గ విషయమేనని కాంగ్రెస్ రాష్ట్ర అధ్యక్షురాలు షర్మిల అభిప్రాయపడ్డారు. అదే సమయంలో అర్హుల పేర్లు జాబితా నుంచి తొలగించి వేధించడం సరికాదని మంగళవారం ఓ ప్రకటనలో సూచించారు. అనర్హుల జాబితాపై పునఃపరిశీలన చేయించాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. "అనర్హుల పేరుతో అర్హులైన దివ్యాంగుల పింఛన్లు తొలగించడం అన్యాయం. వారి జీవితాలతో రాజకీయం తగదు. పునఃపరిశీలనలో అర్హులకు అన్యాయం జరగకుండా చూడాలి. నోటీసులు ఇచ్చిన 1.20 లక్షల మందిలో ఎక్కువ మంది అర్హులే ఉన్నట్లు తెలుస్తోంది. వారికి అన్యాయం జరగకుండా చూడాలి. దొంగ ధ్రువపత్రాలు తీసుకున్న వారిపై, వాటిని ఇచ్చిన వైద్యులపై కఠిన చర్యలు తీసుకోవాలి" అని షర్మిల డిమాండ్ చేశారు.

7 నగరాల్లో స్మార్ట్ స్ట్రీట్ బజార్లు వచ్చేస్తున్నాయ్

ఈనాడు, అమరావతి: రాష్ట్రంలో అనంతపురం, కర్నూలు, తాడేపల్లి-మంగళగిరి, ఒంగోలు, శ్రీకాకుళం, విజయవాడ, వైఎస్సార్ కడప నగరపాలక సంస్థల్లో ఏడు స్మార్ట్ స్ట్రీట్ బజార్ల ఏర్పాటుకు ప్రభుత్వం అనుమతించింది. ఈ మేరకు పురపాలక, పట్టణాభివృద్ధి శాఖ ముఖ్య కార్యదర్శి సురేశ్‌కుమార్ మంగళవారం ఉత్తర్వులు జారీ చేశారు. "ఒక్కో నగరంలో 40 నుంచి 200 దుకాణాల సామర్థ్యం గల కంటెయినర్‌లు ఏర్పాటు చేయనున్నాం. ఒక్కోచోట రోజుకు 12.96 కిలో వాట్ల విద్యుత్ ఉత్పత్తి అయ్యేలా సోలార్ ప్యానళ్లు బిగించనున్నాం. 18 ఏళ్లు పైబడి నగరపాలక సంస్థ కమిషనర్లు ధ్రువీకరించిన వీధి వ్యాపారులను పట్టణ కమిటీల ద్వారా ఎంపిక చేసి స్మార్ట్ స్ట్రీట్ బజార్లలో దుకాణాలు కేటాయిస్తాం. ఇందుకు మొత్తం రూ.26.10 కోట్లు ఖర్చు చేయనున్నాం" అని పేర్కొన్నారు.

హైస్కూల్ ప్లస్‌కు అతిథి అధ్యాపకులు

ఈనాడు, అమరావతి: పాఠశాల విద్యాశాఖ ఆధ్వర్యంలో నడుస్తున్న హైస్కూల్ ప్లస్‌లకు అతిథి అధ్యాపకులను నియమించనున్నారు. రాష్ట్రప్రభుత్వం మండలానికో జూనియర్ కళాశాల ఏర్పాటుచేయాలని నిర్ణయించింది. ఇందులో భాగంగా హైస్కూల్ ప్లస్‌లలో ఇంటర్మీడియట్ బోధనకు ప్రత్యేకంగా అతిథి అధ్యాపకులను నియమించనున్నారు. వెయ్యిమంది వరకు అతిథి అధ్యాపకులు అవసరం కానున్నట్లు ప్రాథమికంగా అంచనా వేశారు.

హంద్రీ నీవా జలాలకు 30న సీఎం జలహారతి

కుప్పం పట్టణం, న్యూస్‌టుడే: కుప్పంలోని పరమసముద్రం చెరువులో కృష్ణా జలాలకు ఈ నెల 30వ తేదీన ముఖ్యమంత్రి చంద్రబాబు దంపతులు హంద్రీ నీవా కాలువ వద్ద జలహారతి ఇవ్వనున్నారు. ఈ సందర్భంగా ఇక్కడ బహిరంగ సభ నిర్వహించనున్నారు. ముఖ్యమంత్రి పర్యటన ఏర్పాట్లను మండలి విప్, ఎమ్మెల్సీ కంచర్ల శ్రీకాంత్, తెదేపా నాయకులు పర్యవేక్షిస్తున్నారు.

బ్రిజేష్ ట్రైబ్యునల్ ముందు వాదనలకు న్యాయవాదుల నియామకం

ఈనాడు, అమరావతి: ఆంధ్రప్రదేశ్ తరఫున బ్రిజేష్ కుమార్ ట్రైబ్యునల్ ముందు వాదనలు వినిపించేందుకు నలుగురు న్యాయవాదులను ప్రభుత్వం నియమించింది. ఈ మేరకు జలవనరులశాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి సాయిప్రసాద్ మంగళవారం ఉత్తర్వులు ఇచ్చారు. గుంటూరు ప్రభాకర్, శివంగి సింగ్ రావత్, జవ్వాజి శరత్ చంద్ర, సంజయ్ సూరనేని ట్రైబ్యునల్ ముందు వాదనలు వినిపించనున్నారు.

రాష్ట్ర ఎన్నికల మాజీ కమిషనర్లకు ప్రొటోకాల్ సదుపాయం

ఈనాడు, అమరావతి: రాష్ట్ర ఎన్నికల మాజీ కమిషనర్లకు కూడా ప్రొటోకాల్ సదుపాయం కల్పిస్తూ ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి విజయానంద్ మంగళవారం ఉత్తర్వులు జారీ చేశారు. ప్రభుత్వ ఆధ్వర్యంలో నిర్వహించే కార్యక్రమాల్లో రాష్ట్ర అతిథిగా గౌరవించాలని నిర్ణయించారు. రాష్ట్ర ఎన్నికల మాజీ కమిషనర్ ఎన్.రమేశ్‌కుమార్ 2025 ఆగస్టు 11న చేసిన వినతి మేరకు ఈ నిర్ణయం తీసుకుంది.

భక్తిప్రపత్తులతో శ్రీరామకోటి పుస్తకాల నిమజ్జనోత్సవం



శ్రీరామకోటి పుస్తకాలకు పూజ చేస్తున్న ఈవో రమాదేవి, ప్రధానార్చకుడు విజయరాఘవన్

భద్రాచలం, న్యూస్‌టుడే: భద్రాచలం శ్రీ సీతారామచంద్రస్వామి వారి దేవస్థానం ఆధ్వర్యంలో మంగళవారం సాయంత్రం శ్రీరామకోటి పుస్తకాల నిమజ్జనోత్సవం భక్తిప్రపత్తులతో సాగింది. భక్తులు నిష్ఠతో రాసి రాములోరికి సమర్పిస్తుంటారు. ఏడాదంతా భద్రపర్చిన పుస్తకాలను హుండీ నుంచి తీసి రెండు లారీల్లో పేర్చి పూజలు చేశారు. ఈ శోభాయాత్రను ఈవో రమాదేవి ప్రారంభించారు. గోదావరి బ్రిడ్జి వరకు ఊరేగింపు సాగింది. వంతెన మధ్యలో ఆగి పుణ్య నదిని పూజించి చీర, సారె సమర్పించారు. భక్తుల జయ జయ ధ్వానాల మధ్య శ్రీరామకోటి పుస్తకాలను వంతెన పైనుంచి నదిలోకి వదిలి నిమజ్జనోత్సవం చేశారు. వైదిక సిబ్బంది నదికి హారతి ఇచ్చారు.